
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 110

బుధవారం 4-1-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విజయంతో మొదలు

తొలి టి20లో శ్రీలంకపై భారత్ గెలుపు.. రాణించిన హుడా, హార్దిక్


- 12లో



డిజిటలైజేషన్‌లో భారత్ భేష్

ఆర్థికవృద్ధికి క్లౌడ్, ఏఐ ఊతం.. మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల

- 13లో



ప్రభుత్వానికి ఆపాదించలేం

ఒక మంత్రి చేసే విద్వేషపూరిత, వివాదాస్పద వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది.

వివరాలు 6లో ▸



గ్లోబల్ లీడర్లుగా ఎదగండి

భారత్‌ను స్వావలంబన దేశంగా తీర్చిదిద్దడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలని జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధాని మోదీ కోరారు.

వివరాలు 6లో ▸



నడ్డా కొనసాగింపు?

రానున్న ఎన్నికల దృష్ట్యా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డాను కొనసాగించాలని అధిష్టానం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

వివరాలు 6లో ▸



'అలుపెరగని పోరాట యోధుడు'

'రాహుల్ పోరాటయోధుడు. పారిశ్రామికవేత్తలను, మీడియాను కొనగలరేమోగానీ రాహుల్‌ను కొనలేరు' అని ప్రియాంక అన్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం



శ్రీవారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. శ్రీవారికి జనవరి 1న భక్తులు రికార్డు స్థాయిలో రూ.7.68 కోట్ల కానుకలు సమర్పించినట్లు టీటీడీ తెలిపింది.

వివరాలు 5 ▸

రోడ్లపై సభలు, రోడ్ షోల నిషేధం మంచిదే



రోడ్ల మీద రోడ్ షోలు, సభలపై ప్రభుత్వం నిషేధం విధించడం మంచి పరిణామమని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. చంద్రబాబు సభల్లో విషాదం వల్లే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నామన్నారు.

వివరాలు 14 ▸

7వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ

- పింఛన్ల పెంపు వారోత్సవాలను పురస్కరించుకుని పొడిగింపు
- ఈ నెలలో ఇప్పటికే 92.52% మందికి పింఛన్ల పంపిణీ పూర్తి

3 లో



రాజమహేంద్రవరంలో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మరో మాట నిలబెట్టుకున్నా

రాజమహేంద్రవరంలో పెన్షన్ వారోత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- దేశంలో ఈ స్థాయిలో పెన్షన్ డబ్బులిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే
- 39 లక్షలున్న పింఛన్లను మీ బిడ్డ ఏకంగా 64.06 లక్షలకు పెంచి ఇస్తున్నాడు
- చంద్రబాబు రూ.400 కోట్లిస్తే ఇప్పుడు నెలకు రూ.1,765 కోట్లు అందిస్తున్నాం
- మూడున్నరేళ్లలో ఒక్క పింఛన్ల కోసమే రూ.62,500 కోట్లు వెచ్చించాం
- నాడు కత్తిరింపులే లక్ష్యం.. జన్మభూమి కమిటీలకు 3 నెలల పెన్షన్ లంచమిస్తేనే మంజూరు
- గత సర్కారు అరకొరగా రూ.వెయ్యి పెన్షన్ ఇస్తే ఇప్పుడు నెలకు రూ.2,750
- అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో అందరికీ ప్రయోజనం
- మిగిలిపోయిన అర్హులను సైతం గుర్తించి ఏటా రెండుసార్లు లబ్ధి చేకూరుస్తున్నాం
- మనుషులను చంపేసి మానవతావాదిలా, మహోన్నతుడిలా చంద్రబాబు డ్రామాలు
- డ్రోన్ షాట్ల కోసం ఇదేచోట 29 మందిని పొట్టనపెట్టుకున్నారా లేదా?
- కందుకూరులో 8 మందిని, గుంటూరులో మరో ముగ్గురిని బలి తీసుకున్నారు
- ఇది కులాల యుద్ధం కాదు.. పేదలు, పెత్తందారుల మధ్య యుద్ధం
- జాగ్రత్తగా ఆలోచించండి.. పొరబాటు జరిగితే పేదలు నాశనమే

2 లో



"పేదలకు ఇచ్చిన మరో మాటను నిలబెట్టుకున్నా. అవ్వాతాతలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు.. అర్హులందరికీ దశలవారీగా పెన్షన్ పెంచుకుంటూ పోతానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. పింఛన్లు రూ.2,750 నుంచి రూ.10 వేల వరకు దేశంలో ఎక్కడైనా ఉన్నాయా? మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో మాత్రమే ఉన్నాయి.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బాబు బరితెగింపు

ఐదు రోజుల్లో 11 మంది మృతిచెందినా మారని తీరు

నేటి నుంచి కుప్పంలో చంద్రబాబు 3 రోజుల పర్యటన

- పలమనేరు డివిజన్‌లో నవంబరు నుంచి అమలులో ఉన్న 30 పోలీస్ యాక్ట్
- తాజాగా రోడ్లపై సభలు, రోడ్ షోలను నిషేధించిన ప్రభుత్వం
- ప్రజల భద్రత కోసం నిర్ణయం
- అయినాసరే నాలుగు రోడ్ షోలతో చంద్రబాబు పర్యటన
- నోటీసులు జారీచేసిన చిత్తూరు పోలీసులు.. దానికి ఇంకా సమాధానమివ్వని టీడీపీ
- పోలీసుల అనుమతి నిరాకరణ
- ప్రజల భద్రతకు విఘాతం కల్గించాలన్నదే టీడీపీ పన్నాగం!



కెనుమాకలపల్లిలో చంద్రబాబు సభ కోసం గుడి ముందు ఏర్పాటు చేసిన వేదిక

సాక్షి, అమరావతి/చిత్తూరు అర్బన్/కుప్పం: తన ప్రచారార్భాటం ప్రజల ప్రాణాలు హరిస్తున్నా ప్రతిపక్ష నేత చంద్రబాబు తీరు ఏమాత్రం మారడంలేదు. లేని జనాదరణను ఉన్నట్లుగా చూపించేందుకు ఆయన వేస్తున్న చీప్‌ట్రిక్స్‌తో కేవలం ఐదురోజుల వ్యవధిలోనే 11 మంది మరణించినా.. ఇంకా ఎంతోమంది గాయపడినా సరే 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబు మనసు కరగడంలేదు. ప్రజల భద్రత కోసం రోడ్లపై సభలు, రోడ్‌షోలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీచేసినా సరే ఆయన బేఖాతరు చేస్తున్నారు. నిజానికి.. శాంతిభద్రతల దృష్ట్యా చిత్తూరు జిల్లా పలమనేరు డివిజన్ పరిధిలో కొన్ని నెలలుగా 30 పోలీస్ యాక్ట్

మిగతా 3వ పేజీలో ▸

అన్ని పార్టీలకు ఒకటే నియమం

- రోడ్ల మీద సభలు, రోడ్‌షోలపై నిషేధం అన్ని పార్టీలకు వర్తిస్తుంది
- ప్రజల ప్రాణాలను పరిరక్షించడమే ప్రభుత్వానికి ప్రధానం: సజ్జల

3 లో



గుంటూరులో రమాదేవి కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రులు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

వారి ఇళ్లకు వెళ్లి రూ.2 లక్షల సాయం పంపిణీ

- గాయపడిన 19 మందికి ఆస్పత్రుల్లోనే రూ.50 వేల చొప్పున సహాయం
- సాయం పంపిణీ చేసిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్
- సభలకు చంద్రబాబు విరామం చెప్పాలి: మంత్రి అంబటి
- చంద్రబాబును అరెస్టు చేయాలి: మంత్రి మేరుగు నాగార్జున
- ఈ మరణాలకు బాబుదే బాధ్యత: మంత్రి విడదల రజిని

గుంటూరు ఈస్ట్: చంద్రన్న కానుక సభలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందినవారి కుటుంబాలకు, గాయపడినవారికి రాష్ట్ర ప్రభుత్వ సహాయాన్ని మంత్రులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, విడదల రజిని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మృతుల ఇళ్లకువెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మొత్తం 19 మందికి రూ.50 వేల చొప్పున చెక్కులు

మిగతా 3వ పేజీలో ▸



విశాఖ శిల్పారామంలో వాటర్ వరల్డ్, స్విమ్మింగ్ పూల్

పర్యాటకుల శోభతో శిల్పారామాలు కళకళ

- గత ఎనిమిదేళ్లతో పోలిస్తే 25% వృద్ధి
- వివాహ, వినోద వేడుకలకు కేంద్రంగా శిల్పారామాల అభివృద్ధి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శిల్పారామాలు గడిచిన ఎనిమిదేళ్లతో పోల్చితే ఎన్నడూ లేనంతగా పర్యాటకుల శోభతో కళకళలాడుతున్నాయి. నెలకు సగటున 1.18 లక్షల మంది సందర్శకుల సంఖ్య నమోదవుతూ.. 2018–19తో పోలిస్తే 25 శాతం వృద్ధి సాధించింది. ప్రస్తుతం తిరుపతి, కడప, పులివెందుల, పుట్టపర్తి, విశాఖపట్నం, అనంతపురం, విజయనగరం, కాకినాడలో శిల్పారామాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గుంటూరులోని శిల్పారామం ప్రారంభానికి సిద్ధమవుతోంది. మరోవైపు ప్రభుత్వం శిల్పారామాలను వివాహ, వినోద కార్యకలాపాలకు వేదికలుగా తీర్చిదిద్దుతోంది. ఈ క్రమంలోనే కల్యాణ మండపాలు, స్విమ్మింగ్ పూల్స్, బోటింగ్, మల్టీ పర్పస్ హాల్స్, వాటర్ వరల్డ్‌లను అందుబాటులోకి తెస్తోంది. తద్వారా పర్యాటకులను ఆకట్టుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. కోవిడ్‌లో శిల్పారామాల ఆదాయం తగ్గినప్పటికీ..ప్రస్తుతం గత రెవెన్యూ లోటును కూడా భర్తీ చేస్తున్నాయి.

సగటున నెలకు పర్యాటకుల సంఖ్య ఇలా..

సంవత్సరం	సందర్శకులు
2014-15	53,461
2015-16	76,087
2016-17	79,237
2017-18	81,672
2018-19	94,188
2019-20	85,552
2020-21	36,279
2021-22	1,18,000

(2019-21 మధ్యలో కోవిడ్, లాక్‌డౌన్ నిబంధనలు అమల్లో ఉన్నాయి)



అనంతపురం శిల్పారామంలో మల్టీపర్పస్ హాల్ నిర్మాణం

ప్రగతి పథంలో పయనం

శిల్పారామాలను సకల వసతులకు నిలయాలుగా తీర్చిదిద్దుతున్నాం. చాలా చోట్ల ఓఅండ్‌ఎం కింద కల్యాణ మండపాలు నిర్వహిస్తున్నాం. ఇప్పుడు రోజుకు సగటున 3,900 మంది శిల్పారామాలను సందర్శిస్తున్నారు. ఏపీలో వైఎస్సార్ శిల్పారామాలను బలోపేతం చేస్తే సీఎం జగన్ మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హోటళ్లను కూడా నిర్మించనున్నాం.
– శ్యామ్ సుందర్ రెడ్డి, శిల్పారామం సీఈవో

ఉపాధి, ఉద్యోగ కల్పనకు లైఫ్ స్కిల్స్ కోర్సులు



- బీఏ, బీఎస్సీ, బీకాం ముగించి బయటకు రాగానే ఉద్యోగం పొందేలా కొత్త కోర్సులు
- పరిశ్రమలు, జాబ్ మార్కెట్ ఓరియెంటెడ్ అంశాలతో ప్రోగ్రాములు
- 17 రకాల కోర్సులు ప్రవేశ పెట్టిన ఉన్నత విద్యా శాఖ
- లైఫ్ స్కిల్స్, స్కిల్ డెవలప్‌మెంటుల్లో కోర్సులు
- ఐఎస్‌బీ ద్వారా ఆన్‌లైన్ కోర్సులకు కూడా కసరత్తు

14 లో

నీటి లభ్యత తేల్చాకే కొత్త ప్రాజెక్టులకు అనుమతి

- గోదావరి బోర్డుకు తేల్చిచెప్పిన ఆంధ్రప్రదేశ్
- తెలంగాణ మూడు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వడంపై ఆక్షేపణ
- ఇది సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమేనని స్పష్టీకరణ
- నీటి లభ్యతపై శాస్త్రీయ అధ్యయనం చేయాలని సీడబ్ల్యూసీకి సిఫార్సు చేస్తామన్న బోర్డు
- ఏపీ అభిప్రాయాలను తెలుసుకున్నాకే ఎగువ రాష్ట్రాల ప్రాజెక్టులకు అనుమతి ఇస్తామన్న సీడబ్ల్యూసీ
- పోలవరం బ్యాక్‌వాటర్‌పై మళ్లీ అధ్యయనం చేయాలన్న తెలంగాణ

3 లో

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌పై మంత్రుల కమిటీ



- కమిటీలో ఆర్థిక, పరిశ్రమల శాఖల మంత్రులు
- అవసరమైన పక్షంలో ఇతర మంత్రులకూ ప్రత్యేక ఆహ్వానం

14లో

క్లుప్తంగా...

అమిత్ షా రాష్ట్ర పర్యటన వాయిదా



సాక్షి, అమరావతి/కర్నూలు (సెంట్రల్): కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన వాయిదా పడింది. ప్రవాసి యోజన కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ నెల 8వ తేదీన కర్నూలు, హిందూపురాల్లో పర్యటించాల్సి ఉంది. అనివార్య కారణాలతో ఆయన పర్యటన వాయిదా పడింది. అమిత్ షా పర్యటన సంక్రాంతి తరువాత ఉండే అవకాశం ఉందని, తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామస్వామి చెప్పారు.

రాష్ట్రంలో కొత్తగా రెండు కరోనా పాజిటివ్ కేసులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో (సోమవారం ఉదయం 9 గంటల నుంచి మంగళవారం ఉదయం 9 గంటల వరకూ) 1,873 నమూనాలను పరీక్షించగా విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఈ నెల ఒకటో తేదీన ఆస్ట్రేలియా నుంచి వచ్చిన మహిళకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆమె కుటుంబంలోని ఇతర సభ్యులకు పరీక్షలు నిర్వహించగా, అందరికీ నెగిటివ్‌గా తేలింది. కరోనా పాజిటివ్‌గా తేలిన మహిళ నమూనాలను విజయవాడలోని జీనోమ్ ల్యాబ్‌కు తరలించి పరీక్షించాలని అధికారులను ఆదేశించినట్టు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ తెలిపారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగానే ఉందన్నారు. మిగిలిన కుటుంబ సభ్యులను హోమ్ ఐసోలేషన్‌లో ఉంచామన్నారు. కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు యాక్టివ్ కేసులు ఉన్నాయి.

పచ్చ పత్రికల దుష్ప్రచారం

- కుక్క కాటు ఇంజెక్షన్ కోసం వచ్చిన వృద్ధురాలు
- ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయాలు
- సీఎం జగన్ సభలో అపశ్రుతి అంటూ తప్పుడు ప్రచారం

సాక్షి ప్రతినిధి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్ : 'దున్నపోతు ఈనిందంటే.. దూడను కట్టేయండి' అన్నట్టుగా ఉంది పచ్చ నేతలు, ఎల్లో మీడియా తీరు. రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీకి చెందిన అర్జి పార్వతి (65) కుక్క కాటు ఇంజక్షన్ రెండో డోస్ వేయించుకునేందుకు మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. తిరిగి ఇంటికి బయలుదేరుతుండగా రంగంపేట నుంచి రాజమహేంద్రవరం వైపు వస్తున్న ఏపీ29 జెడ్–355 నంబరు గల ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడింది. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ నూలు హరీష్ స్థానికుల సాయంతో తొలుత ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అయితే వలంటీర్.. 70 ఏళ్ల వృద్ధురాలిని బలవంతంగా సీఎం సభకు తీసుకెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగిందని.. సీఎం సభలో అపశ్రుతి.. అని పచ్చ మీడియా తప్పుడు ప్రచారం మొదలు పెట్టింది. టీడీపీ నేతలు నిమ్మకాయల చినరాజప్ప తదితరులు రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లి ప్రభుత్వంపై బురదజల్లే యత్నం చేశారు. ఇంతలో వైద్య సేవలతో తేరుకున్న పార్వతి.. జరిగిన విషయాన్ని ఔట్ పోస్టు పోలీసులకు వెల్లడించింది. దీంతో ఎల్లో మీడియా, టీడీపీ నేతలు తేలు కుట్టిన దొంగల్లా మిన్నకుండిపోయారు.

టీడీపీ నేతలకు బుద్ధిరాదు: ఎంపీ భరత్

ప్రజలు ఎంతగా బుద్ధి చెప్పినా, టీడీపీ నేతలకు కనువిప్పు కలగడం లేదని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మండిపడ్డారు. చంద్రబాబు సభల్లో ప్రమాదాలు జరుగుతున్నట్టే సీఎం సభల్లో కూడా జరగాలనే దుర్బుద్ధిని ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. నగరంలో ఎక్కడో రోడ్డు ప్రమాదం జరిగితే దానిని సీఎం సభతో ముడిపెడుతున్నారంటే టీడీపీ చిల్లర, శవ రాజకీయం స్పష్టమవుతోందని ధ్వజమెత్తారు. టీడీపీ నేతలు, ఎల్లో మీడియా ఇప్పటికైనా నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు



థాంక్యూ జగనన్న అంటూ సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజలు

మరో మాట నిలబెట్టుకున్నా

రాజమహేంద్రవరంలో పెన్షన్ వారోత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రాజమహేంద్రవరం నుంచి సాక్షి ప్రతినిధి: 'ఇవాళ రాష్ట్రంలో జరుగుతోంది కులాల యుద్ధం కాదు.. క్లాసుల మధ్య యుద్ధం. ఒకవైపు పేదవాడు మరోవైపు పెత్తందారీ వ్యవస్థ మధ్య జరుగుతున్న యుద్ధమిది. పేదల వ్యతిరేక శక్తులతో పోరాటం చేస్తున్నాం. జాగ్రత్తగా ఆలోచన చేయండి. విషయాన్ని గుర్తించాలి. పొరబాటు జరిగితే పేదవాడు నాశనమైపోతాడనేది మరిచిపోవద్దు. కుట్రలు, కుతంత్రాలతో వస్తున్న చంద్రబాబు, దత్తపుత్రుడు, గజదొంగల ముఠా విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి, దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పింఛన్ లబ్ధిదారులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. 64,06,240 మంది లబ్ధిదారులకు రూ.1,765.04 కోట్ల నమూనా చెక్‌ను ఎలుగొండ చెల్లాయమ్మకు అందచేశారు. గత సర్కారు అరకొరగా 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇస్తే ఇప్పుడు ఏకంగా 64.06 లక్షల మందికి పెన్షన్లు అందచేస్తున్నామని సీఎం జగన్ చెప్పారు. చంద్రబాబు పింఛన్ల కోసం రూ.400 కోట్లిస్తే ఇప్పుడు నెలకు రూ.1,765 కోట్లకుపైగా వ్యయం చేస్తూ అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో ప్రయోజనం చేకూరుస్తున్నట్లు తెలిపారు. నాడు కత్తిరింపులే లక్ష్యమని, జన్మభూమి కమిటీలకు 3 నెలల పెన్షన్ లంచమిస్తేనేగానీ మంజూరు కాని దుస్థితి నెలకొందన్నారు. గత సర్కారు అరకొరగా రూ.వెయ్యి పెన్షన్ ఇస్తే ఇప్పుడు నెలకు రూ.2,750 చొప్పున ఇస్తూ మిగిలిపోయిన అర్హులను సైతం గుర్తించి ఏటా రెండుసార్లు లబ్ధి చేకూరుస్తున్నట్లు చెప్పారు. గత మూడున్నరేళ్లలో ఒక్క పింఛన్ల కోసమే రూ.62,500 కోట్లు వెచ్చించామన్నారు. పింఛన్ల పెంపు వారోత్సవాల సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో భారీగా హాజరైన జనసందోహాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

మిగిలిపోయిన అర్హులకు కూడా..

అర్హతే ప్రామాణికంగా పథకాలన్నింటినీ అమలు చేస్తున్నాం. ఏ పార్టీకి ఓటేశారని కూడా చూడకుండా మనకు వ్యతిరేకంగా ఓటేసిన వారికి కూడా పథకాలన్నింటినీ అందిస్తున్నాం. వీటిని పారదర్శకంగా అర్హులకు చేర్చేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా 2.62 లక్షల మంది వలంటీర్లు, 1.30 లక్షల మంది ఉద్యోగులతో సచివాలయ వ్యవస్థను తెచ్చాం. అవ్వాతాతలకే కాకుండా పుట్టుకతో, పుట్టిన తర్వాత అంగవైకల్యానికి గురైన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల బాధితులు, డయాలసిస్ చేసుకుంటున్నవారు, తలసీమియా, సికిల్‌సెల్, ఎనీమియా, హీమోఫీలియా, ఎయిడ్స్, బోదకాలు, చివరకు పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమైన వారికి, కండరాల క్షీణత, కుష్టువ్యాధి, కాలేయం, గుండె మార్పిడి జరిగిన నిరుపేదలందరికీ ప్రభుత్వం తరపున పెన్షన్లు ఇస్తున్నాం. ఇవాళ అవ్వాతాతలకు పెన్షన్ పెంచడంతో పాటు గత జూలై నుంచి నవంబరు వరకు అర్హులందరికీ కొత్త కార్డులిచ్చాం. బియ్యం, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల పట్టాలు ఇవన్నీ డిసెంబరులోనే ఇచ్చాం. మిగిలిపోయిన అర్హులకు జూలై, డిసెంబరులో ఏడాదికి 2 సార్లు మేలు చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. కొత్తగా 44,543 బియ్యం కార్డులు ఇవ్వడంతో ఏపీలో మొత్తం బియ్యం కార్డుల సంఖ్య 1,45,88,539కు చేరింది. మరో 14,401 ఆరోగ్యశ్రీ కార్డులు వలంటీర్లు ఇంటికి వచ్చి ఇస్తున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ కార్డులు 1,41,48,249కు చేరాయి. మరో 14,531 ఇళ్ల పట్టాలకు సంబంధించి మంజూరు పత్రాలను అక్కచెల్లెమ్మల చేతిలో పెడుతున్నారు. ఇలా 30,29,171 ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మలకు అందించగలిగాం.

> **పొడిచేసి.. దండలు, దండాలు!**
>
> ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి సీఎం కుర్చీని లాక్కున్న చంద్రబాబు ఎన్నికలు వచ్చేసరికి అదే ఎన్టీఆర్ బొమ్మకు దండలు వేస్తారు. పొడిచేది, చంపేది ఆయనే.. మళ్లీ మొసలి కన్నీళ్లు కార్చేది కూడా ఆయనే.
>
> – రాజమహేంద్రవరం సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

అపకారికి సైతం మీ బిడ్డ ఉపకారం

గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా ఇప్పుడు పెన్షన్లకు ఎక్కడా కోటాలు, కత్తిరింపులు, వివక్ష, లంచాలు లేవు. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఆత్మాభిమానాన్ని చంపుకుని మొకరిల్లాల్సిన అవసరం లేదు. చివరకు మన పార్టీకి ఓటు వేయని వారికి కూడా అర్హత ఉంటే చాలు పెన్షన్ దగ్గర నుంచి ప్రతి పథకం ఇళ్ల దగ్గరకు వెళ్లి అందించే గొప్ప వ్యవస్థ తెచ్చాం. ఇందుకు కారణం మీ బిడ్డ మనసున్న పాలన. చెడు చేసేవారికి సైతం మంచి చేసే గుణం మీ బిడ్డకు ఉంది కాబట్టే ఇంత మంచి పరిపాలన చేయగలుగుతున్నాం.



పెంచిన పింఛన్లకు సంబంధించి లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

షూటింగ్ కోసం గేట్లన్నీ మూసివేసి..

ఇదే చంద్రబాబు ఫోటో షూట్, డ్రోన్ షాట్ల కోసం ఇదే రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాలకు వచ్చారు. మీ అందరికీ గుర్తుందా...? (ప్రజలంతా ఒక్కసారిగా పైకి లేచి గుర్తుందంటూ నినదించారు) ఈ పెద్ద మనిషి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 29 మందిని ఇదే మాదిరిగా చంపేశాడు. అన్ని గేట్లు మూయించి సినిమా డైరెక్టర్‌ను పక్కన పెట్టుకుని షూటింగ్ కోసం ఈ ఒక్కగేట్ తెరిచాడు. వేల సంఖ్యలో జనమంతా ఒక్క గేటు గుండా వెళ్లాల్సిన పరిస్థితి. ఆ డ్రోన్ షాట్ల కోసం నాడు 29 మంది చనిపోతే.. కుంభమేళాలో చనిపోలేదా? తొక్కిసలాటలు జరగలేదా? అని ఈ పెద్ద మనిషి వాదించాడు.

మనుషులను చంపేసి మానవతావాదినంటాడు..

కందుకూరులో ఎక్కువ మంది వచ్చినట్లు చూపించేందుకు విశాలమైన ప్రదేశంలో మీటింగ్ జరగనివ్వకుండా ముందుకు తీసుకెళ్లి సందులోకి ప్రజలను తరలించారు. ఆ తర్వాత ఆ పెద్ద మనిషి తన వాహనాన్ని అక్కడికి తీసుకెళ్లడం ద్వారా 8 మందిని చంపేసిన పరిస్థితి చూశాం. తన డ్రోన్ షాట్స్, ఫోటో షూట్ కోసం 8 మందిని చంపేశాడు. ఆ వెంటనే ఆ పెద్దమనిషి అక్కడే.. మౌనం పాటించాలంటాడు. పక్కనే ఉన్న ఆసుపత్రికి వెళ్లాలంటాడు. షూటింగ్ కోసం 5 నిమిషాల్లో ఆసుపత్రి నుంచి మళ్లీ తిరిగి వచ్చేశాడు. చనిపోయిన కుటుంబాలకు తానే చెక్కులు పంపిణీ చేశానంటాడు. తానే మనుషులను చంపేస్తాడు.. చనిపోయిన వారిపట్ల తాను ఒక మహోన్నత, మానవతావాదిలా మళ్లీ డ్రామాలాడుతున్నాడు.

ప్రతి అడుగులోనూ 'బాబు' మోసాలు

45 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకునే ఈ మనిషి వంకర బుద్ధి ఎలా ఉంటుందో 2014 నుంచి 2019 వరకు మనమంతా చూశాం. ప్రతి అడుగులోనూ మోసమే. రూ. 87,612 కోట్ల రైతు రుణాలను మాఫీ చేస్తానని, బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు సీఎం కావాలంటూ చివరకు నట్టేట ముంచాడు. రూ.14,204 కోట్ల పొదుపు సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానని నమ్మించి అక్కచెల్లెమ్మలను రోడ్ల పాలు జేశాడు. రూ.2 వేల నిరుద్యోగ భృతిని ఎగ్గొట్టారు. మేనిఫెస్టో ప్రకటించి ఎన్నికలు కాగానే చెత్తబుట్టలో పడేశాడు.

39 లక్షల పెన్షన్లు ఎక్కడ?.. 64 లక్షల పింఛన్లు ఎక్కడ?

మీ అందరికీ గుర్తుండే ఉంటుంది. గత ప్రభుత్వం దిగిపోయేనాటికి ఉన్న పరిపాలనను ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకుందాం. 2019 ఎన్నికలకు 2 నెలల ముందు వరకు పెన్షన్ కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారు. బాబు పాలనలో పెన్షన్లు ఎలా కోత పెట్టాలా? అనే ఆలోచన చేశారు. నాడు ఎవరైనా చనిపోతేనే మరొకరికి పెన్షన్ మంజూరు చేసే దుస్థితి. పెన్షన్ కావాలంటే జన్మభూమి కమిటీల దగ్గరకు వెళ్లాల్సిందే. అరకొరగా ఇచ్చే పింఛన్లు సైతం మూడు నెలల సొమ్మును లంచంగా ఇస్తేనే మంజూరయ్యేవి కావు. గత సర్కారు దిగిపోయే 6 నెలల ముందు వరకు 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇవ్వగా మీ బిడ్డ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 64.06 లక్షల మందికి పెన్షన్లు అందజేస్తోంది. 39 లక్షలు ఎక్కడ? మన ప్రభుత్వం ఇస్తున్న 64 లక్షలు పెన్షన్లు ఎక్కడ? మీరే ఆలోచన చేయండి. నాడు రూ.వెయ్యి మాత్రమే ఇవ్వగా నేడు రూ.2,750 చొప్పున ఇస్తున్నాం. తేడా గమనించండి. గత సర్కారు హయాంలో పెన్షన్ల ఖర్చు నెలకు కేవలం రూ.400 కోట్లు కాగా ఈరోజు మన ప్రభుత్వం పెన్షన్ల కోసం నెలకు రూ.1,765 కోట్లు వ్యయం చేస్తోంది. పెన్షన్లపై ఏడాదికి రూ.21,180 కోట్లు వ్యయం చేస్తున్నాం. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడున్నరేళ్లలో కేవలం పెన్షన్ల కోసం రూ.62,500 కోట్లను అవ్వాతాతలు, వితంతు అక్కచెల్లెమ్మలు, అభాగ్యుల కోసం ఖర్చు చేసింది.

వెన్నుపోటు, ఫోటో షూట్, డ్రామాలే బాబు నైజం..

ఇంత మంచి చేస్తున్న మనందరి ప్రభుత్వాన్ని ఏనాడూ మంచి చేసిన చరిత్ర లేని పార్టీలు, నాయకులు ఓర్వలేక విమర్శిస్తున్న రాజకీయాలను ఇవాళ చూస్తున్నాం. రాజకీయ వ్యవస్థ ఎంత దిగజారిపోయిందో వివరించేందుకు చిన్న ఉదాహరణ చెబుతా.. కోర్టులో ఒకాయన జడ్జి ముందుకు వచ్చి.. 'అయ్యా తల్లీతండ్రి లేనివాడిని! నన్ను శిక్షించకండి..' అని ఏడ్చాడు.. ఆ ఏడుపు చూసి జడ్జి జాలిపడి చలించి 'ఈ మనిషి చేసిన తప్పేమిటి?' అని ప్రాసిక్యూటర్‌ను అడిగారు. 'నిజమే.. ఈ మనిషికి తల్లీతండ్రి ఇద్దరూ లేరు.. కారణం ఆ తల్లితండ్రీ ఇద్దరినీ చంపేసింది ఈ వ్యక్తే..' అని ప్రాసిక్యూటర్ చెప్పారు. చంద్రబాబుది కూడా ఇదే పద్ధతి. ఈ పెద్ద మనిషి.. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడుస్తాడు. తానే చంపేస్తాడు. సీఎం కుర్చీని కూడా లాక్కుంటాడు. ఎన్టీఆర్ పార్టీని, ట్రస్టుని, ఎన్టీఆర్ శవాన్ని కూడా లాక్కుంటాడు. ఎన్నికలు వచ్చేసరికి మాత్రం ఎన్టీఆర్ ఫోటోకు దండ వేస్తాడు. తమ్ముళ్లూ...! ఎన్టీఆర్ అంత గొప్ప వ్యక్తి ఎవరైనా ఉంటారా? అని ఊరూరా అడుగుతాడు. పొడిచేది, చంపేది ఆయనే. మళ్లీ మొసలి కన్నీరు కార్చేది కూడా ఆయనే. ఎన్టీఆర్ అయినా, ప్రజలైనా ఈ పెద్ద మనిషికి తెలిసిన నైజం.. వెన్నుపోటు పొడవడం. ఫోటో షూట్, డ్రామాలు చేయడం, మొసలి కన్నీరు కార్చడం.

వేలల్లో టోకెన్లు.. అరకొరగా చీరలు

ఇంత దారుణమైన రాజకీయాలు జరుగుతున్నా ఈనాడు రాయదు. ఆంధ్రజ్యోతి చూపించదు. టీవీ 5 అడగదు. దత్తపుత్రుడు అంతకన్నా ప్రశ్నించడు. పేదలను చంపేసి చివరికి టీడీపీ కోసం త్యాగం చేశారంటారు. చనిపోయిన వారిలో ఎస్సీలుంటే తన కోసం త్యాగం చేశారని దాన్ని కూడా వాడుకునే దారుణమైన ఆలోచనలు చేస్తాడు. ఈ పెద్ద మనిషి రక్త దాహం తీరక మళ్లీ గుంటూరులో సభ పెట్టాడు. కొత్త ఏడాది రోజు మరో ముగ్గురిని ఫోటో షూట్లు డ్రోన్ షాట్ కోసం బలి తీసుకున్న పరిస్థితిని మనమంతా చూశాం. తన సభకు ప్రజలు రారనే భయంతో చీరల పంపిణీ పేరుతో మరో ముగ్గురుని బలిగొన్నాడు. వారం రోజులు ఇంటింటికీ తిరిగి టోకెన్లు ఇచ్చారు.బాబు వచ్చే వరకు, మీటింగ్ పూర్తయ్యే వరకు చీరలు పంపిణీ చేయలేదు. ముందే చీరలు పంపిణీ చేస్తే చంద్రబాబు రాకముందే మహిళలు వెళ్లిపోతారని పంచలేదు. తీరా చూస్తే ఇచ్చిన టోకెన్లు వేలల్లో ఉంటే పంపిణీ కోసం చీరలేమో అరకొరగా తెచ్చారు. ఫలితంగా తొక్కిసలాట జరిగింది. ఆశ్చర్యమేమిటంటే చంద్రబాబు తానే బలి తీసుకుంటాడు.. మళ్లీ మొసలి కన్నీళ్లు కారుస్తాడు. పోలీసులది తప్పు అంటాడు. ఇంతకన్నా అన్యాయమైన మనిషి ప్రపంచంలో ఎక్కడైనా ఉంటాడా?

పేదల వ్యతిరేక శక్తులతో పోరాటం

అధికారం కోసం సొంత మామకే వెన్నుపోటు పొడిచిన వ్యక్తికి ప్రజలు ఒక లెక్కా? ఇలాంటి వ్యక్తి ఎన్ని వెన్నుపోట్లు పొడిచినా ఈనాడు రాయదు, ఆంధ్రజ్యోతి చెప్పదు, టీవీ 5 చూపించదు. దత్తపుత్రుడు ప్రశ్నించడు. కారణం వీళ్లంతా ఓ గజదొంగల ముఠా. అప్పట్లో జరిగిన ఏకైక స్కీం.. దోచుకో, పంచుకో, తినుకో(డీపీటీ). అందుకే ఆ పెద్దమనిషిని అధికారంలోకి తెచ్చేందుకు వారంతా కష్టపడుతున్నారు. వీరంతా పేదవాడికి ఇంగ్లిషు మీడియం చదువులు వద్దంటున్నారు. పేదలకు ఇళ్లు కట్టించొద్దంటున్నారు. పేదవాడికి మంచి చేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందంటున్నారు. ఇలాంటి పేదల వ్యతిరేక శక్తులతో మీబిడ్డ పోరాటం చేస్తున్నాడు. ఈ పోరాటంలో మీ అందరి చల్లని దీవెనలు, దేవుడి దయ మీ బిడ్డ పట్ల ఉండాలని కోరుతున్నా. మీ బిడ్డకు వీళ్ల మాదిరిగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 లేకపోవచ్చు. దత్తపుత్రుడి అండ ఉండకపోవచ్చు. కానీ మీ బిడ్డకు ఉన్నదేమిటంటే... ఆ దేవుడి దయ, మీ అందరి ఆశీస్సులు. ఆ పెద్దమనిషి ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడిని నమ్ముకుంటే మీ బిడ్డ ఒక ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, పేద వర్గాలను నమ్ముకున్నాడు.

హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు పినిపే విశ్వరూప్, తానేటి వనిత, చెల్లుబోయిన వేణు, దాడిశెట్టిరాజా, కారుమూరి నాగేశ్వరరావు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంపీలు పెదిరెడ్డి మిథున్‌రెడ్డి, మార్గాని భరత్ రామ్, పిల్లి సుభాష్ చంద్రబోస్, వంగా గీత, చింతా అనురాధ, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, పార్టీ కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షులు కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజా, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, సెర్ప్ సీఈవో ఇంతియాజ్, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ లబ్ధిదారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రాజమహేంద్రవరంలో సీఎం జగన్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న స్థానికులు


జన గోదారి!

- కిక్కిరిసిపోయిన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ
- స్టేడియం నుంచి సభా వేదిక వద్దకు బారులు తీరిన జనం

రాజమహేంద్రవరం నుంచి సాక్షిప్రతినిధి: పెన్షన్ పెంపు వారోత్సవాల సభకు తరలివచ్చిన జనసందోహంతో గోదారమ్మ పులకించిపోయింది. రూ.2,500 నుంచి రూ.2,750కి పింఛన్ల పెంపు వారోత్సవాలలో ముఖ్యమంత్రి జగన్ పాల్గొంటున్నారని తెలిసి వృద్ధులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా రాజమహేంద్రవరం తరలివచ్చారు. సభాస్థలి ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణం ముఖ్యమంత్రి జగన్ రాకకు అరగంట ముందుగానే కిక్కిరిసింది. పలువురు లోపల ఖాళీ లేకపోవడంతో రోడ్లపైనే నిలుచుని ముఖ్యమంత్రి ప్రసంగం పూర్తయ్యాక తిరుగుముఖం పట్టడం కనిపించింది. నగర వీధులన్నీ జనంతో నిండిపోయాయి. మున్సిపల్ స్టేడియంలోని హెలీపాడ్ దగ్గర నుంచి శ్యామలా సెంటర్, డీలక్స్ సెంటర్, సాయికృష్ణా థియేటర్, రంభ ఊర్వశి మేనక థియేటర్, చర్చిగేట్, ఆర్యాపురం, నందంగనిరాజు జంక్షన్, వై జంక్షన్ మీదుగా ఆర్ట్స్ కాలేజీ వరకు దారికిరువైపులా ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్టేడియం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని ఆర్ట్స్ కాలేజీకి చేరుకోవడానికి సీఎంకు అరగంటపైనే పట్టింది.

- సీఎం జగన్ తొలుత వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అక్కడ నిరీక్షిస్తున్న పలువురి సమస్యలను తెలుసుకుని భరోసా కల్పించారు. ఆధార్ నమోదు కేంద్రం స్టాల్ వద్ద వృద్ధురాలు జి.చెల్లాయమ్మను పలకరించగానే భావోద్వేగానికి గురై నిలబడేందుకు ప్రయత్నించింది. ఆమెను సీఎం వారిస్తూ మోకాళ్లపై కూర్చోవడంతో చల్లగా ఉండాలని, మళ్లీ నువ్వే సీఎంగా వస్తావయ్యా అంటూ దీవించింది.
- కల్లుగీత, నేత కార్మికులు, చర్మకారులు, డప్పు వాయిద్యకారులు, ట్రాన్స్‌జెండర్లు తదితర పెన్షన్‌దారులతో సీఎం మాట్లాడి సమస్యలను సావధానంగా ఆలకించారు. వినికిడి లోపంతో బాధపడుతున్న ధవళేశ్వరానికి చెందిన కోరుమిల్లి మేఘన పరిస్థితిని తండ్రి రాజన్న ప్రసాద్ సీఎం దృష్టికి తేవడంతో సమస్య పరిష్కరించాలని తూర్పుగోదావరి కలెక్టర్ డాక్టర్ మాధవీలతను ఆదేశించారు. అనంతరం పెన్షన్‌దారులతో ముఖ్యమంత్రి గ్రూపు ఫొటో దిగారు.

బస్సులో ఉన్నా.. ప్రజల గురించే..



సభా ప్రాంగణానికి సీఎం జగన్ బస్సులో వెళుతుండగా ఆర్ట్స్ కాలేజీ వై.జంక్షన్ వద్ద ఓ మహిళ పాపను ఎత్తుకుని పరుగులు తీస్తుండటాన్ని అద్దంలో గమనించి వెంటనే వాహనాన్ని ఆపాలని ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామానికి చెందిన చెట్టి సూర్యకుమారిని దగ్గరకు పిలిచి ఆమె కుమార్తె డయానా ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని చలించిపోయారు. పుట్టిన ఏడో నెల నుంచే స్పైనల్ మస్కులర్ ఎట్రోఫి టైప్–2 వ్యాధితో నడవలేని స్థితిలో ఉందని బాధితురాలి తల్లి కన్నీటి పర్యంతం కావడంతో పూర్తిగా కోలుకునే వరకు వైద్యం అందించాలని కలెక్టర్ మాధవీలతను ఆదేశించారు.

ఉద్యోగం పోయింది.. ఆదుకోండి సారూ



తన భార్య ప్రసన్న గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోందని, కుమార్తె కీర్తన బ్లెస్సీ తక్కువ బరువుతో పుట్టడంతో పాటు గుండెకు రంధ్రం పడిందని, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ఆర్నెల్ల క్రితం ఉద్యోగం నుంచి తొలగించారని రాజమహేంద్రవరం తుమ్మలావకు చెందిన సిరికొండ సురేష్ సీఎం జగన్ ఎదుట విలపించాడు. మంత్రులు, ఎంపీలు చెప్పినా ఏఈ, ఎంఈలు ఉద్యోగం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, కుటుంబం గడవడం కష్టంగా ఉందంటూ రోదించాడు. తల్లీ బిడ్డలకు వైద్య సేవలందించడంతో పాటు సురేష్ ఉద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు సీఎం సూచించారు.

సొరియాసిస్ బాధిత చిన్నారికి పెన్షన్, వైద్యం..




పుట్టుకతో సొరియాసిస్ వ్యాధితో బాధపడుతున్న తన మూడేళ్ల కుమారుడి వైద్యం కోసం సాయం అందించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లికి చెందిన విజ్జిన అమ్మాజీ ముఖ్యమంత్రి ఎదుట మొర పెట్టుకుంది. హెలీపాడ్ వద్ద సీఎంను కలిసిన ఆమె కుమారుడు వికాస్ చికిత్స కోసం ప్రతి నెలా మందులు వాడాల్సి వస్తోందని, కొబ్బరి ఒలుపు కార్మికుడైన తన భర్త ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతోందని తెలిపింది. చిన్నారి వికాస్‌కు వైద్యసేవలు అందించడంతో పాటు నెలకు రూ.8 వేలు నుంచి రూ.10 వేలు పెన్షన్ వచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్‌ను సీఎం జగన్ ఆదేశించారు. ఒకవేళ సేవలు అందకపోతే తన కార్యదర్శికి తెలియచేయాలంటూ ఫోన్ నెంబర్ ఇచ్చి భరోసా కల్పించడంతో అమ్మాజీ కళ్లు చెమర్చాయి.



కిడ్నీ బాధితుడైన లాలాచెరువు హౌసింగ్ బోర్డుకాలనీకి చెందిన 16 ఏళ్ల సాయి గణేష్ తన తండ్రితో కలిసి సీఎం జగన్ వద్ద తన కష్టాలను మొర పెట్టుకున్నాడు. బాధితుడికి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందేలా తక్షణ సహాయం అందించాలని సీఎం జగన్ కలెక్టర్ డాక్టర్ మాధవీలతను ఆదేశించారు. సీఎం జగన్ తన కుమారుడి సమస్యను సావధానంగా ఆలకించి వెంటనే స్పందించటాన్ని జీవితాంతం మరువలేమని సాయిగణేష్ తండ్రి కృతజ్ఞతలు తెలిపాడు.

ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనన్నా



గత ప్రభుత్వ హయాంలో నా భర్త చనిపోతే ఎవరూ పట్టించుకోలేదన్నా. నాకు ఇద్దరు పిల్లలు. జన్మభూమి కమిటీల చుట్టూ పెన్షన్ కోసం రోజుల తరబడి తిరిగా. మీరు సీఎం అయ్యాక వలంటీర్ నేరుగా మా ఇంటికే వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. నెల తిరగకుండానే వితంతు పింఛన్ చేతిలో పెట్టారు. నా పెద్ద కుమారుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. విద్యా దీవెన రూ.75 వేలు, వసతి దీవెన రూ.20 వేలు చొప్పున నాలుగేళ్లలో రూ.3,80,000 లబ్ధి పొందే అవకాశం మీ ద్వారా వచ్చింది. చిన్న కుమారుడికి ఏడాదికి రూ.15,000 చొప్పున రెండేళ్ళకు రూ.30,000 అమ్మఒడి వచ్చింది. నా పిల్లలకు మేనమామ జగనన్న ఉన్నాడనే ధీమాతో చదివిస్తున్నా. నాకు ఇంటి పట్టా ఇచ్చారు. ఇల్లు కూడా కట్టుకుంటున్నాం. నా కుమారుడికి యాక్సిడెంట్ అయితే నాకంటే ముందే 108 వచ్చి ఆసుపత్రిలో చేర్పించింది. ఆరోగ్యశ్రీ కార్డుతో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించా. ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేను. 'దేవుడెలా ఉంటాడని ఎవరైనా అడిగితే నా అన్నలా ఉంటాడని చెబుతా'

– కోటా సామ్రాజ్యం, వితంతు పెన్షనర్, రాజమహేంద్రవరం.


విజయవాడ 18వ డివిజన్ రాణిగారితోటకు చెందిన మునిమణికి దివ్యాంగ పింఛను అందిస్తున్న వలంటీరు మాధవ్


విశాఖపట్నం అమర్‌నగర్‌లో పి పోలమ్మకు వితంతు పింఛను అందజేస్తున్న వలంటీరు గౌతమి


ఒంగోలు నగరంలోని వడ్డెవానికుంటలో పెంద్ర కోటమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీరు నీలిమ


గుంటూరులోని నగరంపాలెంకు చెందిన షేక్ రసూల్‌కు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వార్డు వలంటీరు యమున


విజయనగరం జిల్లా కేంద్రంలోని లెంక వీధికి చెందిన తొండమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ కుసుమ


నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆత్మకూరుకు చెందిన రాజమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీరు సురేఖ


శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో కమలనాభపురానికి చెందిన రాద రాజమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ భారతి

క్లుప్తంగా...

సీఎం జగన్‌కు ధన్యవాదాలు

ఎమ్మెల్సీ మాధవ్

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌కు బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్ మంగళవారం ధన్యవాదాలు తెలిపారు. 'సుదీర్ఘ కాలం రాష్ట్ర రాజకీయాల్లో ఉంటూ తుది శ్వాస విడిచిన నా తండ్రి పీవీ చలపతిరావుకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించిన ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ధన్యవాదాలు' అని పీవీఎస్ మాధవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కందుకూరు వంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలి

హైకోర్టులో కేఏ పాల్ పిటిషన్

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కందుకూరులో నిర్వహించిన రోడ్‌షోలో తొక్కిసలాట కారణంగా ఎనిమిది మంది చనిపోయారని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రోడ్‌షోలను, బహిరంగ సభలను నియంత్రించే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి చట్టం లేదని, ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కందుకూరు లాంటి ఘటనలు మరోసారి జరగకుండా ఉండాలంటే తగిన చట్టం చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి, రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, కందుకూరు ఎస్‌హెచ్‌వో, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు.

ప్రజా ఉద్యమాల అణచివేతకే జీవో

వామపక్షాల విమర్శ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రోడ్ షోలు, సభలకు అనుమతి నిరాకరిస్తూ ప్రభుత్వం జీవో నంబర్–1 జారీ చేయడం దుర్మార్గమని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో జీవో నంబర్–1 ప్రతులను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను, ప్రశ్నించే గొంతుకలను అణచివేసేందుకే ఈ జీవో ఇచ్చారని ఆరోపించారు. ఆంధ్రా మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శ్రీనివాసరావు, రామకృష్ణ ఇదే విషయమై విజయవాడలో వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో కూడా ప్రభుత్వం జారీచేసిన జీవో నంబర్–1ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జీవో నంబర్ 1 అప్రజాస్వామికం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతులను అణగదొక్కేందుకే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 1 జారీ చేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఇది చీకటి జీవోగా చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు నోరెత్తకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ జీవో తెచ్చారని మండిపడ్డారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు అసలు సభలు, సమావేశాలు నిర్వహించకూడదనేలా ప్రభుత్వం ఆంక్షలు విధించడం దుర్మార్గమన్నారు.

కేసీఆర్‌వి పగటి కలలు: సోము వీర్రాజు


కర్నూలు కల్చరల్: సీఎం కేసీఆర్ టీఆర్‌ఎస్‌కు వీఆర్‌ఎస్ ఇచ్చి బీఆర్‌ఎస్ అంటూ పగటి కలలు కంటున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు ఎద్దేవా చేశారు. కర్నూలులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భద్రాచలం రాములవారిని ఆంధ్రప్రదేశ్‌కు అప్పజెప్పి అప్పుడు కేసీఆర్ రాజకీయాలు మాట్లాడాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అడ్డుపడిన కేసీఆర్... ఇప్పుడు ఆంధ్రా అంటూ కూని రాగాలు తీయడం ఏమిటని ప్రశ్నించారు. సభలు, సమావేశాలు నిర్వహించకూడదని ప్రభుత్వం నియంత్రణ చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు.

చంద్రబాబును అరెస్టు చేయాలి : యోనారాజు

సాక్షి, అమరావతి: కందుకూరు, గుంటూరు ఘటనల్లో 11 మంది మరణాలకు కారకుడైన చంద్రబాబుపై కేసు పెట్టి అరెస్టు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పబ్లిసిటీ కోసం ప్రజల ప్రాణాలను కూడా పణంగా పెట్టడానికి చంద్రబాబు వెనుకాడరని ఆరోపించారు.

నీటి లభ్యత తేల్చాకే కొత్త ప్రాజెక్టులకు అనుమతి

గోదావరి బోర్డుకు తేల్చిచెప్పిన ఏపీ



సాక్షి, అమరావతి: గోదావరిలో నీటి లభ్యతపై శాస్త్రీయ అధ్యయనం చేసి.. రెండు రాష్ట్రాల వాటాలు తేల్చాకే ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని గోదావరి బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా చనాకా–కొరటా, చిన్న కాళేశ్వరం, గుత్ప ఎత్తిపోతలకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక అనుమతి ఇవ్వడం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. వాటి అనుమతిని పునఃసమీక్షించి.. దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులను పరిరక్షించాలని కోరింది. దీనిపై గోదావరి బోర్డు చైర్మన్ ఎమ్కే సిన్హా స్పందిస్తూ.. గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని సిఫార్సు చేస్తామన్నారు. ప్రాజెక్టుల సమగ్ర నివేదిక (డీపీఆర్)లపై రెండు రాష్ట్రాల అభిప్రాయాలను నమోదు చేసి సీడబ్ల్యూసీకి పంపుతామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఎమ్కే సిన్హా అధ్యక్షతన గోదావరి బోర్డు 14వ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఏపీ తరఫున ఈఎన్‌సీ నారాయణరెడ్డి, అంతర్ రాష్ట్ర జలవనరుల విభాగం అధికారులు, తెలంగాణ తరఫున ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్‌సీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. కడెం–గూడెం ఎత్తిపోతల, మోదులకుంట వాగు ఎత్తిపోతలకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ కోరడంపై ఏపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కడెం–గూడెం ఎత్తిపోతల డీపీఆర్‌లోనే కడెం వాగులో 17 టీఎంసీల లభ్యత ఉన్నట్లు తెలంగాణ సర్కార్ పేర్కొందని.. అలాంటప్పుడు గోదావరి నుంచి 11.5 టీఎంసీలను ఎత్తిపోయాల్సిన అవసరం ఏముంటుందని నిలదీసింది. నీటి లభ్యత, వాటా తేల్చే దాకా కొత్త ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చేందుకు అంగీకరించే ప్రశ్నే లేదని తేల్చిచెప్పింది.

తెలంగాణ ప్రాజెక్టులకు ఎలా అనుమతి ఇస్తారు

చనాకా–కొరటా, చిన్న కాళేశ్వరం, గుత్ప ఎత్తిపోతలకు తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా.. కనీసం తమను సంప్రదించకుండా సీడబ్ల్యూసీ సాంకేతిక సలహా కమిటీ ఎలా అనుమతి ఇస్తుందని ఏపీ అధికారులు నిలదీశారు. దీనిపై వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్న సీడబ్ల్యూసీ (హైడ్రాలజీ విభాగం) డైరెక్టర్ నిత్యానందరాయ్ స్పందిస్తూ.. దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులకు ఏమాత్రం నష్టం వాటిల్లకుండా ఆ మూడు ప్రాజెక్టులకు సాంకేతిక అనుమతి ఇచ్చామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర పరిధిలో గోదావరిలో 1,430 నుంచి 1,480 టీఎంసీల లభ్యత ఉంటుందని తెలిపారు. గత ఐదేళ్లలో సగటున 1,600 టీఎంసీల లభ్యత ఉందని.. వాటి ఆధారంగానే ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చామన్నారు. దీనిపై ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు జరగని నేపథ్యంలో తెలంగాణ ప్రాజెక్టులకు ఎలా అనుమతి ఇస్తారని నిలదీశారు. దీనిపై నిత్యానందరాయ్ స్పందిస్తూ.. ఇకపై ఏపీ అభిప్రాయాన్ని తీసుకున్న తర్వాతే ఎగువ రాష్ట్రాల ప్రాజెక్టులకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు.

పోలవరం బ్యాక్‌వాటర్‌పై తెలంగాణ పేచీ

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో భద్రాచలం పరిసర ప్రాంతాలు భారీ ఎత్తున ముంపునకు గురవుతున్నాయని.. దీనిపై మళ్లీ అధ్యయనం చేయాలని తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ అంశాన్ని చర్చించడానికి గోదావరి బోర్డు సరైన వేదిక కాదన్న ఏపీ అభిప్రాయంతో ఎమ్కే సిన్హా ఏకీభవించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమావేశంలో తెలంగాణ ఈ అంశాన్ని లేవనెత్తిందని గుర్తు చేశారు. బ్యాక్‌వాటర్ ప్రభావం అంశాన్ని పీపీఏలోనే చర్చించాలని తేల్చిచెప్పడంతో తెలంగాణ కూడా అంగీకరించింది. కాగా ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగు ఆధునికీకరణకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఆయకట్టు ఆధారంగా ఆధునికీకరణకు అయ్యే వ్యయాన్ని దామాషా పద్ధతిలో ఏపీ 85 శాతం, తెలంగాణ 15 శాతం భరించనున్నాయి. అలాగే గోదావరి ప్రాజెక్టులపై 23 చోట్ల టెలీమీటర్లను ఏర్పాటు చేసి నీటి వినియోగాన్ని లెక్కించడానికి రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. బోర్డు నిర్వహణకు 2023–24లో చెరో రూ.ఐదు కోట్లు చొప్పున విడుదల చేయడానికి కూడా సమ్మతించాయి.

మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

▶ మొదటి పేజీ తరువాయి

అందించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు సభ అనుమతి కోరుతూ చేసిన దరఖాస్తులను మీడియాకు చూపించారు. అందులో కానుకలు ఇస్తున్నట్లు లేకపోవడాన్ని ప్రస్తావించారు. టీడీపీ తప్పుడు ప్రచారాలను దుయ్యబట్టారు.

మానవ ప్రేరిత దుర్ఘటనే

మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇది మానవ ప్రేరిత దుర్ఘటనేనన్నారు. టీడీపీ నేతలు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇది జరిగేది కాదని చెప్పారు. కానుకల పేరిట వేలాదిమంది పేద మహిళలను సభకు తరలించి ముఖ్యమంత్రిని విమర్శించడమే ధ్యేయంగా చంద్రబాబు సభను నడిపారని మండిపడ్డారు. జరిగిన తప్పిదానికి సిగ్గుపడాల్సిందిపోయి వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎదురుదాడికి దిగడం దుర్మార్గమని చెప్పారు. పుష్కరాల్లో, కందుకూరులో, గుంటూరులో సామాన్య ప్రజలు చనిపోవడం క్షమించరాని నేరమన్నారు. కానుకలు పేదల ఇంటికి పంపించి ఉంటే ఈ దుర్ఘటన జరిగేది కాదుకదా అని పేర్కొన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని బహిరంగసభలకు విరామం చెప్పాలని సూచించారు. లోకేశ్ పుట్టుకతోనే వృద్ధుడని, ఆ వృద్ధుడి పాదయాత్రను అడ్డుకోవాల్సిన అవసరం తమకు లేదని ఆయన చెప్పారు.

చంద్రబాబుది నీచ ప్రవృత్తి

మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ కందుకూరు సభలో ఎనిమిదిమంది చనిపోతే, వారికి కులాలు అంటగట్టి తన వెంట ఉన్నారని చంద్రబాబు ప్రకటించడం అతడి నీచమైన ప్రవృత్తిని తెలియజేస్తోందని విమర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు సభకు అనుమతి కోరారేగానీ, అందులో కానుకల విషయం ప్రస్తావించలేదని చెప్పారు. పోలీసులు అప్రమత్తంగా ఉండటం వల్లే ప్రమాద తీవ్రత తగ్గిందని, లేకపోతే పెద్దసంఖ్యలో చనిపోయేవారని పేర్కొన్నారు.

టీడీపీ ఉనికి కోల్పోయింది

మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాధితులకు ఆర్థికసాయం అందజేశామని చెప్పారు. గాయపడిన వారికి ప్రత్యేక వైద్యం అందిస్తున్నామన్నారు. చంద్రబాబు ప్రచారయావతో ప్రజలను సభకు తరలించేందుకు కానుకల పేరుతో మోసం చేశారని విమర్శించారు. టీడీపీ ఉనికి కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్లు డైమండ్‌బాబు, షేక్ షజిల, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహకమండలి సభ్యుడు తాడిశెట్టి మురళి, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బాబు బరితెగింపు

▶ మొదటి పేజీ తరువాయి

అమలులో ఉన్నాసరే పట్టించుకోవడంలేదు. చట్టానికి వ్యతిరేకంగా, నిబంధనలకు విరుద్ధంగా కుప్పంలో మూడు రోజుల పర్యటన షెడ్యూల్‌ను ఖరారుచేశారు. ప్రభుత్వం తాజాగా ఇచ్చిన జీఓ ప్రకారం ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభలు నిర్వహించాలన్న పోలీసుల నోటీసుపైనా స్పందించలేదు.

జీఓ బేఖాతరు.. ఐదు రోడ్‌షోలతో పర్యటన

ఇక చంద్రబాబు బుధ, గురు, శుక్రవారాల్లో తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించనున్నారు. పర్యటన షెడ్యూల్‌ను ఆయన ప్రైవేటు కార్యదర్శి మంగళవారం విడుదల చేశారు. దాని ప్రకారం.. చంద్రబాబు బుధవారం హైదరాబాద్ నుంచి బెంగళూరు చేరుకుని రోడ్డు మార్గంలో కుప్పం వెళ్తారు. మొదటిరోజు శాంతిపురం మండలంలోని పెద్దూరు, బెండన కుప్పం, చెంగుబల్ల క్రాస్, శివకురుబూరు, శెట్టిబల్ల క్రాస్, కెనమాకులపల్లి, శాంతిపురంలలో రోడ్‌షోలు నిర్వహిస్తారు. రెండోరోజు కుప్పంలో పార్టీ కార్యాలయంలో నేతలతో సమీక్ష నిర్వహిస్తారు. శుక్రవారం ఏకంగా మూడు రోడ్‌షోలు నిర్వహిస్తారు. గుడుపల్లి మండలంలోని గుడుపల్లి, గుడుపల్లి రైల్వేస్టేషన్ క్రాస్, పెద్ద గొల్లపల్లి క్రాస్, చిన్నగొల్లపల్లి క్రాస్, కొడిగనిపల్లి, మాలవాని కొత్తూరు, సంగనపల్లి, పెద్దపర్తికుంట క్రాస్‌ల మీదుగా మూడు విడతల్లో రోడ్‌షోలు నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే, చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో గత ఏడాది నవంబరులో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీసులు పలమనేరు డివిజన్‌లో విధించిన 30 పోలీస్ యాక్ట్ అప్పటి నుంచి అమలులోనే ఉంది. ఆ ప్రకారం ముందస్తు అనుమతిలేకుండా ఎలాంటి సభలు నిర్వహించకూడదు. ఈ నేపథ్యంలో.. డిసెంబరు 28న నెల్లూరు జిల్లా కందుకూరులో చంద్రబాబు నిర్వహించిన రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 8 మంది మరణించారు. జనవరి 1న గుంటూరులో చంద్రబాబు పాల్గొన్న సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి ముగ్గురు పేద మహిళలు మృతిచెందారు. దీంతో రాష్ట్రంలో జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రాజ్ రోడ్లపై సభలు, రోడ్‌షోలను నిషేధిస్తూ రాష్ట్ర హోంశాఖ సోమవారం జీఓ జారీచేసింది. రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు రోడ్లపై కాకుండా ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభలు నిర్వహించుకోవాలని కూడా స్పష్టంచేసింది. అయినా 30 పోలీస్ యాక్ట్, హోంశాఖ జీఓలను బేఖాతరు చేస్తూ కుప్పంలో ఐదు రోడ్‌షోలతో చంద్రబాబు పర్యటనకు షెడ్యూల్ ప్రకటించడం విస్మయం కలిగిస్తోంది.


చంద్రబాబు షెడ్యూల్‌లో మార్పులు చేయాలంటూ పోలీసులు జారీచేసిన నోటీసులు

నోటీసులకు స్పందించని టీడీపీ..

చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో చిత్తూరు జిల్లా పోలీసులు మంగళవారం టీడీపీకి నోటీసులు జారీచేశారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండటంతోపాటు రోడ్లపై సభలు, రోడ్‌షోలను నిషేధిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీఓను ఆ నోటీసుల్లో ఉటంకించారు. కాబట్టి ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభలు నిర్వహించుకోవాలని సూచించారు. అలా ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభల కోసం దరఖాస్తు చేస్తే అనుమతిస్తామని.. పూర్తిగా సహకరిస్తామని కూడా చెప్పారు. కాబట్టి చంద్రబాబు పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చేయాలని చెబుతూ నోటీసులు జారీచేశారు. కానీ, పోలీసుల నోటీసులపై టీడీపీ మంగళవారం రాత్రి వరకు స్పందించలేదు. నోటీసులకు సమాధానం కూడా ఇవ్వలేదని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. మరోవైపు... అనుమతిలేకుండా, జీవోకు విరుద్ధంగా రోడ్ షోలు నిర్వహిస్తే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఇదే సాకుగా చంద్రబాబు పర్యటనలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలన్నది టీడీపీ ఉద్దేశంగా ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

చంద్రబాబు సభలు, రోడ్‌షోలకు అనుమతి నిరాకరణ

సాక్షి, చిత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం నుంచి మూడ్రోజుల పాటు తలపెట్టిన కుప్పం నియోజకవర్గ పర్యటనలో రోడ్‌షోలకు, సభలకు అనుమతి నిరాకరించినట్లు పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సభలు, రోడ్ షోల్లో పాటించాల్సిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసిందని ఆయన గుర్తుచేశారు. ఆ జీఓ ప్రకారం చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటనలో పాటించాల్సిన కనీస సూచనలకు సంబంధించి ఆయన వ్యక్తిగత కార్యదర్శి, ఆర్గనైజర్ మనోహర్‌కు పోలీసు శాఖ మంగళవారం ఉ.11.30 గంటలకు నోటీసు అందజేసినట్లు డీఎస్పీ తెలిపారు. అయితే, ఆ నోటీసుకు మంగళవారం రాత్రి 10.30 గంటల వరకు కూడా సమాధానం రాకపోవడంతో చంద్రబాబు రోడ్ షోలకు, సభలకు అనుమతి నిరాకరించినట్లు డీఎస్పీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేని కార్యక్రమాలను నిర్వహించిన వారు, పాల్గొన్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు.

7వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు ఇచ్చే పింఛను మొత్తం రూ.2,750లకు పెంచడాన్ని పురస్కరించుకుని పింఛన్ల పెంపు వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. సాధారణంగా ప్రతి నెలా ఒకటి నుంచి ఐదో తేదీ వరకు వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఈ నెలలో 7వ తేదీ వరకు పొడిగించినట్లు సెర్ప్ అధికారులు వెల్లడించారు. ఈ నెలకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 59,27,207 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళ, మత్స్యకార, చేనేత, చర్మకార తదితర చేతి వృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తయింది. ఒకటో తేదీ నుంచి మూడు రోజులుగా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి మొత్తం రూ.1,633 కోట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 92.52 శాతం మందికి పింఛన్ల పంపిణీ ఇప్పటికే పూర్తయింది. మిగిలిన వారికి 7వ తేదీలోపు పంపిణీ చేస్తారు.

వైఎస్సార్‌సీపీ వెంకటగిరి, పర్చూరు నియోజకవర్గాలకు సమన్వయకర్తల నియామకం



ఆమంచి కృష్ణమోహన్, ఎన్.రాంకుమార్‌రెడ్డి

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆమంచి కృష్ణమోహన్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

అన్ని పార్టీలకు ఒకటే నియమం

- టీడీపీ వైఖరి వల్లే ఈ ఉత్తర్వులు జారీ
- యాత్రలు ఎవరైనా చేసుకోవచ్చు.. నిబంధనలను ఉల్లంఘిస్తే తర్వాత పరిణామాలకు ఆ పార్టీలదే బాధ్యత
- బీఆర్‌ఎస్ పోటీచేస్తే ఆహ్వానిస్తాం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రహదారులపై బహిరంగ సభలు, రోడ్‌షోలను నిషేధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు (జీవో) వైఎస్సార్‌సీపీతోపాటు అన్ని పార్టీలకు వర్తిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టంచేశారు. అధికారంలో ఉన్న తమ వైఎస్సార్‌సీపీకి ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్న వారికి మరోరకంగా నిబంధనలు పెట్టాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. ప్రజల ప్రాణాలను పరిరక్షించడమే ప్రభుత్వానికి ముఖ్యమని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రహదారులపై బహిరంగ సభలు, రోడ్‌షోలు నిషేధిస్తూ జీవో జారీచేయడానికి ప్రధాన కారణం టీడీపీ వైఖరేనని చెప్పారు. ఈ జీవోను ఉల్లంఘించి రహదారులపై సభ, రోడ్‌షో నిర్వహిస్తే తర్వాత పరిణామాలను వారే ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గుంటూరులో చంద్రన్న సంక్రాంతి కానుకల ఆశ చూపి.. టోకెన్లు ఇచ్చి అమాయక పేద మహిళలను సభకు తీసుకొచ్చి.. అందరికీ సరుకులు పంపిణీ చేయకుండా టీడీపీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. సభకు హాజరై.. చంద్రబాబు వెళ్లిన తర్వాత తొక్కిసలాటలో ముగ్గురు పేద మహిళలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్ఘటన జరిగిన స్థలానికి ఎందుకు వెనక్కి రాలేదో వివరణ ఇవ్వాలని చంద్రబాబును నిలదీశారు. సభ జరిగిన చోట విజువల్స్ (దృశ్యాలు) చూస్తే.. పోలీసులు తప్ప ఎవరూ సహాయం చేస్తున్నట్లు కనిపించలేదన్నారు. గుంటూరు సభకు టీడీపీకి పోలీసులు ఇచ్చిన అనుమతి పత్రాన్ని చూస్తే.. సభకు సంబంధించి వలంటీర్ వ్యవస్థను ఆ పార్టీ నేతలు ఏర్పాటు చేసుకోవాలని అందులో స్పష్టంగా ఉందని చెప్పారు. ఇది చంద్రబాబుకూ తెలుసన్నారు. కానీ, నోరుంది కదా అని వైఎస్సార్‌సీపీపై, పోలీసులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం చంద్రబాబుకు అలవాటేనని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గుంటూరులో ఒక ప్రాంతంలో వైఎస్ జగన్ దీక్ష చేస్తామంటే.. అక్కడ అంబులెన్సులు తిరుగుతాయని సాకులు చెప్పి అనుమతించలేదని, దీంతో వేరే ప్రాంతంలో దీక్షచేశారని గుర్తుచేశారు. చంద్రబాబు ఎన్నడూ ప్రజా సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని సజ్జల మండిపడ్డారు. అందుకే ప్రజల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదన్నారు. చివరకు కందుకూరు, గుంటూరు సభల్లో అమాయకులను పొట్టన పెట్టుకుని.. వారి చావుల్లోను కులాలు, ఉప కులాలను వెతికి, దాన్ని రాజకీయం చేసే కుసంస్కారి చంద్రబాబు అని దుయ్యబట్టారు. తన ఉద్యమంలో వారు సమిధలయ్యారని వ్యాఖ్యానించడం చంద్రబాబు బరితెగింపునకు నిదర్శనమన్నారు. దీన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించాలని కోరారు.

ఎవరైనా యాత్రలు చేసుకోవచ్చు

లోకేష్ పాదయాత్ర చేసుకున్నా.. ఆయన తండ్రి చంద్రబాబు యాత్ర చేసుకున్నా.. పవన్‌కళ్యాణ్ బస్సుయాత్ర చేసినా తమకేమీ అభ్యంతరం లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా సజ్జల చెప్పారు. టీడీపీ యాత్రలు చేపట్టడానికి ముందు.. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి, ప్రజలకు ఏ రకంగా అన్యాయం చేశామో, భవిష్యత్‌లో ఏ రకంగా న్యాయం చేస్తామో చెప్పగలగాలని హితవు పలికారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ ప్రభుత్వ వైఫల్యాలను ఎందుకు ప్రశ్నించలేదో.. ఇప్పుడే ఎందుకు ప్రశ్నిస్తున్నాడో పవన్‌కళ్యాణ్ తన యాత్రలో చెప్పగలగాలని సూచించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేలా ఏడాదిన్నరలో వచ్చే ఎన్నికలకు టీడీపీ, జనసేన సిద్ధం కావాలనే తమ పార్టీ ఆశిస్తోందని చెప్పారు. ప్రత్యర్థులు ఎప్పుడూ ధర్మయుద్ధానికి సిద్ధమై ఉండాలనే తాము కోరుకుంటున్నామన్నారు. దొంగయుద్ధం, ముసుగుయుద్ధాలను కాదని ఎద్దేవా చేశారు.

ఎవరైనా పోటీ చేయవచ్చు

ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ ఎక్కడైనా పోటీచేసుకోవచ్చునని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా సజ్జల చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పోటీచేస్తే ఆహ్వానిస్తామన్నారు. రాజకీయాల్లో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్‌లో చేరబోతున్నది టీడీపీలో ఉన్న ఆ 23 మంది ఎమ్మెల్యేలా... అని మరో ప్రశ్నకు సమాధానంగా సజ్జల ఎదురు ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకూడదన్నదే తమ అభిమతమని, దీనికి ఇతర పార్టీలు మద్దతు పలికితే మంచిపరిణామమేనని ఇంకో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

బహిరంగ సభలపై జీవోను వెనక్కి తీసుకోవాలి

- ప్రతిపక్షాలను అణచివేయాలని చూడడం సరికాదు
- బీజేపీ కార్యక్రమాలకు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు
- బీజేపీ ఎంపీ సీఎం రమేష్

సాక్షి, న్యూఢిల్లీ: రోడ్ షోలు, సభలను నిర్వహించడాన్ని నిషేధిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వును బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఖండించారు. ప్రతిపక్షాలను అణచివేయాలని చూడడం సరికాదన్నారు. అణచివేయాలని చూస్తే ప్రతిపక్షాలు తిరగబడతాయని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలపై ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్న సమయంలోనే ప్రతిపక్షాలు నిరసనలు తెలుపుతున్నాయని చెప్పారు. ఆయన మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వరదలు రాకుండా, డ్యామ్‌లు తెగకుండా జీవోలు ఇస్తారా... అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలు తెలుసుకోకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదన్నారు. కర్నూలు, హిందూపురంలో ఈ నెల 8న జరగనున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనను అడ్డుకోవడం కోసమే ఈ జీవో తెచ్చారా.. అని ప్రశ్నించారు. ఏ కార్యక్రమానికి అయినా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అయినప్పటికీ ఏపీలో పరిస్థితులు వేరుగా ఉన్నాయని చెప్పారు. అయితే బీజేపీ కార్యక్రమాలకు ప్రభుత్వ అనుమతి అవసరం లేదని పేర్కొన్నారు. కందుకూరు, గుంటూరు లాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ఆలోచించాలిగానీ సభలు, సమావేశాలను అడ్డుకోవడం సరికాదని చెప్పారు. గత ప్రభుత్వం ఇలానే వ్యవహరిస్తే జగన్ పాదయాత్ర చేసేవారా? అని ఆయన ప్రశ్నించారు.

పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టాలి

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టి.. మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో మంగళవారం బీసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించినప్పుడే వారికి రాజ్యాధికారం దక్కుతుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా బిల్లును లోక్‌సభలో కూడా ప్రవేశపెట్టి పూర్తి చేయాలని కోరారు.

సీఎస్‌ను కలిసిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డిని కలిశారు. ఆయనకు 31 అంశాలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జానిపాషా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ఇప్పటివరకు చేసిన సర్వీసుకి అనుగుణంగా 2019 అక్టోబర్ నుంచి ప్రస్తుతం వరకు 128 ఎర్న్డ్ లీవ్‌లు ఉద్యోగుల లాగిన్‌లో క్రెడిట్ చేయాల్సి ఉండగా, కేవలం ఈ ఏడాదికి సంబంధించి మొత్తం 45 సెలవులు మాత్రమే జమచేశారని, దీంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. పలు సమస్యలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు.



ఏమీ లేకపోవడం, అది ఎంత ఆనందప్రదం!
జ్ఞానోదయం అయినవారు ఏమీలేనివారు. ఏదో ఉన్నవారంటే తన
మనసులో మనుష్యుల సంకెళ్లు ఉన్నవారు. వారు పడే వేదన చూడండి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, జనవరి, 4

ఈ తోక వంకర తీసేదెట్లా?

కొత్త ఏడాది ఇలా ఆరంభమవుతుందని కశ్మీర్ ప్రజలు ఊహించలేదు. అందరూ శాంతి, సంతోషాలను కోరుకుంటున్న వేళ జమ్ములో తీవ్రవాదం జడలు విప్పి, 12 గంటల్లో ఆరుగురిని పొట్టనబెట్టుకున్న తీరు మనసును కలచివేస్తుంది. కశ్మీర్ లోయతో పోలిస్తే ప్రశాంతమైన జమ్ములో ఇలాంటి ఘటన జరగడం విషాదం. 2019లో ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా భారత్ ప్రకటించిన జమ్ము– కశ్మీర్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, ఎన్నికల ప్రక్రియను పునరుద్ధరించకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా తీవ్రవాదులు ఈ దుశ్చర్యలకు దిగినట్టు కనిపిస్తోంది. ఇది పాక్ ప్రేరేపిత తీవ్రవాద చర్య అని అర్థం చేసుకోవడం బ్రహ్మవిద్యేమీ కాదు. కాకపోతే, భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఐక్యరాజ్య సమితిలో మాట్లాడుతూ, తీవ్రవాద కేంద్రస్థానంగా పాకిస్తాన్‌ను ప్రస్తావించి, ఈ ధోరణిని మార్చుకోవాలంటూ హితవు చెప్పిన పక్షం రోజులకే ఈ ఘాతుకం జరగడం శోచనీయం. మారని పాక్ వక్రబుద్ధికి మరో తార్కాణం.

తాజా ఘటన పూర్వాపరాలు దిగ్భ్రాంతికరం. జమ్ము–కశ్మీర్ సరిహద్దు జిల్లాలో రజౌరీ పట్నానికి 8 కిలోమీటర్ల దూరంలోని ధాంగ్రీలో జనవరి 1 సాయంత్రం 7 గంటల వేళ ఖాకీ దుస్తులు ధరించిన తీవ్రవాదులు అక్కడి అల్పసంఖ్యాక వర్గానికి చెందిన మూడు ఇళ్ళలోకి జొరబడ్డారు. విచక్షణారహితంగా కాల్పులు జరిపి, నలుగురు పౌరుల ప్రాణాలు తీశారు. పలువురిని గాయపరిచి, అక్కడ నుంచి ఉడాయించారు. ఆ తుపాకీ దాడులు ముగిసిన కొద్ది గంటల్లోనే ఆ ఇళ్ళ దగ్గరే ఒక చోట తీవ్రవాదులు ఉంచిన బాంబులు పేలి ఇద్దరు చిన్నారులు బలయ్యారు. దర్యాప్తుకు వచ్చే భద్రతాదళ ఉన్నతాధికారులే లక్ష్యంగా ఆ బాంబులు పెట్టడం, ఆధార్ కార్డుల ద్వారా గుర్తుపట్టి మరీ ఎంపిక చేసినవారినే తుపాకీ కాల్పులతో చంపడం తీవ్రవాదుల కక్షను తేటతెల్లం చేస్తోంది.

కశ్మీర్‌లో తీవ్రవాదం వైపు కొత్తగా ఆకర్షితులవుతున్నవారిని వేగంగా నిర్వీర్యం చేస్తున్నామని అక్కడి ఉన్నతాధికారుల ఉవాచ. నిన్న గాక మొన్న ముగిసిన 2022లో 100 మంది కొత్తగా తీవ్రవాద మార్గంలోకి రాగా, 65 మందిని ఎన్‌కౌంటర్ చేశామనీ, వారిలోనూ 58 మందిని (89 శాతం) చెడు దోవ తొక్కిన తొలి నెలలోనే మట్టికరిపించామనీ లెక్కలు చెబుతున్నారు. ఎంతమంది తీవ్ర వాదులు కొత్తగా వస్తున్నదీ, పోతున్నదీ మన పాలకులు, పోలీసులు ఇంత నిర్దుష్టంగా చెప్పగలగడం ఆశ్చర్యమైతే, వారి ప్రతి అడుగూ ఇంత తెలిసినవారు అడ్డుకట్ట వేయలేకపోవడం అమితాశ్చర్యం. పైగా, ఆదివారం దాడి తర్వాత ఆ రాత్రి అణువణువూ జల్లెడ పట్టామని భద్రతా దళాలు చెప్పినా, ఆ దగ్గరే దుండగులు పెట్టిన బాంబులు మర్నాడు పేలి మృతులు పెరగడం మన పనితీరును ప్రశ్నిస్తోంది.

రజౌరీ జిల్లాలో కొన్నిచోట్ల ముప్పుందని కొంతకాలంగా అనుమానిస్తున్నారు. గాలింపులూ జరిగాయి. అయినా సరే ఇలా ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు సాగడం అటు తీవ్రవాదుల తెగింపుకూ, ఇటు మన భద్రతా వైఫల్యానికీ నిలువుటద్దం. జిల్లాలో ఓ సైనిక శిబిరం బయట కాల్పుల్లో ఇద్దరు పౌరుల ప్రాణాలు పోయిన రెండు వారాల్లోనే ఈ ఘటన జరగడం గమనార్హం. సరిహద్దులోని అల్పసంఖ్యాకులే గురిగా పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులు చేస్తున్న ఈ అరాచకం దాయాది దేశం సాధించదలుచుకున్నదేమిటో చెప్పకనే చెబుతోంది. పొరుగు దేశాలన్నిటితో భారత్ సదా సత్సంబంధాలే కోరుకుంటుంది. అలాగని తీవ్రవాదాన్ని బూచిగా చూపించి మనల్ని చర్చలకు తలొగ్గేలా చేయాలనుకుంటే కుదిరేపని కాదు. ఆ మాటే ఆ మధ్య జైశంకర్ కుండబద్దలు కొట్టారు.

జైశంకర్ సోమవారం వ్యాఖ్యానించినట్టు, అనేక దశాబ్దాలుగా సీమాంతర తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ పద్ధతులను యూరోపియన్ దేశాలు సహా అంతర్జాతీయ సమాజం నిర్ద్వంద్వంగా ఖండించకపోవడం మరీ ఘోరం. తీవ్రవాదాన్ని సహించబోమని జబ్బలు చరిచే అమెరికా సైతం భారత్‌తో భుజం భుజం కలుపుతూనే, పాక్‌తోనూ మంచిగా ఉంటోంది. 2018లో ట్రంప్ హయాంలో పెట్టిన నిషేధాన్ని తొలగిస్తూ, బైడెన్ హయాంలో అమెరికా గత ఏడాది పాక్‌తో ఎఫ్16 విమానాల ఒప్పందం పునరుద్ధరించింది. తీవ్రవాద వ్యతిరేక పోరాటంలో పాక్ భాగస్వామి గనకనే ఈ సైనిక, రక్షణ సాయమన్న అమెరికా మాట అతి పెద్ద జోక్. ఇక, ఇటీవలే భారత్, పాక్‌లలో దేన్నీ తాము వదులుకోలేమంటూ విదేశాంగ ప్రతినిధి చేసిన వ్యాఖ్య అగ్రరాజ్యపు నైజానికి తార్కాణం.

మాదక ద్రవ్యాలు, అక్రమ ఆయుధాల వ్యాపారం సహా అంతర్జాతీయ నేరాలెన్నో ముడిపడిన సీమాంతర తీవ్రవాదాన్ని కేవలం ఫలానా దేశపు తలనొప్పి లెమ్మని ఊరకుంటే ముప్పు మీదకొస్తుంది. రోజూ తీవ్రవాదుల్ని భారత్‌కు ఎగుమతి చేస్తున్న పొరుగుదేశం పక్కలో పాము లాంటిదే. గతంలో హిల్లరీ క్లింటన్ అన్నట్లు, 'పెరట్లో పాములను పెట్టుకొని, అవి కేవలం పొరుగువాణ్ణే కాటేస్తాయనుకుంటే పొరపాటే!' ఆ సంగతి అమెరికా సహా అంతర్జాతీయ దేశాలన్నీ గ్రహించాలి.

భారత్ సైతం పాక్‌పై అంతర్జాతీయ వేదికలపై ధ్వజమెత్తుతూనే, అమెరికా పైనా కన్నేసి ఉంచాలి. మన పాలకులు కశ్మీర్ లోయలో పండిట్లు సహా స్థానికులపై తీవ్రవాద దాడులు 2019 తర్వాత పెరిగిన చేదునిజాన్ని గుర్తించాలి. తీవ్రవాదుల్ని కాక తీవ్రవాదాన్ని అంతం చేసే పనికి దిగాలి. స్థానికుల ఆశలు, ఆకాంక్షలకు పెద్ద పీట వేస్తూ, వారే పాలకులయ్యేలా చూడాలి. సానుకూల వాతావరణం కల్పించి, ఇప్పటికే అపరిమితంగా ఆలస్యమైన అసెంబ్లీ ఎన్నికలను జరిపించి, స్థానిక ప్రభుత్వ ఏర్పాటుతో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. ఇప్పుడు అదే మార్గం.

2023లో మన విదేశాంగం ఎటు?

విశ్లేషణ



హర్ష్ వి. పంత్

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం భారత్‌ను అనూహ్యమైన భౌగోళిక, రాజకీయ పరీక్షల వైపు నెట్టింది. రష్యా పట్ల భారత్ వైఖరిని తిరిగి పరిశీలించుకునేలా చేసింది. అదే సమయంలో యూరప్ సమస్యలు ప్రపంచ సమస్యలు అవుతాయి కానీ ప్రపంచ సమస్యలు యూరప్ సమస్యలు కావు అనే ఆలోచనలోని కపటత్వాన్ని భారత్ నొక్కి చెప్పింది. ఇండో–పసిఫిక్ వ్యవహారాలకు సంబంధించి భారత్ కేంద్ర స్థానం విషయంలో యూరప్ దేశాలు నిశ్చితాభిప్రాయానికి వచ్చేశాయి. అయితే చైనా నుండి సవాళ్లు కొనసాగుతున్నాయి. ప్రపంచం మొత్తంగా బీజింగ్ వ్యవహారాలపై అసమ్మతి వ్యక్తపరుస్తున్న తరుణంలో– జీ20 నాయకత్వం రూపంలో అంతర్జాతీయ పర్యవసానాలను రూపుదిద్దగలిగే 'నాయకత్వ శక్తి'గా భారత్ తన విశ్వసనీయతను పెంపొందించుకోవాలి.

మరొక కల్లోలభరితమైన సంవత్సరం ముగిసింది. 2022 ప్రారంభంలో యుద్ధం యూరోపియన్ తీరాలకు చేరుకుంది. కోవిడ్–19 అనంతర సాధారణ స్థితికి ప్రపంచం వస్తున్న తరుణంలోనే ఉక్రెయిన్‌ను రష్యా ఆక్రమించడంతో ప్రపంచ క్రమవ్యవస్థకు కొత్త సవాళ్లను విసిరినట్టయింది. అమెరికా–చైనా మధ్య ఘర్షణ పదునెక్కుతున్న స్థితిలో రష్యా–చైనా మధ్య బంధం మరింతగా బలపడుతోంది. ప్రతి విషయంలోనూ ఆయుధీకరణ కొత్త వ్యవస్థగా ఆవిర్భవిస్తున్నందున ప్రపంచీకరణ వ్యతిరేక క్రమం చుట్టూ చర్చ బలం పుంజుకుంటోంది. ఈ ఉపద్రవం మధ్య అంతర్జాతీయ సంస్థలు నూతన సవాళ్లను ఎదుర్కోవడానికి ఏమాత్రం సిద్ధంగా లేవు. కాబట్టి, నూతన సంస్థాగత నిర్మాణాల కోసం శోధన ముందుకు వచ్చింది.

జాతీయ వ్యూహాత్మక చింతనకు చెందిన కొన్ని మౌలిక భావనలకు బహిరంగంగా వ్యతిరేకత ఎదురవుతున్నప్పుడు భారతీయ విదేశీ విధానం ఒక సంవత్సర కాలంలో ఈ అన్ని మలుపులకూ స్పందించాల్సి వచ్చింది. 2020లో గల్వాన్ సంక్షోభం భారత ప్రభుత్వాన్ని తన చైనా విధానాన్ని తిరిగి మదింపు చేసుకునేలా ఒత్తిడికి గురిచేసింది. ఆ విధంగానే ఉక్రెయిన్ యుద్ధం భారత్‌ను తన రష్యా విధాన చోదక శక్తుల పట్ల వైఖరిని తిరిగి పరిశీలించుకునేలా చేసింది. అలాగే పాశ్చాత్య ప్రపంచంతో తన వ్యవహార శైలిని కొత్తగా రూపొందించుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించింది. 2022 ఫిబ్రవరిలో రష్యన్ దురాక్రమణ ప్రారంభమైనప్పుడు, డిమాండ్ చేస్తున్న పాశ్చాత్య దేశాలు ఒకవైపు, విఘాతం కలిగించే రష్యా మరొకవైపు ఉంటున్న స్థితిలో రెండు శక్తులతోనూ సంబంధాలను భారత్ ఎంత కష్టంగా నిర్వహిస్తుందనే అంశంపై చాలా చర్చ జరిగింది. అయితే అత్యంత సంక్లిష్టమైన ప్రపంచ సమస్యపై భారత్ సమతుల్యత ప్రదర్శించడం నుంచి నూతన సంవత్సరం నాడు ప్రారంభమైంది.

ఇంధన భద్రత కోసం రష్యాతో తన సంబంధ బాంధవ్యాలను భారత్ కొనసాగించడమే కాదు, మాస్కోతో ఇంధన పొత్తులను మరింతగా పెంచుకోగలిగింది. రష్యాను బహిరంగంగా ఖండించకపోవడం ద్వారా పాశ్చాత్య ప్రపంచం పక్షాన భారత్ నిలబడలేదని పాశ్చాత్య దేశాల్లో కొంతమంది విమర్శిస్తున్న సమయంలోనే, సంవత్సరం పొడవునా పాశ్చాత్య దేశాలతో భారత్ సంబంధాలు మరింత బలపడ్డాయి. భారత్ తన వంతుగా ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టం, ప్రాదేశిక సార్వభౌమాధికారం నేపథ్యంలో రష్యన్ దురాక్రమణపై ఆరోపించడం నుంచి తన వైఖరిని మార్చుకుంది. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇది యుద్ధ సమయం కాదని రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌కు బహిరంగంగానే బోధ చేసేంతవరకు పోయారు. బాలి సదస్సులో జీ20 దేశాల చర్చల సమయంలో సెంటిమెంటును రంగరించి మరీ మోదీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సంవత్సరం ముగిసే సమయానికి



ఉక్రెయిన్ సంక్షోభాన్ని ముగించే విషయంలో భారత్ మరింత క్రియాశీలక పాత్ర చేపట్టనుందని అంచనాలు పెరిగిపోయాయి. చివరకు ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ ఫోన్ చేసి మరీ మాట్లాడారు.

రష్యా పట్ల భారత్ వైఖరిని పాశ్చాత్య ప్రపంచం ప్రారంభంలో విమర్శనాత్మకంగా అంచనా వేసింది. కానీ ఉక్రెయిన్ సమస్యపై దౌత్యపరమైన ప్రయత్నాల విషయంలో భారత్ చొరవను చివరకు పాశ్చాత్య దేశాలు హేతుపూర్వకంగా గుర్తించాల్సి వచ్చింది. యూరప్ సమస్యలు ప్రపంచ సమస్యలు అవుతాయి కానీ ప్రపంచ సమస్యలు యూరప్ సమస్యలు కావు అనే ఆలోచనలోని కపటత్వాన్ని భారత్ నొక్కి చెప్పింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇండో–పసిఫిక్ వ్యవహారాలకు సంబంధించి భారత్ కేంద్ర స్థానం విషయంలో యూరప్ దేశాలు నిశ్చితాభిప్రాయానికి వచ్చేశాయి. దీంతో ఈ సంవత్సరం భారత్–యూరోప్ సంబంధాలు కొత్త పుంతలు తొక్కాయి. యూరోపియన్ స్థలపరిధుల్లో రష్యాకు ప్రధాన స్థానం ఉన్నప్పటికీ, చైనా నుండీ, దాని దూకుడు ఎత్తుగడలనుంచే తమకు దీర్ఘకాలిక వ్యూహాత్మక సవాళ్లు ఎదురు కానున్నాయని యూరప్ దేశాలకు స్పష్టంగా బోధపడింది.

వారి వ్యూహాత్మక తర్కం కారణంగా అమెరికాతో భారత్ సంబంధాలు కూడా ముందంజ వేశాయి. ఇండో–పసిఫిక్ నేడు అత్యంత కీలకంగా మారింది. పసిఫిక్ ప్రాంతంలో 'క్వాడ్', మధ్య ప్రాచ్యంలో 'ఐ2యు2' (ఇజ్రాయెల్, ఇండియా, యూఎస్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) రెండు కీలక భూభాగాల్లో సంస్థాగత వ్యాఖ్యాతలుగా ఆవిర్భవిస్తున్నాయి. న్యూఢిల్లీ, వాషింగ్టన్ ద్వైపాక్షిక సంబంధాలకు మించి, తమ వ్యవహారాలకు చెందిన ఎజెండానే పునర్నిర్వచించుకుంటున్నాయి. దాంతోపాటు తమ ఆకాంక్షల ఆకృతులను మరింతగా పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

భారతదేశం నిర్వహించే అంతర్జాతీయ పాత్రను ప్రపంచం ఇప్పుడు మరింత సీరియస్‌గా తీసుకుంటోంది. ఎందుకంటే సంక్లిష్టమైన గ్లోబల్ సమస్యలను భారత్ ఇప్పుడు మరింతగా పట్టించుకుంటూ, నాయకత్వం వహించగలుగుతోంది. ప్రపంచ సమస్యలకు అది పరిష్కారాలు అందించడానికి సిద్ధపడుతోంది. భావసారూప్యత కలిగిన దేశాలతో భాగస్వామ్యాలను ఏర్పర్చుకుంటోంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ తన అధ్యక్ష స్థానాన్ని... సంస్కరించిన బహుపాక్షికతను, శాంతిపరిరక్షణను, ఉగ్రవాద నిరోధకతను, సముద్ర భద్రతను నొక్కి చెప్పడానికి ఉపయోగించుకుంది. ఈ సమస్యలు భారత్ ప్రయోజనాలకే కాదు, ప్రపంచంలోని విశాల భాగం ప్రయోజనాలకు కూడా చాలా ముఖ్యమైనవి.

భద్రతాసమితిలో భారత్ వ్యవహరిస్తున్న తీరులో ఆచరణాత్మకతకు చెందిన కొత్త అర్థం ప్రస్ఫుటమవుతోంది. ఇంతవరకు వినపడకుండా కనిపించకుండా పోయిన విశాల మెజారిటీ దేశాల గురించి మాట్లాడేలా భారత వాణి ఉంటోంది. ఈ ప్రాధాన్యత ప్రాతిపదికపైనే అది జీ20 కూటమి అధ్యక్షత బాధ్యతను చేపడుతోంది. బహుపాక్షికత అనేది తన విశ్వసనీయతా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రపంచం ఎదుర్కొంటున్న కీలకమైన సవాళ్లు కొన్నింటికి పరిష్కారాలను అందించే విషయంలో అందరి కళ్లూ న్యూఢిల్లీ చేపట్టిన జీ20 నాయకత్వంపైనే ఉన్నాయి. ఇది అంతర్జాతీయ పర్యవసానాలను రూపుదిద్దగలిగే 'నాయకత్వ శక్తి'గా భారత్ తన విశ్వసనీయతను పెంపొందించుకోవలసిన సమయం. ప్రత్యేకించి భారత గాథ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న సమయంలో ఇది ఎంతో అవసరం.

భారత్ అంతర్జాతీయ పాత్రను మెచ్చుకునే పరిణామాలు ఏర్పడుతున్న సమయంలో ప్రముఖ ఆర్థిక శక్తిగా ఆవిర్భవించడం కీలక పాత్ర పోషించనుంది. ప్రపంచం మొత్తంగా బీజింగ్ వ్యవహారాలపై తీవ్ర అసమ్మతి వ్యక్తపరుస్తున్న తరుణంలో చైనా దూకుడును నిలువరించడంలో దృఢ వైఖరిని ప్రదర్శిస్తున్న భారత్ కొత్త అవకాశాలను సృష్టించుకుంది. 2022లో ఇలాంటి కొన్ని అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భారతీయ విదేశీ విధానం విజయవంతమైంది. మరోవైపున చైనా సవాలు సమీప భవిష్యత్తులో భారత ప్రభుత్వ సమర్థతను పరీక్షించడం కొనసాగించనుంది. శీతాకాలం తర్వాత కూడా ఉక్రెయిన్ సంక్షోభం కొనసాగినట్లయితే భారత్, రష్యా పొత్తు కూడా నిశిత పరిశీలనకు గురవుతుంది. న్యూఢిల్లీ పదేపదే చెబుతున్న 'బహుళ–అమరిక వాదం' కూడా 2023లో తీవ్రమైన ఒత్తిడి పరీక్షకు గురికాక తప్పదు. అయితే 2022 గురించి ఏమైనా చెప్పుకోవాలీ అంటే, భారత వాణి విశిష్టతను ప్రపంచం గుర్తించింది. ముమ్ముందు అది అంతర్జాతీయ వేదికలపై మరింతగా విస్తరిస్తుంది. ఇప్పుడప్పుడే దాని ప్రతిధ్వనులు తగ్గిపోవు.

వ్యాసకర్త ఉపాధ్యక్షుడు, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్, న్యూఢిల్లీ
('ద హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వేరేవీ కనపడవా?



ఒక పాఠకురాలిగా, పుస్తకాల ప్రచారకర్తగా అత్యధిక ఇయర్ ఎండర్స్ లోనూ, 2023లో చదవాల్సిన జాబితాల్లోనూ ఉన్న పుస్తకాలన్నీ కూడా సెలబ్రిటీలు రాసినవో, లేదా సెలబ్రిటీల మీద రాసినవో ఉండటం బాధ కలిగించింది. వీటి కన్నా అద్భుతమైన పుస్తకాలు చాలా ఉన్నాయి. కొంచెం భిన్నత్వం చూపండి.

– అమృతా తల్వార్, బుక్ పబ్లిసిస్ట్

లౌకిక భారతం



అనుకోకుండా ఫోన్లో ఒక ముస్లిమేతర కవికి సలామ్ చెప్పాను. ఆయన పూర్తి ఉత్సాహంతో వాలేకుమ్ సలామ్ అని బదులిచ్చారు. తర్వాత ఆయన తాను హిందువునని చెప్పారు. అయితే పరస్పరం ఒకరికొకరం శాంతిని కోరుకోవడంలో ఎంతమాత్రమూ హాని లేదన్నారు. చివరగా ఆయన గుర్తుంచుకుని మరీ 'ఖుదా హాఫిజ్' అన్నారు. ఇదీ భారత్!

– ఇన్షత్ అరా, జర్నలిస్ట్

విషయం అర్థమౌతోంది



చైనాతో ఘర్షణలో మోదీకి ఉన్న బలవంతుడు అన్న ఇమేజ్‌కు గండి పడింది. చైనాకు ఇండియా తన భూభాగాన్ని వదులుకోలేదని ఆయన పదేపదే చెప్పడం ఆయన మద్దతుదారులకు ఆయుధం ఇచ్చింది. కానీ ఆయన గుడ్డి మద్దతుదారుల సంఖ్య తగ్గిపోయింది.

– అజయ్ శుక్లా, రక్షణాంశాల వ్యాఖ్యాత

జన ధోరణి



మనం ఎలా ఉన్నామంటే, లేకపోవచ్చు అనుకునే విషయం (దేవుడు) కోసమేమో చచ్చిపోయేంత నిరాశకు లోనవుతున్నాం. అదే కచ్చితంగా ఉంది అనుకునే విషయం (వాతావరణ మార్పు) కోసమేమో ఏమాత్రం నిరాశ పడటం లేదు.

– తబిష్ ఖైర్, రచయిత

ఆకాంక్ష



2023 సంవత్సరాన్ని నేను ఒకటే కోరుకుంటున్నాను – దయచేసి 2022 లాగా ఉండవద్దు.

– రానీ సేన్, ఫిలింమేకర్

ఇన్‌బాక్స్

ఏం చేస్తాం! మా రాత అట్టా రాసుందయ్యా

పేదరికం పేగు తెంచుకొని పుట్టినందుకు
పూటకుపూట అన్నం కోసం దేవులాడుకుంటున్నాం
ఏం చేస్తాం! మా రాత అట్టా రాసుందయ్యా

మీ ప్రచార ఆర్భాట గాలానికి గుచ్చిన
రూపాయి ఎరకు ఆశపడి
కష్టాల కొక్కెను గొంతులో ఇరికించుకున్నాం
ఏం చేస్తాం! మా రాత అట్టా రాసుందయ్యా

మీ మోచేతి మత్తు కోసం
గుటకలు మింగే మా మొగోళ్ళు
మా బాధలను గాలికొదిలేసి
మీ చెప్పులతో స్నేహం చేస్తున్నారు
ఏం చేస్తాం! మా రాత అట్టా రాసుందయ్యా

జనమంతా మీతోనే ఉన్నారని నమ్మించడానికి
మీరు చల్లిన నూకలు
ఆకలి గుంపును అదిమి పట్టడానికే అని తెలిసికూడా
మీ మాయల ఉచ్చులోపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నాం
ఏం చేస్తాం! మా రాత అట్టా రాసుందయ్యా

మీరు విదిలించే కానుకల కిట్లు
మా ఇంట్లో కొత్త సంవత్సర శోభ తెస్తాయని
ఇంటిల్లిపాది పనులు మానుకొని బారులు తీరి
మీ కుతంత్రం కాళ్ళకింద పడి ఊపిరి వదిలేశాం
ఏం చేస్తాం! మా రాత అట్టా రాసుందయ్యా

ఈ ప్రపంచాన్ని నోటు నడిపించినంత కాలం...
ఈ నోట్లు పెద్దోళ్ళ పెరట్లో కాస్తున్నంత కాలం...
మా కూలి బతుకుల్లో విచ్చుకున్న ఆకలి గాయాలు
నిత్యం ఏడుస్తూనే ఉంటాయి
ఏం చేస్తాం! మా రాత అట్టా రాసుందయ్యా

– డా॥ ఎస్. ఈశ్వర రెడ్డి,
ప్రొఫెసర్, యోగివేమన యూనివర్సిటీ, వైఎస్సార్ కడప జిల్లా
(గుంటూరు తొక్కిసలాటలో కూతురును కోల్పోయిన ఒక తల్లి రోదిస్తూ... 'మా రాత అట్టా రాసుందయ్యా' అన్న వాక్యం విన్న బాధతో)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆధునికతకు అంబేడ్కరిజాన్ని జోడించాలి


అభిప్రాయం



ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్

యువతరాన్ని అంబేడ్కర్‌తో అనుసంధానం చేయాలి. వాస్తవిక సమాజ పరిస్థితులను దగ్గరగా పరిశీలిస్తూ యుక్తవయసులోనే విప్లవాత్మకమైన ఆలోచనలు చేసిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. అత్యధిక ఆదాయాన్ని సంపాదించిపెట్టే వృత్తిగా నిలిచే బారిష్టర్‌ను చదివే అవకాశం ఉన్నా, సమాజానికీ, దేశానికీ ఉపయుక్తంగా నిలిచే అర్థశాస్త్రాన్ని కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పూర్తిచేసిన ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి అవగతం కావాల్సిన అవసరం ఉంది. అంబేడ్కర్‌ని ఒక రివల్యూషనరీ థింకర్‌గా చెప్పవచ్చు.

అంబేడ్కర్ ఆలోచనలే పునాదిగా 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' స్థాపన జరిగింది. ప్రపంచవ్యాప్తంగా అగ్ర రాజ్యాల ఆర్థిక వ్యవస్థలు సైతం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా... భారతీయ ఆర్థిక వ్యవస్థ చెక్కుచెదరకుండా తగిన సుస్థిరత్వాన్ని కలిగి ఉందంటే అలా ఉండటానికి అంబేడ్కర్ ఆలోచనలు, ప్రయత్నాలు సఫలీ కృతం అయ్యాయనే అర్థమవుతుంది. ఎక నామిక్స్‌లో చదువు పూర్తయిన తర్వాత మాత్రమే ఆయన బారిష్టర్ చదువు కున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పీహెచ్‌డీని పూర్తిచేసిన ఆయన ప్రతిభను ప్రస్తుత తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.



భవిష్యత్‌ను దర్శించిన ఆలోచనలు అంబేడ్కర్ సొంతం. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత చైనా ఎప్పటికైనా భారత్‌కు ముప్పు తెస్తుందని గుర్తించిన వ్యక్తి అంబేడ్కర్, ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం చైనాకు బదులు భారత్‌కు వచ్చే విధంగా కృషిచేయాలని ఆయన చేసిన సూచనలను నాటి నేతలు పక్కన పెట్టడం అందరికీ తెలిసిందే. దీని పర్యవసానాలను చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే చైనా తన వీటో అధికారాన్ని భారత్‌కు వ్యతిరేకంగా 9 పర్యాయాలు వాడుకుంది.

వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించడం, పారిశ్రామికీకరణతో కలిగిన మార్పులు, ఎకనామిక్ హోల్డింగ్... వంటి అంశాలు నేడు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయి. కానీ వీటిని అంబేడ్కర్ 1927–28లోనే ప్రస్తావించారనే విషయం చాలా మందికి తెలియదు.

అంబేడ్కర్‌ను కేవలం రాజ్యాంగ నిర్మాతగా మనం పిలుస్తుంటాం. ఆయన చేసిన పనుల్లో ఒకటిగా మాత్రమే ఇది నిలుస్తుంది. దీనితో పాటు దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితులూ, స్థితిగతులపై సమగ్ర అవగాహనా, ఆలోచనా భవిష్యత్ ప్రణాళిక కలిగిన ఏకైక వ్యక్తిగా ఆయన్ని పేర్కొనవచ్చు. దేశాన్ని ఆధునికత, పట్టణీకరణ, పారిశ్రామికీకరణతో కూడిన నాగరికత కలిగి స్వయం సమృద్ధి సాధించిన దేశంగా పునర్నిర్మించాలని ఆకాంక్షించిన ఏకైక తత్వవేత్త అంబేడ్కర్.

అంబేడ్కర్ ఆలోచనలు, ఆకాంక్షలు, ఆశయాలను నేటి యువతలోనికి చొప్పించి భవిష్యత్ భారతావనిని పునర్నిర్మించే ప్రయత్నం జరగాలి. ఈ ప్రయత్నం చేసే దిశగా ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నెలకొల్పిన 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్' కృషిచేస్తుంది. గ్రంథాలయాలు, బ్యాంక్‌లు, తరగతులు, అభ్యసన విధానాలు, ఆర్థిక వ్యవస్థలు డిజిటల్ రూపంలోకి మారిపోయాయి. వీటినే ఆధారంగా చేసుకుని డిజిటల్ మాధ్యమాలను లాభదాయకంగా చేసుకుంటూ సమకాలీన యువతకు, సమకాలీన విధానాలతో అంబేడ్కర్ ఆలోచనలు, తత్వాలను చేరువ చేసే విధంగా ఈ కేంద్రం పనిచేస్తుంది. సోషల్ సైంటిస్టులతో పాటు సోషల్ ఇంజనీర్స్‌ను సమన్వయం చేస్తూ, సమ్మిళితంగా పనిచేస్తే సమస్యలకు సాంకేతికంగా పరిష్కారాలను చూపడం సాధ్యపడుతుంది. అంబేడ్కర్‌ను కేవలం సోషల్ సైన్స్ విభాగాలకే పరిమితం చేయకుండా టెక్నాలజీకి అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది.

ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీతో పాటు ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసిస్తున్న అన్ని విభాగాల విద్యార్థులను ఐక్యం చేస్తూ డిజిటల్ మాధ్యమాలు వేదికగా అంబేడ్కర్‌ను వైవిధ్యమైన కోణాలలో పరిచయం చేస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పీఠం' ప్రొఫెసర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం । 98859 50765

వేయి రేఖల వినూత్న సౌందర్యం

సందర్భం



పున్నా కృష్ణమూర్తి

పీటీ రెడ్డిగా విఖ్యాతులైన పాకాల తిరుమల రెడ్డి (1915–1996) ప్రపంచ స్థాయికి చెందిన తెలంగాణ కళాకారుల్లో అగ్రగణ్యుడు. కరీంనగర్ జిల్లా, అన్నవరం గ్రామంలో 1915 జనవరి 4వ తేదీన జన్మించారు. ప్రాథమిక విద్య చదివే రోజుల్లో ఆయన్ని ప్రోత్సహించింది ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సత్తార్ సుభాని.

తన బంధువును కలిసేందుకు ఒక రోజు రెడ్డి హాస్టల్‌కు వెళ్లాడు పీటీ. ఆ రోజు స్పోర్ట్స్ డే. ముఖ్య అతిథి బాడెన్ పావెల్. బాడెన్ రూపానికి 17 ఏండ్ల పీటీ కాంతి వేగంతో ప్రాణం పోస్తున్నారు. అది గమనించిన కొత్వాల్ పీటీని పిలిపించుకొని తన పెయింటింగ్ వేస్తావా అని అడిగారు! మిడాస్ టచ్!!

రెడ్డి హాస్టల్ నిబంధలను సవరించి ప్రతిభావంతులైన కళాకారులకూ స్కాలర్‌షిప్ ఇవ్వవచ్చని పీటీని 'సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్'లో చేర్పించారు కొత్వాల్. ముంబైలోని ఆ వినూత్న ప్రపంచంలో సూజా, కేకే హెబ్బార్, ఎమ్ఎఫ్ హుస్సేన్ తదితరులు సహ విద్యార్థులు. తన 22వ ఏట చిత్రించిన సెల్ఫ్ పోర్ట్రెయిట్ అంతర్ వ్యక్తినీ చూపిందని అధ్యాపకులు మెచ్చుకున్నారు. జేజేలో 1935 నుంచి 42 వరకు చిత్రకళను అభ్యసించి డిప్లొమా పొందారు, ఫస్ట్ క్లాస్, ఫస్ట్ ర్యాంక్‌తో!



పీటీ రెడ్డి

దేశ విభజన సందర్భంలో హైదరాబాద్ వచ్చారు. తెలంగాణ మాండలికాన్ని తన రచనలలో శాశ్వతం చేసిన యశోదా రెడ్డిని వివాహం చేసుకున్నారు. కార్పెంటరీ ఇండస్ట్రీ నెలకొల్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ హుందా తనాన్ని తెలిపే ఫర్నిచర్ పీటీ రెడ్డి సమకూర్చిందే. శిల్పి, దారుశిల్పి; ఆయిల్, వాటర్ కలరిస్ట్ అయిన పీటీ కళా ప్రపంచానికి కానుకగా ఏమి ఇచ్చారు? ఒక్క మాటలో భారతీయ సాంస్కృతిక తాత్విక సౌందర్య భరిత వేయి దళాల పరిమళ భరిత పుష్పం!

మన జ్ఞాపకాల పొరల్లో మసకబారిన ఆ కళారూపాలు చూడవచ్చా? 'స్వధర్మ'లో మూడు అంతస్తులలోని ప్రత్యేక గ్యాలరీలలో పీటీ రెడ్డి కళా రూపాలు కొలువై ఉన్నాయి. వారి కుమార్తె లక్ష్మీ రెడ్డి దంపతులు ఎంతో శ్రద్ధగా కాపాడుతున్నారు. చిరునామా సులభం. నారాయణగూడ మెట్రో పిల్లర్ 1155. కళాకారులు, చరిత్రకారులు అపాయింట్‌మెంట్ తీసుకుని సందర్శించవచ్చు.

వ్యాసకర్త ఇండిపెండెంట్ జర్నలిస్ట్ । 76809 50863
(నేడు పీటీ రెడ్డి జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: శు.త్రయోదశి రా.12.00 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: రోహిణి రా.7.28 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: ఉ.10.58 నుండి 12.42 వరకు, తిరిగి రా.1.30 నుండి 3.14 వరకు, దుర్ముహూర్తం: ప.11.44 నుండి 12.27 వరకు, అమృత ఘడియలు: సా.4.03 నుండి 5.45 వరకు: రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు : యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు : సూర్యోదయం 6.36 : సూర్యాస్తమయం 5.35.

పేదలకు ఇళ్ల ఆశచూపి
రూ.60 కోట్ల వసూళ్లు

- విజయవాడలో తెలుగు తమ్ముళ్ల నిర్వాకం
- పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో సుమారు 2 వేల మందికి టోపీ
- 2014 నుంచి జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల విక్రయాల్లో హవా
- నకిలీ, ఫోర్జరీ పత్రాలతో పేదలను నమ్మించి ముంచేశారు
- అప్పటి టీడీపీ కార్పొరేటర్లు, వారి అనుచరుల మోసాలు
- స్పందనలో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు


టీడీపీ నాయకుడు విజయ్‌కుమార్ బాధితురాలికి ఇచ్చిన నకిలీ డాక్యుమెంట్‌లు

విజయవాడ స్పోర్ట్స్: తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ వారు పేదలకు ప్రభుత్వ ఇళ్లపై ఆశ కల్పించి కోట్లాది రూపాయలు మోసగించిన వైనం వెలుగులోకి వచ్చింది. విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో రూ.60 కోట్లకుపైగా తెలుగుతమ్ముళ్లు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ మోసంపై తాజాగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణాకు ఫిర్యాదు అందింది. జెఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో నిర్మించిన ఇల్లు ఇప్పిస్తానని తనవద్ద తెలుగుదేశం నాయకుడు మాకిన విజయ్‌కుమార్ డబ్బు వసూలు చేసి మోసగించాడంటూ విజయవాడ చిట్టినగర్‌కు చెందిన తమ్మన మాధవి సోమవారం స్పందన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు పక్కన బండిపై పూసలు విక్రయిస్తూ జీవించే తన వద్ద విజయ్‌కుమార్ రూ.3.2 లక్షలు తీసుకుని నకిలీ డాక్యుమెంట్‌లు, ఫోర్జరీ సంతకాలతో ఉన్న ఇంటి పత్రాలు ఇచ్చి మోసగించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. 47వ డివిజన్ మాజీ కార్పొరేటర్, టీడీపీ నాయకురాలు నాగమణి భర్త రామారావుకు విజయ్‌కుమార్ ప్రధాన అనుచరుడు. 2014 నుంచి 2019 వరకు ఆ ప్రాంతంలో విజయ్‌కుమార్ హవా కొనసాగడంతో ఇళ్ల కోసం అతడిని ఆశ్రయించిన ఎంతోమంది పేదల్లో మాధవి ఒకరు. అతడి మాటలు నమ్మి రూ.3.20 లక్షలు చెల్లించి ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరిగి ఇల్లు రాలేదు. దీంతో ఆమె పోలీసుల్ని ఆశ్రయించారు.

4 ఏళ్ల కిందట డబ్బు తీసుకుని మోసం చేశాడు



జక్కంపూడిలో ఇల్లు ఇప్పిస్తానని టీడీపీ నాయకుడు విజయ్‌కుమార్ నాలుగేళ్ల కిందట రూ.3.20 లక్షలు తీసుకున్నాడు. నెలలో ఇల్లు ఇప్పించేస్తానని నమ్మించాడు. ఏడాది తరువాత ఇంటి అగ్రిమెంట్, మరో ఆర్నెల్ల తరువాత బ్యాంకు డీడీ పత్రాలు, మరో ఏడాది తరువాత కార్పొరేషన్ అనుమతి పత్రాలు.. అంటూ ఇచ్చాడు. ఆ కాగితాలన్నీ నకిలీవని, వాటిల్లో అధికారుల సంతకాలు ఫోర్జరీవని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఆఫీసుకు వెళితే తెలిసింది. రోడ్డు పక్కన పూసలు అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ఇల్లు వస్తుందని ఆశతో డబ్బులు కట్టాను. నన్ను మోసం చేసిన విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాను. విజయ్‌కుమార్ చేతిలో మోసపోయిన వారు చిట్టినగర్ ప్రాంతంలో వందమందికిపైగా ఉంటారు.

– తమ్మన మాధవి, బాధితురాలు

2 నియోజకవర్గాల్లో 2 వేలమంది బాధితులు

ఈ నేపథ్యంలో విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని 41 డివిజన్లలో పరిశీలించగా ఇలాంటి బాధితులు సుమారు రెండువేల మంది ఉన్నట్లు తెలిసింది. జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్ఎన్‌యూఆర్ఎం) 2007లో ప్రారంభమైంది. రోడ్లు, కాలువల విస్తరణలో ఇళ్లు కోల్పోయిన పేదలకు పునరావాసం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేశాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రారంభించిన ఈ పథకం పనులు 2014 వరకు కొనసాగాయి. విజయవాడలో ఇళ్లు కోల్పోయిన పేదలకు జక్కంపూడి, ఆర్ఆర్‌పేట, సింగ్‌నగర్, కబేళా ప్రాంతాల్లో వంద ఎకరాల్లో జీ+త్రి పద్ధతిలో 28,152 ఇళ్లు నిర్మించారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకం నిలిచిపోయింది. అప్పటివరకు నిర్మించిన ఇళ్లను కేటాయించేందుకు టీడీపీ నాయకులు సొమ్ము వసూలు చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో 2019 వరకు జేఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్లను అమ్ముకునే ప్రక్రియ యథేచ్ఛగా కొనసాగించారు. ఆయా నియోజకవర్గాలకు అప్పట్లో ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించిన టీడీపీ నాయకులు జలీల్‌ఖాన్, బొండా ఉమా కనుసన్నల్లోనే ఈ అవినీతి బాగోతం జరిగినట్లు తెలుస్తోంది. డివిజన్లలో టీడీపీ నాయకులుగా చెలామణి అవుతున్న ఒక్కొక్కరికి 200 ఇళ్లను అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. పార్టీ అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే ఈ అక్రమ కేటాయింపులు జరగడంతో ఆయా డివిజన్లలో టీడీపీ నాయకుల అవినీతికి అంతులేకుండా పోయింది. ఒక్కో ఇంటికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేసి ఒక్కో నాయకుడు రూ.కోట్లు కొల్లగొట్టారు. జక్కంపూడి, సింగ్‌నగర్, ఆర్ఆర్‌పేట, కబేలా ప్రాంతాల్లో జేఎన్ఎన్ఆర్‌యుఎం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ 2018తోనే పూర్తయింది. అప్పటివరకు ఇళ్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్న ఆయా ప్రాంతాల్లోని టీడీపీ నాయకుల ధనదాహం తీరక నకిలీ డాక్యుమెంట్‌లు, ఫోర్జరీ సంతకాలకు శ్రీకారం చుట్టారు. ఇళ్లు లేకపోయినా ఉన్నట్లు ప్రచారం చేసి పేదలకు వలవేశారు. నకిలీ డాక్యుమెంట్లు ఇచ్చి, మునిసిపల్, బ్యాంకు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి మరో ఏడాది పాటు అక్రమ సంపాదన కొనసాగించారు. 2018–2019లో ఆయా డివిజన్లలో టీడీపీ కార్పొరేటర్‌లు, ఆ పార్టీ ఇన్‌చార్జీలు రూ.60 కోట్లకుపైగా వసూలు చేసినట్లు తెలిసింది. ఏళ్ల తరబడి తిరిగినా ఇంటి జాడ లేకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు తమ వద్ద డబ్బు వసూలు చేసిన టీడీపీ నాయకులపై తిరగబడుతున్నారు. దీంతో కొందరు టీడీపీ నాయకులు బాధితులకు ఎంతోకొంత ఇచ్చి సెటిల్ చేసుకున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఇళ్ల వ్యవహారానికి సంబంధించి టీడీపీ నేతల్లో 47వ డివిజన్‌లో మాకిన విజయ్‌కుమార్, నాగోతు రామారావు, 57వ డివిజన్‌లో ఎడిబోతు రమణ, 58వ డివిజన్‌లో సోమేశ్వరరావు, రామారావు, 60వ డివిజన్‌లో భువట ఉమా, శ్రీరాములు, 63వ డివిజన్‌లో పైడి శ్రీను పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

మతిమరుపుపై పరిశోధనకు గుర్తింపు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ బయోటిక్నాలజీ విభాగంలో పరిశోధనలు చేస్తున్న డాక్టర్ షేక్ చాంద్‌బాషాకు అరుదైన గుర్తింపు లభించిందని విశ్వవిద్యాలయ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోగా ఉన్న డాక్టర్ చాంద్ బాషా మతిమరుపుపై పరిశోధన చేసి ఈ వ్యాధిలో నూతన శాస్త్రీయ కోణాన్ని గుర్తించారని పేర్కొన్నారు. 'న్యూరోనల్ డిస్ ఫంక్షన్‌లో మైక్రోగ్లియాతో సంయోగం చేయడంలో టెర్మ్–2 పాత్రను అన్‌టాంగ్లింగ్ చేయడం' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని వివరించారు. ఆయన పరిశోధనను గుర్తించి డాక్టర్ షేక్ చాంద్ బాషాని జేఏడీ జర్నల్‌కు అసోసియేటెడ్ ఎడిటర్‌గా ఆహ్వానించినట్లు వెల్లడించారు. కేఎల్ విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య జానకి రామయ్య, ప్రో చాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు మార్గదర్శకత్వంలో డాక్టర్ చాంద్ ఈ పరిశోధనని చేసినట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో దుర్గమ్మ మూలవిరాట్!

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారి అంతరాలయంలో మూలవిరాట్‌ను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంపై దుమారం లేచింది. అసలు ఆలయంలోకి సెల్‌ఫోన్ తీసుకురావడం నిషేధం. అయితే కొంత మంది భక్తులు తమ పలుకుబడి ఉపయోగించుకుని సెల్‌ఫోన్లు వెంట తెచ్చుకుంటున్నారు. రూ.300 క్యూలైన్‌లో వచ్చిన వారు అమ్మవారి మూలవిరాట్‌ను వీడియో తీయడమే కాకుండా దానికి విజువల్ ఎఫెక్ట్ పెట్టి దుర్గగుడి దేవస్థానం పేరుతో ఉన్న ఐడీ ద్వారా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియోల వ్యవహారం ఈవో భ్రమరాంబ దృష్టికి వెళ్లడంతో సీసీ పుటేజీలను పరిశీలించి, బాధ్యులను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా మూలవిరాట్‌ను వీడియో తీసి సోషల్ మీడియోలో పెట్టడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల్లో టీడీపీ ఉనికి కోల్పోయింది

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్

సాక్షి,అమరావతి: ప్రజల్లో టీడీపీ, చంద్రబాబు ఉనికి కోల్పోయారు కనుకనే ఏదేదో ఆశలు చూపెట్టి జనాల్ని సభలకు తరలిస్తున్నారనేది ఈరోజు రాష్ట్రం మొత్తానికి తెలిసిపోయిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఇంత జరిగినా.. గుంటూరులో జరిగిన కార్యక్రమం టీడీపీది కాదని, ప్రయివేటు కార్యక్రమంగా చంద్రబాబు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. చంద్రన్న కానుక అని పేరుపెట్టుకుని, టీడీపీ కార్యక్రమం అంటూ అనుమతులు కోరడం ఇవన్నీ ప్రజలకు తెలియదనుకుంటున్నారా? చంద్రబాబుకు ఇప్పటికైనా బుద్ధిరావాలి. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే బాబు తన సభలకు వచ్చిన 40 మందిని బలితీసుకుంటారా? ఈ చావులన్నింటికీ చంద్రబాబే బాధ్యుడు అని ఆయన అన్నారు. గుంటూరులో తొక్కిసలాట జరగ్గానే చంద్రబాబు, ఎల్లో నాలుక మడతేసి, హైదరాబాద్ పారిపోయారన్నారు. ఇప్పటికై నా చంద్రబాబు తన వైఖరి మార్చుకుని ప్రజల ముందు తన తప్పులను ఒప్పుకోవాలి. రాజకీయాల నుంచి తప్పుకుని విశ్రాంతి తీసుకోవటం మంచిదని ఆయన హితువు పలికారు.

క్లుప్తంగా...

భీమేశ్వరస్వామి సన్నిధిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి


ఆలయంలో జస్టిస్ కామేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.కామేశ్వరరావు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామి, అమ్మవారి సన్నిధిలో జస్టిస్ వి.కామేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను ఈవో అందజేశారు.

సికింద్రాబాద్-రామనాథపురం మధ్య ప్రత్యేక రైలు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా సికింద్రాబాద్–రామనాథపురానికి వారాంతపు ప్రత్యేక రైలును నడపనున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ఆంజనేయులు మంగళవారం తెలిపారు. సికింద్రాబాద్–రామనాథపురం (07695) రైలు ప్రతి బుధవారం (జనవరి 4, 11, 18, 25 తేదీల్లో) నడపనున్నట్టు వివరించారు. ఈ రైలు రాత్రి 09.10 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు రామనాథపురం స్టేషన్‌కు చేరుకుంటుంది. రామనాథపురం–సికింద్రాబాద్ (07696) రైలు ప్రతి శుక్రవారం (జనవరి 6, 13, 20, 27 తేదీల్లో) నడపనున్నట్లు వెల్లడించారు. ఈ రైలు ప్రతి శుక్రవారం రామనాథపురం స్టేషన్ నుంచి ఉదయం 9.50 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకుంటుంది.

క్యాన్సర్ రోగులకు మనోధైర్యం ఇవ్వాలి

- వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్



మాట్లాడుతున్న నవీన్‌కుమార్, పక్కన దుర్గాప్రసాద్

గుంటూరు మెడికల్: క్యాన్సర్ చివరి దశలో చికిత్స కోసం వచ్చే రోగులకు వైద్య సిబ్బంది కౌన్సెలింగ్ ద్వారా మనోధైర్యం ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి జి.ఎస్.నవీన్ కుమార్ చెప్పారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్యాలిం ఇండియా సంస్థ, నేషనల్ హెల్త్ మిషన్, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్యాలేటివ్ మెడిసిన్ అండ్ నర్సింగ్‌పై ఫౌండేషన్ కోర్సు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నవీన్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు చికిత్స అందించే సమయంలో ఏవిధంగా మాట్లాడాలనే విషయంపై నర్సింగ్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎంఎల్‌హెచ్‌పీలు శిక్షణను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య విభాగాధిపతి డాక్టర్ గిరజవోలు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే

- తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్


సభలో ప్రసంగిస్తున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్

తిరుపతి కల్చరల్: మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఆదర్శమూర్తి సావిత్రిబాయి పూలే అని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ కొనియాడారు. సావిత్రిబాయి పూలే మహిళలకు స్ఫూర్తిప్రదాత అని అన్నారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో 'సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డులు–2023' ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న 80 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, మహిళా ఉద్యోగులకు సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై వివక్షను ఎదిరించి వారి హక్కుల కోసం ఉద్యమించిన మహనీయురాలు సావిత్రి బాయిపూలే అని కొనియాడారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన సావిత్రిబాయిపూలే పూణేలో తొలిసారిగా 1848లో బాలికల పాఠశాల ప్రారంభించారని గుర్తుచేశారు. సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయినిగా, రచయిత్రిగా ఆమె మహిళల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ జడ్జి గుర్రప్ప, మహాత్మ జ్యోతిరావు పూలే ఫౌండేషన్ చైర్మన్ తులసీరామ్, ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, గోపాల్, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ గవర్నర్

తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ చైనాలో మళ్లీ కరోనా ప్రభావం నేపథ్యంలో మన దేశంలో ప్రతి ఒక్కరు టీకా బూస్టర్ డోస్ వేసుకోవాలని, కోవిడ్ ప్రొటోకాల్ పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు ఆదరణ

- తెలంగాణ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి


ఆలయం వెలుపల రోహిత్ రెడ్డి

తిరుమల: బీఆర్ఎస్‌ని దేశవ్యాప్తంగా ప్రజలు ఆదరిస్తున్నారని, ఏపీ ప్రజలు కూడా కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలంగాణ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రానున్న రోజుల్లో ఎవరూ ఊహించని విధంగా భారీగా బీఆర్ఎస్‌లోకి వలసలు ఉంటాయని చెప్పారు. ఏపీలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా బీఆర్ఎస్‌లో చేరుతారన్నారు. ఏపీ అభివృద్ధిని తెలంగాణ ప్రభుత్వం ఎక్కడా అడ్డుకోలేదని, ఇది పూర్తిగా అవాస్తవమన్నారు.

శాస్త్రోక్తంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం

- జనవరి 1న శ్రీవారి హుండీ ఆదాయం రూ.7.68 కోట్లు


తిరుమల పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల: శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుంచి శ్రీ భూవరాహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీవారి పుష్కరిణిలో ఉదయం 5 నుంచి 6 గంటల నడుమ స్నపన తిరుమంజనం, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

త్వరితగతిన శ్రీవారి దర్శనం

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నా నిర్ణీత సమయంలో కేటాయించిన టైమ్ స్లాట్ టికెట్లు పొందిన భక్తులకు త్వరితగతిన దర్శనం లభిస్తోంది. సోమవారం అర్ధరాత్రి వరకు 69,414 మంది స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకొని అన్ని సిఫార్సు లేఖలపై జారీచేసే దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. శ్రీవారికి జనవరి 1న రికార్డు స్థాయిలో రూ.7.68 కోట్లు లభించినట్లు టీటీడీ తెలిపింది. జనవరి 1న భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం రాత్రి వరకు లెక్కించారు. కాగా, శ్రీవారిని మంగళవారం టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, పలువురు తెలంగాణ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవినేని అవినాష్ దర్శించుకున్నారు.

చంద్రబాబూ.. నిన్ను జనం నమ్మరు..

- 828వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: నిరంతరం ప్రజలను మోసగించాలని చూస్తున్న చంద్రబాబును ప్రజలు ఎప్పటికీ నమ్మరని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 828వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ పేదలంటే తొలినుంచి అలుసుగా చూస్తున్న చంద్రబాబు కొత్త సంవత్సరంలో పంపిణీ పేరుతో మోసపు మాటలు చెప్పి తీసుకొచ్చి పేద ప్రజల ప్రాణాలను బలి తీసుకున్నాడని మండిపడ్డారు. ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి విశాఖ కేంద్రంగా పాలన సాగించడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో పేదలకు అందించే విద్యకు ప్రాధాన్యతనిస్తూ దేశంలోనే ప్రభుత్వ విద్యాశాఖను బలోపేతం చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాలు సైతం ప్రభుత్వ విద్యావిధానాన్ని మన తరహాలో మార్చేందుకు మొగ్గు చూపిస్తున్నాయని చెప్పారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా బహుజన దీక్షా శిబిరంలో సావిత్రీ భాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శతకోటి గాయత్రి మహామంత్ర జప యజ్ఞం


మాట్లాడుతున్న శ్రీరామచంద్రమూర్తి దంపతులు

చంద్రగిరి: లోక కల్యాణార్థం శతకోటి గాయత్రి మహామంత్ర జప యజ్ఞాన్ని చేపట్టనున్నట్లు సంధ్యా వందన అభ్యసన శిక్షణ సమితి అధ్యక్షుడు బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు తిరుపతి జిల్లా ముక్కోటి సమీపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి పాదాల చెంత శ్రీమహాలక్ష్మి, మహా సుదర్శన హోమ సహిత శతకోటి గాయత్రి మహా మంత్ర జపయజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా లక్ష్మీసహస్ర నామ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, గీతా పారాయణం కూడా చేపట్టనున్నట్లు చెప్పారు. కల్వకొలను చిత్తరంజన్ దాస్ స్మారక సేవా సంస్థ ఆధ్వర్యంలో దీన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శృంగేరి విరూపాక్ష పీఠాధిపతి గంభీరానంద భారతీ, ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు హాజరవుతారని తెలిపారు.

సీ హారియర్ రెడీ



సీ హారియర్ మ్యూజియం

సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

సీ హారియర్ మ్యూజియం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మ్యూజియం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. మ్యూజియాన్ని సందర్శించడంతో పాటు జ్ఞాపకాల్ని తీసుకెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్

రూ.7.50 కోట్లతో యుద్ధ విమాన మ్యూజియం పనులు పూర్తి

- సాగరతీరంలో అదనపు ఆకర్షణగా నిలవనున్న మ్యూజియం
- ఈ నెలలో సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

దొండపర్తి (విశాఖ దక్షిణ): సుందర సాగర తీరంతో ప్రపంచ పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్న విశాఖ సిగలో మరికొద్ది రోజుల్లో మరో మణిహారం చేరనుంది. నౌకాదళంలో 32 ఏళ్ల పాటు సేవలందించి నిష్క్రమించిన సీ హారియర్ యుద్ధ విమానం సందర్శకులను కనువిందు చేయనుంది. రూ.7.50 కోట్లతో చేపట్టిన ఈ యుద్ధ విమాన మ్యూజియం పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ నెలలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మ్యూజియాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సీ హారియర్ విశిష్టత

1983లో బ్రిటిష్ ఏరోస్పేస్ నుంచి కొనుగోలు చేసిన ఈ సీ హారియర్ యుద్ధ విమానం నౌకాదళం ఏవియేషన్ విభాగంలో చేరింది. గోవాలోని ఐఎన్ఎస్ హంస యుద్ధ నౌకలో 32 ఏళ్ల పాటు దేశానికి సేవలందించింది. 2016లో సేవల నుంచి నిష్క్రమించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వీఎంఆర్‌డీఏ ఈ యుద్ధ విమానాన్ని సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దుతోంది. సాగరతీరానికి అదనపు ఆభరణంలా ఇప్పుడు సీ హారియర్ యుద్ధ విమానం కూడా సిద్ధమవుతోంది.

రూ.7.5 కోట్లతో..

బీచ్‌రోడ్డు రాజీవ్ స్మృతి భవన్‌లో రూ.7.5 కోట్లతో ఈ సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియం పనులు చేపట్టింది. హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో జీ ప్లస్ టూ బిల్డింగ్‌లో సీహారియర్‌ను వేలాడదీశారు. దీని విశిష్టతతో పాటు పర్యాటకులకు నిజమైన యుద్ధ విమానంలో ప్రయాణించే అనుభూతి కలిగేలే ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో సిమ్యులేటర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అలాగే నావికాదళానికి, ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించి విశేషాలతో కూడిన చిత్రాలను కూడా ప్రదర్శించనున్నారు. ఇప్పటి సాగరతీరంలో టీయూ–142 ఎయిర్‌క్రాఫ్ట్ సందర్శకులను ఎంతగానో అలరిస్తోంది. కురుసుర జలాంతర్గామి సందర్శకుల మనసు దోచుకుంటోంది. మరికొద్ది రోజుల్లోనే ఈ సీ హారియర్ మ్యూజియం కూడా అదనపు ఆకర్షణగా నిలవనుంది.

గోవా నుంచి ట్రైనింగ్ సిమ్యులేటర్

సీ హారియర్ మ్యూజియంలో వివిధ రకాల యుద్ధ విమానాల గురించి తెలుసుకునేలా సమగ్ర సమాచార ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. టీయూ–142 మ్యూజియం ముందు భాగంలో ఏర్పాటు చేసిన ఆర్చ్ మాదిరిగా సబ్‌మెరైన్ మ్యూజియాన్ని తీర్చిదిద్దనున్నారు. వీటికి తోడుగా.. ఇంటిగ్రేటెడ్ మ్యూజియంలో విభిన్న హంగులు కొత్త అనుభూతిని అందివ్వనున్నాయి. సీహారియర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడిపేందుకు ముందుగా శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణని నేరుగా ఎయిర్‌క్రాఫ్ట్‌లో కాకుండా దాని సిమ్యులేటర్ ద్వారా ఇవ్వనున్నారు. గోవాలోని ఐఎన్ఎస్ హంసా నేవల్‌బేస్‌లో ఉన్న ట్రైనింగ్ సిమ్యులేటర్‌ను విశాఖకు తీసుకొచ్చారు. అదే విధంగా కొచ్చి నేవల్ స్టేషన్‌లో ఉన్న విడిభాగాల్ని కూడా రప్పించారు. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.


యుద్ధ విమానం

మంత్రుల వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించలేం

ప్రజాప్రతినిధుల భావ ప్రకటనపై అదనపు పరిమితులు విధించలేం ● సుప్రీంకోర్టు ధర్మాసనం మెజారిటీ తీర్పు

- స్వీయ నియంత్రణ తప్పనిసరన్న ధర్మాసనం
- మంత్రుల వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించొచ్చు
- భిన్నమైన తీర్పు వెలువరించిన జస్టిస్ నాగరత్న



న్యూఢిల్లీ: ప్రజాప్రతినిధుల వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల భావ ప్రకటనపై ఇప్పటికే ఆర్టికల్ 19(2)లో ఉన్నవాటికి అదనంగా మరిన్ని పరిమితులు విధించలేం. సమష్టి బాధ్యత సూత్రాన్ని ఈ విషయంలో వర్తింపజేయలేం'' అని స్పష్టం చేసింది. ఒక మంత్రి చేసే విద్వేషపూరిత, వివాదాస్పద వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపాదించలేమని పేర్కొంది. ఓ సామూహిక అత్యాచారం కేసుపై విద్వేష వ్యాఖ్యలు చేసిన అప్పటి యూపీ మంత్రి ఆజం ఖాన్‌ను అరెస్టు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ ఎస్.ఎ.నజీర్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ మేరకు 4–1తో మెజారిటీ తీర్పు వెలువరించింది. భారత్ వంటి పార్లమెంటరీ వ్యవస్థలో ఆరోగ్యకర ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ అత్యవసరమని జస్టిస్ నజీర్‌తో పాటు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎ.ఎస్.బొపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్ పేర్కొన్నారు. ఐదో సభ్యురాలైన జస్టిస్ నాగరత్న మాత్రం, మంత్రి అధికారిక హోదాలో చేసే వ్యాఖ్యలను మొత్తం ప్రభుత్వానికి ఆపాదించవచ్చంటూ భిన్నమైన తీర్పు వెలువరించారు. వాటివల్ల నష్టం జరిగిందని భావిస్తే ఎవరైనా కోర్టును ఆశ్రయించవచ్చని కూడా స్పష్టం చేశారు. అయితే వాక్ స్వాతంత్ర్యంపై మరిన్ని పరిమితులు కష్టమేనని ఆమె అంగీకరించారు. యూపీలోని బులంద్‌షహర్‌లో 2016లో తమ కూతురు సామూహిక అత్యాచార కేసును ఢిల్లీకి బదలాయించాలంటూ ఒక వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు రాజకీయ కుట్ర అన్నందుకు అప్పటి యూపీ మంత్రి ఆజం ఖాన్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. దీనిపై తొలుత త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ప్రజాప్రతినిధులు, మంత్రులకు సున్నితాంశాలపై తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా వ్యక్తీకరించే హక్కుందా వంటి పలు అంశాలను తేల్చాల్సిందిగా 2017 అక్టోబర్లో రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది. నవంబర్ 15న విచారణ పూర్తి చేసిన ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు పౌరులను అవమానించే, వారి మధ్య విద్వేషాన్ని వ్యాప్తి చేసే, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని సూచించింది. అయితే, ''ఇది మన రాజ్యాంగ సంస్కృతిలో భాగం. ఇందుకోసమని ప్రజాప్రతినిధులకు ప్రవర్తన నియమావళి రూపొందించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 19(2)లో పేర్కొన్న నిబంధనలు సరిపోతాయి'' అని అభిప్రాయపడింది.

రాజ్యాంగ స్ఫూర్తికే గొడ్డలిపెట్టు: జస్టిస్ నాగరత్న

విద్వేష వ్యాఖ్యలు రాజ్యాంగ మౌలిక విలువల స్ఫూర్తికే గొడ్డలిపెట్టని జస్టిస్ నాగరత్న అన్నారు. ''సమాజంలో అసమానతలకు దారి తీసే ఇలాంటి పోకడ పెరిగిపోతుండటం ఆందోళనకరం. ప్రతి పౌరునికీ తోటి పౌరుని గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉంటుంది. భిన్న నేపథ్యాలకు చెందిన పౌరుల మధ్య సౌభ్రాతృత్వ భావనలను విద్వేష వాతావరణం ఎంతగానో దెబ్బ తీస్తుంది. అందుకే మంత్రులు, ప్రజాప్రతినిధులు, సెలబ్రిటీలు ఈ విషయంలో మరింత బాధ్యతగా ఉండటం తప్పనిసరి. అది వారి విధి కూడా. తాము మాట్లాడుతున్న మాటలు, వాటి పర్యవసానాలు, ప్రజల మనోభావాలపై అవి చూపబోయే ప్రభావం, అలాంటి మాటల ద్వారా తాము నెలకొల్పుతున్న ఉదాహరణ వంటివాటిపై వారికి అవగాహన ఉండి తీరాలి'' అని అభిప్రాయపడ్డారు. ''మంత్రులు, నేతలు చేసే ప్రసంగాలను నియంత్రించడం వారి పార్టీ బాధ్యత. అవసరమైతే ప్రవర్తన నియమావళిని నిర్దేశించాలి. ప్రజాప్రతినిధులు తమ తోటి పౌరులపై రెచ్చగొట్టే, విద్వేష వ్యాఖ్యలు చేయకుండా నియంత్రించేలా రాజ్యాంగంలోని 19(1)(ఏ), 19(2) అధికరణల స్ఫూర్తికి అనుగుణంగా పార్లమెంటు చట్టం తేవాలి'' అని ఆమె సూచించారు.

తినుబండారాలపై నిషేధం...
సినిమా హాళ్ల ఇష్టమే: సుప్రీం

న్యూఢిల్లీ: సినిమా హాళ్లలోకి బయటి నుంచి తినుబండారాలను అనుమతించే విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సినిమా హాల్ అనేది ప్రైవేట్ ఆస్తి అని, అందులోకి బయటి తినుబండారాలను అనుమతించాలా? లేదా? అనేది నిర్ణయించుకొనే హక్కు యాజమాన్యానికి ఉందని తేల్చిచెప్పింది. ప్రేక్షకులు బయటి నుంచి తినుబండారాలు, పానీయాలు తీసుకురాకుండా అడ్డుకోరాదని, అందుకు అనుమతించాలని ఆదేశిస్తూ జమ్మూకశ్మీర్ హైకోర్టు గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ థియేటర్ ఓనర్లు, మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. జమ్మూకశ్మీర్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిల్లలకు అవసరమైన ఆహారాన్ని తల్లిదండ్రులు సినిమా హాల్లోకి తీసుకొస్తే అడ్డుకోవద్దని స్పష్టం చేసింది.

'స్వలింగ వివాహాల'పై 6న విచారణ

స్వలింగ వివాహాలకు ప్రభుత్వం అధికారికంగా గుర్తింపునివ్వాలని కోరుతూ ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లంటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేసి, విచారించాలని విజ్ఞప్తి చేస్తూ కొందరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఈ నెల 6వ తేదీన విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలియజేసింది.

క్లుప్తంగా...

'రెండో బూస్టర్ డోస్ అనవసరం'

న్యూఢిల్లీ: దేశ ప్రజలకు కోవిడ్ రెండో బూస్టర్ డోసు పంపిణీ విషయం ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని అధికారవర్గాలు తెలిపాయి. దేశ ప్రజలు చాలా మంది ఇంకా మూడో కోవిడ్ టీకా డోసే తీసుకోలేదని పేర్కొన్నాయి. ఈ సమయంలో నాలుగో డోస్ అనవసరమని తెలిపాయి. చైనాలో కోవిడ్ వ్యాప్తి ఆందోళనకరంగా మారిన వేళ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఈ మేరకు స్పష్టతనిచ్చాయి.

బ్రిటన్ రాజుకు మోదీ ఫోన్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ మంగళవారం బ్రిటన్ రాజు చార్లెస్–3తో ఫోన్‌లో మాట్లాడారు. వాతావరణ మార్పులు, జీవవైవిధ్య పరిరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంలో వినూత్న ఆవిష్కరణలు వంటి అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో)తెలిపింది.

27న ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చా'

ఈ నెల 27వ తేదీన వార్షిక 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం జరగనుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మోదీ మాట్లాడనున్నారు. ఢిల్లీలోని తల్కటోరా ఇండోర్ స్టేడియంలో 6వ విడత పరీక్షా పే చర్చా జరగనుందని కేంద్ర విద్యాశాఖ మంగళవారం ట్వీట్ చేసింది.

పాక్ ఉగ్ర కేంద్రమే: జై శంకర్

వియన్నా: భారత్‌లోకి ఉగ్రవాదులను ఎగదోస్తూ, ఉగ్రవాదాన్ని విస్తరింపజేస్తున్న పాకిస్తాన్‌పై ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ సమర్థించుకున్నారు. ఆస్ట్రియా జాతీయ వార్తాప్రసార సంస్థ ఓఆర్ఎఫ్‌కు సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో జైశంకర్ పలు అంశాలు మాట్లాడారు. ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రస్థానం పాక్‌లో ఉందని మీరు చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ సమాజంలో ఒక భారతీయ దౌత్యవేత్త హోదాలో సమర్థించుకుంటారా అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ.. 'భారత పార్లమెంట్‌పై దాడి, ముంబై వంటి నగరాల్లో దాడి చేసి భారతీయులను, విదేశీ పర్యాటకులను చంపి, రోజూ సరిహద్దు గుండా ఉగ్రవాదుల చొరబాట్లకు ప్రయత్నించే పాక్‌నుద్దేశించి ఇంకా ఏమనాలి? ఇంకాస్త పరుష పదం వాడితే బాగుండేది. ఉగ్రవాదానికి కేంద్రస్థానం అనే పదం మంచిదే' అని వ్యాఖ్యానించారు. 'పట్టపగలే నగరాల్లో ఉగ్రవాదులకు సైన్యం తరహాలో యుద్ధతంత్రాలు నేర్పిస్తున్నారు. ఈ విపరీతాలను యూరప్ దేశాలు ఎందుకు నిలదీయవు? భారత్, పాక్ మధ్య మళ్లీ యుద్ధం వస్తుందేమోననే భయం ప్రపంచానికి ఉంటే ముందుగా ఉగ్రవాదంపై ప్రపంచదేశాలు దృష్టిపెట్టాలి' అని హితవు పలికారు.

సవాళ్లను ఎదుర్కొనే సత్తా మనకుంది: రాజ్‌నాథ్

బొలెంగ్: సరిహద్దుల్లో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని, మన భూభాగాన్ని కాపాడుకునే సత్తా మనకుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. పొరుగు దేశాలతో మంచి సంబంధాలనే కోరుతున్నామన్నారు. శ్రీరాముడి వారసత్వం, గౌతమ బుద్ధుడి బోధనల ద్వారా మనం నేర్చుకున్నది ఇదేనన్నారు. సరిహద్దు రహదారుల సంస్థ(బీఆర్‌వో) సియోమ్ వద్ద నిర్మించిన 100 మీటర్ల పొడవైన స్టీలు వంతెనను మంగళవారం మంత్రి రాజ్‌నాథ్ ప్రారంభించి మాట్లాడారు.

నెతన్యాహుకు ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డ్

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దంపతులను కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డ్‌కు ఎంపికచేసింది. ఇజ్రాయెల్‌లో నెతన్యాహు స్నేహితురాలు, భారతీయ మూలాలున్న మహిళా పారిశ్రామికవేత్త రీనా వినోద్ పుష్కామాతోపాటు మరికొందరిని ఈ అవార్డ్‌కు ఎంపికచేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 8 నుంచి జరిగే ప్రవాసీ భారతీయ దివస్ వేడుకల్లో వీరికి అవార్డులను ప్రదానంచేస్తారు. సంగీత విభావరి నిర్వాహకులు జుబెన్ మెహతా, నటి సోఫియా లోరెన్, ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఐజాక్ రాబిన్, మాజీ అధ్యక్షుడు, ప్రధాని షిమోన్ పెరీస్‌సహా ఈ ఏడాది 21 మందిని ఈ అవార్డుతో సత్కరించనున్నారు.



గ్లోబల్ లీడర్లుగా ఎదగండి

సామాన్యులకు సైన్స్ ఫలితాలు
- సైంటిస్టులకు ప్రధాని మోదీ పిలుపు
- నాగపూర్‌లో 108వ జాతీయ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం

నాగపూర్: భారత్‌ను స్వావలంబన దేశంగా తీర్చిదిద్దడానికి సైంటిస్టులు కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. వారు తమ పరిజ్ఞానాన్ని ప్రజల రోజువారీ జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఉపయోగించాలని కోరారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో 108వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఐదు రోజులపాటు ఈ సదస్సు జరుగనుంది. శాస్త్రీయ విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. క్వాంటమ్ టెక్నాలజీ, డేటా సైన్స్‌తోపాటు కొత్త వ్యాక్సిన్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పరిశోధకులకు సూచించారు. కొత్తగా పుట్టుకొచ్చే వ్యాధులపై నిఘా పెట్టే చర్యలను వేగవంతం చేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ ఆదరణ పొందుతున్న క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో విశేష కృషి చేయడం ద్వారా గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని సైంటిస్టులకు ఉద్బోధించారు. సెమీ కండక్టర్ల రంగంలో నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని కోరారు. పరిశోధకులు తమ ప్రాధాన్యత జాబితాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీని చేర్చుకోవాలని చెప్పారు.

ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 40వ స్థానం

సైంటిస్టులు ప్రయోగశాలల నుంచి క్షేత్రస్థాయికి రావాలని, అప్పుడే వారి ప్రయత్నాలు గొప్ప ఘనతలుగా కీర్తి పొందుతాయని ప్రధానమంత్రి వెల్లడించారు. సైన్స్ ప్రయోగాల ఫలితాలను సామాన్య ప్రజలకు అందించాలన్నారు. టాలెంట్ హంట్, హ్యాకథాన్లతో యువతను సైన్స్ వైపు ఆకర్షితులను చేయాలని కోరారు. ప్రైవేట్ కంపెనీలు, స్టార్టప్‌లను రీసెర్చ్ ల్యాబ్‌లు, విద్యాసంస్థలతో అనుసంధానిస్తే అద్భుతమైన ఫలితాలు లభిస్తాయని స్పష్టం చేశారు. క్వాంటమ్ కంప్యూటర్స్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్, సెన్సార్స్, క్రిప్టోగ్రఫీ, న్యూ మెటీరియల్స్ దిశగా మన దేశం వేగంగా ముందుకు సాగుతోందని మోదీ వివరించారు. మన దేశంలో ఇంధన, విద్యుత్ అవసరాలు రోజురోజుకీ భారీగా పెరుగుతున్నాయని, ఈ రంగంలో కొత్త ఆవిష్కరణ ద్వారా దేశానికి లబ్ధి చేకూర్చాలని సైంటిఫిక్ సమాజానికి పిలుపునిచ్చారు. దేశంలో అభివృద్ధి కోసం శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించుకుంటున్నామని తెలియజేశారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో మన దేశం 2015లో 81వ స్థానంలో ఉండేదని, ఇప్పుడు 40వ స్థానానికి చేరిందని అన్నారు.



తూర్పు ఢిల్లీలో రాహుల్ జోడో యాత్ర. (ఇన్‌సెట్‌లో) యూపీలో చెల్లి ప్రియాంకతో రాహుల్

అలుపెరగని పోరాట యోధుడు

- రాహుల్‌పై ప్రియాంక పొగడ్తలు
- యూపీలోకి ప్రవేశించిన జోడో యాత్ర

ఘజియాబాద్: తన సొంత ఇమేజ్‌ను, పరువు ప్రతిష్టలను దెబ్బతీసేందుకు మోదీ సర్కార్ వేల కోట్లు ఖర్చుచేస్తున్నా ఏమాత్రం భయపడని వ్యక్తిత్వం రాహుల్‌ది అని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. మంగళవారం ఢిల్లీ నుంచి భారత్ జోడో యాత్ర ఉత్తరప్రదేశ్‌లో అడుగుపెట్టిన సందర్భంగా యాత్రలో రాహుల్ సోదరి ప్రియాంకాగాంధీ పాల్గొని ప్రసంగించారు. 'అంబానీ, అదానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలు ఎంతో మంది రాజకీయనేతలను, ప్రభుత్వరంగ సంస్థలను, మీడియాను కొనగలరేమో. కానీ నా సోదరుడు రాహుల్‌ను కొనలేరు. సత్యమనే ఆయుధాన్ని ధరించిన పోరాటయోధుడు రాహుల్' అని ప్రియాంక అన్నారు.

తొమ్మిది రోజుల విరామం తర్వాత

తొమ్మిది రోజుల విరామం తర్వాత జోడో యాత్ర మంగళవారం ఢిల్లీలోని హనుమాన్ మందిర్ నుంచి యూపీలోకి అడుగుపెట్టగానే వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా) మాజీ చీఫ్ అమర్‌జీత్ సింగ్ దులత్ సైతం యాత్రలో పాల్గొన్నారు.

నడ్డా కొనసాగింపు?

16, 17ల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జగత్‌ప్రకాశ్ నడ్డాను కొనసాగించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు నెల 16, 17న ఢిల్లీలో జరుగనున్నాయి. ఈ ఏడాది జరగబోయే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల సన్నద్ధతపై అగ్రనేతలు సమీక్ష నిర్వహిస్తారని బీజేపీ వర్గాలు తెలియజేశాయి. ఒక రోడ్డుమ్యాప్ సైతం సిద్ధం చేయనున్నట్లు సమాచారం.

రక్తమోడుతున్నా ఈడ్చుకెళ్లారు

కారు కింద ఇరుక్కుని అరుస్తున్నా ఆగలేదు ● 'ఢిల్లీ దారుణం'పై ప్రత్యక్ష సాక్షి వెల్లడి

- ఆమె బాధితురాలి స్నేహితురాలే
- ఘటన వేళ స్కూటీపైనే కూర్చుంది
- అత్యాచారం జాడల్లేవన్న పోస్టుమార్టం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో యువతిని స్కూటీతో పాటు కారు కింద కిలోమీటర్ల మేరకు ఈడ్చి పొట్టన పెట్టుకున్న దారుణ ఘటనకు సంబంధించి మరిన్ని నివ్వెరపరిచే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. కారు ఢీకొనడంతో చక్రాల కింద ఇరుక్కుని, కాపాడండంటూ ఆర్తనాదాలు చేస్తున్నా కనికరం లేకుండా నిర్దాక్షిణ్యంగా ఈడ్చుకెళ్లారని నిధి అనే ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. మృతురాలు అంజలీ సింగ్‌కు ఆమె స్నేహితురాలే. ఘటన జరిగినప్పుడు అదే స్కూటీపై అంజలీ వెనక కూచొని ఉంది. స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడింది. షాక్‌తో ఘటన వివరాలను ఆమె ఇంతవరకూ బయట పెట్టలేదు. స్కూటీపై మరో మహిళ ఉన్నట్టు సీసీటీవీ ఫుటేజీలో గుర్తించిన పోలీసులు ఆరా తీసి ఆమె వాంగ్మూలం నమోదుచేశారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి జరిగిన దారుణం గురించి నిధి వెల్లడించారు. ''మా పరిచయమై 15 రోజులే అయినా మంచి స్నేహితులమయ్యాం. కొత్త ఏడాది వేడుక కల్సి చేసుకుందామనుకున్నాం. హోటల్‌లో పార్టీ తర్వాత 2 గంటలపుడు బయటకొచ్చి స్కూటీపై వెళ్తున్నాం. ఎదురుగా వస్తున్న కారు హఠాత్తుగా మమ్మల్ని ఢీకొట్టింది. నేను పడిపోయా. కానీ అంజలీ కారు చక్రాల్లో ఇరుక్కుని రక్తమోడుతూ సాయం కోసం అరిచింది. అయినా వాళ్లు వేగంగా అలాగే ఆమెను కారుతో పాటుగా ఈడ్చుకెళ్లారు. వెంటనే ఆపితే ఆమె కచ్చితంగా బ్రతికేది. చక్రాల్లో ఆమె ఇరుక్కుందని తెలిసీ నిర్దయగా అలాగే వెళ్లిపోయారు. ఆ దారుణాన్ని చూసిన షాక్‌లో ఈ విషయం ఎవరికీ చెప్పలేదు'' అని నిధి చెప్పారు. అయితే స్కూటీ ఎక్కడానికి ముందు హోటల్ బయట వారిద్దరూ గొడవ పడుతున్నట్టు మరో వీడియో కూడా వైరల్ అవుతోంది. నిధి నుంచి ఏదో లాక్కోవడానికి అంజలి ప్రయత్నిస్తున్నట్టు అందులో కన్పిస్తోంది. బహుశా స్కూటీని ఎవరు నడపాలనే విషయమై వారు వాదించుకున్నారని భావిస్తున్నారు. కాగా ఈ కేసులో అత్యాచారం ఆనవాళ్లు లేవని పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో వెల్లడైంది. తల, వెన్నెముక, మొండెం కింది అవయవాలకు తీవ్ర గాయాలవడంతో అంజలీ మరణించినట్టు నివేదిక పేర్కొంది. నిందితులు ఆమెను రేప్ చేసి చంపేశారనే ఆరోపణల నేపథ్యంలో మెడికల్ బోర్డు పర్యవేక్షణలో పోస్ట్‌మార్టం జరిగిందని ఢిల్లీ పోలీస్ స్పెషల్ కమిషనర్ సాగర్ ప్రీత్ హుడా చెప్పారు. ఝౌంతీ గ్రామంలో నగ్నంగా పడి ఉన్న యువతి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం, నిందితులను అరెస్టు చేసి కస్టడీకి తీసుకోవడం తెల్సిందే.



అంజలిని ఈడ్చుకెళ్తున్న కారు



అంజలి(ఫైల్)



స్కూటీ

కేసును నీరుగారుస్తున్నారు: ఆప్

దర్యాప్తు వేగంగా ముగించి దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలంటూ ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు 'ఆప్' ఎమ్మెల్యేల బృందం వినతిపత్రం ఇచ్చింది. మృతురాలి కుటుంబానికి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ రూ.10 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు.

కేంద్రం సీరియస్

ఘటనపై కేంద్రం సీరియస్‌గా ఉంది. సమగ్ర నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను కేంద్ర హోం శాఖ ఆదేశించింది. దాంతో స్పెషల్ కమిషనర్ శాలినీ సింగ్ నేతృత్వంలో ఢిల్లీ పోలీస్ విభాగం దర్యాప్తు సంఘాన్ని ఏర్పాటుచేసింది. ఘటన సమయంలో ఇద్దరు నిందితులు తాగి ఉన్నట్లు వార్తలొచ్చాయి. వారి రక్త నమూనాలను పరీక్షకు పంపారని, రిపోర్టులు రావాల్సి ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

కుటుంబానికి ఏకైక దిక్కు

మృతురాలు అంజలి తన కుటుంబానికి ఏకైక పెద్ద దిక్కు. తండ్రి ఎనిమిదేళ్ల క్రితమే మరణించాడు. అక్కకు పెళ్లయింది. దాంతో అమ్మ, ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లను ఆమే పోషిస్తోంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తూ వారికి ఆసరాగా నిలుస్తోంది. మూత్రపిండాలు దెబ్బ తిన్న తల్లికి తరచూ డయాలసిస్ అవసరం.

ఆత్మహత్యలేనా?

మిస్టరీగా రష్యా ప్రముఖుల మరణాలు
- ఒడిశాలో 15 రోజుల వ్యవధిలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు

రష్యాకు చెందిన ప్రముఖులు అనుమానాస్పద రీతిలో మరణించడం సంచలనం రేపుతోంది. ఒకరో, ఇద్దరో మరణించారనుకుంటే ఏమో అనుకోవచ్చు. గత ఏడాది కాలంలో ఏకంగా 24 మంది మృత్యువాత పడడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ప్రారంభించడానికి కాస్త ముందు నుంచే ఈ మిస్టరీ మరణాలు సంభవించడం గమనార్హం. ఇలా మరణించిన ప్రముఖుల్లో కొందరు పుతిన్ యుద్ధోన్మాదాన్ని బహిరంగంగా వ్యతిరేకించినవారు ఉన్నారు. దీంతో పుతిన్‌ను ఎదిరిస్తే ప్రాణాలు కోల్పోవాల్సిందేనా అన్న చర్చ కూడా జరుగుతోంది.

భారత్‌లో 15 రోజుల్లో ముగ్గురు

మన దేశంలోని ఒడిశా రాష్ట్రంలో గత పదిహేను రోజుల్లో ముగ్గురు రష్యన్లు ప్రాణాలు కోల్పోయారు. పారాదీప్ ఓడరేవులో ప్రయాణిస్తున్న నౌక సిబ్బందిలో ఒకరైన సెర్గీ మిల్యాకోవ్ (50) మంగళవారం తెల్లవారుజామున నౌకలో అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు విడిచారు. బంగ్లాదేశ్‌లో చిట్టగాంగ్ పోర్టు నుంచి పారాదీప్ మీదుగా ముంబై వెళుతున్న ఆ నౌకకి సెర్గీ చీఫ్ ఇంజనీర్. తెల్లవారుజామున 4.30 గంటలకు ఆయన శవమై కనిపించారు. సెర్గీ గుండె పోటుతో మరణించారని నౌకా సిబ్బంది భావిస్తున్నారు. ఒడిశాలోని రాయగడ సాయి ఇంటర్నేషనల్ హోటల్‌లో ఇద్దరు రష్యన్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై విచారణ కొనసాగుతుండగానే మరో మరణం సంభవించింది. రష్యా వ్యాపారి, ఎంపీ పావెల్ ఆంటోవ్ (65)డిసెంబర్ 24న హోటల్ గది కిటికీలో నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయారు. అంతకు రెండు రోజుల ముందే డిసెంబర్ 22న ఆయన స్నేహితుడు వ్లాదిమర్ బెడెనోవ్ (61) హోటల్ గదిలో అపస్మారక స్థితిలో కనిపించి ఆస్పత్రికి తీసుకువెళ్లేలోగా ప్రాణాలు విడిచారు.

ప్రాణాలు కోల్పోతున్న ప్రముఖులెవరు ?

ప్రాణాలు కోల్పోతున్న రష్యన్లలో బిలయనీర్లు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, చమురు సంస్థల అధిపతులు, పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు, మిలటరీ నాయకులు ఉన్నారు. వీరిలో అత్యంత పిన్న వయస్కుడు 37 ఏళ్లు కాగా 73 ఏళ్ల వయసు వరకు అన్ని వయసుల వారు ఉన్నారు. రష్యా యుద్ధం మొదలైన రెండో రోజే గ్యాజ్‌ప్రామ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అలెగ్జాండర్ ట్యూల్కోవ్ అనుమానాస్పదరీతిలో మరణించారు. యుద్ధాన్ని వ్యతిరేకించిన డాన్ రాపో పోర్ట్ గత ఆగస్టులో అనుమానాస్పద స్థితిలో మరణించారు. మన దేశంలో రాయగడలో మరణించిన ఎంపీ పావెల్ కూడా యుద్ధాన్ని వ్యతిరేకించినవారే. ఆయన మరణించిన రోజే రష్యా నావికాదళానికి చెందిన అలెగ్జాండర్ బుజకోవ్ కూడా అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయారు. మార్చిలో వాసిలీ మెల్నికోవ్ తన భార్యా ఇద్దరు పిల్లలతో కలిసి శవమై కనిపించారు. జులైలో ప్రభుత్వ కాంట్రాక్టర్ యూరీ వోరోనోవ్ తన ఇంట్లో స్విమ్మింగ్‌పూల్‌లో రక్తపు మడుగులో శవమై తేలారు.



పావెల్ ఆంటోవ్



సెర్గీ మిల్యాకోవ్

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎలా మరణిస్తున్నారు ?

రష్యా ప్రముఖులు మరణాల్లో ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకొని చనిపోతున్నట్టు ప్రచారంలో ఉంది. ఎత్తయిన భవనాల మీద నుంచి, గదుల్లోని కిటికీల నుంచి, నౌకల నుంచి దూకడం, తమని తాము కాల్చుకోవడం, గుండె పోట్లు వంటి ఘటనలతో మరణించడం ఎక్కువగా వెలుగులోకి వస్తోంది..లుక్ ఆయిల్ చైర్మన్ రావిల్ మాగ్నోవ్ గత సెప్టెంబర్‌లో అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి తన గది కిటికీ నుంచి కింద పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. ఇలా మరణిస్తున్న వారిలో సంపన్నులే ఎక్కువ. వారి చుట్టూ అంగరక్షకులు ఉంటారు. కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. చిన్న అనారోగ్యం వచ్చినా అత్యుత్తమ వైద్య సేవలు తీసుకునే సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే వారి మరణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ''మరణిస్తున్న వారిలో అత్యధికులు కోట్లకు పడగలెత్తి రాజకీయ ప్రాబల్యం ఉన్నవారే. వారు అసహజంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదం. పుతిన్ హయాంలో గత దశాబ్దకాలంగా విషప్రయోగాలతో చంపేయడం, హత్యాయత్నాలు విరివిగా జరుగుతూనే ఉన్నాయి. 2020లో ప్రతిపక్ష నేత అలెక్సీ నావెల్నీపై విష ప్రయోగం జరిగిన విషయం తెలిసిందే'' అని రష్యాలో పొలిటికల్ సైంటిస్ట్ ప్రొఫెసర్ జెఫ్రీ వింటర్స్ చెప్పారు.

ఆర్థిక ఒత్తిళ్లు కారణమా ?

ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలతో వ్యాపారాలు బాగా దెబ్బతిని బిలయనీర్లందరూ ఆర్థిక కష్టాల్లో మునిగిపోయారు. గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన వారంతా తమ వ్యాపారాలు మళ్లీ పుంజుకుంటాయన్న నమ్మకం లేని తీవ్రమైన నిరాశ నిస్పృహల్లోకి వెళ్లిపోతున్నారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడడం, ఆరోగ్యం క్షీణించి గుండెపోట్లు రావడం జరుగుతోందన్న అభిప్రాయాలు ఉన్నాయి. గత ఏడాది కాలంలో చమురు సంస్థలకు చెందిన ఆరుగురు అనుమానాస్పద స్థితిలో మరణించారు.

ఆన్‌లైన్లో ఆధార్ అడ్రస్ మార్పుకు...
ఇంటిపెద్ద అంగీకారం చాలు

న్యూఢిల్లీ: ఆధార్ కార్డులో చిరునామాను మార్చుకోవడం మరింత సులభతరంగా మారింది. ఇంటిపెద్ద(హెడ్ ఆఫ్ ద ఫ్యామిలీ) అంగీకారంతో ఆధార్ పోర్టల్‌లో (ఆన్‌లైన్‌లో) చిరునామా సులువుగా మార్చుకోవచ్చని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కొత్త విధానంలో ఇంటి పెద్దతో సంబంధాన్ని ధ్రువీకరించే ఏదైనా పత్రం సమర్పించాల్సి ఉంటుంది. రేషన్ కార్డు, మార్కుల షీట్, మ్యారేజ్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు తదితర ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించవచ్చు. కానీ, ఇందులో ఇంటిపెద్ద పేరు, దరఖాస్తుదారుడి పేరు, వారిద్దరి మధ్య సంబంధం గురించి తప్పనిసరిగా ఉండాలి. ఆన్‌లైన్‌లో ఓటీపీ ఆధారిత ధ్రువీకరణ ద్వారా అడ్రస్ మారుతుంది. ఇంటిపెద్ద ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ



రిలేషన్‌షిప్‌ను నిర్ధారించే డాక్యుమెంట్ లేకపోతే ఇంటిపెద్ద సెల్ఫ్–డిక్లరేషన్ సమర్పించవచ్చు. ఇది యూఐడీఏఐ నిర్దేశించిన ఫార్మాట్‌లో ఉండాలి. ఆధార్ కార్డులో చిరునామా మార్చుకోవడానికి తగిన ధ్రువపత్రాలు లేని వారికి ఈ కొత్త విధానంతో ఏంతో ప్రయోజనం చేకూరుతుందని యూఐడీఏఐ తెలియజేసింది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారినవారికి సైతం ఉపయోగకరమని వివరించింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం ၊ 4 ၊ జనవరి ၊ 2023




ఎప్పుడైనా భక్తసంద్రమే: విజయపుర సిద్ధేశ్వర స్వామి అస్తమయంతో లక్షలాది భక్తులు శోకతప్తులయ్యారు. విజయపురలో ఇటీవల ఓ ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు. (కుడిచిత్రం) మంగళవారం స్వామి అంతిమయాత్రలో పాల్గొన్న వేలాది భక్తజన సమూహం

వాహనరంగం జోరు

- గతేడాదిలో 30 శాతం పెరిగిన రిజిస్ట్రేషన్లు
- గత రెండేళ్ల కంటే అధికం
- ప్రభుత్వానికి రూ. 8,648 కోట్ల రాబడి



బెంగళూరులో ఆధునిక ద్విచక్ర వాహనాలతో నగరవాసులు

సాక్షి, బెంగళూరు: అవసరం, ఆదాయం పెరగడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరూ సొంత వాహనాల కోసం అర్రులు చాస్తున్నారు. ఫలితంగా వాటి అమ్మకాలు ఎగబాకాయి. 2021 ఏడాదితో పోలిస్తే 2022లో రాష్ట్రంలో వాహన రిజిస్ట్రేషన్ల సంఖ్య 30 శాతం మేర పెరిగింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2022లో 15.3 లక్షల వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. కాగా, 2021లో ఆ సంఖ్య 11.7 లక్షలుగా ఉండగా 2020లో 12 లక్షలు, 2019లో 15.7 లక్షలుగా ఉంది.

2021 కంటే 38 శాతం ఎక్కువ ఆర్జన

- గతేడాది రిజిస్ట్రేషన్ల వల్ల 2022లో రవాణా శాఖ వార్షిక ఆదాయం రూ. 8,648 కోట్లుగా నమోదైంది. 2021తో పోలిస్తే 38 శాతం పెంపు (రూ. 6,263 కోట్లు) నమోదైంది. ఇది 2020లో రూ. 4,996 కోట్లు, 2019లో రూ. 5,864 కోట్లుగా ఉండేది.
- కోవిడ్, లాక్‌డౌన్ సమస్యల కారణంతో 2020, 21లో వాహనాల అమ్మకాలు కొంచెం తగ్గిపోయాయి. ఆపై కోవిడ్ వ్యాప్తి భయం వల్ల ఎక్కువమంది బైక్‌లు, కార్లు వంటి వ్యక్తిగత వాహనాలను కొనుగోలుకు ప్రయత్నించారు.
- గణాంకాల ప్రకారం అత్యధిక ఆదాయం బెంగళూరు దక్షిణం ఆర్టీవో (జయనగర) నుంచి ప్రభుత్వానికి వచ్చింది.

రాష్ట్రంలో 2.9 కోట్ల వాహనాలు

- రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 2.9 కోట్ల వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఇందులో సగానికి పైగా ద్విచక్ర వాహనాలున్నాయి. దేశంలో అత్యధిక రోడ్డు పన్ను విధిస్తున్న రాష్ట్రాల్లో కర్ణాటక కూడా ఉండడం గమనార్హం. రవాణాశాఖ రాబడిలో సగానికి పైగా ఆదాయం బెంగళూరు నుంచే లభిస్తుండడం గమనార్హం. బెంగళూరులోనే కోటికి పైగా వాహనాలు ఉన్నాయి.
- 2022 అక్టోబర్‌లో గరిష్ఠంగా 1.6 లక్షల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి.
- ఆ తర్వాత నవంబర్‌లో 1.5 లక్షల వాహనాలు అమ్ముడయ్యాయి. ఈ రెండు నెలలు మంగళకరంగా ప్రజలు భావిస్తున్నారు. డిసెంబర్‌లో ఈ సంఖ్య మళ్లీ 1.1 లక్షకు తగ్గిపోయింది. ఆపై జనవరి నుంచి ఊపందుకోవచ్చని అంచనా.

న్యూస్‌రీల్

సుబ్రమణ్యునికి ఖాకీ సేవ



పల్లకీ మోస్తున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: ప్రసిద్ధ ఘాటి సుబ్రమణ్య క్షేత్రంలో మంగళవారం నాడు రాజవీధి ఉత్సవం ఘనంగా జరిగింది. బ్రహ్మ రథోత్సవం జరిగిన తరువాత పోలీసుల ఆధ్వర్యంలో రాజవీధి ఉత్సవం జరపడం ఆనవాయితీ. జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి, ఏఎస్పీ పురుషోత్తం, సీఐలు మునికృష్ణ, హరీష్ పాల్గొని స్వామివారి పల్లకీ మోశారు. వీరితో పాటు బీడీఏ అధ్యక్షుడు, యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్, సతీమణి వాణిశ్రీ విశ్వనాథ్, భక్తులు కూడా ఉత్సవంలో పాల్గొన్నారు.

చర్చి విధ్వంసం కేసులో నిందితుడు అరెస్టు

మైసూరు: మైసూరు జిల్లాలోని పిరియాపట్టణలోని గోణికొప్ప రోడ్డులో ఉన్న సెయింట్ మేరీస్ చర్చిలో డిసెంబర్ 27వ తేదీన బాలయేసు విగ్రహాన్ని ధ్వంసం చేసి మూడు హుండీలను చోరీ చేసిన కేసులో నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక మహాదేశ్వర లేఔట్‌లో నివాస ఉంటున్న పౌర కార్మికుడు విశ్వ(24) నిందితుడు. ఆ రోజు సంఘటనా స్థలంలో పోలీసులకు చేతి తొడుగులు లభించాయి. వాటిని బట్టి నిందితుడు ఎవరై ఉంటారో గుర్తించారు. వెంటనే పౌర కార్మికుల కాలనీలో 100 మందికి పైన ఉన్న యువకులను విచారణ చేయగా విశ్వ బండారం బయటపడింది. గతంలో ఇతడు అదే చర్చిలో పని చేశాడని చెప్పాడు. దానికి సంబంధించిన డబ్బులు ఫాదర్ ఇవ్వలేదనే కోపంతో ఈ అపచారానికి పాల్పడ్డాడు. పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ఆరు తరాల బామ్మ.. సొణ్ణమ్మ

- ఘనంగా 106వ పుట్టిన రోజు



అవ్వ పుట్టిన రోజు సంబరం

కోలారు: అందరూ పుడతారు కానీ వందేళ్లు బతికేది చాలా తక్కువమందే. ఆ వందేళ్ల జీవితంలో ఏమి సాధించారన్నది అనవసరం. కానీ అంత సుదీర్ఘకాలం జీవించి ఉండడం మాత్రం ఘనతే అని చెప్పాలి. కోలారు తాలూకాలోని కొళగంజనహళ్లికి చెందిన సొణ్ణమ్మ అనే శతాయుష్కురాలు 106 వసంతాలు పూర్తి చేసుకుని మంగళవారం తన అశేష కుటుంబ సభ్యుల మధ్య పుట్టిన రోజు వేడుకను జరుపుకుంది.

నేటికీ ఆరోగ్యంగా

ఆరు తరాలను చూసిన ఈ బామ్మ నేటికీ ఎంతో ఆరోగ్యంగా ఉండి నేటి తరానికి ఆదర్శంగా నిలిచింది. ఈమెకు 30 మంది మనుమలు, 20 మంది మునిమనుమలు ఉన్నారు. సొణ్ణమ్మకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం ఉన్నారు.

ఆఖరి రోజుల్లో సర్కారు: డీకే

శివాజీనగర: బీజేపీ ప్రభుత్వం ఆఖరి రోజుల్లో ఉందని, ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రజలకు తెలియజేస్తామని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అన్నారు. మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడిన ఆయన, బీజేపీ అగ్రనేత అమిత్ షా మాటలను తాము పట్టించుకోవడం లేదని, అయితే రాష్ట్ర బీజేపీలో నాయకత్వం లేదని ఆయన చెప్పడాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. తరచూ ప్రధాని మోదీ, అమిత్ షాలు రాష్ట్రానికి రావడం అంటే ఇక్కడి బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందినట్లు అర్థమన్నారు. జనవరి 11 నుంచి రాష్ట్ర పర్యటనను ప్రారంభిస్తానని తెలిపారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితాలు

- కేంద్ర ఎన్నికల అధికారులు

బనశంకరి: కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికలు -2023 నేపథ్యంలో ఎన్నికల అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ అజయ్‌బాదూ, కార్యదర్శి బీసీ పాత్ర మంగళవారం బెంగళూరులో ఈసీ అధికారులతో సమావేశమయ్యారు. మొత్తం నియోజకవర్గాల్లో ఈ నెలలో ప్రకటించే ఓటర్ల జాబితా గురించి ఎక్కువగా చర్చించారు. మృతిచెందిన ఓటర్ల తొలగింపు, అడ్రస్‌ల మార్పులు చేర్పులు, యువ ఓటర్ల పేర్లు చేర్చడం గురించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఓటర్ల తుది జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు జిల్లాల్లో పర్యటించి ప్రతి ఇంటినీ సందర్శించి తప్పులు జరగకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మనోజ్ కుమార్‌మీనా, అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌కుమార్, పీ.రాజేంద్రచోళన్ పాల్గొన్నారు.

సిటీలో యథేచ్ఛగా ఫ్లెక్సీలు, బ్యానర్లు

- హైకోర్టు ఆదేశాలకు గండి



బనశంకరి: సిలికాన్ సిటీ సౌందర్యానికి అడ్డుగా ఉన్నాయని, ప్రజలకు ప్రమాదకరంగా మారాయని పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను అటు బీబీఎంపీ, ఇటు హైకోర్టు నిషేధించడం తెలిసిందే. కానీ కొందరు యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. న్యూ ఇయర్, త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చోటామోటా నాయకులు, కార్యకర్తలు రాత్రికి రాత్రి ఫ్లెక్సీలు, బ్యానర్లను అమరుస్తున్నారు. సిటీలో పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు ఫోటోలు, పేర్లతో పుట్టిన రోజులు, కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెబుతూ అమర్చిన ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ లెక్కచేయకుండా రాజకీయనేతలు, వారి అభిమానులు ప్రవర్తిస్తున్నారు. శాంతినగర నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్ఏ హ్యారీస్ మద్దతుదారులు, దుమ్మలూరు రాజ్‌కుమార్ పార్కు ముందు భారీ ఫ్లెక్సీని వేశారు. కంఠీరవ రాజ్‌కుమార్ విగ్రహానికి అడ్డంగా ఫ్లెక్సీని కట్టడంపై విమర్శలు వచ్చాయి. ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లు, పార్టీనేతలు , కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు అంతటా వెలిశాయి.

సందర్భం వస్తే చాలు

జయంతులు వంటి ప్రముఖ దినాలు, జాతీయ, రాష్ట్రనేతలు నగరంలో పర్యటించే సమయంలో ఫ్లెక్సీలకు అడ్డే ఉండడం లేదు. రోడ్లలోని ప్రముఖ సర్కిల్స్‌లో బ్యానర్లు, ఫ్లెక్సీలను చూస్తూ వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా బీబీఎంపీ అధికారులు కళ్లుమూసుకుని కొందరు నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, బెంగళూరు 8 వలయాల్లో అధికారులు బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని సూచించినట్లు బీబీఎంపీ రెవిన్యూశాఖ ప్రత్యేక కమిషనర్ దీపక్ తెలిపారు.

అంతం చేసింది అత్త కొడుకే

- విద్యార్థిని లయస్మిత హత్య కేసు విచారణ వేగవంతం
- నిందితుడు సమీప బంధువే



లయస్మితతో పవన్ (ఫైల్)

యశవంతపుర: ప్రేమోన్మాది ఘాతుకానికి బలైన ఇంజినీరింగ్ విద్యార్థిని హత్య కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. దిబ్బూరు గ్రామంలోని ప్రెసిడెన్సీ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న కోలారుకు చెందిన లయస్మితను మరో కళాశాలలో చదువున్న పవన్ అనే యువకుడు హత్య చేశాడు. నిందితుడిని లయస్మిత మేనత్త కొడుకుగా పోలీసులు గుర్తించారు. ప్రేమను నిరాకరించిందనే ఆక్రోశంతోనే ఘోరానికి తెగబడ్డాడని తేలింది.

మరో విద్యార్థి ఐడీ కార్డుతో కళాశాలలోకి ప్రవేశం

ఇతరులు కాలేజీలోనికి వెళ్లటానికి అవకాశంలేదు. హత్య చేసిన పవన్ ఎలా లోపలకు వెళ్లాడనే విషయంపై ఆరా తీయగా మరో విద్యార్థి ఐడీ కార్డును ఉపయోగించుకుని కాలేజీలోకి వెళ్లాడు. ప్రెసిడెన్సీ కాలేజీకి చెందిన కొందరు విద్యార్థులు సహకరించటం వల్ల లోపలకు వెళ్లి హత్య చేసినట్లు విచారణలో తెలిసింది. మధ్యాహ్నం 12:30 గంటలకు కాలేజీ గేట్‌వద్దకు వెళ్లాడు. అక్కడ మరో విద్యార్థిని పరిచయం చేసుకున్నారు. అతడి కాలేజీ ఐడీతో లోపలకు వెళ్లి లయస్మిత తరగతి గది వద్దకు వెళ్లాడు. ఆమె గది నుంచి బయటకు వస్తుండగానే కత్తితో గుండెపై పొడిచాడు. అయితే నిందితుడి వద్ద ఉన్న ఐడీ కార్డు ఎవరిదనే విషయంపై పోలీసులు గుర్తించే పనిలో పడ్డారు. ఇదిలా ఉంటే లయస్మిత తండ్రి నాగరాజు మూడు నెలల క్రితమే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కూతుర్లు. లయను ఇంజినీరింగ్ చదివిస్తున్నారు. పవన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై కారు ఎక్కించి హత్య

- మండ్య జిల్లాలో భూ వివాదంలో ఘోరం



జయలక్ష్మి మృతదేహం

మండ్య: రెండు కుటుంబాల మధ్య ఉన్న వ్యవసాయ భూమి గొడవలో మహిళ పైన కారు ఎక్కించి హత్య చేశారు. ఈ దారుణం మండ్య జిల్లాలోని నాగమంగళ తాలుకాలోని బెళ్ళూరు సమీపంలో ఉన్న గాణసంద్ర గ్రామంలో జరిగింది. బెంగళూరులో నివసించే గాణసంద్రవాసి రామకృష్ణయ్య భార్య జయలక్ష్మి (50) హతురాలు.

పొలం పనులు చేయిస్తుండగా

వివరాలు.. జయలక్ష్మికి గత 10 సంవత్సరాల క్రితం గాణసంద్ర గ్రామంలో సర్వే నంబర్ 84లో బంజరు భూమిని ప్రభుత్వం ఇవ్వగా ఆమె సాగు చేస్తోంది. అయితే భూమి తమదని గౌడయ్య అతని కుటుంబ సభ్యులు అనేకసార్లు జయలక్ష్మితో గొడవ పెట్టుకున్నారు. బోర్లను కూడా ధ్వంసం చేశారు. మంగళవారం జయలక్ష్మి బెంగళూరు నుంచి వచ్చి ట్రాక్టర్‌తో పొలం పనులు చేయిస్తుండగా గౌడయ్య, కుమారుడు అనిల్ సహా 8 మంది దాడి చేశారు. జయలక్ష్మి మీదకు అనిల్ కారుతో దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ట్రాక్టర్ డ్రైవర్, కూలీలను కొట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

చెలువరాయునికి ముక్కోటి ద్వాదశి పూజలు



స్వర్ణ కవచం అలంకరణలో చెలువ నారాయణస్వామి

మండ్య: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మేలుకోటి చెలువనారాయణ స్వామివారు మంగళవారం బంగారు కవచ ధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. మేలుకోటెలో వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేయడం ఉండదు. అందుకు బదులుగా మంగళవారం ముక్కోటి ద్వాదశి కావడంతో స్వామిని అలంకరించి పూజలు చేశారు. చెలువనారాయణ స్వామి సాక్షాత్తు మహావిష్ణువు అవతారం అయినందున మేలుకోటెను భూ వైకుంఠంగా వర్ణిస్తూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

మిక్సీ బాంబ్ కేసులో వ్యక్తి అరెస్ట్

యశవంతపుర: హాసన్ పట్టణంలోని కువెంపునగరలో ఓ కొరియర్ కార్యాలయంలో జరిగిన మిక్సీ బాంబ్ పేలుడుకు సంబంధించి అనూప్‌కుమార్ అనే వ్యక్తిని బెంగళూరులో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ హరిరాం శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన హాసనలో విలేకర్లతో మాట్లాడారు. మహిళ వసంత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఈ నెల 7 వరకు కోర్టు పోలీసుల కస్టడీకి అప్పగించింది. అనూప్‌కు మిక్సీలో డిటోనేటర్ అమర్చటానికి సహకరించింది ఎవరు, సరఫరా చేసింది ఎవరనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. బెంగళూరు నుంచి మిక్సీ హాసన్‌కు ఎలా వచ్చిందనే కోణంలో అనూప్ నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

12న చిక్కలో బృహత్ ఉద్యోగ మేళా

చిక్కబళ్లాపురం: జనవరి 12న చిక్కబళ్లాపురంలో ఎస్‌జెసిఐటి కాలేజీలో బృహత్ ఉద్యోగ మేళా జరుగుతుందని వైద్య ఆరోగ్య మంత్రి సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో జనవరి 7 నుంచి 14వ తేదీ వరకు చరిత్రలో నిలిచిపోయేలా వైభవంగా చిక్కబళ్లాపురం ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. సీఎం బొమ్మై ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా 12న పెద్ద ఎత్తున ఉద్యోగ మేళా జరుగుతుందని, 7వ తరగతి నుంచి ఇంజనీరింగ్ పట్టభద్రుల వరకూ పాల్గొనవచ్చని, 105కు పైగా ప్రముఖ కంపెనీలు హాజరవుతాయని చెప్పారు.

సర్కారు అవినీతి వల్లే ఈ ఘోరాలు

- కాంగ్రెస్ నేతల ధ్వజం

బనశంకరి: వ్యాపారవేత్త ప్రదీప్ ఆత్మహత్య కేసులో బీజేపీ ఎమ్మెల్యే అరవింద లింబావళిని అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. బెంగళూరులో ప్రదీప్ కుటుంబసభ్యులను నేతలు రణదీప్ సూర్జేవాలా, సిద్దరామయ్య, రామలింగారెడ్డి తదితరులు పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రదీప్ మృతి ఆత్మహత్య కాదు, హత్య. దీనికి కారణమైన వ్యక్తులు ఎంతపెద్దవారైనా వారికి శిక్ష పడాలని, తక్షణం వారిని అరెస్ట్‌చేయాలని డిమాండ్ చేశారు. ప్రదీప్ కుమార్తె , భార్య కన్నీరు తుడవటం బీజేపీ ప్రభుత్వానికి సాధ్యమా? అవినీతి వల్ల ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. కాంట్రాక్టర్లు సంతోష్‌పాటిల్, ప్రసాద్, పారిశ్రామికవేత్త ప్రదీప్ లు 40 శాతం కమీషన్లు, ప్రభుత్వ అవినీతికి బలయ్యారని ఆరోపించారు. ప్రదీప్ ఒక టిన్నర కోటి పెట్టుబడి పెడితే నయాపైసా కూడా తిరిగి ఇవ్వలేదు, తమ డబ్బును వెనక్కి ఇవ్వాలని ప్రదీప్ భార్య కోరుతోందన్నారు. పోలీసులు ప్రదీప్ కుటుంబసభ్యుల మొబైల్ ఫోన్లను అడుగుతున్నారని, ఇది సరికాదని నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చెప్పేది నాటువైద్యం, చేసేది దోపిడీలు



అరెస్టయిన వంచకులు



స్వాధీనం చేసుకున్న కార్లు, ద్విచక్రవాహనాలు

- బెంగళూరులో రాజస్థానీ ముఠా అరెస్టు

బనశంకరి: ఆయుర్వేద మూలికలతో చికిత్స చేస్తామని చెప్పుకుంటూ ప్రజలవద్ద నుంచి డబ్బు దండుకుని వంచనకు పాల్పడుతున్న రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను మంగళవారం బెంగళూరు విల్సన్ గార్డెన్ పోలీసులు అరెస్ట్‌చేశారు. నిందితులు మహమ్మద్ సమీన్ అలియాస్ డాక్టర్ మల్లిక్, సైఫ్ అలీ, మహ్మద్ రహీస్.

ఇంటికెళ్లి రూ.8.8 లక్షలతో పరారు

వివరాలు... నెలమంగల వద్ద టెంట్లు వేసుకుని నాటు మూలికలు ప్రదర్శిస్తూ మొండి రోగాలను నయం చేస్తామని ప్రజలను నమ్మించేవారు. శాంతినగర బసప్పరోడ్డు నివాసి పంకజ్‌ఠాకూర్ తన తల్లికి కాలి నొప్పికి చికిత్స చేయాలని వీరిని గత నెల 16 తేదీన ఇంటికి తీసుకెళ్లాడు. చికిత్స చేయడానికి ఖర్చవుతుందని వారిని మాటల్లో పెట్టి రూ.8.8 లక్షలు తీసుకుని ఉడాయించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో డీసీపీ శ్రీనివాసగౌడ, ఏసీపీ నారాయణస్వామి ఆధ్వర్యంలో ముఠాను గాలించి పట్టుకున్నారు. వారి నుంచి నాలుగుకార్లు, మూడు ద్విచక్రవాహనాలు రూ.3.50 లక్షలు నగదు, నాటు మూలికలను స్వాధీనం చేసుకున్నారు. ఇలా వైద్యం పేరుతో ఎంతోమందిని మోసగించినట్లు అనుమానాలున్నాయి.

నేత్రపర్వంగా గరుడోత్సవం



వెంకటరమణస్వామి గరుడోత్సవం దృశ్యం

చింతామణి: తాలూకాలోని ఆలంబగిరి గ్రామంలో వెలసిన శ్రీ వెంకట రమణస్వామి ఆలయంలో ముక్కోటి ద్వాదశి పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణస్వామి మూర్తికి, నారాయణ తాత విగ్రహానికి విశేషంగా అలంకరణ గావించారు. కన్నుల పండువగా గరుడోత్సవం జరిగింది.

ముంచేసిన జ్యోతిష్యుడు

- రూ.లక్ష నగదు, అర్ధకేజీ బంగారంతో పరార్

బనశంకరి: మూడు నెలల క్రితం పరిచయమైన నకిలీ జ్యోతిష్యుడు ఓ మహిళను నిండా దోచుకున్నాడు. ఈ ఘటన జేసీ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునిరెడ్డిపాళ్యలో జరిగింది. వివరాలు.. కృష్ణరాజపురం నివాసి సహన అనే బాలింత జేసీ నగరలోని పుట్టింటికి వచ్చింది. వారికి ఎదురింట్లో మూడునెలల నుంచి విజయ్ శ్రీనివాస్, మదన్ శ్రీనివాస్, గోవింద రాజన్, రేవతి లక్ష్మీ కుటుంబం ఉండేది. జ్యోతిష్యున్ని అని పరిచయం చేసుకున్న విజయ్‌శ్రీనివాస్ సహన కుటుంబంతో ఆత్మీయంగా మెలిగాడు. మీ గ్రహ పరిస్థితులు చెడుగా ఉన్నాయి, కాబట్టి శాంతి పూజలు చేయాలని భయపెట్టాడు. అతని మాటలు నమ్మిన సహనా రూ.లక్ష నగదు, 578 గ్రాములు బంగారు ఆభరణాలను డిసెంబరు 28 తేదీ విజయ్‌శ్రీనివాస్ చేతికి అందించింది. నగలు, డబ్బును ఉంచి ఆ రోజు పరిహార పూజలు చేశారు. మరుసటి రోజున చూస్తే డబ్బు, నగలు లేవు, ఎదురింట్లో జ్యోతిష్యుని కుటుంబం కూడా కనిపించలేదు. షాక్ తిన్న సహన జేసీ నగర పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఆభరణాల విలువ రూ.28 లక్షలని తెలిపింది. పోలీసులు వంచకుల కోసం గాలిస్తున్నారు.

మురిపిస్తున్న వస్త్ర మేళా

బనశంకరి: సంక్రాంతి పండుగ రాబోతుండగా ఉద్యాననగరిలో సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన మగువలను ఆకట్టుకుంటోంది. జేపీ నగర ఫస్ట్ ఫేజ్ సింధూర కన్వెన్షన్ హాల్‌లో న్యూక్రాఫ్ట్ సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన జరుగుతోంది. ధర్మవరం, కంచి, బెనారస్ సహా దేశంలో పేరుపొందిన పట్టుచీరలు, వస్త్రాలు ఇక్కడ విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పలువురు మోడల్స్ భామలు ప్రదర్శనకు హాజరయ్యారు. 8వ తేదీ వరకు నిర్వహిస్తారు.




వైవిధ్య చీరలను తిలకిస్తున్న సుందరాంగులు



సాహితీ విందు నోరూరాలి కదా

సాహిత్య సమ్మేళనంలో అతిథులకు ఇంపైన రుచులు కూడా ఉండాలి కదా. హావేరిలో 6 నుంచి 8వ తేదీ వరకు జరిగే కన్నడ సాహిత్య సమ్మేళనంలో అతిథుల కోసం సిద్ధమవుతున్న ఓళిగలు, రవ్వలడ్లు వగైరా



క్లుప్తంగా

బోదకాలు వ్యాధిపై చైతన్యం అవసరం



కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలో బోదకాలు వ్యాధి నియంత్రణపై ప్రజల్లో చైతన్యం తేవాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం జిల్లాధికారి కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఈ విషయంపై జిల్లా అంతటా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ అధికారి సురేంద్రబాబు, నందిత, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి చేతన్‌లున్నారు.

నేడు బళ్లారికి సీఎం రాక

సాక్షి,బళ్లారి: సీఎం బసవరాజ్ బొమ్మై బుధవారం నగరంలో జరిగే వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు విచ్చేస్తున్నారు. ఆయన ఉదయం బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో జిందాల్ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుంచి నగరానికి రోడ్డు మార్గం గుండా చేరుకుని విమ్స్ ఆస్పత్రిలో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో బహిరంగ సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు. నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు జిల్లా క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సింథటిక్ ట్రాక్‌ను ప్రారంభిస్తారు. జిల్లాస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన 100 పడకల చిన్నారుల ఆస్పత్రిని కూడా ఆయన ప్రారంభిస్తారు.

బాధ్యులపై చర్యలకు వినతి

రాయచూరు రూరల్: నగరంలో గత నెల 30న రిమ్స్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో మరణించిన యువతి రాజేశ్వరి మృతికి బాధ్యులైన వైద్యులు, అధికారులపై చర్యలు చేపట్టాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి జిల్లా సంచాలకుడు నరసింహులు మాట్లాడారు. బాధ్యులను ఉద్యోగం నుంచి తొలగించి, రిమ్స్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏడీసీ దురుగేష్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా వెంకన్న రథోత్సవం




రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయచూరు రూరల్: ఉప్పారవాడిలో వెలసిన వేంకటేశ్వరాలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరిగాయి. సోమవారం సాయంత్రం ఆలయంలో స్వామి వారి విగ్రహానికి పల్లకీ సేవలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు.

9న కసాప సమ్మేళనంపై సమీక్ష సమావేశం

కంప్లి: కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా సమ్మేళనం నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 9న 11.30 గంటలకు సంగ్రాయ సంస్కృత పాఠశాలలో ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తాలూకా కసాప అధ్యక్షులు షణ్ముఖప్ప చిత్రగార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని గంగా సంకీర్ణంలో ఏర్పాటు చేసిన కసాప కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి కసాప సభ్యులు, ప్రగతిశీల సంఘాల ప్రముఖులు, రాజకీయ ప్రతినిధులు, సీనియర్లు హాజరు కావాలని కోరారు. అదే రోజు స్థలం, రూపురేఖలపై నిర్ణయం తీసుకుంటారన్నారు. సమావేశంలో అంబిగర మంజునాథ, సీ.వెంకటేష, యూఎం.విద్యాశంకర్, హెచ్ కాళింగవర్ధన్, వైవెంకటరెడ్డి, డాక్టర్ ఏసీ దానప్ప, ఎస్.వి జయలక్ష్మీ వీరమ్మ, నాగరాజ్, ఎంఎస్ విరుపాక్షయ్య స్వామి, అగళి పంపాపతి, బీ.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

6న బాలాజీ ఫొటో స్టూడియో చిత్రం విడుదల



మాట్లాడుతున్న డైరెక్టర్ రాజేశ్ ధృవ

బళ్లారిటౌన్: సృజన ప్రొడక్షన్స్ నిర్మించిన బాలాజీ ఫొటో స్టూడియో అనే చిత్రాన్ని ఈనెల 6న రాష్ట్ర వ్యాప్తంగా 100 థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు ఆ చిత్రం డైరెక్టర్ రాజేశ్ ధృవ, నిర్మాత వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం నగరంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ చిత్రం ఫొటోగ్రాఫర్ సాధక బాధకాలతో కూడిన హాస్యభరిత చిత్రమని, కుటుంబమంతా కలిసి చూసి ఆనందించవచ్చని అన్నారు. దీన్ని లఘు చిత్రంగా విడుదల చేయగా మంచి స్పందన లభించిందన్నారు. చిత్రం షూటింగ్‌ను ఉత్తర కన్నడ జిల్లాలో అదే భాషా శైలిలో నిర్మించామన్నారు. చిత్ర నిర్మాణం కోసం కర్ణాటక రక్షణ వేదిక, ఫొటోగ్రాఫర్ల సంఘం సహకారం తీసుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా స్థానిక నేతలు చానాక్ శేఖర్, సంపత్, రవి సాలియాన, రవి మరూరు, విరుపాక్షప్ప కోరి పాల్గొన్నారు.

సిద్దరామేశ్వర స్వామికి కన్నీటి వీడ్కోలు

- జనసాగరంగా మారిన విజయపుర
- అంత్యక్రియలకు ప్రముఖుల హాజరు



సిద్దరామేశ్వర స్వామీజీ అంతిమ దర్శనం (ఇన్‌సెట్‌లో) సిద్దరామేశ్వర స్వామీజీ(ఫైల్)

సాక్షి,బళ్లారి: ఆధ్యాత్మిక గురువు, నడిచే దేవుడు, శతాయుషిగా పేరొందిన జ్ఞానయోగాశ్రమ సిద్ధరామేశ్వర స్వామీజీ(82)కి కన్నీటి వీడ్కోలు పలికారు. వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠానికి చేరుకున్న సిద్ధరామేశ్వర స్వామికి మంగళవారం ప్రముఖులు, మఠాధీశులు, వేలాది మంది భక్త జనసాగరం ఆయన పార్థివ దేహాన్ని దర్శనం చేసుకుని పునీతులయ్యారు. వీరశైవ సంప్రదాయం ప్రకారం స్వామిని కూర్చొబెట్టి అద్దాల పెట్టిలో ఉంచడంతో స్వామిని దర్శనం చేసుకోవడానికి జనం బారులు తీరారు. ఉదయం నుంచి రాష్ట్ర నలుమూలల నుంచి అపారమైన భక్త జనసాగరం తరలిరావడంతో విజయపుర నగరం జనసంద్రమైంది. మఠాధీశులు స్వామీజీ పార్థివ దేహం వద్దనే కూర్చొని ప్రార్థనలు చేశారు. స్వామీజీ భౌతికకాయ అంతిమ దర్శనానికి సైనిక పాఠశాలలో ఏర్పాట్లు చేశారు. దీంతో విజయపుర వీధుల్లో భారీగా జన రద్దీ కనిపించింది. స్వామీజీ మృతితో విజయపురలో స్వచ్ఛందంగా వ్యాపారాలు, పాఠశాలు మూసివేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

రాయచూరు రూరల్ : స్వామీజీ భౌతికకాయం ఉంచిన ప్రదేశంలో ఓంనమఃశివాయ మంత్రం మార్మోగింది. మంగళవారం స్వామీజీ భౌతికకాయాన్ని సీఎం బసవరాజ్ బొమ్మైతో పాటు పలువురు మంత్రులు, బసవనగౌడ పాటిల్ యత్నాల్, ఎంబీ పాటిల్ తదితర ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో వీరశైవ లింగాయత్ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

సిద్దరామేశ్వర స్వామికి శ్రద్ధాంజలి

బళ్లారి టౌన్: సిద్దరామేశ్వర స్వామీజీ మృతికి సంతాపం ప్రకటిస్తూ నగరంలోని శుభమస్తు మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘం కార్యాలయంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను సంఘం అధ్యక్షురాలు సుమారెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో నేతలు శారద, శరణమ్మ, కవిత, రేణుక, రేవతి, ఫాతిమా, సుగుణ, సావిత్రి, జ్యోతి, శిరీష పాల్గొన్నారు.

రాయచూరు రూరల్ : సిద్దేశ్వర స్వామీజీ మృతికి వీరశైవ సమాజం సంతాపం ప్రకటించింది. మంగళవారం బసవేశ్వర కాలనీలో వీరశైవ సమాజం కార్యాలయంలో అధ్యక్షుడు చంద్రశేఖర్ స్వామీజీ చిత్రపటానికి పూలమాల వేసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సంతాప సభలో రాచనగౌడ, పరమేశ్వర సాలిమఠ, దేవన్న నాయక్, జగదీష్, పార్వతి పాల్గొన్నారు.

హుబ్లీ: దివికేగిన సిద్దేశ్వర స్వామీజీ మృతికి హుబ్లీలోని ఫుట్‌పాత్ వ్యాపారులు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక వ్యాపారస్తులు సిద్దేశ్వర స్వామీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి స్వామీజీ ఆత్మహత్యకు శాంతి కలగాలని ప్రార్థించారు. మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ కూడా స్వామీజీకి ఘన నివాళులు అర్పించారు. అపారమైన భక్తులను కలిగిన స్వామీజీ తమ ప్రవచనాల ద్వారా స్ఫూర్తిప్రదాత అయ్యారన్నారు. ఆయన లేని లోటు భక్తులకు తీరని నష్టం అన్నారు.

ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు లేదు

- మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



రోడ్‌షోలో పాల్గొన్న మాజీ సీఎం సిద్దరామయ్య

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో గతంలో దేవరాజ అరసు, బంగారప్ప, యడియూరప్ప, శ్రీరాములు తదితరులు ప్రాంతీయ పార్టీలు పెట్టి రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావించినా ఆ పార్టీలను ప్రజలు సున్నితంగా తిరస్కరించారని, అందువల్ల రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు లేదని మాజీ సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఆయన మంగళవారం విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లిలో రోడ్ షో నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రభుత్వ వ్యవస్థలో ఎవరైనా సొంత పార్టీ పెట్టుకోవచ్చన్నారు. అయితే ఎవరినైనా అధికారంలోకి తెచ్చేది, లేనిది ప్రజలేనన్నారు. ప్రజలు ఆమోదిస్తే వారు నాయకులు అవుతారని పరోక్షంగా కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ గురించి మాట్లాడారు. గతంలో కేజేపీ, బీఎస్ఆర్ పార్టీలు ఏర్పాటు చేయడం వల్లనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కదా? అని విలేకరులు ప్రశ్నించగా, అలాంటిదేం లేదని, ప్రజలే కాంగ్రెస్ పార్టీని గెలిపించారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలో తెచ్చేందుకు తాము కలిసికట్టుగా పని చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను ఈనెలాఖరులోగా విడుదల చేస్తామని అన్నారు. గెలుపు గుర్రాలకే పార్టీ టికెట్ కేటాయిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్లు ఉన్నా రాష్ట్రాభివృద్ధి ఏం జరిగిందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాలవి జలాశయంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు గణేష్, భీమానాయక్, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై కర్ణాటక వాసి మృతి



ప్రతాప్‌రెడ్డి మృతదేహం



నూర్పిడి యంత్రం పైన వెళ్లిన విద్యుత్ తీగలు

గుంతకల్లు రూరల్: కంది చేనులో నూర్పిడి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని చింతలాంపల్లిలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో బళ్లారి తాలూకా హొసనెల్లుడికి చెందిన ప్రతాప్‌రెడ్డి(30) అనే వ్యక్తి మృతి చెందాడు. కందిపంట నూర్పిడి మిషన్ కలిగి ఉన్న ప్రతాప్‌రెడ్డి ప్రతి ఏడాది పంట నూర్పిడి సమయంలో గుంతకల్లు మండలంలో నూర్పిడి పనులు చేపట్టేవాడు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం చింతలాంపల్లికి చేరుకున్న ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఉదయాన్నే రైతు రామాంజనేయులు పొలంలో కందిపంట నూర్పిడి పనులు ప్రారంభించాడు. పంట నూర్పిడి పనులు సాగుతుండగా ప్రతాప్‌రెడ్డి మిషన్ వెనుకభాగం పైకెక్కి పనులను పరిశీలిస్తున్నాడు. ఈక్రమంలో పైన వెళ్తున్న విద్యుత్ తీగలు తగలడంతో ఆయన షాక్‌కు గురై కుప్పకూలి కింద పడిపోయాడు. అపస్మారక స్థితికి చేరిన అతడిని వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సావిత్రి బాయి పూలే జయంతి



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి: స్త్రీలకు విద్యతో పాటు సమానత్వ హక్కును ప్రతిపాదించడంలో సావిత్రి బాయి పూలే పాత్ర మహత్తరమని బలిజ మహిళా సంఘం నాయకురాలు శారదా లోకేష్ తెలిపారు. మంగళవారం మారుతీనగర్‌లోని యోగి నారాయణ యతీంద్ర బలిజ భవనంలో ఏర్పాటు చేసిన సావిత్రి బాయి పూలే 192వ జయంతికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వెనుకబడిన మహిళలకు విద్య అందించడంతో పాటు అక్షరవిప్లవాన్ని సృష్టించిన ఆమె సాధన అమోఘం అన్నారు. విజయనగర ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఉపాధ్యాయిని శంక్రమ్మ ఎస్.గిరిసాగర్, చేతన విద్యానికేతన్ ఉపాధ్యాయిని ఎంఆర్.సావిత్రిని సన్మానించారు. సంఘం పదాధికారులు కే.విద్యాశివకుమార్, ప్రముఖులు రేణుక రమేష్, భాగలక్ష్మి, కే.శంకర్, విద్యావీరేష్, పాండురంగ, అర్చకుడు ప్రకాష్ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై చిలిపి చేష్టలు



రొమాన్స్‌లో ప్రేమజంట దృశ్యం

బనశంకరి: పట్టపగలు నడిరోడ్డుపై స్కూటర్‌లో వెళ్తూ ప్రేమజంట రొమాన్స్ చేసిన ఘటన స్థానిక మైసూరు రోడ్డులో చోటుచేసుకుంది. హెల్మెట్ ధరించకుండా, ఎవరైనా చూస్తారనే భయం లేకుండా చిలిపి చేష్టలకు పాల్పడ్డారు. రెండురోజుల క్రితం మైసూరురోడ్డు నాయండహళ్లి ఫైవంతెనపై ఈ ఘటన జరిగింది. వారి వెనుక కారులో వెళ్తున్న ఓ వ్యక్తి ఈ తతంగాన్ని మొబైల్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. పోలీసులు అది చూసి వాహన నంబరు ప్రకారం ప్రేమజంటను గుర్తించారు. వారిని, తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

తల నరికి, వేళ్లు కత్తిరించి..

- దేవనహళ్లి శివార్లలో కలకలం



సంఘటనా స్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: వ్యక్తి తల నరికి హత్య చేసిన సంఘటన దేవనహళ్లి తాలూకా బుళ్లహళ్లి గేట్ వద్ద చోటుచేసుకుంది. సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన అపరిచిత వ్యక్తిని తల నరికి, చేతి వేళ్లు కత్తిరించి చంపారు, ఆపై దుస్తులు తొలగించి దేవనహళ్లి పట్టణ శివారులోని బుళ్లహళ్లి గేట్ వద్ద పడేశారు. మృతదేహాన్ని చూసిన స్థానికులు భయాందోళనకు గురై మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారమిచ్చారు. ఎంతో కక్షతోనే హత్య చేసినట్లు తెలుస్తోంది. విజయపుర పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిచితుల మృతదేహాల సంఘటనలు పెరగడం కలకలం కలిగిస్తోంది.

చేపలు పట్టడానికి వెళ్లి నీటిపాలు

చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన యువకుడు నీట మునిగి మృతిచెందాడు. దొడ్డ తాలూకా పుట్టయ్యన అగ్రహారకు చెందిన మునిరాజు(28) గ్రామ సమీపంలోని మధురె చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునగడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఫైర్ సిబ్బంది శవాన్ని వెలికితీశారు.

స్వామికి విశేష అలంకరణ



స్వామి వారికి విశేష అలంకరణ చేసిన దృశ్యం

కంప్లి: తాలూకాలోని నెంబర్– ముద్దాపురంలో చారిత్రక వెంకటరమణ స్వామి ఆలయంలో సురేంద్ర తీర్థ శ్రీపాదుల ఆరాధన సందర్భంగా మంగళవారం వెంకటరమణ స్వామి ప్రతిమకు పుష్పాలు, తులసీదళాలతో అర్చకులు ఆర్‌పీ నారాయణాచార్ అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బసవణ్ణ విగ్రహావిష్కరణ



విగ్రహానికి మాజీ ఎంపీ, ఎమ్మెల్యేల పుష్పాంజలి

గంగావతి: బస్టాండ్ ఎదురుగా ఉన్న నెహ్రూ పార్క్‌లో జగజ్యోతి బసవణ్ణ విగ్రహావిష్కరణకు మాజీ ఎంపీ హెచ్‌జీ.రాములు, ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి భూమి పూజను నెరవేర్చారు. మాజీ ఎంపీ మాట్లాడుతూ బసవణ్ణ 12వ శతాబ్దంలోనే సమ సమాజ స్థాపన కోసం కృషి చేశారన్నారు. అలాంటి మహాపురుషుని విగ్రహ ప్రతిష్ఠాపనపై నగర ప్రజలు కన్న కలల సాకారానికి నేడు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు శ్రీకారం చుట్టామన్నారు. మాజీ మంత్రి మల్లికార్జున నాగప్ప, మాజీ ఎంపీ సూగూరు శివరామ గౌడ, మాజీ ఎమ్మెల్యే జీ.వీరప్ప, ప్రముఖులు నెక్కంటి సూరిబాబు, రైతు ప్రశస్తి విజేత టీ.శ్రీధర్, పంచమసాలి సమాజ ప్రముఖులు కళకనగౌడ, రిటైర్డ్ ఇంజినీర్ బసవయ్యస్వామి, వాల్మీకి సమాజ ప్రముఖులు జోగద నారాయణప్ప నాయక్, హనుమంతప్ప నాయక్, దళిత ప్రముఖులు కుంటోజి మరియప్ప, ఆరతి వీరేష్, కళాకారిణి మహాలక్ష్మీ పాల్గొన్నారు.

వెనుకబాటును నిర్మూలించాలి



మాట్లాడుతున్న ధనరాజ్

గంగావతి: ప్రవర్గ–1 కులాలకు రిజర్వేషన్ల కల్పనలో, రాజకీయ, విద్యా, ఆర్థిక పరంగా అన్యాయం జరిగిందని ఐక్యకార్యాచరణ సమితి కొప్పళ జిల్లా అధ్యక్షులు ఈ.ధనరాజ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని నీలకంఠేశ్వర సర్కిల్ వద్ద కృష్ణా వెజ్ సభా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 115 నియోజకవర్గాల్లో నిర్ణాయక శక్తిని కలిగి ఉన్న ఈ వర్గానికి చెందిన ప్రజలు విద్యా, రాజకీయ పరంగా వెనుకబడి ఉన్నారన్నారు. వీరికి సరైన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీరికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యకు ఆధారంగా జెడ్పీ, టీపీ స్థానాలకు ప్రతి పార్టీ వారు కనీసం 50 స్థానాలను కల్పించాలని ఆయన ఒత్తిడి చేశారు. వసతి పాఠశాలల్లో వీరికి సంఖ్య ఆధారంగా సీట్లను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణలో ఈ వర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదాను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేరని పక్షంలో దీర్ఘకాల పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా సమితి తాలూకా అధ్యక్షులు ప్రణవానంద, కార్యదర్శి వెంకటేష్ హొస్పళ్లి, ప్రముఖులు మహేష్ సాగర్, అమరజ్యోతి నరసప్ప, ప్రణవానంద, ఆరాళ ముద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అగ్నిప్రమాదం

- నలుగురికి గాయాలు



ప్రమాదం జరిగిన ఆలయం ఇదే

హుబ్లీ: వంట గ్యాస్ లీకేజ్ వల్ల ప్రమాదం జరిగి నలుగురు భక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన వీరాపుర వీధి గణపతి ఈశ్వర దేవస్థానంలో చోటు చేసుకుంది. ఆలయ ప్రాంగణంలోని వంట గదిలో ఆకస్మికంగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడినవారిని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న బెండిగేరి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కోలారు వార్తలు...

ఎన్‌పీఎస్ రద్దుకు కట్టుబడి ఉన్నాం



రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన దృశ్యం

కోలారు : కొత్త సంవత్సరంలో రాష్ట్ర సమస్త ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య సేవలు, 7వ వేతన సంఘం నివేదిక కానుకగా లభిస్తోందని, దీనికి తోడు కొత్త పింఛన్ పథకం(ఎన్‌పీఎస్) రద్దుకు కూడా రాష్ట్ర ఉద్యోగుల సంఘం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీ ఎస్ షడక్షరి తెలిపారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జి సురేష్‌బాబు నేతృత్వంలో సన్మానం అందుకుని ఆయన మాట్లాడారు. కొత్త సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగులు తమ కుటుంబాలకు సుఖశాంతులు, మానసిక నెమ్మదిని అందించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల హిత రక్షణలో రాష్ట్ర సంఘం ఎన్నటికీ రాజీ పడేది లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు తనకు తెలుసునని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తమ భవిష్యత్ లక్ష్యం ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి తిరిగి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయించడమేనని ఆయన అన్నారు.

చిట్టచివరి రైతుకూ బ్యాంకు రుణాలు అందిస్తాం



రుణపత్రాలు, ఏటీఎం కార్డులు అందిస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : క్యాసంబళ్లి ఫిర్కాలో చెరువుల కింద వ్యవసాయానికి అనువుగా రైతులకు ఆర్థిక సహాయం అందించడానికి డీసీసీ బ్యాంకు సిద్ధంగా ఉందని, చిట్టచివరి రైతుకు కూడా బ్యాంకు నుంచి రుణం అందుతుందని బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడ తెలిపారు. మంగళవారం క్యాసంబళ్లిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు, స్త్రీశక్తి సంఘాల మహిళలకు రూ.2.25 కోట్ల రుణాలు, ఏటీఎం కార్డులను అందించి మాట్లాడారు. మహిళలు సకాలంలో రుణాలు చెల్లిస్తుండడం వల్ల మహిళా సంఘాలకు మరో రూ.25 కోట్ల వరకు రుణాలు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే రూపా శశిధర్ మాట్లాడుతూ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని గొర్రెలు, పశువుల పెంపకం, కూరగాయల విక్రయాలతో ఆర్థికాభివృద్ధి పొందుతుండడం హర్షణీయమన్నారు. సంఘం సభ్యులు సరస్వతమ్మ, కేఈబీ వెంకటేష్, టి.వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాక్షరతకు మార్గదర్శి పూలే



పూలే జయంతిని నిర్వహించిన దృశ్యం

మాలూరు : మహిళల పాలిట దారి దీపం సావిత్రిబాయి పూలే అని డీఎస్ఎస్ తాలూకా సంచాలకుడు ఎస్ఎం వెంకటేష్ కొనియాడారు. మంగళవారం పట్టణంలోని డీఎస్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతిలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన వర్గాలు, మహిళలకు అక్షరాలు నేర్పించి వారిని విద్యావంతులను చేయడానికి సావిత్రిబాయి పూలే ఎంతో శ్రమించారన్నారు. జిల్లా సమన్వయ సంచాలకుడు చవ్వేనహళ్లి, సంఘటకులు సుబ్రమణి, డీఎన్ నారాయణస్వామి, బండిహట్టి నారాయణస్వామి, తిరుమలేష్, వెంకటేశప్ప పాల్గొన్నారు.

'విశ్వకర్మ'లకు ఆదర్శం జక్కన్న

శ్రీనివాసపురం : అమరశిల్పి జక్కణాచారి విశ్వకర్మ సముదాయానికి ఆదర్శమని తాలూకా విశ్వకర్మ క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు కె.మోహనాచారి తెలిపారు. మంగళవారం పట్టణంలోని కాళికా కమటేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జక్కణాచారి జయంతిలో ఆయన మాట్లాడారు. తాలూకా విశ్వకర్మ క్షేమాభివృద్ధి సంఘం మహిళా అధ్యక్షురాలు కె రాధమ్మ, రామచంద్రాచారి, ఎన్ రత్నాచారి పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించే వరకు పోరాడుతాం



మాట్లాడుతున్న యజమానుల సంఘం సభ్యులు

బళ్లారి అర్బన్: జిల్లా లారీ యజమానుల సంఘం ఎన్నికలు నిర్వహించేంత వరకు పోరాడుతామని ఆ సంఘం సభ్యులు, లారీ యజమానులు తెలిపారు. మంగళవారం స్థానిక పత్రికాభవనంలో జిల్లా లారీ యజమానుల సంఘం స్టాండింగ్ కమిటీ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. సంఘానికి ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకోవడాన్ని సభ్యులంతా తిరస్కరిస్తున్నామన్నారు. తక్షణమే ఎన్నికల తేదీని ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలని అభిప్రాయ పడ్డారు. సంఘం స్టాండింగ్ కమిటీ సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, బాబు, జే.నాగరాజ్, రామ్‌కుమార్, మెహబూబ్ బాష, వెంకటేష్, ఎం.లోకేష్, రమేష్, సురేంద్ర, నీలకంఠేశ్వర నాయుడు పాల్గొన్నారు.

పూలే సర్కిల్‌గా నామకరణం



సావిత్రి బాయి పూలే సర్కిల్ నామఫలకానికి పూలమాల వేసిన దృశ్యం

రాయచూరు రూరల్ : నగరంలో మంగళవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఆచరించారు. నవోదయ ఆస్పత్రి వద్ద సర్కిల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేశారు. నగరసభ సభ్యుడు జయన్న మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే సర్కిల్ నిర్మాణం చేపట్టి నామకరణం చేయడం అభినందనీయమన్నారు. ఆర్పీఐ మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, శాంతప్ప, సదానంద పూజార్, వెంకటేష్‌లున్నారు.

కలెక్టరేట్‌లో పూలే జయంతి

జిల్లాధికారి కార్యాలయంలో మంగళవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఆచరించారు. ఆమె చిత్రపటానికి ఏడీసీ దురుగేష్ పూలమాల వేసి సరళంగా జయంతిని నెరవేర్చారు. విద్యార్థులకు మొదట్లో అక్షరాలు నేర్పిన మహా మేధావి సావిత్రి బాయి పూలే అని, ఆమె సరస్వతి పుత్రిగా పేరొందారన్నారు.

మద్దతు ధర ప్రకటించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో రైతులు పండించిన పత్తి, మిరప పంటలకు మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు రంగనాథ్ పాటిల్ మాట్లాడారు. ప్రభుత్వం ఈ విషయంలో రైతుల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఆటోడ్రైవర్లకు లైసెన్సుల పంపిణీ

కోలారు : ప్రజా సేవచేయడానికి తాను సదా సిద్ధమని, వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ ఆటో డ్రైవర్లకు ఉచిత డ్రైవింగ్ లైసెన్సులను అందించి ఆయన మాట్లాడారు. కష్టపడి స్వాభిమానంతో జీవించే ఆటో డ్రైవర్ల కష్టాల్లో తాను భాగస్వామినయ్యానన్నారు. ఏపీఎంసీకి వచ్చే రైతులకు ఆటో డ్రైవర్లు అందిస్తున్న సేవలు అపారమన్నారు. లౌకిక సిద్ధాంతాలపై నడిచే జేడీఎస్ పార్టీ సమాజంలో ప్రతి సముదాయానికి సమాన అవకాశాలు కల్పించాలని చూస్తోందన్నారు. స్వతంత్ర జీవితం సాగించడానికి జేడీఎస్ పార్టీకి మద్దతు తెలపాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ అధికారంలోకి వస్తే పంచరత్న పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జేడీఎస్ జిల్లా కార్యాధ్యక్షుడు బణకనహళ్లి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా సామాజిక బాధ్యత అనంతం



సాధక మహిళలను సన్మానించిన దృశ్యం

కోలారు : మీడియా ఎంత ఆధునికమైనా అనంతమైన సామాజిక బాధ్యతల నుంచి తప్పించుకోరాదని బెంగుళూరు ఉత్తర విశ్వ విద్యాలయం కులపతి ప్రొఫెసర్ డి.డొమినిక్ తెలిపారు. మంగళవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో నిర్వహించిన నమ్మ సుద్ది.నెట్ వెబ్ సైట్ ప్రారంభోత్సవం, సావిత్రిబాయి పూలే జయంతిలో ఆయన మాట్లాడారు. మీడియా సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని అన్నారు. పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో గూగల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, మైక్రో సాఫ్ట్, ఇన్‌స్టాగ్రాం ద్వారా క్షణాల్లో ప్రపంచ నలుమూలల్లోని వార్తలు మన కళ్లముందు ఉంటున్నాయన్నారు. సావిత్రిబాయి పూలే ఆదర్శాలను ప్రతి మహిళ అలవరచుకుని విద్యావంతురాలు కావాలన్నారు. అనంతరం సాధక మహిళలను సన్మానించారు. జిల్లా కార్యనిరత పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బి వి గోపినాథ్, పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్ఎస్ ధర్నా



తుమకూరు: తుమకూరు నగరంలో దళితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కర్ణాటక దళిత సంఘర్ష సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి తుమకూరు జిల్లా అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టౌన్ హాల్ వద్దకు చేరుకున్న డీఎస్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అధికారి కలిసి వినతిపత్రం అందజేశారు.

అధికారిపై కేసు

మైసూరు: తన సహోద్యోగికి అశ్లీల వీడియోలు, ఫొటోలు పంపిన ఆరోపణలపై మైసూరు నగరంలోని నీటిపారుదల శాఖ దక్షిణ విభాగం చీఫ్ ఇంజినీర్ కార్యాలయ సూపరింటెండెంట్ వసంత్‌పై కేఆర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వసంత్ తన కార్యాలయంలో పనిచేసే సహాయకురాలి మొబైల్‌కు అశ్లీల వీడియోలు, ఫొటోలు పంపించాడు. దీంతో బాధితురాలు కేఆర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతని కేసు నమోదు చేశారు.

బైకిస్టు దుర్మరణం

లారీ ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన మైసూరు బన్నూరు రోడ్డులో ఉన్న ఎటీఎంఈ కళాశాల వద్ద జరిగింది. మృతుడిని తాలూకాలోని మేలహళ్లికి చెందిన శివకుమార్ (23)గా గుర్తించారు. ఇతను మైసూరులోని ఓ హార్డ్‌వేర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. బన్నూరు వైపు నుంచి వస్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి లారీ కిందపడి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తి అరెస్ట్

మైసూరు: స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తిని మైసూరు నగరంలోని విజయనగర పోలీసులు అరెస్ట్ చేశారు. లోకేశ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. వివరాలు...మైసూరులోని కూర్గళ్లిలో ఒకే ఇంటిలో లోకేశ్, దర్శన్ ఉంటున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు. రెండో పెళ్లి చేసుకున్న లోకేశ్ భార్యతో కలిసి అదే ఇంటిలో ఉంటున్నాడు. లోకేశ్ భార్యపై కన్నేసిన దర్శన్ అప్పుడప్పుడు ఆమెకు మెసేజ్‌లు పెట్టడం, ఫోన్ మాట్లాడటం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న లోకేశ్, దర్శన్‌ను నిలదీశాడు. ఈ క్రమంలో దర్శన్‌పై కక్ష పెంచుకున్న లోకేశ్ ఇటీవల చాకుతో పొడిచి హత్య చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

భక్తులకు అన్నదానం పుణ్యప్రదం



అన్నదానం నిర్వహించిన యువకుల బృందం

గౌరిబిదనూరు: ధార్మిక క్షేత్రాలలో భక్తులకు అన్నదానం చేయడం పుణ్యప్రదమని ముదుగానకుంటె అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం ముదుగానకుంటె గంగాభగీరథి ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా గంగసంద్ర గ్రామ ప్రజలచే సమీపంలోని ముదుగానకుంటె గంగాభగీరథి ఆలయంలో మొదటి సోమవారం అన్నదానం చేయడం ఆనవాయితీ అని, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వస్తుంటారని, సోమవారం మాత్రమే పూజలు ఉంటాయని, మిగతా రోజుల్లో ఇక్కడ ఎవ్వరూ ఉండరని తెలిపారు. ఉదయం కేఏఎస్ అధికారి వరప్రసాదరెడ్డి గంగామాతను దర్శించుకున్నారు. లక్ష్మీనారాయణ పటేల్, అశోక్‌ప్రసాద్, మహేశ్, మురారీ, నాగభూషణరెడ్డి, నాగేశ్, కిరణ్‌సాయి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చెరువుకు గండికొట్టిన దుండగులు



చింతామణి: పట్టణానికి తాగునీరు అందించే నెక్కుందిపేట చెరువుకు సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చెరువుకు గండికొట్టారు. దీంతో నీరు మొత్తం చెరువుకు కింద ఉన్న పంటలను ముంచేసింది. పంటలు మొత్తం దెబ్బతిన్నాయని కౌన్సిలర్లు రాణియమ్మ, శోభా శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం ఈ విషయం తెలుసుకున్న నగరసభ సిబ్బందితో పాటు కౌన్సిలర్లు వెళ్లి చెరువుకు మరమ్మతులు చేపట్టారు.

యువకుడిపై పోక్సో కేసు

మండ్య: మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన ఘటన మండ్య జిల్లా నాగమంగళ పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలో టైలర్ దుకాణం నిర్వహిస్తున్న అన్సర్‌పాషా (26) వద్దకు ఈనెల ఒకటిన కొత్త దుస్తులు కుట్టించుకోవడానికి బాలిక వచ్చింది. అన్సర్ కొలతలు తీసుకునే సమయంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

తుమకూరు జిల్లాలో యాక్సిడెంట్ల హోరు

- వేర్వేరు చోట్ల నలుగురు మృత్యువాత

తుమకూరు: తుమకూరు జిల్లాలోని కుణిగల్, చిక్కనాయకనహళ్ళి, తిపటూరు తాలూకాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నాలుగు మంది మరణించారు. వివరాలు...కుణిగల్ తాలూకాలోని దొడ్డమావత్తూరు గేట్ వద్ద బైకులో వెళ్తుండగా కుక్క రావడంతో సడన్ బ్రేక్ వేశారు, దీంతో బైకు వెనుకాల కుర్చొని ఉన్న కల్పన (49) అనే మహిళ ఎగిరి కింద పడి గాయాలతో మృతి చెందింది. ఆమె స్వస్థలం హులియూరు దుర్గ సమీపంలోని ఉజ్జని గ్రామం.

లారీ టైర్ పేలి డ్రైవర్...

- తిపటూరు తాలూకాలోని కేబిక్రాస్ దగ్గరి హిండిస్కర వద్ద 14 చక్రాల లానీ టైరు పేలడంతో దెబ్బలు తగిలి డ్రైవర్ చనిపోయాడు. మంగళవారం ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో లారీ టైర్ వేడెక్కిందని తెలిసిన డ్రైవర్ దానిని పరిశీలిస్తున్నాడు. ఇంతలో ఆ టైర్ బాంబు మాదిరిగా పేలిపోయింది. ఆకస్మిక ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ అక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుని సొంతూరు కొరటిగెరెగా తెలిసింది.
- చిక్కనాయకనహళ్లి తాలూకాలోని ముద్దేనహళ్లి గేట్ అతివేగంగా వస్తున్న మారుతి వ్యాన్ పాదచారిని ఢీకొట్టింది. కందికెరె దగ్గరున్న సాలకట్టి తండాకు చెందిన విజయ్‌కుమార్ (30) గాయాలతో అక్కడే మరణించాడు. ఇతను రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొంది.
- తిపటూరు గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలో న్యాకేనహళ్ళి వద్ద స్థానికుడు బోరేగౌడ (45) భోజనం తేవడానికి హోటల్‌కు బైకులో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రగాయాలతో బోరేగౌడ సంఘటనాస్థలంలోనే మృతి చెందాడు. పై కేసుల్లో స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు.



న్యాకేహళ్లి వద్ద మరణించిన బైకిస్టు బోరేగౌడ



పేలిన లారీ టైర్



డ్రైవర్ మృతదేహం

గార్మెంట్స్ ఉద్యోగి దుర్మరణం

శివాజీనగర: అతి వేగంగా వచ్చిన టెంపో వాహనం ఢీకొని గార్మెంట్స్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన కామాక్షిపాళ్య వ్యాప్తిలో మంగళవారం తెల్లవారజామున సంభవించింది. పావగడకు చెందిన లోహిత్ (23) కెంగేరి ఉపనగరలో నివసిస్తూ గార్మెంట్స్‌లో పనిచేసేవాడు. ఔటర్ రింగ్ రోడ్డు ఉల్లాళ చెరువు సమీపంలో బైక్‌లో కెంగేరి ఉపనగర వైపు వస్తుండగా వేగంగా వచ్చిన టెంపో ఢీకొనడంతో లోహిత్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని ఆసుపత్రికి తరలించగా అక్కడ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్టు

బెంగళూరు సీసీబీ పోలీసులు రౌడీ ఇమ్రాన్ (మండి ఇమ్రాన్) షాబాజ్ ఖాన్, సయ్యద్ యారబ్ అనేవారిని అరెస్టు చేసి రూ. 3 లక్షలు విలువచేసే 25 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్, 22 ఎల్ఎస్‌డీ పట్టీలు, 1 కేజీ గంజాయిని సీజ్ చేశారు. మండి ఇమ్రాన్‌కు ఒక హత్య కేసుతో సంబంధముంది. మిగతావారు డ్రగ్స్ దందాలకు పాల్పడేవారు. స్కూళ్లు, కాలేజీ విద్యార్థులకు డ్రగ్స్ అమ్మేవారని పోలీసులు తెలిపారు.

కన్నుల పండువగా జాతర మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న బసవరాజ్ తదితరులు

బనశంకరి: బనశంకరీదేవి జాతర మహోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. మంగళవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం యాగశాలలో అర్చకులు బృందం శ్రీదుర్గా, శ్రీసూక్త, శ్రీ సారస్వత హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బసవరాజ్, కమిటీ సభ్యులు, ఈఓ కే.పద్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

ఎయిర్‌పోర్టులో భగ్గుమన్న పార్కింగ్ గొడవలు

దొడ్డబళ్లాపురం: ఎయిర్‌పోర్టులో ట్యాక్సీల పార్కింగ్ విషయంలో తారతమ్యం చూపిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో దేవనహళ్లి ఎమ్మెల్యే నిసర్గ నారాయణస్వామి మంగళవారం ఎయిర్‌పోర్టుకు వెళ్లి ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలు ఆలకించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డ్రైవర్లు ఎయిర్‌పోర్టులో బీఐఏఎల్ అధికారులు, కేఎస్‌టీడీసీ ట్యాక్సీలకు పార్కింగ్ కల్పించడం లేదన్నారు. కేఎస్‌టీడీసీ ట్యాక్సీ డ్రైవర్లు మొత్తం 500 మందిపైగా ఉన్నామని అధికారులు పలు కంపెనీల ట్యాక్సీలకు కొమ్ముకాస్తున్నారని, ఈ విషయంలోనూ వివక్ష చూపుతున్నారని వాపోయారు. ఎయిర్‌పోర్టులో పీ–5లో కేఎస్‌టీడీసీ కౌంటర్ ప్రారంభమైందని, మొదట ఇక్కడ 400 ట్యాక్సీలకు అనుమతి ఇచ్చారని తరువాత 200 ట్యాక్సీలకు ఇప్పుడు కేవలం 30 ట్యాక్సీలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారన్నారు. అధికారులు ఓలా, ఉబర్ కంపెనీల ట్యాక్సీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, తామంతా కష్టమర్లు లేక తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే నిసర్గ నారాయణస్వామి ఎయిర్‌పోర్టు అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపిస్తానని హామీ ఇచ్చారు.



ట్యాక్సీ డ్రైవర్‌లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నిసర్గ

ఉపాధ్యాయినులకు సన్మానం

మైసూరు: సంఘ సంస్కర్త, స్త్రీ విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన జ్యోతిబాపూలే సతీమణి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నగరంలోని త్యాగరాజ రోడ్డులో కృష్ణరాజ యువకుల సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడెకోళ ప్రభుత్వ పాఠశాలకు చెందిన సుమతి, గోపాలపుర పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయురాలు మంజుల, మళవళ్లి ప్రభుత్వ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు విశాలమ్మ, అక్కన బళగ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ, నాగరత్న, దళవాయి పాఠశాల ఉపాధ్యాయురాలు కావ్యశ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మడికెరె గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెండ్

యశవంతపుర: మంగళూరు పట్టణంలోని తణ్ణీరు బావి బీచ్ వద్ద క్రికెట్ ఆడుతుండగా యువకులపై లాఠీ విసిరిన పణంబూరు స్టేషన్ కానిస్టేబుల్ సునీల్‌ను సస్పెండ్ చేస్తూ మంగళూరు పోలీసు కమిషనర్ శశికుమార్ అదేశాలు జారీ చేశారు. లాఠీ విసిరిన ఘటనలో ఆరో తరగతి విద్యార్థి గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. కానిస్టేబుల్ తీరుపై గ్రామస్తులు అందోళన చేయడంతో సునీల్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గురువు మార్గదర్శి

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విద్యా బుద్ధులను నేర్పించి ఉన్నతస్థాయికి మార్గాలు చూపించే గురువులను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సివిల్ న్యాయమూర్తి మమత అన్నారు. మంగళవారం విజయపుర పట్టణంలోని ప్రగతి బాలికల పీయూ కళాశాలలో నిర్వహించిన బెళ్లిహబ్బ వర్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. తాను ఇదే కళాశాల విద్యార్థినిని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో రాణించాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు.



మహిళలను సన్మానించిన దృశ్యం

మొబైల్ లాక్కొని బ్లాక్‌మెయిల్

- వ్యక్తి అరెస్ట్



నిందితుడు పవన్

బనశంకరి: టీ దుకాణం వద్ద యువకుడి నుంచి మొబైల్ తీసుకుని తిరిగి ఇవ్వకుండా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన వ్యక్తిని యశవంతపుర పోలీసులు అరెస్ట్ చేశారు. కొద్ది రోజుల క్రితం రామయ్య ఆసుపత్రి వెనుకభాగం మత్తికెరె టీస్టాల్ వద్ద దేవవ్రతసింగ్ అనే వ్యక్తి నిలబడి ఉండగా పవన్ అనే యువకుడు వచ్చి తన మొబైల్ పనిచేయలేదని, అర్జంట్‌గా బంధువులతో మాట్లాడాలని మొబైల్ ఇవ్వాలని అడిగాడు. ఈ సమయంలో దేవవ్రతసింగ్ మొబైల్ తీసుకుని పవన్ బైక్‌లో ఉడాయించాడు. అనంతరం దేవవ్రతసింగ్‌కు, అతని స్నేహితులకు ఫోన్ చేసి లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బు ఇవ్వకపోతే మొబైల్‌లో ఉన్న ప్రైవేటు ఫొటోలు సోషల్ మీడియాల్ అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. ఈ ఘటనపై దేవవ్రతసింగ్ యశవంతపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు తీవ్రంగా గాలించి మంగళవారం పవన్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపడుతున్నారు.

రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ

యశవంతపుర: వరిని కొనుగోలు చేసి రైతులకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ఘటన దావణగెరెలో జరిగింది. విజయనగర జిల్లాకు చెందిన ప్రశాంత్ అనే వ్యాపారి రైతుల నుంచి వందల టన్నుల వరిని కొనుగోలు చేశారు. ఇలా దావణగెరె, విజయనగర జిల్లాలకు చెందిన రైతుల వద్ద నుంచి ప్రశాంత్ కొనుగోలు చేసి మొత్తం రూ.37 కోట్లు ఇవ్వాలి. ఒక్క దావణగెరె నుంచి కోట్ల విలువైన వరిని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వలేదు. దీంతో చుట్టు పక్కల గ్రామాల రైతులు మంగళవారం దావణగెరెలోని ప్రశాంత్ ఇంటి ముందు రైతులు ఆందోళన చేశారు. రైతుల నుంచి వరిని కొని అమ్మగా వచ్చిన డబ్బులతో ప్రశాంత్ ఆస్తులను కొనుగోలు చేశాడు. రైతులకు ఒక పైసా డబ్బులు ఇవ్వలేదని మహిళా రైతు యల్లమ్మ ఆరోపించారు. గతంలోని ప్రశాంత్ అనేకమంది రైతులకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. ఇందుకు సంబంధించిన దావణగెరె ఎస్పీ రిష్యంత్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి మళ్లీ కొద్ది సేపటికే విడుదల చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.



మోసం చేసిన వ్యాపారి ప్రశాంత్

చెరువు పనులు నెలలో పూర్తి చేయాలి

బొమ్మనహళ్లి: చెరువు అభివృద్ధి పనులు ఫిబ్రవరి మొదటి వారంలో పూర్తి చేయాలని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి బీబీఎంపీ కాంట్రాక్టర్లను ఆదేశించారు. సామసంద్రపాళ్య చెరువు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన స్థానిక నాయకుడు శ్రీనివాసరెడ్డి, చిన్మయ విద్యా సంస్థల అధ్యక్షుడు వాసుదేవరెడ్డితో కలిసి చెరువు వద్దకు చేరుకుని అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు ముగ్గురు కాంట్రాక్టర్లను మార్చినా పనులు వేగంగా సాగడం లేదని స్థానికులు ఎమ్మెల్యేకు చెప్పడంతో ఆయన బీబీఎంపీ ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నెల రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీరెడ్డి, సంతోష్, వెంకటేశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

బొమ్మనహళ్లి: రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన బెంగళూరు జిల్లా పరిధిలోని ఆనేకల్ సురగజక్కనహళ్లి వద్ద చోటుచేసుకుంది. మృతుడిని కుంబరనహళ్లి గ్రామానికి చెందిన నంజుండరెడ్డి (40)గా గుర్తించారు. మంగళవారం నంజుండరెడ్డి తన బైక్‌పై జిగణి రోడ్డులో వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో నంజుండరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కారును ఆపకుండా వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఆనేకల్ సీఐ చంద్రప్ప ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యాన్ బోల్తా, అయ్యప్ప భక్తుడి...

శివాజీనగర: శబరిమల వెళ్తున్న అయ్యప్ప మాలధారుల వాహనం బోల్తాపడిన ఘటనలో ఓ భక్తుడు మృతి చెందగా ఇద్దరు గాయపడిన ఘటన మంగళవారం తమిళనాడులోని వెదసందూర్ దిండిగల్ జిల్లాలో చోటు చేసుకుంది. కర్ణాటకకు చెందిన సుమారు 20 మంది భక్తులు శబరిమలకు మినీ వ్యాన్‌లో బయలుదేరారు. వ్యాన్ అదుపుతప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నకిలీ నోట్ల చెలామణి, ఇద్దరి అరెస్ట్



నిందితులు, నకిలీ నోట్లు

యశవంతపుర: నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ఇద్దరిని మంగళూరు కద్రి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు బంట్వాళ తాలూకా బీసీ రోడ్డుకు చెందిన నిజాముద్దీన్ అలియాస్ నిజామ్, జప్పువికి చెందిన రజామ్ అలియాస్ రఫిలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4.50 లక్షల విలువైన ఐదు వందల ముఖ విలువ కలిగిన నోట్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలో పోలీసులు పట్టుకున్నారు. బెంగళూరుకు చెందిన డ్యానియల్ అనే వ్యక్తి నుంచి నకిలీ నోట్లను తెచ్చి చెలామణి చేస్తున్నట్లు మంగళూరు సీపీ శశికుమార్ తెలిపారు.

ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం



లక్ష్మీకాంత్

బనశంకరి: నగరంలో జాలహళ్లికి చెందిన లక్ష్మీకాంత్ (30) అలియాస్ పవన్ అనే యువకుడు గత నెల 30న అదృశ్యమయ్యారు. బీటెక్ పట్టభద్రుడైన లక్ష్మీకాంత్ దేవనహళ్లిలో కోఫోర్జ్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవారు. తల్లి మంజులతో కలిసి లక్ష్మీకాంత్ ఉంటున్నారు. నాలుగురోజుల క్రితం లక్ష్మీకాంత్ తీవ్ర ఆందోళనకు గురై ఇంటి నుంచి పారిపోయారు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినప్పటికి ఆచూకీ కనిపించలేదు. ఆయన తల్లి జాలహళ్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. లక్ష్మీకాంత్ 6 అడుగులు ఎత్తు, బ్లూ టీషర్ట్, గ్రే ట్రాక్ ప్యాంట్ ధరించారు. ఆచూకీ తెలిసిన వారు రఘునాథ్–99723 10842 నంబరు కు సమాచారం ఇవ్వాలని విన్నవించారు.

పరిశుభ్రమైన తాగునీటిని అందించడమే లక్ష్యం



కృష్ణరాజపురం: హొసకోటె నియోజకర్గం పరిధిలోని గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించటమే తన లక్ష్యమని హొసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ అన్నారు. మంగళవారం హొసకోటె పట్టణంలో ఏర్పాటు చేసిన తాగునీటి ఫిల్టర్‌ను ప్రారంభించి మహిళలకు వాటర్ క్యాన్లను అందజేశారు. పరిశుభ్రమైన నీరు లభించక ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, దీంతో తన సొంత ఖర్చుతో తాగునీటి ఫిల్లర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

హోసూరు వార్తలు..

కార్మికుడి ఆత్మహత్య

హోసూరు: అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన కార్మికుడు ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్న ఘటన కావేరిపట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు... కావేరిపట్టణం సమీపంలోని సౌళూరు గ్రామానికి చెందిన మురుగన్ (48) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కావేరిపట్టణం పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

నగనూరు వద్ద ఏనుగు బెడద



సంచరిస్తున్న ఒంటి ఏనుగు

కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని నగనూరు అటవీ ప్రాంతంలో ఒంటి ఏనుగు సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది. బెంగళూరు బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి జవుళగిరి అటవీ ప్రాంతానికి చేరుకొన్న వంద ఏనుగులు గుంపులు గుంపులుగా విడిపోయి డెంకణీకోట, నగనూరు, బేవనత్తం, ఉడేదుర్గం, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. నగనూరు అటవీ ప్రాంతంలో ఒంటి ఏనుగు రోడ్డుపైకి చేరుకొని అంచెట్టి వైపు వెళ్లే వాహనాలను అడ్డుకోవడంతో పాటు అటవీ ప్రాంత గ్రామ పరిసర ప్రాంతాల్లో రైతుల పంటలను తొక్కి ధ్వంసం చేస్తోంది. అటవీ సిబ్బంది దానిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు.

చెట్ల నరికివేతపై ఆగ్రహం



కృష్ణరాజపురం: ఒకవైపు చెట్లను సంరక్షించాలని జాగృతి కార్యక్రమాలు చేపడుతున్నా, మరోవైపు అభివృద్ధి పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తున్నారు. తాజాగా నగరంలోని మహదేవపుర పరిధిలోని అయప్పనగరలో కోడిగెహళ్లి మార్గం మధ్యలో 20 భారీ చెట్లను నరికివేశారు. చెట్ల నరికివేతకు సంబంధించి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని సామాజిక కార్యకర్త పరమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుడైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

చింతామణి: తాలూకాలోని పెరమాచనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు సమీపిస్తుండటంతో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు మోటారు పంపుసెట్లను అందజేశారు.

కొనసాగుతున్న నారేయణ తాత ఆశ్రమ వార్షికోత్సవాలు

హోసూరు: హోసూరు పట్టణంలో వెలసిన శ్రీ సద్గురు నారేయణ తాత ఆశ్రమ 16వ వార్షికోత్సవాలు డిసెంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. జనవరి 14వ తేదీ వరకు జరిగే ఈ వార్షికోత్సవంలో భాగంగా రోజూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ వేకువజాము 3 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నారేయణ తాత భక్తులు పురవీధుల్లో రామభజనలు చేస్తూ ఆశ్రమానికి చేరుకుని విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిత్యాన్నదానం చేస్తున్నారు. సోమవారం రాత్రి తొరపల్లి పంచాయతీ కార్యనిర్వణాధ్యక్షుడు రాము, ఆశ్రమ ప్రతినిధులు మంజునాథ్, కుముదేపల్లి భజనమండలి బృందంచే నారేయణతాత ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



నారేయణ తాత ఉత్సవమూర్తిని అలంకరించిన దృశ్యం

సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం



విలేకరులతో మాట్లాడుతున్న లారీ యాజమానుల సంఘ అధ్యక్షుడు షణ్ముగప్ప



ఆందోళనకారులతో చర్చిస్తున్న పోలీసులు

- క్రషర్, లారీ యాజమానుల సంఘం హెచ్చరిక

కెలమంగలం: హోసూరు –డెంకణీకోట రోడ్డు కొరటగిరి గ్రామం వద్ద నిర్వహిస్తున్న కంకర క్వారీలకు టిప్పర్ లారీలను అనుమతించకపోతే క్రషర్, లారీ యాజమానుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని సంఘం నేతలు హెచ్చరించారు. గత 8 నెలలుగా క్రషర్ యాజమానులు, టిప్పర్ లారీ యాజమానులు, గ్రామస్తుల మధ్య చర్చలు జరుగుతూ వచ్చింది. ఈనేపథ్యంలో కంకర క్వారీల యాజమానులు చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం కొరటగిరి గ్రామంపై టిప్పర్ లారీల సంచారానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. వారం రోజుల క్రితం పోలీసు బందోబస్తు మధ్య లారీల సంచారానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అయితే గ్రామస్తులు రోడ్లపై షెడ్లు ఏర్పాటు చేసి లారీలను అడ్డుకున్నారు. దీంతో మంగళవారం క్రషర్ యాజమానుల సంఘం, టిప్పర్ లారీల యాజమానుల సంఘం పెద్ద ఎత్తున ఆందోళనకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా పంక్షేశ్వరం బస్టాప్ వద్ద క్రషర్ యాజమానులు, కార్మికులు, టిప్పర్ లారీ యాజమానులు, డ్రైవర్, క్లీనర్‌లు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అఖిల భారత లారీ యాజమానుల సంఘ అధ్యక్షుడు షణ్ముగప్ప విలేఖరులతో మాట్లాడుతూ... రెండు రోజులుగా కంకర క్వారీలను మూసివేశామని, దీంతో కోట్లలో నష్టపోతున్నామని, టిప్పర్ లారీలను అనుమతించకపోతే 10 వేలకు పైగా లారీలతో హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై ఆందోళన చేపడతామన్నారు. విషయం తెలుసుకొన్న డెంకణీకోట డీఎస్పీ మురళి, పోలీసులు ఆందోళనకారులతో చర్చించారు. కార్యక్రమంలో క్రషర్ యాజమానుల సంఘ అధ్యక్షుడు సంపంగి, సంఘ సభ్యులు ప్రేమనాథ్, సర్వేష్, వెంకటరాజు, క్రషర్, టిప్పర్ లారీల యాజమానుల సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయాలి

హోసూరు: తమిళనాడు రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో అందజేసిన విధంగా పొంగల్ కానుకలను అందజేయాలని, ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం అనుబంధ సీఐటీయూ మంగళవారం సాయంత్రం పట్టణంలోని రామనగర్ అన్నా విగ్రహం వద్ద ఆందోళన చేపట్టింది. అసంఘటిత కార్మిక సంఘ అధ్యక్షుడు బి.జి.మూర్తి అధ్యక్షతన జరిగిన ఆందోళనలో రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో అందజేసిన విధంగా పొంగల్ కానుకలను అందజేయాలని, పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ఉచిత ఇళ్లపట్టాలు అందజేయాలని, వృద్ధాప్యపెన్షన్‌ను రూ. 3 వేలకు పెంచాలని తదితర పలు డిమాండ్లతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీధర్, పీటర్, శ్రీనివాసన్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణపెన్నాలోకి చేపపిల్లలు



చేప పిల్లలను నీటిలో వదులుతున్న కలెక్టర్

హోసూరు: హోసూరు సమీపంలోని దక్షిణపెన్నానది, అంచెట్టి సమీపంలోని బిలిగుండ్లు కావేరినదిలో మంగళవారం 1.60 లక్షల చేప పిల్లలను కలెక్టర్ జయచంద్రభానురెడ్డి వదిలారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఉపడైరెక్టర్ వేల్‌మురుగన్, అధికారులు రత్నం, సూళగిరి తహసీల్దార్ అనిత, బీడీవోలు శివకుమార్, గోపాలక్రిష్ణన్, శివశంకర్, బీర్జేపల్లి పంచాయతీ అధ్యక్షులు శ్రీప్రియ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మాచర్ల అల్లర్ల కేసులో టీడీపీ నేతలకు హైకోర్టు ముందస్తు బెయిల్

జూలకంటి బ్రహ్మారెడ్డి సహా 23 మందికి బెయిల్

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా మాచర్లలో ఇటీవల టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన అల్లర్లకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్న పలువురికి హైకోర్టు మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. టీడీపీ మాచర్ల ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డికి, మరో 22 మందికి ముందస్తు బెయిల్ ఇచ్చింది. ముందస్తు బెయిల్ కోసం మొత్తం 24 మంది హైకోర్టును ఆశ్రయించారు. వీరిలో.. కేసులో 7వ నిందితుడు కళ్లం రమణారెడ్డి మినహా మిగిలిన 23 మందికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. బ్రహ్మారెడ్డి వర్గీయులు గత నెల 17న మాచర్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తీవ్ర దాడులు చేసి అల్లర్లు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసులు పలువురు టీడీపీ నేతలపై కేసు నమోదు చేశారు.

తనపై కేసుల వివరాలు కోరుతూ హైకోర్టులో ఎంపీ రఘురామ పిటిషన్

విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ రఘునందన్‌రావు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్‌ల్లో తనపై నమోదైన కేసుల వివరాలతో పాటు వాటి ఎఫ్ఐఆర్ కాపీలు, కేసులు నమోదు చేయని ఫిర్యాదుల వివరాలను తనకు అందజేసేలా డీజీపీని ఆదేశించాలని కోరుతూ ఎంపీ రఘురామకృష్ణరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు ముందున్న కేసుల జాబితాలో విచారణకు వచ్చింది. కోర్టు సమయం ముగియడంతో ఈ వ్యాజ్యం విచారణకు నోచుకోలేదు. న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు స్పందిస్తూ, ఈ వ్యాజ్యం విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. మరో న్యాయమూర్తి ముందు ఈ వ్యాజ్యం విచారణకు వచ్చేలా చర్యలు చేపట్టాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ సమయంలో రఘురామకృష్ణరాజు తరపు న్యాయవాది పీవీజీ ఉమేశ్ స్పందిస్తూ..సంక్రాంతికి పిటిషనర్ తన నియోజకవర్గానికి రావాలని భావిస్తున్నారని, ఏదైనా కేసులో అరెస్ట్ చేస్తారన్న అభద్రత భావం ఉందన్నారు. అందువల్ల అత్యవసర విచారణ జరపాలన్నారు. వేరే న్యాయమూర్తి ముందు అత్యవసరంగా విచారణకు వచ్చేలా ఆదేశాలివ్వాలన్నారు. ఇందుకు న్యాయమూర్తి స్పందిస్తూ అలాంటి ఆదేశాలు ఇవ్వలేనన్నారు.

డూప్లి కేటుగాళ్లు

దొంగ ఆధార్ సృష్టించి ఆస్తుల రిజిస్ట్రేషన్లు

- రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లభ్యం కాని డాక్యుమెంట్లే టార్గెట్
- కొందరు లేఖరుల సాయంతో దందా
- విజయవాడలో నకిలీ డాక్యుమెంట్లు సృష్టిస్తున్న రెండు బృందాల గుర్తింపు
- పోలీసుల అదుపులో ఓ నిందితుడు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడలోని పాయకాపురంలో గీత అనే మహిళ పేరిట ఆస్తికి సంబంధించిన ఓ డాక్యుమెంట్ ఉంది. దీనిని గుర్తించిన కేటుగాళ్లు అదే ప్రాంతంలో నివశిస్తున్న విజయలక్ష్మి పేరును ఆధార్ కార్డులో గీతగా మార్పించి.. రూ.12 లక్షల విలువైన ఇంటిస్థలాన్ని ఇతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించారు. భవానీపురంలో మేర కోటేశ్వరరావు అనే వ్యక్తి రిజిస్ట్రార్ కార్యాలయంలో లభ్యం కాని డాక్యుమెంట్లను గుర్తించి.. వాటిని వేరే వారి పేరుతో ఫేక్ డాక్యుమెంట్లు క్రియేట్ చేశాడు. సదరు ఆస్తులను తన కొడుకు శ్రీనివాసులు పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాడు. కొందరు లేఖరుల సాయంతో దర్జాగా సాగిపోతున్న దందాలు విశాఖపట్నంలో లాగిన తీగతో విజయవాడలో వెలుగులోకి వచ్చాయి.

ఇలా బయటపడింది..

విశాఖపట్నానికి చెందిన ఎస్.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి తన స్థలానికి సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) కోసం దరఖాస్తు చేయగా.. తన స్థలాన్ని ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి రాజు చైతన్య అనే వ్యక్తికి విజయవాడలోని గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనఖా రిజిస్ట్రేషన్ చేసినట్టు వచ్చింది. దీంతో వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా మొత్తం డొంక కదిలింది. ఈ ఫిర్యాదుతో మేల్కొన్న సబ్ రిజిస్ట్రార్లు తెలివిగా వ్యవహరించి నిందితుడిని పిలిపించి, రిజిస్ట్రేషన్ రద్దు చేయించారు. తిరిగి అతనిపైనే గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని నకిలీ డాక్యుమెంట్లను ఎలా తయారు చేస్తున్నారు, దీనికి సహకరిస్తున్న వ్యక్తులెవరనేది కూపీ లాగుతున్నారు. కాగా, ప్రస్తుతం గుణదలకు చెందిన రాజుచైతన్య పోలీసుల అదుపులో ఉన్నాడు. అతనికి ముగ్గురు వ్యక్తులతో కూడిన బృందం సహకరిస్తున్నట్టు పోలీసుల దర్యాప్తులో ప్రాథమికంగా గుర్తించారు.

దొంగ రిజిస్ట్రేషన్లు ఇలా..

ప్రధానంగా ఆధార్ కార్డులో పేరు మార్చి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఆధార్ కార్డుల మార్పిడి ఇందిరాగాంధీ స్టేడియం సమీపంలో సాగుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఒరిజినల్ రికార్డుల మాదిరి డాక్యుమెంట్లు సృష్టించడంలో నిష్ణాతులు ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా హత్యానంతర పరిణామాలతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డులు దగ్ధమయ్యాయి. దీంతో కొందరు కేటుగాళ్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తరచూ కొన్ని ఆస్తులకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ కోసం దరఖాస్తు చేస్తున్నారు. ఆ డాక్యుమెంట్ లేకపోతే సంబంధిత సిబ్బంది 'నాట్ ఫౌండ్' అని సమాచారమిస్తారు. దీంతో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి, రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సదరు ఆస్తిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాల్లో ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన మేర కోటేశ్వరావు అనే వ్యక్తితో కూడిన బృందం ఆరితేరినట్టు గుర్తించారు. కోటేశ్వరరావు విజయవాడలోని దేవీపేటలో నివాసం ఉంటున్నట్టు గుర్తించారు. ఈ తరహాలో ఇప్పటికే నున్న, గాంధీనగర్, మైలవరం, గుణదల, పటమట, మైలవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో నకిలీ డాక్యుమెంట్లతో పలు రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సమాచారం. నున్న ప్రాంతంలో రెవెన్యూ శాఖలో పనిచేసే ఓ ఉద్యోగి ఫేక్ డాక్యుమెంట్ల తయారీకి సహకరిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వీరికి ప్రధానంగా కొంతమంది రెవెన్యూ సిబ్బంది, దస్తావేజు లేఖరులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, కొందరు సబ్‌రిజిస్ట్రార్‌లు సైతం సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రామోజీ.. తప్పుడు రాతలు కట్టిపెట్టు

- చంద్రబాబు డెయిరీకన్నా రైతులకు ఎక్కువే చెల్లిస్తున్నాం
- మాది న్యాయబద్ధమైన వ్యాపారం.. హెరిటేజ్‌లా దోచుకోలేదు
- 'ఈనాడు' రాతలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం



చిత్తూరు అర్బన్: 'ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి రావడానికి రామోజీరావుది కీలకపాత్ర. బాబుపై ఉన్న ప్రేమతో ఈనాడును అడ్డుపెట్టుకుని మాపై విషం చిమ్మడమే లక్ష్యంగా ప్రజలకు అవాస్తవాలను చేరవేస్తున్నారు. రాజకీయ విమర్శలు ఉండొచ్చు కానీ వ్యక్తిగత విషయాల్లో అబద్ధపు రాతలు ఉండకూడదు. రామోజీ.. నీకు ఒక్కటే చెబుతున్నా. 10 లీటర్ల పాలు తీసుకుని పుంగనూరులోని సదుం, సోమలలో పర్యటించు. 5 లీటర్లు శివశక్తి డెయిరీకి, మరో 5 లీటర్లు హెరిటేజ్‌కు ఇవ్వు. ఎవరు ఎంత ధర చెల్లిస్తారో ప్రత్యక్షంగా చూడు' అంటూ రాష్ట్ర గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హితవు పలికారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనాడులో అబద్ధపు రాతలు రాస్తూ, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు రామోజీరావు చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 1994 నుంచి శివశక్తి డెయిరీ నడుస్తోందని, ఆనాటి నుంచి రైతులు తమను నమ్మి తమ డెయిరీకి పాలు విక్రయిస్తున్నారని మంత్రి చెప్పారు. తన నియోజకవర్గంలోని సదుం, సోమల మండలాల్లో పాడి రైతులకు మిగిలిన ప్రాంతాల కంటే రైతులకు తక్కువ ధరలు చెల్లిస్తున్నట్టు ఈనాడులో రాయడం దుర్మార్గమన్నారు. రామోజీరావు తప్పుడు రాతల్ని కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

'హెరిటేజ్ కంటే తక్కువ ధర చెల్లిస్తే నిరూపించు'

సదుం, సోమల మండలాల్లో చంద్రబాబు సంస్థ హెరిటేజ్ రైతులకు చెల్లించేది తమ సంస్థకంటే తక్కువ ధర అనే విషయం రామోజీరావు గ్రహించాలని మంత్రి పెద్దిరెడ్డి హితవు పలికారు. శివశక్తి డెయిరీ మొత్తం 347 సెంటర్లలో పాలను సేకరిస్తోందని, ఏ ఒక్క ప్రాంతంలో అయినా రూ.29 కంటే తక్కువ ధర చెల్లిస్తే నిరూపించాలని సవాల్ చేశారు. పాలలో వెన్న శాతం ఆధారంగా లీటర్‌కు రూ.29 నుంచి రూ.33 పాడి రైతులకు చెల్లిస్తున్నామని చెప్పారు. దీంతోపాటు అదనంగా ఇన్సెంటివ్ కూడా ఇస్తున్నామన్నారు. హెరిటేజ్ మాత్రం లీటరుకు రూ.24 నుంచి రూ.29 మాత్రమే చెల్లిస్తోందని స్పష్టం చేశారు. నిస్సిగ్గుగా, ప్రజలు నవ్వుకుంటారేమో అనే స్పృహ లేకుండా అబద్ధపు రాతలు రాయడం ఈనాడుకు నిత్యకృత్యమైపోయిందన్నారు. ఈ అంశంపై న్యాయపరంగా ముందుకు వెళతామని, తమ సంస్థ పేరు మసకబారేలా వార్తల్ని ప్రచురించినందుకు పరువు నష్టం దావా కూడా వేయాలని నిర్ణయించామని మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు.

పథకాన్ని కచ్చితంగా అమలు చేస్తేనే లబ్ధిదారులకు ప్రయోజనం

- పథకం పేరు మార్చినంత మాత్రాన లబ్ధిదారులకు ఒరిగేదేమీ ఉండదు
- హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లేఖలపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పండి
- గృహనిర్మాణ, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శులకు హైకోర్టు ఆదేశం
- విచారణ ఈ నెల 18కి వాయిదా



సాక్షి, అమరావతి: ఒక పథకానికి ఉన్న ప్రముఖ వ్యక్తి పేరు మార్చి మరో ప్రముఖ వ్యక్తి పేరు పెట్టినంత మాత్రాన పేద లబ్ధిదారులకు ఒరిగేదీ లేదని హైకోర్టు పేర్కొంది. ఈ పథకాన్ని కచ్చితంగా అమలు చేసి, ఇవ్వాల్సిన సొమ్మును కచ్చితంగా విడుదల చేసినప్పుడే ఆ పథకం ద్వారా లబ్ధిదారులు ప్రయోజనం పొందుతారని తెలిపింది. గృహనిర్మాణ పథకం కింద రావాల్సిన నిధులను విడుదల చేయాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాసిన లేఖల ఆధారంగా ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ కార్యాచరణ నివేదికను తమ ముందుంచాలని గృహనిర్మాణశాఖ, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వైఎస్సార్ గ్రామీణ హౌసింగ్ పథకం కింద 2019–20 సంవత్సరానికి లబ్ధిదారులమైన తమకు ఇవ్వాల్సిన డబ్బును ప్రభుత్వం ఇవ్వడంలేదంటూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ విచారించారు. పిటిషనర్ల ఖాతాల్లో ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం రూ.1 మాత్రమే జమచేసిందని పిటిషనర్ల న్యాయవాదులు వివరించారు. వడ్డీలకు అప్పులు తెచ్చుకుని ఇళ్లు నిర్మించుకున్నారని, ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన డబ్బు చెల్లించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్థికశాఖ తరపు ప్రభుత్వ న్యాయవాది అశోక్‌రామ్ వాదనలు వినిపిస్తూ.. హౌసింగ్ పథకానికి వైఎస్సార్ హౌసింగ్ పథకంగా పేరు మార్చామని చెప్పారు. ఈ పథకం కింద వివిధ వర్గాల వారికి 2018లో 4 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పిటిషనర్లకు చెల్లింపుల విషయంలో తమ శాఖ వద్ద ప్రతిపాదనలేమీ పెండింగ్‌లో లేవని చెప్పారు. బిల్లులు సమర్పిస్తే ప్రాధాన్యత క్రమంలో చెల్లిస్తామన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ తరపు న్యాయవాది స్పందిస్తూ.. రూ.358 కోట్ల విడుదల కోసం ఆర్థికశాఖకు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లేఖలు రాశారని తెలిపారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్.. హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లేఖల ఆధారంగా తీసుకున్న చర్యలు వివరిస్తూ ఓ నివేదికను తమ ముందుంచాలని గృహనిర్మాణశాఖ, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు.

అప్పుడెక్కడ దాక్కున్నావ్ పవన్?

- కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని మోసం చేసిన చంద్రబాబు
- దీన్ని నిరసిస్తూ ఉద్యమించిన ముద్రగడ
- చిత్రహింసలకు గురి చేసిన టీడీపీ ప్రభుత్వం
- కాపుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినప్పుడు నోరు విప్పలేదెందుకు?
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

సాక్షి, అమరావతి/సత్తెనపల్లి(ముప్పాళ్ళ): కాపులకు రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఉద్యమించిన ముద్రగడను నాటి సీఎం చంద్రబాబు చిత్రహింసలకు గురిచేసినప్పుడు ఎక్కడ దాక్కున్నావ్ అని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నిలదీశారు. పోరాటంలో పాల్గొన్న కాపు యువకులను టీడీపీ ప్రభుత్వం కేసులు పెట్టి వేధించినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కేంద్రం కల్పించిన 10 శాతం రిజర్వేషన్‌లో కాపులకు 5 శాతం ఇవ్వాలని నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న హరిరామజోగయ్యతో పవన్ కళ్యాణ్ సంప్రదింపులు జరిపి, దీక్ష విరమింపజేశారని గుర్తు చేశారు. కాపులకు రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చి, మోసం చేసిన టీడీపీ సర్కార్ హయాంలో నోరుతెరవని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇప్పుడెందుకు స్పందిస్తున్నారో.. ఇదేం తర్కమో ఆలోచించాలని కాపులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేయకుండా చంద్రబాబు కాపులను అవహేళన చేశారన్నారు. చంద్రబాబు తీరును నిరసిస్తూ.. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ అప్పట్లో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో కాపులు భారీ ఎత్తున ఉద్యమించారని గుర్తు చేశారు. ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసేందుకు ముద్రగడను, ఆయన కుటుంబ సభ్యులను చంద్రబాబు పోలీసుల ద్వారా చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటంలో పాల్గొన్న కాపు యువకులపై కేసులు పెట్టి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. కాపులకు చంద్రబాబు ద్రోహం చేస్తే.. ముద్రగడను చిత్రహింసలకు గురిచేస్తే అప్పట్లో పవన్ కళ్యాణ్ ఎందుకు నోరువిప్పలేదని నిలదీశారు. అప్పుడు ఎక్కడో దాక్కున్న పవన్ కళ్యాణ్ ఇప్పుడెందుకు స్పందించి హరిరామజోగయ్యతో దీక్షను విరమింపజేశారో అర్థం చేసుకోవాలని కాపులకు విజ్ఞప్తి చేశారు.

కార్గోలో కొత్త పుంతలు!

- ప్రైవేటు లాజిస్టిక్స్‌తోనూ ఒప్పందాలు
- సరకు రవాణాలో ఆర్టీసీ జోన్–1 జోరు
- గత ఏడాది కంటే రూ.4.15 కోట్లు పెరిగిన ఆదాయం
- అన్ని ఆదాయ మార్గాలపైనా ఆర్టీసీ అధికారుల దృష్టి
- ఏటీబీ ఏజెంట్ల వ్యవస్థ మరింత విస్తృతం



విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ రవాణా కేంద్రం

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో ఆర్టీసీ ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇప్పటికే తక్కువ సమయంలో సరకులను, పార్సిళ్లను గమ్యానికి చేరుస్తూ వినియోగదారుల ఆదరణ చూరగొంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను మరింతగా విస్తృతం చేసే దిశగా ఆలోచన చేస్తోంది. సరకు రవాణాలో ఆర్టీసీ జోన్–1 (పూర్వ విజయనగరం జోన్) జోరు మీద ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న ఈ జోన్‌లో 47 సరకు రవాణా వాహనాలున్నాయి. వీటిలో 17 కంటెయినర్లు, 30 డీజీటీలు (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు) ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ ఒక్క రోజు కూడా ఖాళీ లేకుండా తిరుగుతున్నాయి. ఇలా రోజు రోజుకు పెరుగుతున్న కార్గో రవాణాతో వీటి సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు కొత్తగా ప్రైవేటు లాజిస్టిక్స్ (పార్సిల్) సంస్థలతోనూ ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా వీరు అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయా సంస్థలకు అధీకృత ఏజెన్సీలను ఇస్తారు. ఆపై ఆ సంస్థలు బుక్ చేసిన సరకులను గాని, లేదా ఆ సంస్థలు రవాణా చేయగా మిగిలిన సరకులను గాని ఆర్టీసీ ద్వారా కూడా రవాణా చేసేలా చర్చిస్తున్నారు. బుకింగ్ చేసే వారి నుంచి ప్రైవేటు పార్సిల్ సంస్థలు వసూలు చేసే చార్జీతో ఆర్టీసీకి సంబంధం ఉండదు. ఆర్టీసీ నిర్దేశిత రవాణా చార్జీ చెల్లిస్తే చాలు గమ్యానికి చేరవేస్తారు. ప్రైవేటు పార్సిల్ సర్వీసులు సరకును గమ్యానికి చేర్చడానికి 3–4 రోజుల సమయం పడుతుంటే ఆర్టీసీ గరిష్ఠంగా 24–48 గంటల్లోపే ఆయా ప్రాంతాలకు చేరుస్తుంది. ఇలా ప్రైవేటు పార్సిల్ సంస్థల కంటే వేగంగా గమ్యాన్ని చేరుస్తుండడం తమకు కలిసొచ్చే అంశంగా ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

కొరియర్ సేవల్లో దూకుడు

ఆర్టీసీ కొరియర్ సేవలకు మరింత ఆదరణ లభిస్తోంది. పార్సిల్ కౌంటర్ నుంచి 10 కి.మీల పరిధిలో 50 కిలోల బరువు వరకు సరకు/కొరియర్ పార్సిళ్లను వినియోగదారుడు కోరుకున్న చిరునామాకు డోర్ డెలివరీ చేస్తున్నారు. వీటిలో వివిధ రకాల పార్సిళ్లతో పాటు బ్లడ్ శాంపిల్స్ డెంటల్ కిట్స్ వంటివి కూడా ఉంటున్నాయి. జోన్–1 నుంచి సిమెంట్, వైట్ సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమపిండి, దుస్తులు, ఫ్లిప్‌కార్ట్ సరకులు, బిస్కెట్లు, విత్తనాలు, పుస్తకాలు, మందులు, బియ్యం, నూకలు, పాత టైర్లు వంటివి బుక్ అవుతున్నాయి. ఇంకా ఇల్లు మారాలనుకునే వారి సామగ్రి తరలింపును కూడా ఆర్టీసీ చేపట్టింది. ఇలా సరకు రవాణా ద్వారా 35 శాతం, పార్శిళ్ల ద్వారా 65 శాతం ఆదాయాన్ని ఆర్జిస్తోంది.


ఏటీబీ ఏజెంట్ల సంఖ్య పెంపు

మరోవైపు ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణతో ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ ఏజెంట్ల (ఏటీబీలు) వ్యవస్థను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఈ జోన్‌లో 60 మందికి పైగా ఏటీబీ ఏజెంట్లు ఉండగా ఆ సంఖ్యను 200 వరకు పెంచనున్నారు. ఈ ఏజెంట్లకు బుకింగ్ చార్జీలో 15 శాతం కమీషన్‌గా చెల్లిస్తారు. ఏటీబీ కోసం గ్రామీణ ప్రాంతంలో రూ.1000, అర్బన్‌లో రూ.5 వేల చొప్పున తిరిగి చెల్లించే పద్ధతిలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఏటీబీ ఏజెన్సీలతో పాటు ఇంటి సామగ్రి తరలింపు కోసం 7331147260/7331147261/9346749365 నంబర్లకు సంప్రదించాలని ఆర్టీసీ జోనల్ అధికారులు కోరుతున్నారు.

రూ.4.15 కోట్ల పెరుగుదల

కార్గో రవాణాలో ఆర్టీసీ జోన్–1 గత ఏడాదికంటే మెరుగైన ఆదాయాన్ని సాధించింది. 2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్‌కు ఈ జోన్ రూ.11.37 కోట్లు ఆర్జించగా, 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.15.52 కోట్లు సంపాదించింది. అంటే గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.15 కోట్ల ఆదాయం పెరిగిందన్న మాట! ఇలా 36 శాతానికి పైగా వృద్ధి కనిపించింది.

కార్గో వ్యవస్థ మరింత బలోపేతం



ఆర్టీసీ కార్గో రవాణాకు మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. ఏటీబీ ఏజెన్సీలను విస్తృతం చేస్తాం. డిమాండ్‌కు అనుగుణంగా డీజీటీలు/కంటైనర్ వాహనాలను పెంచుతాం. డీజిల్ ధరలు గణనీయంగా పెరిగినా 2018లో నిర్దేశించిన రవాణా చార్జీలే వసూలు చేస్తున్నాం. ఈ జోన్‌లో గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.5 కోట్ల కార్గో ఆదాయం పెరిగింది. ప్రైవేటు కార్గో సంస్థలకంటే వేగంగా, సురక్షితంగా సరకులు, పార్శిళ్లను డెలివరీ ఇస్తున్నాం. త్వరలో ప్రైవేటు కార్గో సంస్థలకు ఆథరైజ్డ్ ఏజెన్సీలు ఇచ్చి వారి సరకును కూడా ఆర్టీసీ ద్వారా రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–రవికుమార్,
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్–1



ఆర్టీసీ సరకు రవాణా కంటెయినర్

రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి

హెల్త్ ఐడీలు



ఇంటింటి సర్వే ద్వారా వారందరికీ ఆరోగ్య పరీక్షలు పూర్తి

- పౌరుల హెల్త్ ఐడీలు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కు అనుసంధానం
- రాష్ట్రంలో 4.66 కోట్ల మంది జనాభాకు ఆరోగ్య పరీక్షలు లక్ష్యం
- సాంక్రమికేతర, జీవనశైలి జబ్బుల నివారణకే ఆరోగ్య పరీక్షలు
- రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, రక్తహీనత వ్యాధులను గుర్తించడానికి ప్రాథమిక పరీక్షలు
- త్వరగా మిగతా పౌరుల ఆరోగ్య పరీక్షలు పూర్తిచేయండి
- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటింటి సర్వే ద్వారా ఇప్పటివరకు 3.38 కోట్ల మందికి ఆరోగ్య పరీక్షలు పూర్తిచేయడమే కాకుండా వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ ఐడీలు జారీచేసింది. సాంక్రమికేతర, జీవనశైలి జబ్బుల నివారణలో భాగంగా నాన్ కమ్యూనికబుల్, కమ్యూనికబుల్ వ్యాధులను గుర్తించడానికి రాష్ట్రంలోని 4.66 కోట్ల మంది జనాభాకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా డిసెంబర్ నెలాఖరు నాటికి 3.38 కోట్ల మందికి వారి ఇంటి వద్దే ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఆరోగ్య పరీక్షలను పూర్తిచేయడంతో పాటు వారి ఆరోగ్య వివరాలతో కూడిన హెల్త్ ఐడీలను జారీచేశారు. వారందరి ఆరోగ్య వివరాల సమాచారాన్ని డిజిటలైజేషన్ చేశారు. అలాగే, ఈ హెల్త్ ఐడీలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కు అనుసంధానించారు. గత గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఇంటింటి ఆరోగ్య పరీక్షల పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే 72 శాతానికి పైగా పౌరులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా హెల్త్ ఐడీ కార్డులు కూడా జారీచేశారని, మిగతా పౌరులకు కూడా పరీక్షలను త్వరగా పూర్తిచేసి హెల్త్ ఐడీల జారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆయన సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, రక్తహీనతతో పాటు ఇతర వ్యాధులను గుర్తించడానికి ప్రాథమిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. వ్యాధి అనుమానితులకు వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నారు. నిర్ధారణ అయితే ప్రభుత్వ, ఆరోగ్యశ్రీ సదుపాయం ఉన్న ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చిన్న పిల్లలకు హిమోగ్లోబిన్‌ను పరీక్షిస్తున్నారు.

జిల్లాల వారీగా ఆరోగ్య పరీక్షలు పూర్తి, హెల్త్ ఐడీలు జారీ అయిన వారి సంఖ్య..

జిల్లా	సంఖ్య
ఏలూరు	16,10,327
అనకాపల్లి	11,69,604
ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	16,90,232
పార్వతీపురం మన్యం	7,01,127
పల్నాడు	14,36,431
వైఎస్సార్	14,66,811
అంబేడ్కర్ కోనసీమ	12,73,480
ప్రకాశం	15,83,562
పశ్చిమగోదావరి	12,73,620
బాపట్ల	10,68,494
తూర్పుగోదావరి	12,70,420
కాకినాడ	14,91,179
తిరుపతి	14,28,692
గుంటూరు	14,90,449
శ్రీకాకుళం	15,30,608
అన్నమయ్య	11,46,130
కర్నూలు	16,98,791
విజయనగరం	12,68,722
చిత్తూరు	12,62,899
నంద్యాల	12,32,765
కృష్ణా	12,05,678
ఎన్టీఆర్	13,86,112
శ్రీ సత్యసాయి	12,29,590
అనంతపురం	14,97,824
విశాఖపట్నం	10,91,324
అల్లూరి సీతారామరాజు	3,91,737

కాపులకు రిజర్వేషన్లపై న్యాయస్థానానికి వెళతాం

పాలకొల్లు సెంట్రల్: త్వరలో కాపు రిజర్వేషన్లపై కోర్టు తలుపులు తట్టడానికి అన్ని పత్రాలూ సిద్ధం చేశామని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కోర్టులో కూడా తమకు న్యాయం జరగకపోతే రాబోయే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను నెగ్గించుకుని రిజర్వేషన్లు దక్కించుకుంటామని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గానికి జనాభా ప్రాతిపదికన, శాసనసభలో పాసైన బిల్లులో ఉదహరించిన 5 శాతానికి రిజర్వేషన్ కలిపించాలని కోరుతూ తాను నిరాహారదీక్షకు పూనుకున్నానని, పవన్ కళ్యాణ్ సూచనల మేరకు దీక్షను విరమించానని పేర్కొన్నారు. తనకు మద్దతుగా నిరసనలు తెలిపిన కాపు సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నిరసనల్లో కొన్నిచోట్ల అరెస్టులు చేశారని, ఎవరిపైనైనా కేసులు పెట్టినట్టు ఉంటే న్యాయపరంగా ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. కాగా, టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మంగళవారం జోగయ్యను పరామర్శించారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 4-1-2023

• మానసిక రుగ్మతలపై స్టడీ

పిల్లల కోసం తల్లిదండ్రుల కొత్త తీర్మానాలు



ఇంట్లో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే రకరకాల ఉపచారాలు చేయడానికి సిద్ధపడతారు. కానీ, మానసికంగా బాగోలేదంటే మాత్రం దానికంత ప్రాముఖ్యం ఇస్తున్నట్టు ఎక్కడా కనిపించదు. ముఖ్యంగా పిల్లల విషయంలో... అంటోంది యునిసెఫ్.

పిల్లల మానసిక స్థితి ఏయే దేశాల్లో ఏవిధంగా ఉందో తెలుసుకోవడానికి గత ఏడాది యునిసెఫ్ ఓ ప్రయత్నం చేసింది. అందులో భాగంగా 21 దేశాలలో 20,000 మంది పిల్లలు– పెద్దలతో ఒక సర్వే నిర్వహించింది. మిగతా దేశాలతో పోల్చితే భారతదేశంలోని పిల్లలు మానసిక ఆరోగ్య చికిత్సను పొందేందుకు ఇష్టపడరని తేలింది. విదేశాలలో మానసిక ఆరోగ్య సమస్యల పట్ల సగటున 83 శాతం మంది స్పందిస్తే, 15 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత 41 శాతం మాత్రమే మానసిక చికిత్సకు మద్దతునిచ్చారని తేలింది.

ఇతరులను కలవాలనుకోరు..

మిగతా దేశాలతో పోల్చితే భారతీయ పిల్లలలో మానసిక రుగ్మతలను గుర్తించడం పెద్ద వాళ్లకు కష్టంగా ఉంటుంది. అమ్మాయి లేదా అబ్బాయి పెరుగుతున్నప్పుడు అనేక శారీరక, మానసిక భావోద్వేగ మార్పులకు లోనవుతారు. అందుకు తగిన చికిత్స లేదా సహాయం తీసుకోవడానికి ఇష్టపడరు. 2019లో ఇండియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీలో ప్రచురించిన ఒక అధ్యయనం, కరోనా మహమ్మారి రాకముందే 50 మిలియన్ల మంది భారతీయ పిల్లలు మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని నివేదించింది. వీరిలో 80 నుంచి 90 శాతం మంది చికిత్స తీసుకోలేదు. ఈ అసమానతలు ఉన్నప్పటికీ, ఇండియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీ 2017 ప్రకారం, భారతదేశం తన హెల్త్ బడ్జెట్‌లో ఏటా 0.05 శాతం మాత్రమే మానసిక ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తోంది.

సరైన తీర్మానాలివే!

ఎడిహెచ్‌డి, ఆందోళన, ప్రవర్తనా సమస్యలు, నిరాశ అనేవి పిల్లలు– యుక్తవయస్కులలో అత్యంత ప్రబలంగా ఉన్న న్యూరో బిహేవియరల్ డిజార్డర్‌గా చెప్పవచ్చు.

- మానసిక నిపుణులు, మీరు.. పిల్లలతో కలిసి కూర్చుని, వారి నూతన సంవత్సర తీర్మానాలుగా నిర్దేశించాలనుకుంటున్న లక్ష్యాలను చర్చించాలి.
- ప్రవర్తనలో ఆకస్మిక మార్పులను గమనించాలి. ఇలాంటప్పుడు పిల్లలకి మానసిక బలం అవసరమని సూచించే అనేక సంకేతాలు కనిపిస్తాయి. ఇందులో స్నేహితులు, కుటుంబ సభ్యుల నుండి ఒంటరిగా ఉండటం, నిత్యకృత్యాలను పాటించకపోవడం, పిల్లలు సాధారణంగా ఆనందించే కార్యకలాపాల నుండి వైదొలగడం వంటి ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు ఉంటాయి.
- పిల్లలు చెప్పేది ఓపికగా వినాలి. ఇబ్బందులు ఎదురైతే మద్దతుగా ఉంటానని భరోసా ఇవ్వాలి.
- పిల్లల పట్ల అధిక పర్యవేక్షణ, సానుభూతి చూపించడం తగ్గించాలి. అలాగే వారి మీద తక్కువ అంచనాలు ఉండాలి.
- రోజువారీ షెడ్యూల్‌లు, పనితీరు కారణంగా పిల్లలు తరచు అధిక స్థాయి ఒత్తిడి, ఆందోళనకు గురవుతారు. అందుకని, రోజువారీ దినచర్యలను అనుసరించడంలో పిల్లలకు సహాయపడాలి. చురుకైన జీవనశైలిని గడపడానికి ప్రోత్సహించాలి.
- పెద్దలు భావోద్వేగాలను వ్యక్తం చేసే విధానాన్ని పిల్లలు నిరంతరం గమనిస్తూనే ఉంటారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి తరచుగా దీర్ఘ శ్వాస తీసుకోవడం, రంగులు వేయడం, పెయింటింగ్ చేయడం, నడవడం లేదా సంగీతం వినడం వంటి కార్యకలాపాలలో పాల్గొంటాం. మన పిల్లలు ఒత్తిడిని ఎదుర్కోవడంలో, వారి జీవన నైపుణ్యాలను బలోపేతం చేయడంలో సహాయపడటానికి చిన్నప్పటినుంచే ఇలాంటి వ్యూహాలను పరిచయం చేయవచ్చు.
- ఆటలు, పాటలు, నృత్యం వంటి బృంద కార్యకలాపాలలో పాల్గొనడం ఒత్తిడిని తగ్గిస్తుంది. భావోద్వేగ, సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది. విశ్వాసాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. దీనివల్ల అవకాశాలూ పెంపొందుతాయి.
- సానుకూల అభిప్రాయం, ప్రోత్సాహం సరైన ప్రవర్తనను పునరావృతం చేసేలా వారిని ప్రేరేపించడమే లక్ష్యంగా ఎంచుకోవాలి. మీరు సపోర్ట్‌గా ఉన్నారని చేతల్లో చూపడం, సురక్షితమైన వాతావరణాన్ని అందించడం కూడా అంతే ముఖ్యం.

బ్యూటీ టిప్

ట్యాన్ తొలగాలంటే...

- గిన్నెలో టేబుల్ స్పూన్ చొప్పున తేనె, కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఐదు నుంచి పది నిమిషాల తర్వాత గోరు వెచ్చని నీటితో కడిగేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- తేనెలో ఉండే హైడ్రాక్సిల్ యాసిడ్, ఇతర ఎంజైమ్స్ చర్మం మీద ఉన్న మొటిమల కారణంగా ఏర్పడిన మచ్చలను తగ్గించి స్కిన్ టోన్‌ను మెరుగుపరచడంతో పాటు చర్మ కణాలను ఆరోగ్యంగా మారుస్తాయి. కొబ్బరి నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ముదిమి ఛాయలు రాకుండా, చర్మం ముడతలు పడకుండా కాపాడుతాయి. దీనివల్ల స్కిన్ టెక్స్చర్ సైతం మెరుగుపడుతుంది.

నేడు ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

అంధురాలైన రేషమ్ తల్వార్ తన భవిష్యత్తు బాగుండాలంటే బ్రెయిలీ నేర్చుకోక తప్పదని తొమ్మిదేళ్ల వయసులోనే గ్రహించింది.
బ్రెయిలీలోనే ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ ఇగ్నోలో పి.జి చేసింది.
ఆ చదువు ఆమెకు ఆత్మవిశ్వాసం ఇచ్చింది.
నేడు సక్సెస్‌ఫుల్ రేడియో జాకీగా ఆమెకు ఉపాధిని ఇస్తోంది.
చెన్నైకి చెందిన అంధురాలు బెనో జెఫైన్ బ్రెయిలీలో దొరికే మెటిరియల్‌లో ఐ.ఏ.ఎస్‌కు ప్రిపేర్ అయ్యి ఐ.ఎఫ్.ఎస్ సాధించిన తొలి అంధ మహిళగా రికార్డు స్థాపించింది.
స్త్రీలు అంధులైతే కుటుంబాలు వారిని ఇంట కూచోబెడతాయి.
కాని బ్రెయిలీ అనే అలీబాబా దీపాన్ని రుద్ది వారు అద్భుత విజయాలు సాధిస్తూనే ఉన్నారు.
చీకటి తమ వెలుతురుకు అడ్డు కాదంటున్నారు.



• రేషమ్ తల్వార్

మునివేళ్లపై భవిష్యత్తు



మన దేశంలో కోటీ యాభై లక్షల మంది పాక్షిక/పూర్తి అంధులు ఉన్నారు. వారిలో 2 లక్షల మంది చిన్నారులు. భారత్ వంటి వెనుకబడిన దేశాలలో అంధుల శాతం ఎక్కువ. దీనికి కారణం గర్భధారణ సమయంలో సరైన పరీక్షలు చేయించకపోవడం, పుట్టిన వెంటనే కంటి సమస్యలను గుర్తించకపోవడం, జన్మించాక వచ్చే ఐ ఇన్ఫెక్షన్స్‌కు సరైన చికిత్స చేయించకపోవడం, పిల్లల్లో వచ్చే హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి వంటి సమస్యలకు కూడా అద్దాల వంటి సహాయక పరికరాలను ఉపయోగించకపోవడం. అంధులుగా జన్మించడం అంటే వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సామాజికంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొనడం. అబ్బాయిలు అంధులుగా పుడితే కుటుంబం ఏదో ఒక మేరకు వారికి తర్ఫీదు ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. కాని అమ్మాయి అంధురాలైతే చాలామటుకు నిరుత్సాహమే ఎదురవుతుంది.

అంధుల అక్షరాస్యత

కళ్లున్న వాళ్లకు అక్షరాస్యత ఉన్నట్టే అంధులకు కూడా అక్షరాస్యత ఉంటుంది. మన దేశంలో అంధుల అక్షరాస్యత కేవలం ఒక శాతం. బ్రిటన్‌లో ఇది 4 శాతం ఉంది. అంధుల అక్షరాస్యత అంటే బ్రెయిలీని చదవడం రాయడం రావడమే. లూయిస్ బ్రెయిలీ అనే ఫ్రెంచ్ అంధ విద్యావేత్త రూపకల్పన చేసిన బ్రెయిలీ కోడ్ పుట్టి 200 ఏళ్లు అయినా 70 ఏళ్ల క్రితమే భారతీయ భాషల కోసం ఉమ్మడి 'భారతీ బ్రెయిలీ'ని మనం తయారు చేసుకున్నా నేటికీ బ్రెయిలీ అంధ విద్యార్థులకు అందని ఫలంగానే ఉంది. సంప్రదాయ బ్లైండ్ స్కూళ్లు, కాలేజీలలో బ్రెయిలీ నేర్పిస్తున్నా సమ్మిళితంగా (ఇన్‌క్లూజివ్) మామూలు పిల్లలతో కలిసి చదువుకోవాలనుకునే పిల్లలకు బ్రెయిలీ అందడం లేదు. దీనికి కారణం తగినంత మంది స్పెషల్ టీచర్లు లేకపోవడం, విద్యార్థులు ఎక్కువగా ఆడియో పాఠాల మీద ఆధారపడటం. కాని ఆడియో పాఠాలు విని సహాయకునితో పరీక్ష రాసి పాసైనప్పటికీ బ్రెయిలీ చదవడం, సొంతగా రాయడం రాకపోతే వారు నిరక్షరాస్యులు అవుతారు. తాముగా చదవగలం, రాయగలం అనే భావనే ఆత్మవిశ్వాసం ఇవ్వగలదు.

ప్రతికూలతలను దాటి

ఇన్ని ప్రతికూలతల మధ్య కూడా అంధత్వాన్ని జయించి ముందుకు సాగిన స్త్రీలు స్ఫూర్తిమంతంగా నిలుస్తున్నారు. చెన్నైకి చెందిన బెనో జెఫైన్ పుట్టుకతో అంధురాలైనా బ్రెయిలీలో చదువుకుంది. ఇంగ్లిష్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి బ్యాంక్ ఆఫీసర్ అయ్యింది. అయినప్పటికీ ఇంకా సాధించాలనే ఉద్దేశంలో ఉద్యోగం చేస్తూనే బ్రెయిలీలో దొరికిన మెటీరియల్ చదివి 2015లో ఐ.ఏ.ఎస్ పరీక్షలు రాస్తే ఇండియన్ ఫారిన్ సర్వీసెస్‌కు ఎంపిక



• బెనో జెఫైన్

అయ్యింది. ఇప్పటివరకు ఐ.ఎఫ్.ఎస్‌లో అంధులకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఆ మేరకు బెనో చరిత్ర సృష్టించింది. ఇప్పుడామె ఢిల్లీ కేంద్రంగా విధులు నిర్వహిస్తోంది. వివాహం చేసుకుని భర్త, కుమార్తెతో ముందుకు సాగుతోంది. బ్రెయిలీ భాష మాత్రమే ఆమెను ఇక్కడి వరకూ చేర్చింది. అలాగే ఢిల్లీకి చెందిన పాతికేళ్ల రేషమ్ తల్వార్ అక్కడి రేడియో ఉడాన్‌లో జాకీగా పని చేస్తోంది. పూర్తి అంధురాలైన రేషమ్‌ను తల్లిదండ్రులు అలాగే వదిలేయ దలచుకోలేదు. మామూలు విద్యార్థులతోపాటు కలిసి చదివేలా చేశారు. బ్రెయిలీలో స్కూలు పాఠాలు చదివించడంలో శ్రద్ధ చూపారు. రేషమ్ ఆగలేదు. పోస్ట్ గ్రాడ్యుయేట్‌గా నిలిచింది. అంతేకాదు, ఆ ఆత్మవిశ్వాసంతో రేడియో జాకీగా చేరింది. వాయిస్ ఓవర్ ఆర్టిస్టుగా పని చేస్తోంది.

నిపుణుల సూచన

ఇవాళ అంధ విద్యార్థులకు సాయపడే యాప్స్ (టెక్స్ట్ బుక్స్‌ను ఆడియోగా మారుస్తాయి) ఉన్నప్పటికీ బ్రెయిలీలో చదవడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. పాఠ్యపుస్తకాలే కాదు సాహిత్యం, కథలు, పురాణాలు, గ్రంథాలు... ఏవి బ్రెయిలీలో అందుబాటులో ఉంటే అవన్నీ చదవడం వల్ల మాత్రమే అంధులకు తమ మీద తమకు విశ్వాసం ఏర్పడుతుందని సలహా ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో విద్యార్థులు, ముఖ్యంగా అంధ విద్యార్థినులు బ్రెయిలీ భాషను నేర్చుకోవడం గురించి, ఆ విషయంలో వారు ఎదుర్కొంటున్న ఆటంకాల గురించి విద్యాశాఖ దృష్టిపెట్టడం అవసరం.

యూత్ పల్స్

ఛలో ఛాట్‌బోట్ వరల్డ్

• శోధించు.. అద్భుతాలు సాధించు



శోధించి సాధించు... అన్నారు. ఆ సాధనలో అద్భుతాలు సాధిస్తే ఎంత బాగుంటుంది! కృత్రిమ మేధస్సుతో కూడిన రకరకాల ఛాట్‌బోట్‌లు ఆ అద్భుతాలకు నిలయం కానున్నాయి. యువతరాన్ని అమితంగా ఆకట్టుకుంటున్న ఛాట్‌బోట్ 'ఛాట్‌బోట్‌జీపీటీ' ఎందుకు? ఏమిటి? ఎలా?

జనరల్ నాలెడ్జ్ నుంచి జటిలమైన ప్రశ్నలకు సమాధానం వరకు, మ్యూజిక్ కంపోజింగ్ నుంచి పాటలు రాయడం వరకు ఎన్నో విషయాలలో ఉపకరించే ఏఐ ఆధారిత ఛాట్‌బోట్‌ల గురించి యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది. ఇటీవల కాలంలో యూత్ 'చాట్‌జీపీటీ' (జనరేటివ్ ప్రీ–ట్రైన్డ్ ట్రాన్స్‌ఫార్మర్) గురించి అమిత ఆసక్తి ప్రదర్శిస్తోంది.

దిగ్గజ సెర్చ్ ఇంజిన్ 'గూగుల్'ను ఈ 'ఛాట్‌జీపీటీ' సవాలు చేయగలదని కొందరు, అధిగమించి అగ్రస్థానంలో నిలవనుందని కొందరు అంచనా వేస్తున్నారు. ఆ అంచనాలలో నిజానిజాల మాట ఎలా ఉన్నా 'ఆసక్తి' మాత్రం నిజం. ఇంతకీ ఏమిటి దీని ప్రత్యేకత?

కంటెంట్ క్రియేషన్‌లో ఉపయోగపడుతుంది. ఏదైనా క్రియేటివ్ ఆర్టికల్ రఫ్‌గా రాస్తే మంచి మంచి పదాలు, శైలితో సొబగులు అద్దగలదు. ఏదైనా అంశానికి సంబంధించి అస్తవ్యస్తంగా ఉన్నా డేటాను క్రమపద్ధతిలోకి తీసుకురాగలదు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ రాయగలదు. మనుషుల సంభాషణ శైలిని సహజంగా అనుకరించగలదు.

ఏదైనా విషయం గురించి గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నప్పుడు 'ఇదిగో ఈ లింకులు ఉన్నాయి' అన్నట్లుగా చూపుతుంది. 'ఛాట్‌జీపీటీ' మాత్రం లింక్‌లతో పాటు తనదైన శైలిలో విషయ వివరణ ఇస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను దుర్వినియోగం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. జాత్యహంకార, సెక్సిస్ట్ ప్రాంప్ట్‌లను 'చాట్‌జీపీటీ' డిస్‌మిస్ చేస్తుంది.

శాన్‌ఫ్రాన్సిస్కో కేంద్రంగా పనిచేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'ఓపెన్ ఏఐ' 'ఛాట్‌జీపీటీ' సాఫ్ట్‌వేర్‌ను సృష్టించింది. కంప్యూటర్ సైంటిస్టు శామ్‌ఆల్ట్‌మన్, ఎంటర్‌ప్రెన్యూర్, ఇన్వెస్టర్, ప్రోగ్రామర్ ఇల్యా సట్స్‌కెర్వర్, ఎలాన్ మస్క్...లాంటివారు ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న ప్రముఖులు. ఆ తర్వాత కాలంలో మస్క్ తప్పుకున్నారు.

మైక్రోసాఫ్ట్‌లాంటి దిగ్గజ సంస్థ దీనిలో పెట్టుబడి పెట్టడం విశేషంగా మారి అంచనాలు మరింతగా పెంచింది.

'ఫ్రెండ్లీ ఏఐ' ని దృష్టిలో పెట్టుకొని ఏఐ రంగంలో లోతైన పరిశోధనలు చేస్తోంది ఛాట్‌జీపీటీ.

వ్యక్తిగత సంభాషణ, సోషల్‌మీడియాలో అభిప్రాయాల కలబోత అనేది ఒక ఎత్తు అయితే, 'ది న్యూయార్క్ టైమ్స్' 'ది గార్డియన్'లాంటి పత్రికలు 'ది బెస్ట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఛాట్‌బోట్' అంటూ 'ఛాట్‌జీపీటీ'ని ప్రశంసించడం మరో ఎత్తు. మరోవైపు టెక్నాలజీ రైటర్ డాన్ గ్లిమోర్ ప్రయోగాత్మకంగా పరీక్షించి 'ఛాట్‌జీపీటీ'ని ప్రశంసించారు. అంతా బాగానే ఉందిగానీ, 'ఛాట్‌జీపీటీ'కి పరిమితులు, లోపాలు లేవా? అనే ప్రశ్నకు 'నో' అనే జవాబు మాత్రం వినిపించదు.

అప్పుడప్పుడూ తప్పుడు సమన్వయాలు, పునరావృతం అయ్యే పదాలు, తప్పుడు సమాధానాలు కనిపించవచ్చు. కొన్ని సంఘటనల గురించి పరిమిత సమాచారానికి మాత్రమే పరిమితం కావచ్చు. కొందరు ప్రముఖుల గురించి ఏమీ చెప్పలేకపోవచ్చు... ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. అయితే 'ఓపెన్ ఏఐ' ఈ పరిమితులు, లోపాలను దాచాలనుకోవడం లేదు.

యూజర్‌లు లోపాలను ఎత్తిచూపవచ్చు. సూచనలు ఇవ్వవచ్చు. వాటిని ఆహ్వానిస్తోంది ఛాట్‌జీపీటీ.

ప్రయోగదశ కాలంలో పది లక్షల మందికి పైగా సబ్‌స్క్రైబర్‌లను కలిగి ఉన్న 'ఛాట్‌జీపీటీ' పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గూగుల్‌ను పక్కకు తప్పించగలదా? యువతరం అంచనాలకు న్యాయం చేయగలదా?... మొదలైన ప్రశ్నలకు స్పష్టత వచ్చేందుకు ఎంతో కాలం పట్టేటట్లు లేదు.



బి.నారాయణమ్మ
మహబూబ్‌నగర్
29 చుక్కలు, 9 వరుసలు, 9 వచ్చే వరకు, సరి చుక్క





కోమల హరిత
కలికిరి, అన్నమయ్య జిల్లా
15 చుక్కలు, 3 వరుసలు, 7 వచ్చే వరకు, సంధు చుక్క



ముగ్గు ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్:muggulu.sakshi@gmail.com (మీ ఊరుతోపాటు కాలనీ– వీధి పేరు కూడా రాయండి)

న్యూస్ మేకర్

చీపురు పట్టి స్టార్ అయ్యింది

గత సంవత్సరం టాప్ 10 కంటెంట్ క్రియేటర్స్‌గా యూ ట్యూబ్ ప్రకటించిన వారిలో 22 ఏళ్ల అపర్ణా టాండలే ఉంది. మన దేశంలో ఇంటింటా తెలిసిన పని మనిషి పాత్రను చీపురు పట్టి హాస్యం చిలికేలా పోషించడమే అపర్ణా సక్సెస్‌కు కారణం. ఆమె చేసే 'కామ్‌వాలీ బాయి' వీడియోలకు 37 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. అపర్ణ చేసిన 'బారిష్ మే భీగ్‌నా' (వానలో తడవడం) అనే మూడు నిమిషాల వీడియోకు 3 కోట్ల వ్యూస్ వచ్చాయంటే ఆమె ఫాలోయింగ్ అర్థం చేసుకోవచ్చు. అపర్ణ పరిచయం.

పని మనిషి అప్పుడే ఇల్లు తుడిచి మొత్తం శుభ్రం చేసి ఉంటుంది. అంతలో కాలింగ్‌బెల్ మోగుతుంది. తలుపు కన్నం నుంచి చూస్తే వానలో పూర్తిగా తడిసి వచ్చిన అమ్మగారూ, అయ్యగారూ. పని మనిషి గతుక్కుమంటుంది.

'అమ్మో.. ఇప్పుడు వీళ్ల ఇంట్లోకి వస్తే ఇల్లంతా నీళ్ళు, బురదా. మళ్లీ పనంతా చేయాలి' అనుకుంటుంది.

అంతే. తలుపుకు ఇంకో బోల్టు పెట్టేస్తుంది. అమ్మగారు కాలింగ్ బెల్ నొక్కితే బోల్ట్ తీస్తున్నట్టుగా నటిస్తూ 'అమ్మా... బోల్ట్ స్ట్రక్ అయ్యింది' అని లోపలి నుంచి అరుస్తుంది.

బయటి నుంచి అమ్మగారి పిలుపులు... లోపలి నుంచి తలుపు రావడం లేదని పని మనిషి అరుపులు. తడిసి వచ్చిన అమ్మగారిని, అయ్యగారిని ఇంటి బయటే గంట సేపు కూచోబెట్టి ఈ లోపు హాయిగా టీవీ చూస్కుంటూ వాళ్లు పూర్తిగా ఆరారు అని తేల్చుకున్నాక అప్పుడు తలుపు తీస్తుంది పని మనిషి.

ఇది అపర్ణా టాండాలె తీసిన మూడు నిమిషాల'బారిష్ మే భీగ్‌నా' షార్ట్ వీడియో. సూపర్‌హిట్ అయ్యింది. మూడు కోట్ల వ్యూస్ వచ్చాయి. పూణెకు చెందిన 22 ఏళ్ల అపర్ణ టాండాలె 2022లో యుట్యూబ్‌లో ఒక టాప్ కంటెంట్ క్రియేటర్‌గా నిలిచింది. ఆమె షార్ట్ వీడియోస్ కోసం చేసే పాత్ర పేరు షీలా దీదీ. సిరీస్ పేరు 'కామ్‌వాలీ బాయి'. కామ్‌వాలీ అంటే పని మనిషి.

• • •

పనిమనిషి లేని మధ్యతరగతి ఇల్లు ఉండదు. పని మనిషితో పేచీ పడని ఇల్లాలూ ఉండదు. పని సరిగ్గా చేయడం లేదని అమ్మగారు సణిగితే, పని ఎక్కువైందని పనిమనిషి గొణుగుతుంది. బాగా తెలివైన పని మనిషైతే 'స్మార్ట్ వర్క్' చేసి పనిని తగ్గించుకోవడమో, తప్పించుకోవడమో చేస్తుంది. అపర్ణా టాండాలె తన సిరీస్‌లో ధరిస్తున్నది ఈ స్మార్ట్ పనిమనిషి పాత్రనే.



• అపర్ణా టాండలే

ఎప్పుడూ ఆకుపచ్చని చీర, మేచింగ్ బ్లౌజ్, కొప్పు వేసిన జుట్టు, మెడలో నల్ల పూసలు, చేతిలో చీపురు... ఇది పని మనిషి షీలా ఆహార్యం. ఆమె పని చేసేది ఒక యువ జంట ఇంట్లో. చేయాల్సిన పని చేస్తుంటుంది గాని ఒక్కోసారి తేడా వచ్చిందంటే ట్రిక్స్ ప్లే చేస్తూ ఉంటుంది. ఆ ట్రిక్సే ఒకటీ ఒకటిన్నర నిమిషాల వీడియోలుగా మనం చూస్తుంటాము.

– ఒక వీడియోలో యజమాని ఒకసారి బోల్డన్ని ఇండోర్ ప్లాంట్స్ తెస్తుంది. 'దీనికి స్ప్రే చేస్తే చాలు. దానికి అరగ్లాసు నీళ్లు చాలు. ఈ దానికి రెండు రోజులకు ఒకసారి నీళ్లు పోయాలి'... ఇలా పది కుండీల లెక్క చెబుతుంది అమ్మగారు. పని మనిషి షీలా ఇంత పని చేస్తుందా? ఒక రోజు పెద్ద బకెట్టు నిండా నీళ్లు మొక్కలకు పోయబోతూ అమ్మగారికి కంగారు పుట్టిస్తుంది. మరోరోజు మొక్కల దగ్గర ఒళ్లు గీరుకుంటూ 'నాకు మొక్కలంటే ఎలర్జీ' అంటుంది. మరోరోజు అమ్మగారి మీదే తుమ్ముతూ 'మొక్కలకు నీళ్లు పోస్తే తుమ్ములు' అంటుంది. దెబ్బకు మొక్కలకు నీళ్లు పోసే పని అయ్యగారు తీసుకుంటాడు. ఇదంతా ఎంతో ఫన్నీగా ఉంటుంది.

- మరో వీడియోలో అమ్మగారు అల్మారాలోని తన బట్టలన్నీ సర్దమంటే ఒక్కదాన్నే చేయాలా అనుకున్న పని మనిషి 'అమ్మగారూ... పొరుగింట్లో ఏమయ్యిందో తెలుసా?' అని అమ్మగారిని పిలిచి మాటల్లో పెట్టి ఆమె చేతే మొత్తం బట్టలు మడత పెట్టిస్తుంది.
- ఇంకో వీడియోలో స్టోర్‌రూమ్ సర్దమంటే 'బాబోయ్ ఎలుక...' అని అరిచి యజమానిని పిలిచి 'అటు పోయింది... ఇటు పోయింది' అంటూ మొత్తం సామాను అతడే సర్దేలా చేస్తుంది.



ఈ వీడియోలు చూసే ప్రేక్షకులు యజమానుల్లో తమని, షీలా పాత్రలో తమ పని మనిషిని చూసుకోవడం వల్ల ఈ సిరీస్ పెద్ద హిట్ అయ్యింది.

• • •

పూణెకు చెందిన యూ ట్యూబర్ అపర్ణ టాండాలెకు 'షార్ట్స్ బ్రేక్' అనే యూట్యూబ్ చానల్ ఉంది. అందులో 'కామ్ వాలీ బాయి' సిరీస్ చేస్తుంది. ఈ ఒక్క యూ ట్యూబ్ చానల్ కాకుండా 'టేక్ ఏ బ్రేక్', 'మ్యాడ్ ఫర్ ఫన్' అనే ఇంకో రెండు మూడు చానల్స్ నడుపుతోంది అపర్ణ.

మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన అపర్ణకు బాల్యం నుంచి నటి కావాలనే కోరిక. స్కూల్, కాలేజీలో స్టేజ్ మీద నాటకాలు వేసేది. 2018 నుంచి యూ ట్యూబ్‌లో షార్ట్ వీడియోలు మొదలెట్టింది. పలుచటి శరీరంతో చురుగ్గా కదులుతూ హుషారైన ముఖ కవళికలతో ఆకట్టుకుంటుంది అపర్ణ. 'ప్రతి ఇంట్లో ఇంటి పని ఉంటుంది. అలాగే పని మనిషి కూడా కావాల్సిందే. ఆ పాత్రను తీసుకుంటే ఎంతో హాస్యం పండించవచ్చు. బాధగా ఉన్నవారు కూడా నా వీడియోలు చూసి నవ్వాలి' అంటుంది అపర్ణ.

అలా నవ్వుతున్నారు కనుకనే ఆమెకు పాపులారిటీ. సృజనాత్మక ఐడియాలు ఉంటే భారీగా పాపులర్ కావచ్చనేదానికి అపర్ణే ఒక పెద్ద చీపురంత ఉదాహరణ.



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో మనిక బత్రా

అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ మనిక బత్రా కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో మనిక మూడు స్థానాలు ఎగబాకి 35వ ర్యాంక్‌కు చేరుకుంది. జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ నాలుగు స్థానాలు పురోగతి సాధించి 72వ ర్యాంక్‌లో నిలిచింది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ కుర్రాడు స్నేహిత్ 136వ ర్యాంక్‌లో ఉన్నాడు. సత్యన్ 39వ ర్యాంక్‌తో భారత నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్

జాతీయ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. హిసార్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ 5–0తో లాలామావ్‌మా (మిజోరం)పై నెగ్గాడు. 51 కేజీల ప్రిక్వార్టర్ ఫైనల్లో యడ్ల ప్రభుదాస్ (ఆంధ్రప్రదేశ్) 0–5తో బిశ్వామిత్ర (సర్వీసెస్) చేతిలో ఓడిపోయాడు.



ఆంధ్ర 135 ఆలౌట్


రవితేజ

సాక్షి, విజయనగరం: హైదరాబాద్ మీడియం పేసర్లు తెలుకుపల్లి రవితేజ (5/34), కార్తికేయ కక్ (3/31) హడలెత్తించడంతో... మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 51.1 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలింది. ఆంధ్ర జట్టులో ఓపెనర్ అభిషేక్ రెడ్డి (135 బంతుల్లో 81; 15 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (13; 1 ఫోర్, 1 సిక్స్) మినహా మిగతా బ్యాటర్లు రెండంకెల స్కోరు కూడా దాటలేదు. కెప్టెన్ హనుమ విహారి (2), రికీ భుయ్ (6), కోన శ్రీకర్ భరత్ (5), కరణ్ షిండే (3) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (35; 4 ఫోర్లు), ప్రజ్ఞయ్ రెడ్డి (17; 3 ఫోర్లు), రోహిత్ రాయుడు (6; 1 ఫోర్) అవుటయ్యారు.

పీలే అంత్యక్రియలు పూర్తి



సాంటోస్: బ్రెజిల్ దిగ్గజ ఫుట్‌బాలర్ పీలే అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. కేవలం కుటుంబసభ్యుల మధ్యే ఈ లాంఛనం ముగించారు. అంతకుముందు విలా బెల్మిరో స్టేడియంలో పీలే భౌతికకాయాన్ని వేల మంది బ్రెజిలియన్లు సందర్శించుకొని కడసారి వీడ్కోలు తెలిపారు. బ్రెజిల్ దేశాధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లులా తమ దిగ్గజానికి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులు అర్పించేందుకు అభిమానులు పోటెత్తడంతో అంతిమ యాత్ర నిర్ణీత షెడ్యూల్‌కు కాస్త ఆలస్యంగా మొదలైంది. సాంటోస్ వీధుల గుండా పీలే అంతిమ యాత్ర సాగుతుండగా 'పీలే జెర్సీ నంబర్ 10'ను అభిమానులు ప్రముఖంగా ప్రదర్శించారు. ప్రజలంతా భారమైన హృదయంతో తమ ఆరాధ్య ఫుట్‌బాలర్‌ను తలచుకొని విలపించారు. తమ దేశాన్ని మూడుసార్లు ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిపిన హీరోకు విషణ్ణ వదనంతో వీడ్కోలు పలికారు. అనంతరం మెమోరియల్ నెక్రొపొలె ఎక్యుమెనిక వద్దకు తీసుకొచ్చారు. క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు ముగించారు.

విజయంతో మొదలు...

హార్దిక్ పాండ్యా నాయకత్వంలోని టీమిండియా కొత్త ఏడాదిని విజయంతో మొదలు పెట్టింది. బ్యాటింగ్‌లో సాధారణ స్కోరుకే పరిమితమైనా చివరకు ఉత్కంఠను అధిగమించి దానిని కాపాడుకోగలిగింది. ఆఖరి బంతికి 4 పరుగులు చేయాల్సిన లంక సింగిల్ మాత్రమే తీయడంతో గెలుపు టీమిండియా పరమైంది. బ్యాటింగ్‌లో దీపక్ హుడా ఆదుకోగా, తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన శివమ్ మావి ఓవర్‌కు ఒక్కో వికెట్ చొప్పున నాలుగు వికెట్లు తీసి గెలుపులో కీలక పాత్ర పోషించాడు.

- తొలి టి20లో భారత్ గెలుపు
- 2 పరుగులతో ఓడిన శ్రీలంక
- రాణించిన హుడా, హార్దిక్
- శివమ్ మావికి 4 వికెట్లు


దీపక్ హుడా

3 ప్రజ్ఞాన్ ఓజా, బరీందర్ శరణ్ తర్వాత కెరీర్ తొలి మ్యాచ్‌లోనే 4 వికెట్లు తీసిన మూడో భారత బౌలర్‌గా శివమ్ మావి నిలిచాడు.


శివమ్ మావి

ముంబై: శ్రీలంకతో టి20 సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2 పరుగుల తేడాతో గెలిచి 1–0తో ముందంజ వేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీపక్ హుడా (23 బంతుల్లో 41 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (29 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (20 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం లంక 20 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షనక (27 బంతుల్లో 45; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, శివమ్ మావి (4/22) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. రెండో టి20 రేపు పుణేలో జరుగుతుంది.

కీలక భాగస్వామ్యం...

రజిత వేసిన తొలి ఓవర్లో ఇషాన్ కిషన్ ఒక సిక్స్, 2 ఫోర్లు కొట్టగా, మొత్తం 17 పరుగులతో భారత్ ఇన్నింగ్స్ జోరుగా మొదలైంది. అయితే ఆ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. లంక బౌలర్లు చక్కటి బంతులతో భారత్‌ను కట్టిపడేశారు. అరంగేట్ర మ్యాచ్‌లో శుబ్‌మన్ గిల్ (7) విఫలం కాగా, సూర్యకుమార్ (7), సంజు సామ్సన్ (5) విఫలమయ్యారు. పవర్‌ప్లేలో జట్టు 41 పరుగులకే పరిమితమైంది. మరోవైపు రజిత ఓవర్లోనే వరుస బంతుల్లో 6, 4 కొట్టిన కిషన్ మళ్లీ భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. 11–15 ఓవర్ల మధ్య 26 పరుగులే చేయగలిగిన భారత్ హార్దిక్ పాండ్యా (27 బంతుల్లో 29; 4 ఫోర్లు) వికెట్ కూడా చేజార్చుకుంది. అయితే చివర్లో హుడా దూకుడు టీమిండియాకు మెరుగైన స్కోరు అందించింది. తీక్షణ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టిన హుడా... హసరంగ, రజిత ఓవర్లలో ఒక్కో సిక్స్ బాదాడు. మదుషంక ఓవర్లో అక్షర్ కూడా సిక్స్, ఫోర్‌తో తన వంతు సహకారం అందించాడు. హుడా, అక్షర్ ఆరో వికెట్‌కు అభేద్యంగా 35 బంతుల్లోనే 68 పరుగులు జోడించారు.

షనక మినహా...

తన తొలి మ్యాచ్ తొలి ఓవర్లోనే వికెట్‌తో మావి ఆకట్టుకున్నాడు. నిసాంక (1)ను బౌల్డ్ చేసిన అతను, తన తర్వాతి ఓవర్లో ధనంజయ (8)ను వెనక్కి పంపాడు. మొదటి 6 ఓవర్లలో లంక 32 పరుగులే చేయగలిగింది. ఆ తర్వాత నాలుగు పరుగుల వ్యవధిలో మరో 2 వికెట్లు కోల్పోయిన లంక సగం ఓవర్లు ముగిసేసరికి 66 పరుగులకే పరిమితమైంది. అయితే కెప్టెన్ షనక, హసరంగ దూకుడుతో జట్టు కొంత పోరాడగలిగింది. చహల్ ఓవర్లో హసరంగ వరుసగా రెండు సిక్సర్లు బాదగా, హర్షల్ ఓవర్లో షనక 6, 4 కొట్టాడు. అయితే 21 బంతుల్లో 34 పరుగులు చేయాల్సిన దశలో షనకను ఉమ్రాన్ అవుట్ చేయడంతో లంక గెలుపు ఆశలు కోల్పోయింది.

మావి, గిల్ అరంగేట్రం

తొలి టి20 ద్వారా భారత్ ఇద్దరు కొత్త ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. అర్‌్షదీప్ అనారోగ్యం నుంచి కోలుకోకపోవడంతో పేసర్ శివమ్ మావి జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌తో శుబ్‌మన్ గిల్ కూడా అంతర్జాతీయ టి20ల్లో అడుగుపెట్టాడు. భారత్ తరఫున ఇప్పటికే 13 టెస్టులు, 15 వన్డేలు ఆడిన గిల్‌కు ఇదే తొలి టి20 మ్యాచ్.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) ధనంజయ (బి) హసరంగ 37; గిల్ (ఎల్బీ) (బి) తీక్షణ 7; సూర్యకుమార్ (సి) రాజపక్స (బి) కరుణరత్నే 7; సామ్సన్ (సి) మదుషంక (బి) ధనంజయ 5; హార్దిక్ (సి) మెండిస్ (బి) మదుషంక 29; హుడా (నాటౌట్) 41; అక్షర్ (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు)** 162. **వికెట్ల పతనం:** 1–27, 2–38, 3–46, 4–77, 5–94. **బౌలింగ్:** రజిత 4–0–47–0, మదుషంక 4–0–35–1, తీక్షణ 4–0–29–1, కరుణరత్నే 3–0–22–1, ధనంజయ 1–0–6–1, హసరంగ 4–0–22–1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) మావి 1; మెండిస్ (సి) సామ్సన్ (బి) హర్షల్ 28; ధనంజయ (సి) సామ్సన్ (బి) మావి 8; అసలంక (సి) కిషన్ (బి) ఉమ్రాన్ 12; రాజపక్స (సి) హార్దిక్ (బి) హర్షల్ 10; షనక (సి) చహల్ (బి) ఉమ్రాన్ 45; హసరంగ (సి) హార్దిక్ (బి) మావి 21; కరుణరత్నే (నాటౌట్) 23; తీక్షణ (సి) సూర్యకుమార్ (బి) మావి 1; రజిత (రనౌట్) 5; మదుషంక (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్)** 160. **వికెట్ల పతనం:** 1–12, 2–24, 3–47, 4–51, 5–68, 6–108, 7–129, 8–132, 9–159, 10–160. **బౌలింగ్:** హార్దిక్ 3–0–12–0, శివమ్ మావి 4–0–22–4, ఉమ్రాన్ 4–0–27–2, చహల్ 2–0–26–0, హర్షల్ 4–0–41–2, అక్షర్ 3–0–31–0.

జైదేవ్ ఉనాద్కట్ అరుదైన రికార్డు

రంజీ ట్రోఫీ మ్యాచ్ మొదటి ఓవర్లోనే 'హ్యాట్రిక్' సాధించిన తొలి బౌలర్‌గా ఘనత



రాజ్‌కోట్: క్రికెట్‌లో 'హ్యాట్రిక్'లు, ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు కొత్తేం కాదు... కానీ ఆట మొదలైన ఓవర్లోనే వరుసగా మూడు వికెట్లు (హ్యాట్రిక్) తీస్తే... ఆ ముగ్గురు డకౌట్ అయితే అది చరిత్ర! అలాంటి ఘనమైన రికార్డును సౌరాష్ట్ర సీమర్ జైదేవ్ ఉనాద్కట్ (8/39) ఢిల్లీతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో లిఖించాడు. 88 ఏళ్ల రంజీ చరిత్రలో తొలిసారి ఈ రికార్డు సృష్టించాడు. ఎలైట్ గ్రూప్ 'బి'లో మంగళవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఢిల్లీ బ్యాటింగ్‌కు దిగింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ వేసిన ఉనాద్కట్ మూడో బంతికి ధ్రువ్ శోరే (0)ను, నాలుగో బంతికి వైభవ్ (0)ను, ఐదో బంతికి యశ్ ధుల్ (0)ను అవుట్ చేశాడు. తన మరుసటి ఓవర్ వేసిన ఉనాద్కట్ మళ్లీ పంజా విసిరాడు. జాంటీ సిద్ధు (4)తోపాటు లలిత్ యాదవ్ (0)నూ స్కోరు చేయనివ్వలేదు. మూడు ఓవర్లు ముగిసేసరికి ఢిల్లీ స్కోరు 5/6. మళ్లీ ఐదో ఓవర్ వేసిన ఉనాద్కట్ లక్ష్యయ్ (1)ను పెవిలియన్ చేర్చాడు. 10 పరుగులకే 7 వికెట్లను కోల్పోయిన ఢిల్లీని టెయిలెండర్లు హృతిక్ షోకీన్ (68 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శివాంక్ వశిష్ట్ (38; 5 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. శివాంక్‌తో పాటు కుల్దీప్ యాదవ్ (0)ను కూడా ఉనాద్కటే అవుట్ చేసి ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌ను 133 పరుగుల వద్ద ముగించాడు. అనంతరం సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టానికి 184 పరుగులు చేసింది. హర్విక్ దేశాయ్ (104 బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ శతకం సాధించాడు.

న్యూజిలాండ్ 449 ఆలౌట్

కరాచీ: టెయిలెండర్లు మ్యాట్ హెన్రీ (68 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎజాజ్ పటేల్ (35; 4 ఫోర్లు) అసాధారణ పోరాటంతో న్యూజిలాండ్ భారీస్కోరు చేసింది. పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఓవర్‌నైట్ స్కోరు 309/6తో మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 449 స్కోరు వద్ద ఆలౌటైంది. 345/9 స్కోరు వద్ద కివీస్ పతనం అంచున నిలిచింది. ఈ దశలో హెన్రీ, ఎజాజ్ ఆఖరి వికెట్‌కు 104 పరుగులు జోడించారు. తర్వాత తొలి ఇన్నింగ్స్ మొదలు పెట్టిన పాకిస్తాన్ రెండో రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్లకు 154 పరుగులు చేసింది. ఇమామ్ (74 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్), షకీల్ (13 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నారు.

రామ్‌కుమార్‌కు మిశ్రమ ఫలితాలు



పుణే: టాటా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో భారత ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రామ్‌కుమార్ 3–6, 7–5, 3–6తో ప్రపంచ 62వ ర్యాంకర్ పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్) చేతిలో ఓడిపోయాడు. అయితే డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్‌కుమార్–మిగెల్ వరేలా (మెక్సికో) జోడీ 7–6 (7/5), 6–7 (4/7), 11–9తో రోహన్ బోపన్న (భారత్)–జాండ్‌షుల్ప్ (నెదర్లాండ్స్) ద్వయంపై 'సూపర్ టైబ్రేక్'లో నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరింది. ఇతర మ్యాచ్‌ల్లో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ 7–6 (7/1), 5–7, 7–10తో మూడో సీడ్ సాదియో దుంబియా–రిబూల్ (ఫ్రాన్స్) జంట చేతిలో... పురవ్ రాజా–దివిజ్ శరణ్ (భారత్) ద్వయం 4–6, 3–6తో జీవన్–శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీ చేతిలో ఓడిపోయాయి.

లంకతో వన్డే సిరీస్‌కు బుమ్రా



ముంబై: భారత జట్టు టాప్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మళ్లీ మైదానంలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంకతో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం బుమ్రాను ఎంపిక చేశారు. భారత్, శ్రీలంక మధ్య ఈ నెల 10, 12, 15 తేదీల్లో మూడు వన్డేలు జరగనున్నాయి.వెన్ను నొప్పి గాయంతో బాధపడుతూ అతను గత సెప్టెంబర్ నుంచి జట్టుకు దూరంగా ఉన్నాడు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో చికిత్స అనంతరం రీహాబిలిటేషన్ పూర్తి చేసుకొని బుమ్రా ఇప్పుడు పూర్తి ఫిట్‌గా తయారయ్యాడు. 'బుమ్రా గత వారం రోజులుగా పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయడంతో పాటు ఫిజికల్ ట్రెయినింగ్ కూడా చేస్తున్నాడు. ఎన్‌సీఏ అతడిని ఫిట్‌గా ప్రకటించింది. అందుకే వన్డేల కోసం ఎంపిక చేశాం. త్వరలోనే బుమ్రా భారత జట్టుతో చేరతాడు' అని బీసీసీఐ ప్రకటించింది.

సినిమా

ఏప్రిల్‌లో ఉగ్రం


● 'అల్లరి' నరేష్

'నాంది' వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత హీరో 'అల్లరి' నరేష్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందుతున్న ద్వితీయ చిత్రం 'ఉగ్రం'. ఇందులో మిర్నా హీరోయిన్. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాని ఏప్రిల్ 14న విడుదల చేయనున్నట్లు ఒక స్పెషల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ ప్రకటించారు. అలాగే తన తుపాకీని నరేష్ వేరొకరిపై గురిపెట్టిన పోస్టర్‌ను కూడా విడుదల చేసింది యూనిట్. ''నరేష్ అద్భుతమైన పాత్రలో కనిపించనున్న చిత్రం 'ఉగ్రం'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: సిద్.

పెళ్లికి ముహూర్తం కుదిరిందా?


● కియారా, సిద్ధార్థ్

ఈ కొత్త సంవత్సరం తొలిరోజు వార్తల్లో నిలిచినవారిలో హీరో సిద్ధార్థ్ మల్హోత్రా, హీరోయిన్ కియారా అద్వానీ జంట ఒకటి. ఈ జంట దుబాయ్ వెళ్లి, అక్కడే సంబరాలు జరుపుకున్నారు. ఈ ఇద్దరూ కొంత కాలంగా ప్రేమలో ఉన్నారనే వార్త ప్రచారంలో ఉన్న విషయం తెలిసిందే. గత ఏడాది 'షేర్షా' చిత్రంలో నటించినప్పుడు ప్రేమలో పడ్డారని ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఈ ఇద్దరూ తమ పెళ్లి పనులతో బిజీగా ఉన్నారని సమాచారం. ఫిబ్రవరి 6న పెళ్లికి ముహూర్తం కుదిరిందని బాలీవుడ్ టాక్. మెహందీ, సంగీత్, పెళ్లి.. ఈ మూడు వేడుకలు రెండు రోజుల పాటు జరగనున్నాయట. మెహందీ, సంగీత్ ఒకే రోజున, ఆ మర్నాడు వివాహ వేడుకను ప్లాన్ చేశారని భోగట్టా. రాజస్థాన్‌లోని జైసల్మేర్ ప్యాలెస్ వివాహ వేదిక కానుందనీ, పంజాబీ సంప్రదాయంలో పెళ్లి జరగనుందనీ టాక్. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య పెళ్లి చేసుకుని, సినీ ప్రముఖులకు ముంబయ్‌లో గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయాలని సిద్ధార్థ్, కియారా అనుకున్నారట. ఇక సినిమాల విషయానికి వస్తే.. సిద్ధార్థ్‌కి హిందీలో నటుడిగా మంచి పేరుంది. కియారా తెలుగులో మహేశ్‌బాబు సరసన 'భరత్ అనే నేను', రామ్‌చరణ్‌తో 'వినయ విధేయ రామ' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఆమే హీరోయిన్. హిందీ చిత్రాల్లోనూ కియారా నటిస్తున్నారు.

మైఖేల్ డేట్ ఫిక్స్

సందీప్ కిషన్ హీరోగా నటించిన తొలి పాన్ ఇండియా చిత్రం 'మైఖేల్'. రంజిత్ జయకొడి దర్శకత్వం వహించారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ పతాకాలపై భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 3న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, ఓ పోస్టర్‌ని రిలీజ్ చేసింది చిత్రబృందం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: కిరణ్ కౌశిక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కె. సాంబశివరావు.



● దివ్యాంశ కౌశిక్, సందీప్ కిషన్

గీత రచయిత పెద్దాడ మూర్తి కన్నుమూత



సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్, ప్రముఖ పాటల రచయిత పెద్దాడ మూర్తి ఇకలేరు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా భీముని పట్నంలో జన్మించారు పెద్దాడ మూర్తి. తన తండ్రి పెద్దాడ వీరభద్రరావు నుంచి సాహిత్యాన్ని వంటబట్టించుకున్నారాయన. కాళీపట్నం రామారావు వంటి ప్రముఖుల రచనలతో స్ఫూర్తి పొందిన పెద్దాడ మూర్తి డిగ్రీ చదువుతున్న సమయంలోనే 'పతంజలి' అనే పత్రికలో జర్నలిస్టుగా చేశారు. వేటూరి స్ఫూర్తితో గేయ రచయితగా మారాలనుకున్నారు. దర్శకుడు కృష్ణవంశీతో పరిచయం ఉండడంతో హైదరాబాద్‌కి వచ్చిన మూర్తి సినీ జర్నలిస్ట్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. పలు సినీ వార పత్రికలు, దినపత్రికల్లో పని చేశారు. మూర్తికి దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తొలిసారి 'కూతురు' (1996) సినిమాలో పాట రాసే అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత రవితేజ 'ఇడియట్' (చెలియా చెలియా..), 'అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి' (నీవే నీవే..), చిరంజీవి 'స్టాలిన్' (సిగ్గుతో ఛీ ఛీ..), కృష్ణవంశీ 'చందమామ' (బుగ్గే బంగారమా..), మధుమాసం, పౌరుడు, కౌసల్య సుప్రజ రామ, అది నువ్వే, నాకూ ఓ లవర్ ఉంది' వంటి పలు సినిమాలకు పాటలు రాశారు పెద్దాడ మూర్తి. పలు టీవీ సీరియల్స్‌కీ పాటలు రాశారు. అలాగే 'ఇష్ట సఖి, హౌస్‌ఫుల్' అనే ప్రైవేట్ ఆల్బమ్స్ చేశారు. 'తారా మణిహారం' అనే పుస్తకాన్ని రచించారు. మూర్తి మాటలు, పాటలు అందించిన 'నాగలి' సినిమా త్వరలో విడుదల కానుంది. మూర్తి మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, జర్నలిస్టులు సంతాపం తెలియజేశారు. కాగా పెద్దాడ మూర్తికి భార్య సంధ్య, కుమార్తె సుగాత్రి, కుమారుడు అభిజీత్ ఉన్నారు. హైదరాబాద్‌లోని ఈఎస్ఐ స్మశాన వాటికలో నేడు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

వారసుడు పండగలాంటి సినిమా - శ్రీకాంత్



''నా కెరీర్‌లో తొలి తమిళ చిత్రం 'వారసుడు'. ఇందులో విజయ్‌కి బ్రదర్‌గా కీలకమైన పాత్ర చేశాను. అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. సినిమా ఒక దృశ్యకావ్యంలా ఉంటుంది'' అని హీరో శ్రీకాంత్ అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వారసుడు'. తమిళంలో 'వారిసు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, పీవీపీ సినిమా పతాకాలపై 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళంలో ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన శ్రీకాంత్ చెప్పిన విశేషాలు.

- తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా చేసినప్పటికీ పక్కా తెలుగు మూవీలానే ఉంటుంది. జయసుధగారు, నేను, కిక్ శ్యామ్, శరత్ కుమార్, రష్మిక, సంగీత, ప్రభు.. ఇలా అందరూ తెలుగు సినిమాలు చేసిన వారే ఉండటంతో పూర్తి తెలుగు నేటివిటీ సినిమాలానే ఉంటుంది. వంశీ పైడిపల్లి సినిమాల్లో గ్రేట్ ఎమోషన్స్ ఉంటాయి. ఆ కోవలోనే ఈ మూవీలో బ్రదర్స్ మధ్య జరిగే భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. విజయ్‌గారు ఎక్కువగా మాట్లాడరు. సెట్‌లో అడుగు పెడితే ప్యాకప్ చెప్పేవరకూ అక్కడే ఉంటారు. క్యారవాన్ వాడరు.. సెల్ ఫోన్ కూడా దగ్గర పెట్టుకోరు. ఒక మంచి సినిమా, విజయ్‌లాంటి స్టార్ హీరోతో తమిళంలో అడుగుపెడుతుండటం హ్యాపీ.
- ఇప్పుడు వస్తున్న సినిమాలన్నీ పాన్ ఇండియా అయిపోయాయి. మన తెలుగు సినిమాలు ఇతర భాషల్లోనూ హిట్ సాధిస్తున్నాయి. సంక్రాంతి అనేది సినిమాల పండగ కూడా.. అన్ని సినిమాలనీ ప్రేక్షకులు ఆదరిస్తారు. 'వారసుడు' పండగ లాంటి సినిమా. ఈ సంక్రాంతికి విడుదలవుతున్న సినిమాలన్నీ బాగా ఆడాలి.. అదే హ్యాపీ సంక్రాంతి. 'దిల్' రాజుగారి ప్రొడక్షన్‌లో చేయడం ఇదే తొలిసారి. 'వారసుడు'కి తమన్ అద్భుతమైన మ్యూజిక్, రీ రికార్డింగ్ ఇచ్చాడు.
- 'అఖండ' తర్వాత డిఫరెంట్‌గా ఉండాలని 'వారసుడు'లోని పాత్ర చేశాను. అలాగే రామ్‌చరణ్– శంకర్‌గారి సినిమాలోనూ మంచి పాత్ర చేస్తున్నాను. కథ, క్యారెక్టర్ నచ్చితే వైవిధ్యమైన పాత్రలు కచ్చితంగా చేస్తాను.

ఓం నమశ్శివాయ


● శివ, రాశీ సింగ్

శివ కందుకూరి, రాశీ సింగ్ హీరో హీరోయిన్స్‌గా నటించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ స్నేహల్ జంగాల, శశిధర్ కాశీ, కార్తీక్ ముడుంబై నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్ విడుదలైంది. 'ఓం నమశ్శివాయ' అనే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మోషన్ పోస్టర్‌లో వినబడుతుంది. ''ఇటీవలే షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం ఎడిటింగ్ జరుగుతోంది. శ్రీ చరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్ మంచి సంగీతం అందించారు. త్వరలో టీజర్, ట్రైలర్‌ను విడుదల చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: గౌతమ్ జి.

త్వరలో రాజా


● రామకృష్ణ గౌడ్, అహ్మద్ ఖాన్

రోషన్ హీరోగా, పూజా డే, అమీక్ష పవర్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'మన్మథరాజా'. యం.డి. అబిద్ దర్శకత్వంలో యండీ అహ్మద్ ఖాన్ నిర్మించారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నగేష్, అడిషనల్ డీఎస్పీ లక్ష్మణ్ రావ్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, డైరెక్టర్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''మన్మథరాజా' మూవీ బాగా వచ్చింది. త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు యండీ అహ్మద్ ఖాన్. ''నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన అహ్మద్ ఖాన్‌గారికి థ్యాంక్స్'' అన్నారు అబిద్. ''మా అల్లుడు ప్రారంభించిన 'సినిమా ఆడెంట్' అనే హాస్పిటల్‌లో ఇండస్ట్రీలోని సాంకేతిక నిపుణులకు ఉచితంగా వైద్యం అందిస్తాం.. ఇందుకు గుర్తింపు కార్డులు ఇస్తాం'' అన్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్.

సరిహద్దు ప్రేమ

అంజన్ రామచంద్ర, శ్రావణీ రెడ్డి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లవ్ రెడ్డి'. స్మరన్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ హేమలతా రెడ్డి, మదన్ గోపాల్ రెడ్డి, ప్రభంజనం రెడ్డి, నాగరాజు బీరప్ప నిర్మించారు. ఈ చిత్రం గ్లింప్స్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేసి, మాట్లాడుతూ– ''లవ్ రెడ్డి' గ్లింప్స్ చాలా ఫ్రెష్ గా ఉంది. ఈ గ్లింప్స్ చూశాక నాకు కూడా ఒక లవ్‌స్టోరీ చెయ్యాలనిపిస్తోంది. యంగ్ టీమ్ చేసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''ఆంధ్ర , కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో జరిగే స్వచ్ఛమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని రూపొందించాం'' అన్నారు స్మరన్ రెడ్డి. ''ఒక మంచి సినిమాలో నటించినందుకు ఆనందంగా ఉంది అన్నారు'' అంజన్ రామచంద్ర.


● రామచంద్ర, శ్రావణి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
126	35
61,294	18,233

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,318	▽	148
డోజోన్స్	32,942	▽	205
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,554	▲	102
డాక్స్	14,182	▲	112
షాంఘై	3,117	▲	27
నికాయ్	26,094	▲	1

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	55,581 ▲ 714
బంగారం (99.5 స్వచ్ఛత)	55,359 ▲ 712
వెండి (కిలో)	69,227 ▲ 1,135

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	81.95	83.62
£	బ్రిటన్ పౌండ్	[illegible]	86.82	89.91
€	యూరో	[illegible]	98.29	101.62
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	62.75	64.79
AUS	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.39	57.75
S$	సింగపూర్ డాలర్	[illegible]	60.90	62.91
SAR	సౌదీ రియాల్	[illegible]	21.11	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.67	23.46
¥	చైనా యువాన్	[illegible]	10.87	12.90

ఏపీలో రూ.2,000 కోట్లతో గ్రాన్యూల్స్ ప్లాంట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ గ్రాన్యూల్స్.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద భారీ ప్లాంటును ఏర్పాటు చేయనుంది. వచ్చే అయిదేళ్లలో ఈ కేంద్రానికి కంపెనీ రూ.2,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. 100 ఎకరాల విస్తీర్ణంలో దశలవారీగా ఈ ఫెసిలిటీ కార్యరూపం దాల్చనుంది. ఔషధాల ఉత్పత్తికి కావాల్సిన కీ స్టార్టింగ్ మెటీరియల్స్, ఇంటర్మీడియేట్స్, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్, ఫెర్మెంటేషన్ ఆధారిత ఉత్పత్తులను ఇక్కడ తయారు చేస్తారు. కాగా, గ్రాన్యూల్స్ తాజాగా గ్రీన్‌కో జీరోసీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఉద్గార రహిత విద్యుత్‌ను గ్రీన్‌కో ఈ ప్లాంటుకు సరఫరా చేస్తుంది. అలాగే డీసీడీఏ, పీఏపీ, పారాసీటమాల్, మెట్‌ఫార్మిన్, ఏపీఐలు, ఇంటర్మీడియేట్స్ తయారీలో వాడే రసాయనాలను సైతం అందిస్తుంది. గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి, గ్రీన్‌కో గ్రూప్ ఫౌండర్ మహేశ్ కొల్లి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

జీపీఎఫ్‌పై 7.1% వడ్డీ...

న్యూఢిల్లీ: జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్), ఇదే మాదిరి ఇతర ఫండ్స్ రేటును 7.1 శాతంగా కొనసాగిస్తూ కేంద్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. డిసెంబర్‌తో ముగిసిన 3 నెలల కాలానికి కూడా 7.1% రేటు అమల్లో ఉంది. అదే రేటును జనవరి–మార్చి త్రైమాసికానికి అమలవుతుందంటూ కేంద్ర ఆర్థిక శాఖ ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-1-2023	
విశాఖ	555-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
3-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	541-00
వరంగల్	543-00
రిటైల్ ధర	6.00

ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలను పొడిగించాలి

కేంద్రానికి ఎస్‌ఎంఈవీ విజ్ఞప్తి • ఫేమ్–2 పథకం గడువు పొడిగింపునకు అభ్యర్థన



న్యూఢిల్లీ: ఫేమ్–2 (ఎఫ్‌ఏఎంఈ) పథకం కింద ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) సబ్సిడీలను పొడిగించాలని ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారుల సంఘం (ఎస్‌ఎంఈవీ) కేంద్రాన్ని కోరింది. అలాగే ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడానికి తేలికపాటి నుండి భారీ వాణిజ్య వాహనాలను కూడా ఈ పథకం కిందకు తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు 2023–24 ఆర్థిక బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని కోరింది. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలపై 5% ఏకరీతి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)విధానాన్ని అవలంబించాలని కూడా తన బడ్జెట్ ముందస్తు సిఫారసుల్లో అభ్యర్థించింది. ఈ మేరకు వెలువడిన ప్రకటనలో కొన్ని ముఖ్యాంశాలు..

- ఫేమ్–2 గడువు 2024 మార్చి 31న ముగుస్తుంది. సబ్సిడీల ప్రయోజనం ఇంకా పరిశ్రమ పురోగతిపై కనిపించలేదు. అందువల్ల పథకం గడువును కేంద్రం మరోసారి పొడిగిస్తుందని భావిస్తున్నాం.
- సబ్సిడీని నేరుగా వినియోగదారులకు బదిలీ చేయడానికి వీలుగా పథకం నిబంధనలు ఉండాలి.
- ఫేమ్ 2 సబ్సిడీని ట్రాక్టర్లకూ విస్తరించాలి.
- దేశంలో లిథియం–అయాన్ సెల్స్ తయారీ ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉంది. కనుక వీటి తయారీ సామర్థ్యం దేశంలో పెరిగేంతవరకూ సెల్స్‌పై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయాలి.
- ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడం కోసం రూపొందించిన పీఎల్ఐ (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్) స్కీమ్ 'స్టార్టప్‌లు–ఎంఎస్ఎమ్ఈలకు' ప్రయోజనం చేకూర్చేలా రూపొందించలేదు. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలను పరిధిలోకి తేవాలి.
- పీఎల్ఐ పథకం పెద్ద కార్పొరేట్‌లు, బహుళజాతి కంపెనీలకే అనుకూలం. మూలధనం కోసం ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకూ ఈ ప్రయోజనం అందాలి.
- దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత వేగవంతం చేయడానికి ఈ రంగం రుణాలను ''ప్రాధాన్యతా'' రుణాలుగా పరిగణించాలి. దీనివల్ల ఈ రంగానికి తగిన మూలధనం అందుబాటులోకి వస్తుంది. ఎలక్ట్రిక్ వాహన కస్టమర్లకు విధించే వడ్డీ రేట్ల తగ్గుదలకూ ఇది దోహదపడుతుంది.

ఓయో ఐపీవోకు సెబీ బ్రేక్

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ.. ఒరావెల్ స్టేస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ప్రణాళికలకు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. తగిన తాజా సమాచారంతో ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను తిరిగి దాఖలు చేయవలసిందిగా ఒరావెల్‌ను ఆదేశించింది. వెరసి దరఖాస్తును తిప్పి పంపించింది. ట్రావెల్ టెక్ సంస్థ ఓయోకు ఒరావెల్ మాతృ సంస్థకాగా.. యూనికార్న్ హోదాలో కంపెనీ 2021 సెప్టెంబర్‌లో ఐపీవో బాట పట్టింది. రూ. 8,430 కోట్ల సమీకరణకు వీలుగా సెబీకి దరఖాస్తు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 7,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేసేందుకు ప్రణాళికలు వేసింది. వీటికి



జతగా మరో రూ.1,430 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. తొలి ప్రాస్పెక్టస్‌లో ఓయో ఈ ఏడాది (2022–23) తొలి అర్ధభాగ ఫలితాలను జత చేసింది. వీటి ప్రకారం ఏప్రిల్–సెప్టెంబర్‌లో రూ. 63 కోట్ల లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 280 కోట్ల నష్టం ప్రకటించింది. ఆదాయం 24% వృద్ధితో రూ. 2,905 కోట్లకు చేరింది.

టెలికంలో కొలువులకు 5జీ దన్ను

స్టాఫింగ్ సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ వెల్లడి



న్యూఢిల్లీ: అత్యంత వేగవంతమైన 5జీ సర్వీసుల ప్రారంభంతో ఈ ఏడాది (2023) టెలికం రంగంలో కొలువులకు ఊతం లభించగలదని అంతర్జాతీయ స్టాఫింగ్ సేవల సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ తెలిపింది. ఇటు సాంకేతిక, అటు సామాన్య నైపుణ్యాలు ఉన్న వారికి కూడా ఉద్యోగావకాశాలు లభించగలవని ఒక ప్రకటనలో పేర్కొంది. రాబోయే రోజుల్లో హైరింగ్ డిమాండ్ కేవలం టెలికం రంగానికి మాత్రమే పరిమితం కాకుండా హెల్త్‌కేర్, రిటైల్, తయారీ, ఆటోమోటివ్ తదితర రంగాలు కూడా 5జీకి అనుగుణంగా తమ సర్వీసు సామర్థ్యాలను పెంచుకునేందుకు గణనీయంగా రిక్రూట్ చేసుకునే అవకాశం ఉందని ఎన్ఎల్‌బీ వివరించింది. టెలికంయేతర రంగాల్లో డేటా సైంటిస్టులు, సైబర్‌సెక్యూరిటీ ప్రొఫెషనల్స్ మొదలైన వారికి డిమాండ్ ఉండగలదని పేర్కొంది. 2021తో పోలిస్తే 2022లో టెలికం టెక్నాలజీలో ప్రత్యేక నైపుణ్యాలున్న వారికి డిమాండ్ 20 శాతం పెరిగిందని తెలిపింది. ప్రస్తుతం సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్ వంటి ఉద్యోగాలకు మంచి డిమాండ్ ఉందని, 10–12 శాతం మెరుగైన ప్యాకేజీలు లభిస్తున్నాయని ఎన్ఎల్‌బీ వివరించింది. దిగ్గజ టెల్కోలు వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా చాలా మటుకు ప్రాంతాల్లో 5జీ సేవలను అందుబాటులోకి తేనున్నాయని, దీని ప్రభావంతో నియామకాలకు కూడా తోడ్పాటు లభించగలదని పేర్కొంది.

సూచీలకు స్వల్ప లాభాలు



ముంబై: ఆద్యంతం లాభ, నష్టాల మధ్య కదలాడిన స్టాక్ సూచీలు చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 126 పాయింట్లు పెరిగి 61,294 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 35 పాయింట్లు బలపడి 18,233 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే అంశాలేవీ లేకపోవడంతో సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులతో ట్రేడయ్యాయి. ఒక దశలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అయితే చివరి గంట కొనుగోళ్లతో ఇంట్రాడే గరిష్టం వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 93 పాయింట్ల నష్టంతో 61,075 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 339 పాయింట్ల పరిధిలో 61,004 వద్ద కనిష్టాన్ని, 61,344 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 34 పాయింట్ల నష్టంతో 18,163 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 18,150 – 18,252 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. కమోడిటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.22%, స్మాల్ క్యాప్ సూచీ 0.18 శాతం పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.628 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.351 కోట్ల షేర్లను కొన్నారు. రూపాయి విలువ జీవితకాల కనిష్ట స్థాయి వద్ద ముగిసింది. డాలర్ మారకంలో 22 పైసలు పతనమై 83.00 స్థాయి వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జొమాటో సహ వ్యవస్థాపకులు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గుంజన్ పాటిదార్ రాజీనామాతో కంపెనీ షేరు 2 శాతం నష్టపోయి రూ.58.90 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతానికి పైగా నష్టపోయి రూ.57.65 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- స్వల్ప శ్రేణి ట్రేడింగ్‌లోనూ బీమా కంపెనీల షేర్లకు డిమాండ్ లభించింది. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ 4.50%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 4%, ఎల్ఐసీ 3.50%, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ రెండుశాతం చొప్పున లాభపడ్డాయి.

ఎన్‌డీటీవీ వాటాదారులకు జోష్

ఎన్‌డీటీవీ వాటాదారులకు బోనస్‌లాంటి వార్త. ఇటీవలే ఎన్‌డీటీవీని చేజిక్కించుకున్న అదానీ గ్రూప్.. మీడియా సంస్థ వాటాదారులకు షేరుకి రూ. 48.65 చొప్పున అదనంగా చెల్లించేందుకు నిర్ణయించింది. ఓపెన్ ఆఫర్‌లో భాగంగా నవంబర్ 22 నుంచి డిసెంబర్ 5 మధ్య షేర్లను టెండర్ చేసిన ఎన్‌డీటీవీ వాటాదారులకు తాజా చెల్లింపు వర్తించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ పేర్కొంది.

డిజిటైజేషన్‌లో భారత్ భేష్

- ఆర్థిక వృద్ధికి క్లౌడ్, ఏఐ ఊతం
- మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల వెల్లడి



ముంబై: డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన విషయంలో భారత్ అసాధారణ రీతిలో కృషి చేస్తోందని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల ప్రశంసించారు. టెక్నాలజీ ఆధారిత ఆర్థిక వృద్ధి సాధనలో క్లౌడ్, కృత్రిమ మేధ (ఏఐ) గణనీయంగా తోడ్పాటు నివ్వగలవని ఆయన తెలిపారు. నాలుగు రోజుల భారత పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ ఫ్యూచర్ రెడీ లీడర్‌షిప్ సమిట్‌లో పాల్గొన్న సందర్భంగా నాదెళ్ల ఈ విషయాలు వివరించారు. 2025 నాటికి చాలా మటుకు అప్లికేషన్లు ..క్లౌడ్ ఆధారిత మౌలిక సదుపాయాలతో రూపొందుతాయని, సుమారు 90 శాతం డిజిటల్ పని అంతా క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్‌పైనే జరుగుతుందని ఆయన చెప్పారు. 'ఈ నేపథ్యంలోనే మేము ప్రపంచవ్యాప్తంగా 60 పైగా రీజియన్లు, 200 పైగా డేటా సెంటర్లపై ఇన్వెస్ట్ చేస్తున్నాం. భారత్‌లో మరింతగా విస్తరిస్తున్నాం. హైదరాబాద్‌లో మా నాలుగో రీజియన్ ఏర్పాటు చేస్తున్నాం. క్లౌడ్‌ను అంతటా అందుబాటులోకి తేవాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం' అని నాదెళ్ల చెప్పారు. భారత్‌లో క్లౌడ్ వినియోగానికి భారీ అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. క్లయింట్ సర్వర్ శకంతో పోలిస్తే ప్రస్తుతం అంతా మారిపోయిందని .. అన్ని వ్యాపారాల్లోనూ క్లౌడ్ వినియోగం పెరుగుతోందని నాదెళ్ల వివరించారు. 2020 ఫిబ్రవరి తర్వాత తొలిసారిగా భారత్‌లో పర్యటిస్తున్న సత్య నాదెళ్ల .. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు నగరాలను సందర్శించనున్నారు. కస్టమర్లు, స్టార్టప్‌లు, డెవలపర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు మొదలైన వారితో సమావేశం కానున్నారు.

కృత్రిమ మేధ హవా..

ఆటోమేషన్ గురించి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కృత్రిమ మేధ చాలా కీలకంగా మారగలదని నాదెళ్ల చెప్పారు. 'ముందుగా మనకు భారీ డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండాలి. అది లేకుండా ఏఐ ప్రయోజనాలను పొందలేము. అందుకే మేము మౌలిక సదుపాయాలపై ఇన్వెస్ట్ చేస్తున్నాం' అని ఆయన తెలిపారు. ఉద్యోగులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఉండటం, మార్కెట్ శక్తులు దానికి తగ్గ ప్రోత్సాహాన్ని అందిస్తుండటం వంటి అంశాలు భారత్‌కు సానుకూలమైనవని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. రీసెర్చ్ సంస్థ ఐడీసీ గణాంకాల ప్రకారం దేశీయంగా పబ్లిక్ క్లౌడ్ సర్వీసుల మార్కెట్ 2026 నాటికి 13 బిలియన్ డాలర్లకు చేరనుంది. 2021–26 మధ్య కాలంలో ఏటా 23.1 శాతం వృద్ధి నమోదు చేయనుంది. భారత్‌లోని టాప్ క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసు ప్రొవైడర్లలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), గూగుల్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ అజూర్ ఉన్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ రాష్ట్రంలో 5204 స్టాఫ్ నర్సు పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ (ఎంహెచ్ఎస్ఆర్‌బీ).. స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 5204
- **పోస్టుల వివరాలు:** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్/డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్–3823, తెలంగాణ వైద్య విధాన పరిషత్–757, ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ–రీజనల్ క్యాన్సర్ సెంటర్–81, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ–08, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–127, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ–197, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(గురుకులం)–74, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–124, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషనల్ సొసైటీ–13.
- **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ▪ **వేతనం:** నెలకు రూ.36,750 నుంచి రూ.1,06,990 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసిన పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.02.2023
- **వెబ్‌సైట్:** mh-srb.telangana.gov.in

తెలంగాణ రాష్ట్రంలో 1365 గ్రూప్-3 పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలో 26 ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్–3 పోస్టులకు దరఖాస్తులకు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 1365
- **పోస్టుల వివరాలు:** వ్యవసాయ శాఖ–27, పశుసంవర్ధక శాఖ–02, బీసీ సంక్షేమం–27, ఇంధన శాఖ–02, పర్యావరణ శాఖ, అటవీ శాఖ–07, ఆర్థిక శాఖ–712, పౌర సరఫరాల శాఖ–16, సాధారణ పరిపాలన శాఖ–46, వైద్య, ఆరోగ్య శాఖ–39, ఉన్నత విద్య శాఖ–89, హోం శాఖ–70, పరిశ్రమలు, వాణిజ్య శాఖ–25, నీటిపారుదల శాఖ–01, కార్మిక శాఖ–33, మైనార్టీ సంక్షేమ శాఖ–06, పురపాలక శాఖ–18, పంచాయతీరాజ్ శాఖ–29, ప్రణాళిక శాఖ–03, రెవెన్యూ శాఖ–73, ఎస్సీ సంక్షేమ శాఖ–36, మాధ్యమిక విద్య శాఖ–56, రవాణా శాఖ–12, గిరిజన సంక్షేమ శాఖ–27, మహిళా శిశు సంక్షేమ శాఖ–03, యువజన సర్వీసుల శాఖ–05, గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్)–01.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 24.01.2023
- **దరఖాస్తులకు చివరి తేది:** 23.02.2023

గమనిక: ఖాళీల విభజన,వయస్సు,జీత భత్యాలు, కమ్యూనిటీ, విద్యార్హతలు తదితరాలతో కూడిన వివరణాత్మక ప్రకటన జనవరి 24న టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.

- **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

తెలంగాణ రాష్ట్రంలో 113 ఏఎంవీఐ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ▪ **మొత్తం పోస్టుల సంఖ్య:** 113

- **అర్హత:** ఇంజనీరింగ్ డిగ్రీ(మెకానికల్ ఇంజనీరింగ్/ఆటోమొబైల్) లేదా డిప్లొమా(ఆటోమొబైల్ ఇంజనీరింగ్)ఉత్తీర్ణతతోపాటు హెవీ మోటార్ వెహికల్(ట్రాన్స్‌పోర్ట్ వెహికల్) డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.**వయసు:** 01.07.2022 నాటికి 21 నుంచి 39ఏళ్ల మధ్య ఉండాలి. ▪ **వేతనం:** నెలకు రూ.45,960 నుంచి రూ.1,24,150 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్)పేపర్–1,పేపర్–2,ధ్రువపత్రాల పరిశీలన,రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**01.02.2023
- **పరీక్ష తేది:** 23.04. 2023.
- **వెబ్‌సైట్:** tspsc.gov.in

ఆర్ఆర్‌సీ-సెంట్రల్ రైల్వేలో 2422 అప్రెంటిస్‌లు

ముంబైలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ సెంట్రల్.. రైల్వే పరిధిలోని వర్క్‌షాప్‌లు /యూనిట్లలో.. వివిధ ట్రేడుల్లో 2422 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 2422
- **ట్రేడులు:** ఫిట్టర్, మెషినిస్ట్, షీట్ మెటల్ వర్కర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, మెకానిక్ మెషిన్ టూల్స్ మెయింటెనెన్స్, కంప్యూటర్ ఆపరేటర్–ప్రోగ్రామ్ అసిస్టెంట్, మెకానిక్, పెయింటర్.
- **అర్హత:** పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 15.12.2022 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **శిక్షణ కాలం:** ఒక ఏడాది.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.01.2023.
- **వెబ్‌సైట్:** www.rrccr.com

డిగ్రీతో.. డిఫెన్స్ ఆఫీసర్

» సీడీఎస్(1)-2023 నోటిఫికేషన్ విడుదల
» త్రివిధ దళాలకు చెందిన 5 అకాడమీల్లో 341 పోస్టులు
» డిగ్రీ, బీటెక్ అర్హతలతో పోటీ పడే అవకాశం
» శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టయిఫండ్

సీడీఎస్ఈ.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్!! త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకులో..ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష. ఇందులో విజయం సాధిస్తే.. కొలువు ఖరారు కావడమే కాకుండా.. శిక్షణ సమయంలోనే నెలకు రూ.56వేలకు పైగా స్టయిఫండ్ పొందొచ్చు. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతోనే సీడీఎస్‌కు పోటీపడొచ్చు. ఇటీవల యూపీఎస్సీ.. సీడీఎస్(1)-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో..సీడీఎస్ పరీక్ష వివరాలు, భర్తీ చేయనున్న పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ విశ్లేషణ..



దేశ సేవ చేయాలనే తపన, దేశ రక్షణకు పాటుపడాలనే తెగువ ఉన్నవారికి చక్కటి అవకాశం.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. ఈ పరీక్షలో విజయంతోపాటు తదుపరి ఎంపిక ప్రక్రియలో నెగ్గితే.. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ, విభాగాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో కొలువు సొంతం చేసుకోవచ్చు.

అయిదు విభాగాలు.. 341 పోస్టులు

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(1)–2023 ద్వారా త్రివిధ దళాలకు చెందిన అయిదు విభాగాల్లోని 341 పోస్టులను భర్తీ చేయనున్నారు. అవి.. ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్): 100; ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా):22; ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్): 32; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై) (పురుషులు): 170; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(మహిళలు): 17.

అర్హతలు

- **ఇండియన్ మిలటరీ అకాడెమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఇండియన్ నేవల్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివుండాలి. డీజీసీఏ జారీచేసిన కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్నవారికి రెండేళ్ల సడలింపు ఉంటుంది.
- నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- **ఇండియన్ మిలటరీ అకాడమీ:** జనవరి 2, 2000–జనవరి1, 2005 మధ్యలో జన్మించి ఉండాలి.
- **నేవల్ అకాడమీ:** జనవరి 2, 2000–జనవరి 1, 2005 మధ్యలో జన్మించి ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** జనవరి 2, 2000– జనవరి 1, 2004 మధ్యలో జన్మించి ఉండాలి(డీజీసీఏ కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్న వారికి రెండేళ్ల సడలింపు ఇస్తారు).
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ:** జనవరి 2,1999 – జనవరి 1, 2005 మధ్యలో జన్మించి ఉండాలి.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

సీడీఎస్ఈ ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. మొదట యూపీఎస్సీ సీడీఎస్ రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి.. మెరిట్ జాబితాలో నిలిస్తే.. మలి దశలో ఆయా దళాలకు చెందిన సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌లు నిర్వహించే ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియలోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే.. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగంలో కెరీర్ ఖరారవుతుంది.

రాత పరీక్ష ఇలా

- ఇండియ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు రాత పరీక్ష జరుగుతుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ తరహాలో జరిగే రాత పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులు కోత విధిస్తారు.
- ఐఎంఏ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలకు జరిగే రాత పరీక్షలో.. మూడు విభాగాలు.. ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ 100 మార్కులకు చొప్పున ఉంటాయి. ప్రతి విభాగానికి పరీక్ష సమయం రెండు గంటలు.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ జరిగే పరీక్షలో.. రెండు విభాగాలు ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు చొప్పున ఉంటాయి. వీటికి ప్రతి విభాగానికి పరీక్ష సమయం రెండు గంటలు.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.
- రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. అన్ని అకాడమీల అభ్యర్థులకు ఉమ్మడిగా అయిదు రోజులపాటు ఈ టెస్ట్ జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి టెస్టులను 6 రోజులపాటు నిర్వహిస్తారు.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

- సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో జరిగే ఎంపిక ప్రక్రియ 300 మార్కులకు ఉంటుంది. పలు రకాల పరీక్షలు, చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- మొదటి దశ స్టేజ్–1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్(ఓఐఆర్) టెస్ట్‌లు, స్టేజ్–2లో సైకాలజీ టెస్ట్‌లు, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, ఇంటర్వ్యూలు, కాన్ఫరెన్స్‌లు ఉంటాయి. వీటిని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు.
- స్టేజ్–1, స్టేజ్–2ల తర్వాత వర్డ్ అసోసియేషన్ టెస్ట్(డబ్ల్యూఏటీ), సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ (ఎస్ఆర్‌టీ)ల ద్వారా అభ్యర్థుల సమయస్ఫూర్తిని పరీక్షిస్తారు.
- చివరగా సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్(ఎస్‌డీ)లో అభ్యర్థి తన కుటుంబం, స్నేహితులు, కాలేజీ, ఉపాధ్యాయుల గురించి రాయాలి. ఈ టెస్టుల తర్వాత రెండు రోజుల పాటు 9 రకాల గ్రూప్ టాస్క్‌లు నిర్వహిస్తారు.

చివరగా ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలోని రెండు దశల్లోనూ విజయం సాధించిన అభ్యర్థులకు చివరగా.. ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూను బోర్డ్ ప్రెసిడెంట్ లేదా సీనియర్ సభ్యుడి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలోనే ఒక ప్రక్రియగా కాన్ఫరెన్స్ ఉంటుంది. ప్యానెల్ ముందు అభ్యర్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికి పీఏబీటీ ఉంటుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిస్ట్ లిస్ట్ రూపొందిస్తారు.ఈ జాబితాలో చోటు సంపాదించుకున్న విద్యార్థులకు మరోసారి శారీరక, వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు.

శిక్షణ, స్టయిఫండ్

సీడీఎస్ ఎంపిక ప్రక్రియలో నెగ్గిన అభ్యర్థులకు ఆయా అకాడమీల్లో శిక్షణ ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్)లో 18 నెలలు; నేవల్ అకాడమీలో 17 నెలలు; ఎయిర్ ఫోర్స్ అకాడమీలో 18 నెలలు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 11 నెలలు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ సమయంలో వీరికి నెలకు రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత లెఫ్టినెంట్ హోదాలో పర్మనెంట్ కొలువు సొంతమవుతుంది. నేవీలో మాత్రం ప్రారంభంలో సబ్–లెఫ్టినెంట్ హోదా లభిస్తుంది.ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షణ పొందినవారు ప్రారంభంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా విధులు చేపడతారు. ఇలా ఆయా హోదాల్లో సదరు విభాగాల్లో అడుగుపెట్టిన వారు కొన్ని నెలలు ప్రొబేషన్‌లో ఉంటారు.

విజయం సాధించాలంటే

- **ఇంగ్లిష్:** 120 ప్రశ్నలతో వంద మార్కులకు జరిగే ఇంగ్లిష్ విభాగంలో.. ఇంగ్లిష్ భాషపై పట్టును, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఆర్డరింగ్ ఆఫ్ సెంటెన్సెస్, సెంటెన్సెస్‌లో పదాల ఆర్డరింగ్, ప్యాసేజ్‌లు, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెసెస్, క్లోజ్ టెస్టు, ఫిల్‌అప్స్, అనాలజీస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్ ద ఎర్రర్స్ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్ రూల్స్ తెలుసుకోవాలి.
- **జనరల్ నాలెడ్జ్:** అభ్యర్థుల్లో సామాజిక అంశాల పట్ల ఉన్న అవగాహనను పరీక్షించే విభాగమిది. 100 మార్కులకు–120 ప్రశ్నలకు ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ,ఇండియన్ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర అన్ని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు ఎదురవుతున్నాయి.
- **ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్:**ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్ విభాగం ఉంటుంది. వంద ప్రశ్నలు–వంద మార్కులకు పరీక్ష జరిగే విభాగం ఇది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్,స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ,వాల్యూమ్ అండ్ సర్ఫేస్ ఏరియా, లీనియర్ అండ్ క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, ట్రిగనామెట్రీ, ఫ్యాక్టరైజేషన్ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ముందుగా యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:**జనవరి10,2023
- **సీడీఎస్ఈ(1)–2023 పరీక్ష తేదీ:**ఏప్రిల్16,2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in, www.upsc.gov.in



విజయవాడలోని మధురానగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రకాశం జిల్లా ఎదురాళ్లపాడులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వం



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

క్లుప్తంగా...

సకాలంలో ఉద్యోగాల నియామక ప్రక్రియ పూర్తిచేయండి

ఏపీపీఎస్సీకి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సూచన



గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్‌ను కలిసిన చైర్మన్ గౌతం సవాంగ్, తదితరులు

సాక్షి, అమరావతి: సకాలంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)కు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సూచించారు. ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్, సభ్యులు మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. ఏపీపీఎస్సీ వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరీక్షించే యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఏపీపీఎస్సీ తన కార్యాచరణను వేగవంతం చేయాలన్నారు. గౌతం సవాంగ్ మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీలో ఎదురవుతున్న న్యాయపరమైన సమస్యలను అధిగమించేందుకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. అతి త్వరలోనే మరిన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ సభ్యులు కె.విజయ్‌కుమార్, పద్మరాజు, జీవీ సుధాకర్ రెడ్డి, ఏవీ రమణారెడ్డి, పి.సుధీర్, ఎస్.సోనివుడ్, ఎస్.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు యూనిట్ల ప్రక్షాళనకు రంగం సిద్ధం

- ఒకేచోట మూడేళ్లు సర్వీసు పూర్తయిన అందరికీ బదిలీ
- ఆదేశాలు జారీ చేసిన డీజీపీ

సాక్షి, అమరావతి: జిల్లా పోలీస్ యూనిట్లను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు పోలీసు శాఖ కసరత్తు చేపట్టింది. ఒకేచోట మూడేళ్లు సర్వీసు పూర్తిచేసుకున్న పోలీసులు అందరినీ బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు ఆదేశాలు జారీచేశారు. జిల్లాల్లో కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను క్రోడీకరించనున్నారు. తాజాగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం తాత్కాలికంగా చేసిన మార్పులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ప్రత్యేక అవసరాల దృష్ట్యా ఒకచోట పోస్టింగ్ ఉన్న పోలీసులకు ఇతర ప్రాంతాల్లో విధులు కేటాయించిన వారిని కూడా ప్రత్యేకంగా పరిగణిస్తారు. ఈ విధంగా ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని బదిలీ చేసేందుకు కసరత్తును చేపడతారు. ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తిచేయాలని పోలీసు శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు సేవలను ప్రజలకు మరింత సక్రమంగా అందించే దిశగా జిల్లా పోలీసు యూనిట్లను పటిష్టం చేయాలని ఈ నిర్ణయం తీసుకుంది.

రూ.3 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం



పల్నాడు జిల్లా నరసరావుపేట లో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.3 కోట్లు విలువైన విదేశీ సిగరెట్లు

సాక్షి, అమరావతి: అక్రమంగా తరలిస్తోన్న రూ.3 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను విజయవాడ కస్టమ్స్ అధికారులు పల్నాడు జిల్లాలో మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 30 లక్షల పారిస్ బ్రాండ్ సిగరెట్లను మయన్మార్ నుంచి భారత్‌లోకి అక్రమంగా తరలించినట్లు విచారణలో వెల్లడైంది. బిహార్‌లోని ముజఫరాబాద్‌లో ఓ లారీలో వీటిని లోడ్ చేసి అక్రమంగా రవాణా చేస్తుండగా కస్టమ్స్ అధికారులు నరసరావుపేట శివార్లలో తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సిగరెట్లను గోధుమ పిండి బ్యాగుల్లో ప్యాక్ చేసి టార్పాలిన్లు కప్పి తరలిస్తున్నట్లు గుర్తించారు. వీటిపై చట్టపరమైన హెచ్చరికలు ముద్రించి లేకపోవడంతో అధికారులు లారీని జప్తు చేసి కేసు నమోదు చేశారు. కాగా, గత 6 నెలల్లో విజయవాడ కస్టమ్స్ అధికారులు.. తనిఖీల్లో రూ.1.50 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆర్బీకేల్లో 7,384 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

- అత్యధికంగా 5,188 పశుసంవర్ధక సహాయక పోస్టులు
- 1,644 ఉద్యాన సహాయకులు
- ఏపీపీఎస్సీ ద్వారా భర్తీకి ఏర్పాట్లు
- ప్రస్తుతం ఆర్బీకేల్లో 14,347 మంది సేవలు
- కొత్త పోస్టుల భర్తీతో 21,731 మందికి చేరనున్న ఆర్బీకే సిబ్బంది



సాక్షి, అమరావతి: విత్తు నుంచి విక్రయం వరకు అన్నదాతలకు విశేష సేవలందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆర్బీకేల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం చర్యలు చేపట్టింది. 660 మండలాల్లో 10,778 ఆర్బీకేలు ఏర్పాటు చేయగా వీటిలో 14,347 మంది సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో ఇంకా శాఖల వారీ ఖాళీగా ఉన్న 7,384 పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఆర్బీకేల ఏర్పాటు సమయంలో మంజూరు చేసిన పోస్టుల సంఖ్యను బట్టి శాఖల వారీగా ఖాళీలను గుర్తించారు. అత్యధికంగా 5,188 పశుసంవర్ధక సహాయక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి తర్వాత 1,644 ఉద్యాన, 467 వ్యవసాయ, 63 మత్స్య, 22 పట్టు సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్టుగా లెక్కతేల్చారు. ఏపీపీఎస్సీ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటికి త్వరలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పోస్టులను కూడా భర్తీ చేస్తే ఆర్బీకేల్లో పనిచేసేవారి సంఖ్య 21,731కి చేరుతుంది.

ఆర్బీకేలకు ఇన్‌చార్జ్‌లుగా..

ప్రస్తుతం ఆర్బీకేల్లో పనిచేస్తున్న మొత్తం 14,347 మందిలో ప్రధానంగా 6,291 మంది వ్యవసాయ, 2,356 మంది ఉద్యాన, 4,652 మంది పశుసంవర్ధక, 731 మంది మత్స్య, 317 మంది పట్టు సహాయకులు ఉన్నారు. స్థానికంగా వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా, పట్టు సాగు విస్తీర్ణాన్ని బట్టి ఆయా శాఖల సహాయకులు స్థానిక ఆర్బీకేలకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. మెజార్టీ ఆర్బీకేల్లో వ్యవసాయ, ఉద్యాన సహాయకులే ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారు. కొన్నిటిలో మాత్రం పట్టు, మత్స్య సహాయకులు ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తున్నారు. ఇతర పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి ఆయా శాఖలకు చెందిన సహాయకులు సెకండ్ ఇన్‌చార్జిలుగా సేవలందిస్తున్నారు. మెజార్టీ ఆర్బీకేల పరిధిలో పాడి సంపద ఉండడంతో ప్రతి ఆర్బీకేకు ఓ పశుసంవర్ధక సహాయకుడు చొప్పున కేటాయించారు. ఇలా దాదాపు మెజార్టీ ఆర్బీకేల్లో ఒకరు లేదా ఇద్దరు చొప్పున సేవలు అందిస్తున్నారు.

ఇప్పటికే సీఎం ఆదేశాలు..

ఈ–క్రాప్, ఈ–కేవైసీ, పొలం బడులు, తోట, మత్స్య సాగు బడులు, పశువిజ్ఞాన బడుల నిర్వహణతో పాటు ఇతర రైతు ప్రాయోజిత కార్యక్రమాల అమలు కోసం ఆర్బీకే సిబ్బంది క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్తున్నారు. ఇలాంటి సమయంలో ఆర్బీకేలకు వచ్చే రైతులకు ఆటంకాలు లేకుండా సేవలందించడానికి స్థానికంగా చురుగ్గా ఉండే వలంటీర్‌ను ఆర్బీకేలకు అనుసంధానించారు. మరోవైపు గ్రామ స్థాయిలో బ్యాంకింగ్ సేవలందించే సంకల్పంతో 9,160 బ్యాంకింగ్ కరస్పాండెంట్‌లను కూడా ఆర్బీకేలకు అనుసంధానం చేశారు. వన్ స్టాప్ సొల్యూషన్ సెంటర్స్‌గా వీటిని తీర్చిదిద్దడంతోపాటు రైతులకు అందించే సేవలన్నింటినీ ఆర్బీకేలు కేంద్రంగా అందిస్తున్నారు. దీంతో ఆర్బీకేల్లో సిబ్బందిపై పనిఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ మేరకు ఆదేశాలు కూడా జారీ చేశారు.

సచివాలయాల్లోనూ..

ఆర్బీకేలతో పాటు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం త్వరలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సంక్రాంతిలోగా నోటిఫికేషన్ ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రతి ఆర్బీకేలో స్థానికంగా ఉండే పాడిపంటలను బట్టి సిబ్బంది ఉండేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వాటికనుగుణంగా ఖాళీ పోస్టుల భర్తీ కోసం చర్యలు చేపట్టాం.

–వై.మధుసూదనరెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ

పోలవరం వ్యయం రూ.20,744 కోట్లు

- విడుదల చేసింది రూ.13,226.04 కోట్లు
- వార్షిక నివేదికలో జలశక్తి శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు డిసెంబర్ 15, 2022 వరకూ రూ.20,744 కోట్లు ఖర్చయిందని వార్షిక నివేదికలో జలశక్తి శాఖ పేర్కొంది. పనుల నిమిత్తం ఇప్పటి వరకూ రూ.13,226.04 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొంది. 2017–18 ధరల ప్రకారం ప్రాజెక్టుకు ఆమోదించిన అంచనా వ్యయం రూ.47,725.74 కోట్లు అని స్పష్టం చేసింది. కేంద్రం తరఫున ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు నీటి పారుదల విభాగాన్ని అమలు చేస్తోందని పేర్కొంది. 2,454 మీటర్ల ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్, 1,128.4 మీటర్ల పొడవైన స్పిల్ వేతో తూర్పు, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, కృష్ణా జిల్లాల్లో 2.91 లక్షల హెక్టార్లకు సాగు నీరు అందించడంతోపాటు పలు ఇతర ప్రయోజనాల కోసం ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపింది. 2022లో వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్ విభాగంలో భారతదేశం గెలుచుకున్న నాలుగు అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఒకటని తెలిపింది.

రోడ్ షోలు, సభల నిషేధం మంచిదే

- చంద్రబాబు సభల్లో విషాదంతోనే ప్రభుత్వ నిర్ణయమని భావిస్తున్నాం
- ఏపీ ప్రజలను దుర్భాషలాడిన తెలంగాణ సీఎం కేసీఆర్..
- ఏ మొహం పెట్టుకుని బీఆర్‌ఎస్ పేరుతో ఓట్లడుగుతారు
- విభజన హామీలు నెరవేర్చిన తర్వాతే ఏపీ ప్రజల ముందుకు రావాలి
- బీజేపీ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): రాష్ట్రంలో రోడ్ షోలు, సభలపై ప్రభుత్వం నిషేధం విధించడం మంచి పరిణామమని బీజేపీ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు చెప్పారు. విశాఖలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోడ్ షోలు, సభలను నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు సభల్లో చోటుచేసుకున్న విషాదాల నేపథ్యంలో ప్రజలకు మంచి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. అలాకాకుండా ప్రతిపక్షాలను కట్టడి చేయడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉంటే అది సమర్థనీయం కాదన్నారు. బీఆర్‌ఎస్ పేరుతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏపీ ప్రజలను ఏ మోహం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజనప్పుడు, అనేక సందర్భాల్లో కేసీఆర్ ఏపీ ప్రజలను అవమానించారని చెప్పారు. ఏపీ ప్రజలను కుక్కలతో పోల్చడంతోపాటు 24 గంటల్లో ఏపీ ప్రజలను తరిమికొట్టాలి.. వంటి విద్వేషపూరిత నినాదాలు చేశారని గుర్తుచేశారు. పోలవరం ఎత్తు పెంచొద్దంటూ మోకాలడ్డిన కేసీఆర్ తన పార్టీ అధికారంలోకి వస్తే పోలవరం పూర్తిచేస్తామనడం హాస్యాస్పదమన్నారు. కృష్ణా జలాలను అక్రమంగా వాడుకోవడంతోపాటు శ్రీశైలం పవర్ ప్రాజెక్టు ద్వారా అక్రమంగా విద్యుత్ పొందుతున్నారని ఆరోపించారు. రెండు రాష్ట్రాలు విభజన అంశంపై 29 సార్లు సమావేశమైతే ఒక్క సమస్య పరిష్కారానికీ తెలంగాణ ప్రభుత్వం సహకరించలేదన్నారు. విభజన చట్టంలో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన విద్యుత్ బకాయిలను కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ఇక్కడి ప్రజలకు తీరని ద్రోహం చేసిన కేసీఆర్ ఇప్పుడు బీఆర్‌ఎస్ పేరుతో మరోసారి ప్రజలను మోసం చేస్తానంటే ఊరుకునేది లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్‌లోని వారి ఆస్తులను కాపాడుకునేందుకే కేసీఆర్‌పై విమర్శలు చేయడంలేదని పేర్కొన్నారు. వారి ఆస్తులకు నష్టం వాటిల్లకూడదనే కేసీఆర్ నిర్ణయాలను వ్యతిరేకించే ప్రయత్నం చేయలేకపోతున్నారని ఆరోపించారు. కేసీఆర్ నీచ రాజకీయాలను తమ పార్టీ ఉపేక్షించబోదని చెప్పారు. బీఆర్‌ఎస్ పేరుతో ఏపీలో కేసీఆర్ కార్యకలాపాలు సాగించాలంటే తొలుత పోలవరంపై కేసు విత్‌డ్రా చేసుకోవడంతోపాటు విభజన హామీలు అమలు చేసి తీరాలన్నారు. ఆ తర్వాతే ఏపీ ప్రజల ముందుకు రావాలన్నారు. ఏపీ హక్కులను కాలరాసి ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తామంటే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తనువు లేకున్నా.. తనుంది!

- బ్రెయిన్ డెడ్‌తో ప్రొద్దుటూరు యువతి మృతి
- ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యుల అవయవ దానం
- మరికొందరికి జీవితాన్నిచ్చిన దేవరశెట్టి సుచిత్ర



దేవరశెట్టి సుచిత్ర

ప్రొద్దుటూరు క్రైం: తాను చనిపోయినా.. తన శరీరంలోని అవయవాలు పది మందికి ఉపయోగపడాలనే ఆమె గొప్ప ఆలోచన పలువురికి ప్రాణం పోసింది. అవయవ దానంతో యువతి ఆదర్శంగా నిలవడమే కాకుండా మరికొందరికి కొత్త జీవితాన్ని అందిస్తున్నది. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దేవరశెట్టి సుచిత్ర (25) అనే యువతి బ్రెయిన్ డెడ్‌తో సోమవారం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందింది. ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు అవయవదానం చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరులోని శ్రీరాంనగర్‌కు చెందిన దేవరశెట్టి నరసింహులు, అనురాధ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. వారిలో పెద్ద కుమార్తె రూపశరణ్య, చిన్న కుమార్తె సుచిత్ర. సుచిత్ర స్థానికంగా బీ ఫార్మసీ పూర్తి చేసింది. కొన్ని నెలల క్రితం నుంచి బెంగళూరులో ఉద్యోగం చేస్తుండగా, రూపశరణ్య బీటెక్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. నరసింహులు విద్యుత్‌శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. సుచిత్రకు డిసెంబర్ 31న తీవ్ర తలనొప్పిగా ఉందని చెప్పడంతో స్నేహితులు, తోటి ఉద్యోగులు హుటాహుటిన ప్రొద్దుటూరుకు తీసుకొచ్చారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించి వైద్యుల సూచన మేరకు ఎమ్‌ఆర్‌ఐ స్కానింగ్ చేయించారు. బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టిందని స్కానింగ్‌లో నిర్ధారణ కావడంతో తల్లిదండ్రులు సుచిత్రను వెంటనే హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆపరేషన్ జరిగినా కోలుకోలేక సుచిత్ర సోమవారం మృతి చెందింది. కాగా తమ కుమార్తె మరణానంతరం అవయవ దానం కోసం రిజిస్టర్ చేయించిందనే విషయాన్ని కుటుంబ సభ్యులు ఆస్పత్రి వైద్యులకు తెలిపారు. దీంతో కిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి యువతి శరీరంలోని నేత్రాలు, గుండె, మూత్రపిండాలు, వెన్నెముకను సేకరించి భద్రపరిచారు. మంగళవారం సాయంత్రం ప్రొద్దుటూర్చులో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్‌సెట్‌లో ఏ, బీ కేటగిరీలకు సమానంగా సీట్లు

- 50 శాతం ఏ–కేటగిరీకి, 50 శాతం బీ–కేటగిరీకి..
- ఉత్తర్వులు జారీచేసిన ఉన్నత విద్యాశాఖ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీఆర్‌సెట్‌లో సీట్ల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం కొన్ని సవరణలు చేసింది. పీహెచ్‌డీ కోర్సుల్లోని సీట్లలో 50 శాతం ఏ–కేటగిరీలో, బీ కేటగిరీలో 50 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి జె.శ్యామలరావు జీవో నంబర్–1 విడుదల చేశారు. పీహెచ్‌డీ కోర్సుల్లో అడ్మిషన్లను గతంలో ఆయా యూనివర్సిటీలే నేరుగా నిర్వహించేవి. కానీ గత ఏడాది నుంచి అన్ని యూనివర్సిటీలకు కలిపి ఉన్నత విద్యామండలి ద్వారా ఆర్‌సెట్‌ను నిర్వహించి అందులో అర్హత సాధించిన వారికి సీట్లు కేటాయిస్తున్నారు. ఈ సీట్లను ఏ, బీ కేటగిరీలుగా భర్తీ చేస్తున్నారు. ఏ–కేటగిరీ సీట్లను జాతీయ స్థాయిలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్వహించే నెట్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్‌ఐఆర్) యూజీసీ నెట్, ఐఐటీ జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్), రాష్ట్రస్థాయిలో నిర్వహించే స్టేట్ లెవల్ ఎలిజిబులిటీ టెస్ట్ (సెట్) తదితర ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన వారితో ఆర్‌సెట్‌లో మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తుంటారు. ఇక బీ–కేటగిరీ సీట్లను ఆర్‌సెట్‌లో మెరిట్ సాధించిన పీజీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు కేటాయిస్తుంటారు. గతంలో ఇచ్చిన జీవో నంబర్ 45 ప్రకారం ఆర్‌సెట్‌లోని సీట్లలో ఏ–కేటగిరీ అభ్యర్థులతో 25 శాతం సీట్లను, మరో 75శాతం సీట్లను బీ–కేటగిరీ అభ్యర్థులతో భర్తీ చేసేవారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన తమకు 25 శాతం సీట్లు ఇవ్వడం వల్ల నష్టపోతున్నామని పలువురు అభ్యర్థులు విన్నవించడంతో ప్రభుత్వం రెండు కేటగిరీలకు సమానంగా సీట్లు వచ్చేలా 50 శాతం చొప్పున కేటాయింపు చేసింది. ఈ మేరకు గత జీవోను సవరిస్తూ కొత్తగా జీవో నంబర్–1ని విడుదల చేశారు. ఒక కేటగిరీలో మిగిలిన సీట్లను మరో కేటగిరీలోని అభ్యర్థుల ద్వారా భర్తీ చేసే వెసులుబాటు కల్పించారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌పై మంత్రుల కమిటీ

సాక్షి, అమరావతి: ఏపీలో భారీ పెట్టుబడులను ఆకర్షించి తద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది మార్చి3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)ను విజయవంతం చేయడానికి ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. ఇందుకుగాను మంత్రులు బుగ్గన, గుడివాడ అమరనాథ్‌లతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. అవసరమైన పక్షంలో ఇతర మంత్రులను ప్రత్యేక ఆహ్వానితులుగా మంత్రుల కమిటీ సమావేశాలకు హాజరుకావచ్చని పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కాగా, జీఐఎస్ నిర్వహణ ఏర్పాట్లను మంత్రుల కమిటీ పర్యవేక్షిస్తుంది. ఇప్పటికే జీఐఎస్ నిర్వహణకు సీఎస్ నేతృత్వంలో 19 మందితో ఏర్పాటు చేసిన వర్కింగ్ కమిటీకి మంత్రుల కమిటీ మార్గదర్శకత్వం చేస్తుంది.

రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా బల్లి కళ్యాణ్



గూడూరు (తిరుపతి జిల్లా): డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి రెండోసారి నియమితులయ్యారు. బెంగుళూరు డివిజన్‌కు నామినేట్ అయిన కళ్యాణ్ చక్రవర్తికి పలువురు అభినందనలు తెలిపారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి సూచన

సాక్షి, అమరావతి: డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సూచించారు. సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన 27వ రాష్ట్ర స్థాయి కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సీఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోజురోజుకు పెరుగుతున్న డిజిటల్, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల మోసాల విషయంలో ప్రజలు పూర్తి అవగాహనతో, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మోసాలను నియంత్రించేందుకు జాతీయ స్థాయిలో ఒక పరిష్కార మార్గాన్ని రూపొందించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా ఆర్బీఐ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మోసాలను అరికట్టేందుకు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అగ్రిగోల్డ్, అక్షయగోల్డ్, అభయగోల్డ్, హీరా, కపిల్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు, సహారా, ప్రగతి, అవని, ఆదర్శ్ తదితర కోఆపరేటివ్ సొసైటీలకు సంబంధించిన కేసుల ప్రగతిపైనా సమావేశంలో చర్చించారు. కేసులను ఒక నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సీఎస్ స్పష్టంచేశారు.

ఉపాధి, ఉద్యోగ కల్పనకు లైఫ్ స్కిల్స్ కోర్సులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు తమ చదువులు ముగించుకుని బయటకు రాగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కించుకునేలా స్కిల్ డెవలప్‌మెంట్, లైఫ్ స్కిల్స్ కోర్సులకు విద్యాశాఖ శ్రీకారం చుడుతోంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులైన బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు తప్పనిసరిగా ఈ స్కిల్ డెవలప్‌మెంట్, లైఫ్ స్కిల్స్ కోర్సులను కూడా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం.. కొత్తగా 17 రకాల స్కిల్ డెవలప్‌మెంట్, లైఫ్ స్కిల్స్ అంశాలను కాలేజీ విద్యా విభాగం గుర్తించింది. వీటి సిలబస్‌తో పుస్తకాలను అందుబాటులోకి తెచ్చేందుకు కాలేజీ విద్య కమిషనర్ పోలా భాస్కర్ సన్నాహాలు చేపట్టారు. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కేలా ఇప్పటికే అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. జవహర్ నాలెడ్జి సెంటర్ల (జేకేసీ) ద్వారా నిర్వహించిన పలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్లలో వేలాది మందికి అవకాశాలు దక్కాయి.

లైఫ్ స్కిల్స్‌లో 4 కోర్సులు

కాగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో 13 కోర్సులు, లైఫ్ స్కిల్స్ విభాగంలో 4 కోర్సులను రూపొందించారు.



లైఫ్ స్కిల్స్ కోర్సుల విభాగంలో.. హ్యూమన్ వ్యాల్యూస్ అండ్ ప్రొఫెషనల్ ఎథిక్స్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఎనలిటికల్ స్కిల్స్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ఉన్నాయి. లైఫ్ స్కిల్స్ కోర్సులు అందరు విద్యార్థులకు ఒకే రకంగా ఉంటాయి.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో 13 కోర్సులు..

ఇందులో మూడు విభాగాలుగా కోర్సులను ప్రవేశపెడుతున్నారు. స్ట్రీమ్–ఏ ఆర్ట్స్ విభాగంలో టూరిజం గైడెన్స్, సర్వే అండ్ రిపోర్టింగ్, సోషల్ వర్క్ మెథడ్స్, ఫైనాన్షియల్ మార్కెట్స్ ఉన్నాయి. అలాగే స్ట్రీమ్–బీ కామర్స్ విభాగంలో ఇన్సూరెన్స్ ప్రమోషన్, బిజినెస్ కమ్యూనికేషన్, లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, రిటైలింగ్ కోర్సులు ఉన్నాయి. స్ట్రీమ్–సీ సైన్స్ విభాగంలో ఎలక్ట్రికల్ అప్లయెన్సెస్, ప్లాంట్ నర్సరీ, సోలార్ ఎనర్జీ, డెయిరీ టెక్నిక్స్, పౌల్ట్రీ ఫార్మింగ్ ఉన్నాయి. వీటిలో సెమిస్టర్ల వారీగా ఆయా అంశాలను విద్యార్థులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దేలా..

డిగ్రీ కాలేజీల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొనేలా ప్రభుత్వం ఇప్పటికే అనేక సంస్కరణలను చేపట్టింది. జాబ్ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఆక్వాకల్చర్ వంటివి వీటిలో ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి కూడా అధ్యయనం చేసేందుకు వీలుగా లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్‌ఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చింది. దీనిలో 700 వీడియో పాఠాలను అప్‌లోడ్ చేయించింది. విద్యార్థుల్లో ఇంగ్లిష్ నైపుణ్యాన్ని పెంచేందుకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ ల్యాబ్స్ (ఈఎల్‌ఎల్)ను ప్రవేశపెట్టింది. 72 కాలేజీల్లో ఈఎల్‌ఎల్‌లు ఏర్పాటయ్యాయి. ప్రఖ్యాత ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ద్వారా కోర్సులను ఆన్‌లైన్ ద్వారా అందించడానికి ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది.

144 కాలేజీల్లో వర్చువల్ తరగతులు

విద్యార్థులకు ఉన్నత పరిజ్ఞానంతో కూడిన అంశాల బోధనకు వీలుగా 144 కాలేజీల్లో వర్చువల్ తరగతులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అలాగే 132 కాలేజీల్లో జవహర్ నాలెడ్జి సెంటర్లను కూడా ఏర్పాటు చేశారు. 56 కాలేజీల్లో డిజిటల్ తరగతులను ప్రవేశపెట్టారు. జిల్లా రిసోర్స్ కేంద్రాల ద్వారా విద్యార్థులు ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న బోధన ఎలా ఉందో తెలుసుకునేందుకు ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. 'స్టూడెంట్ శాటిస్‌ఫ్యాక్షన్ సర్వే' పేరుతో లెక్చరర్లు ఎలా చెబుతున్నారో విద్యార్థుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నారు. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ ఆడిట్‌ను నిర్వహిస్తూ కాలేజీల్లో సిబ్బంది సామర్థ్యాలను సైతం పెంచుతున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
బుధవారం । 4 । జనవరి । 2023




ఎప్పుడైనా భక్తసంద్రమే: విజయపుర సిద్దేశ్వర స్వామి అస్తమయంతో లక్షలాది భక్తులు శోకతప్తులయ్యారు. విజయపురలో ఇటీవల ఓ ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు. (కుడిచిత్రం) మంగళవారం స్వామి అంతిమయాత్రలో పాల్గొన్న వేలాది భక్తజన సమూహం

న్యూస్‌రీల్

సుబ్రమణ్యునికి ఖాకీ సేవ



పల్లకీ మోస్తున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: ప్రసిద్ధ ఘాటి సుబ్రమణ్య క్షేత్రంలో మంగళవారం నాడు రాజవీధి ఉత్సవం ఘనంగా జరిగింది. బ్రహ్మ రథోత్సవం జరిగిన తరువాత పోలీసుల ఆధ్వర్యంలో రాజవీధి ఉత్సవం జరపడం ఆనవాయితీ. జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి, ఏఎస్పీ పురుషోత్తం, సీఐలు మునికృష్ణ, హరీష్ పాల్గొని స్వామివారి పల్లకీ మోశారు. వీరితో పాటు బీడీఏ అధ్యక్షుడు, యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్, సతీమణి వాణిశ్రీ విశ్వనాథ్, భక్తులు కూడా ఉత్సవంలో పాల్గొన్నారు.

చర్చి విధ్వంసం కేసులో నిందితుడు అరెస్టు

మైసూరు: మైసూరు జిల్లాలోని పిరియాపట్టణలోని గోణికొప్ప రోడ్డులో ఉన్న సెయింట్ మేరీస్ చర్చిలో డిసెంబర్ 27వ తేదీన బాలయేసు విగ్రహాన్ని ధ్వంసం చేసి మూడు హుండీలను చోరీ చేసిన కేసులో నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక మహాదేశ్వర లేఔట్‌లో నివాస ఉంటున్న పౌర కార్మికుడు విశ్వ(24) నిందితుడు. ఆ రోజు సంఘటనా స్థలంలో పోలీసులకు చేతి తొడుగులు లభించాయి. వాటిని బట్టి నిందితుడు ఎవరై ఉంటారో గుర్తించారు. వెంటనే పౌర కార్మికుల కాలనీలో 100 మందికి పైన ఉన్న యువకులను విచారణ చేయగా విశ్వ బండారం బయటపడింది. గతంలో ఇతడు అదే చర్చిలో పని చేశాడని చెప్పాడు. దానికి సంబంధించిన డబ్బులు ఫాదర్ ఇవ్వలేదనే కోపంతో ఈ అపచారానికి పాల్పడ్డాడు. పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ఆరు తరాల బామ్మ.. సొణ్ణమ్మ

- ఘనంగా 106వ పుట్టిన రోజు



అవ్వ పుట్టిన రోజు సంబరం

కోలారు: అందరూ పుడతారు కానీ వందేళ్లు బతికేది చాలా తక్కువమందే. ఆ వందేళ్ల జీవితంలో ఏమి సాధించారన్నది అనవసరం. కానీ అంత సుదీర్ఘకాలం జీవించి ఉండడం మాత్రం ఘనతే అని చెప్పాలి. కోలారు తాలూకాలోని కొళగంజనహళ్లికి చెందిన సొణ్ణమ్మ అనే శతాయుష్కురాలు 106 వసంతాలు పూర్తి చేసుకుని మంగళవారం తన అశేష కుటుంబ సభ్యుల మధ్య పుట్టిన రోజు వేడుకను జరుపుకుంది.

నేటికీ ఆరోగ్యంగా

ఆరు తరాలను చూసిన ఈ బామ్మ నేటికీ ఎంతో ఆరోగ్యంగా ఉండి నేటి తరానికి ఆదర్శంగా నిలిచింది. ఈమెకు 30 మంది మనుమలు, 20 మంది మునిమనుమలు ఉన్నారు. సొణ్ణమ్మకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం ఉన్నారు.

ఆఖరి రోజుల్లో సర్కారు: డీకే

శివాజీనగర: బీజేపీ ప్రభుత్వం ఆఖరి రోజుల్లో ఉందని, ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రజలకు తెలియజేస్తామని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అన్నారు. మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడిన ఆయన, బీజేపీ అగ్రనేత అమిత్ షా మాటలను తాము పట్టించుకోవడం లేదని, అయితే రాష్ట్ర బీజేపీలో నాయకత్వం లేదని ఆయన చెప్పడాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. తరచూ ప్రధాని మోదీ, అమిత్ షాలు రాష్ట్రానికి రావడం అంటే ఇక్కడి బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందినట్లు అర్థమన్నారు. జనవరి 11 నుంచి రాష్ట్ర పర్యటనను ప్రారంభిస్తానని తెలిపారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితాలు

- కేంద్ర ఎన్నికల అధికారులు

బనశంకరి: కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికలు -2023 నేపథ్యంలో ఎన్నికల అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ అజయ్‌బాదూ, కార్యదర్శి బీసీ పాత్ర మంగళవారం బెంగళూరులో ఈసీ అధికారులతో సమావేశమయ్యారు. మొత్తం నియోజకవర్గాల్లో ఈ నెలలో ప్రకటించే ఓటర్ల జాబితా గురించి ఎక్కువగా చర్చించారు. మృతిచెందిన ఓటర్ల తొలగింపు, అడ్రస్‌ల మార్పులు చేర్పులు, యువ ఓటర్ల పేర్లు చేర్చడం గురించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఓటర్ల తుది జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు జిల్లాల్లో పర్యటించి ప్రతి ఇంటినీ సందర్శించి తప్పులు జరగకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మనోజ్ కుమార్‌మీనా, అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌కుమార్, పీ.రాజేంద్రచోళన్ పాల్గొన్నారు.

వాహనరంగం జోరు

- గతేడాదిలో 30 శాతం పెరిగిన రిజిస్ట్రేషన్లు
- గత రెండేళ్ల కంటే అధికం
- ప్రభుత్వానికి రూ. 8,648 కోట్ల రాబడి



బెంగళూరులో ఆధునిక ద్విచక్ర వాహనాలతో నగరవాసులు

సాక్షి, బెంగళూరు: అవసరం, ఆదాయం పెరగడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరూ సొంత వాహనాల కోసం అర్రులు చాస్తున్నారు. ఫలితంగా వాటి అమ్మకాలు ఎగబాకాయి. 2021 ఏడాదితో పోలిస్తే 2022లో రాష్ట్రంలో వాహన రిజిస్ట్రేషన్ల సంఖ్య 30 శాతం మేర పెరిగింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2022లో 15.3 లక్షల వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. కాగా, 2021లో ఆ సంఖ్య 11.7 లక్షలుగా ఉండగా 2020లో 12 లక్షలు, 2019లో 15.7 లక్షలుగా ఉంది.

2021 కంటే 38 శాతం ఎక్కువ ఆర్జన

- గతేడాది రిజిస్ట్రేషన్ల వల్ల 2022లో రవాణా శాఖ వార్షిక ఆదాయం రూ. 8,648 కోట్లుగా నమోదైంది. 2021తో పోలిస్తే 38 శాతం పెంపు (రూ. 6,263 కోట్లు) నమోదైంది. ఇది 2020లో రూ. 4,996 కోట్లు, 2019లో రూ. 5,864 కోట్లుగా ఉండేది.
- కోవిడ్, లాక్‌డౌన్ సమస్యల కారణంతో 2020, 21లో వాహనాల అమ్మకాలు కొంచెం తగ్గిపోయాయి. ఆపై కోవిడ్ వ్యాప్తి భయం వల్ల ఎక్కువమంది బైక్‌లు, కార్లు వంటి వ్యక్తిగత వాహనాలను కొనుగోలుకు ప్రయత్నించారు.
- గణాంకాల ప్రకారం అత్యధిక ఆదాయం బెంగళూరు దక్షిణం ఆర్టీవో (జయనగర) నుంచి ప్రభుత్వానికి వచ్చింది.

రాష్ట్రంలో 2.9 కోట్ల వాహనాలు

- రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 2.9 కోట్ల వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఇందులో సగానికి పైగా ద్విచక్ర వాహనాలున్నాయి. దేశంలో అత్యధిక రోడ్డు పన్ను విధిస్తున్న రాష్ట్రాల్లో కర్ణాటక కూడా ఉండడం గమనార్హం. రవాణాశాఖ రాబడిలో సగానికి పైగా ఆదాయం బెంగళూరు నుంచే లభిస్తుండడం గమనార్హం. బెంగళూరులోనే కోటికి పైగా వాహనాలు ఉన్నాయి.
- 2022 అక్టోబర్‌లో గరిష్ఠంగా 1.6 లక్షల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి.
- ఆ తర్వాత నవంబర్‌లో 1.5 లక్షల వాహనాలు అమ్ముడయ్యాయి. ఈ రెండు నెలలు మంగళకరంగా ప్రజలు భావిస్తున్నారు. డిసెంబర్‌లో ఈ సంఖ్య మళ్లీ 1.1 లక్షకు తగ్గిపోయింది. ఆపై జనవరి నుంచి ఊపందుకోవచ్చని అంచనా.

సిటీలో యథేచ్ఛగా ఫ్లెక్సీలు, బ్యానర్లు

- హైకోర్టు ఆదేశాలకు గండి



బ్యానర్లు అంతటా వెలిశాయి.

బనశంకరి: సిలికాన్ సిటీ సౌందర్యానికి అడ్డుగా ఉన్నాయని, ప్రజలకు ప్రమాదకరంగా మారాయని పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను అటు బీబీఎంపీ, ఇటు హైకోర్టు నిషేధించడం తెలిసిందే. కానీ కొందరు యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. న్యూ ఇయర్, త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చోటామోటా నాయకులు, కార్యకర్తలు రాత్రికి రాత్రి ఫ్లెక్సీలు, బ్యానర్లను అమరుస్తున్నారు. సిటీలో పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు ఫోటోలు, పేర్లతో పుట్టిన రోజులు, కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెబుతూ అమర్చిన ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ లెక్కచేయకుండా రాజకీయనేతలు, వారి అభిమానులు ప్రవర్తిస్తున్నారు. శాంతినగర నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్ఏ హ్యారీస్ మద్దతుదారులు, దుమ్మలూరు రాజ్‌కుమార్ పార్కు ముందు భారీ ఫ్లెక్సీని వేశారు. కంఠీరవ రాజ్‌కుమార్ విగ్రహానికి అడ్డంగా ఫ్లెక్సీని కట్టడంపై విమర్శలు వచ్చాయి. ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లు, పార్టీనేతలు , కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు అంతటా వెలిశాయి.

సందర్భం వస్తే చాలు

జయంతులు వంటి ప్రముఖ దినాలు, జాతీయ, రాష్ట్రనేతలు నగరంలో పర్యటించే సమయంలో ఫ్లెక్సీలకు అడ్డే ఉండడం లేదు. రోడ్లలోని ప్రముఖ సర్కిల్స్‌లో బ్యానర్లు, ఫ్లెక్సీలను చూస్తూ వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా బీబీఎంపీ అధికారులు కళ్లుమూసుకుని కొందరు నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, బెంగళూరు 8 వలయాల్లో అధికారులు బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని సూచించినట్లు బీబీఎంపీ రెవిన్యూశాఖ ప్రత్యేక కమిషనర్ దీపక్ తెలిపారు.

మహిళపై కారు ఎక్కించి హత్య

- మండ్య జిల్లాలో భూ వివాదంలో ఘోరం



జయలక్ష్మి మృతదేహం

మండ్య: రెండు కుటుంబాల మధ్య ఉన్న వ్యవసాయ భూమి గొడవలో మహిళ పైన కారు ఎక్కించి హత్య చేశారు. ఈ దారుణం మండ్య జిల్లాలోని నాగమంగళ తాలుకాలోని బెళ్ళూరు సమీపంలో ఉన్న గాణసంద్ర గ్రామంలో జరిగింది. బెంగళూరులో నివసించే గాణసంద్రవాసి రామకృష్ణయ్య భార్య జయలక్ష్మి (50) హతురాలు.

పొలం పనులు చేయిస్తుండగా

వివరాలు.. జయలక్ష్మికి గత 10 సంవత్సరాల క్రితం గాణసంద్ర గ్రామంలో సర్వే నంబర్ 84లో బంజరు భూమిని ప్రభుత్వం ఇవ్వగా ఆమె సాగు చేస్తోంది. అయితే భూమి తమదని గౌడయ్య అతని కుటుంబ సభ్యులు అనేకసార్లు జయలక్ష్మితో గొడవ పెట్టుకున్నారు. బోర్లను కూడా ధ్వంసం చేశారు. మంగళవారం జయలక్ష్మి బెంగళూరు నుంచి వచ్చి ట్రాక్టర్‌తో పొలం పనులు చేయిస్తుండగా గౌడయ్య, కుమారుడు అనిల్ సహా 8 మంది దాడి చేశారు. జయలక్ష్మి మీదకు అనిల్ కారుతో దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ట్రాక్టర్ డ్రైవర్, కూలీలను కొట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

మిక్సీ బాంబ్ కేసులో వ్యక్తి అరెస్ట్

యశవంతపుర: హాసన్ పట్టణంలోని కువెంపునగరలో ఓ కొరియర్ కార్యాలయంలో జరిగిన మిక్సీ బాంబ్ పేలుడుకు సంబంధించి అనూప్‌కుమార్ అనే వ్యక్తిని బెంగళూరులో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ హరిరాం శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన హాసనలో విలేకర్లతో మాట్లాడారు. మహిళ వసంత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఈ నెల 7 వరకు కోర్టు పోలీసుల కస్టడీకి అప్పగించింది. అనూప్‌కు మిక్సీలో డిటోనేటర్ అమర్చటానికి సహకరించింది ఎవరు, సరఫరా చేసింది ఎవరనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. బెంగళూరు నుంచి మిక్సీ హాసన్‌కు ఎలా వచ్చిందనే కోణంలో అనూప్ నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

12న చిక్కలో బృహత్ ఉద్యోగ మేళా

చిక్కబళ్లాపురం: జనవరి 12న చిక్కబళ్లాపురంలో ఎస్‌జెసిఐటి కాలేజీలో బృహత్ ఉద్యోగ మేళా జరుగుతుందని వైద్య ఆరోగ్య మంత్రి సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో జనవరి 7 నుంచి 14వ తేదీ వరకు చరిత్రలో నిలిచిపోయేలా వైభవంగా చిక్కబళ్లాపురం ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. సీఎం బొమ్మై ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా 12న పెద్ద ఎత్తున ఉద్యోగ మేళా జరుగుతుందని, 7వ తరగతి నుంచి ఇంజనీరింగ్ పట్టభద్రుల వరకూ పాల్గొనవచ్చని, 105కు పైగా ప్రముఖ కంపెనీలు హాజరవుతాయని చెప్పారు.

చెలువరాయునికి ముక్కోటి ద్వాదశి పూజలు



స్వర్ణ కవచం అలంకరణలో చెలువ నారాయణస్వామి

మండ్య: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మేలుకోటి చెలువనారాయణ స్వామివారు మంగళవారం బంగారు కవచ ధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. మేలుకోటెలో వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేయడం ఉండదు. అందుకు బదులుగా మంగళవారం ముక్కోటి ద్వాదశి కావడంతో స్వామిని అలంకరించి పూజలు చేశారు. చెలువనారాయణ స్వామి సాక్షాత్తు మహావిష్ణువు అవతారం అయినందున మేలుకోటెను భూ వైకుంఠంగా వర్ణిస్తూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

అంతం చేసింది అత్త కొడుకే

- విద్యార్థిని లయస్మిత హత్య కేసు విచారణ వేగవంతం
- నిందితుడు సమీప బంధువే



లయస్మితతో పవన్ (ఫైల్)

యశవంతపుర: ప్రేమోన్మాది ఘాతుకానికి బలైన ఇంజినీరింగ్ విద్యార్థిని హత్య కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. దిబ్బూరు గ్రామంలోని ప్రెసిడెన్సీ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న కోలారుకు చెందిన లయస్మితను మరో కళాశాలలో చదువున్న పవన్ అనే యువకుడు హత్య చేశాడు. నిందితుడిని లయస్మిత మేనత్త కొడుకుగా పోలీసులు గుర్తించారు. ప్రేమను నిరాకరించిందనే ఆక్రోశంతోనే ఘోరానికి తెగబడ్డాడని తేలింది.

మరో విద్యార్థి ఐడీ కార్డుతో కళాశాలలోకి ప్రవేశం

ఇతరులు కాలేజీలోనికి వెళ్లటానికి అవకాశంలేదు. హత్య చేసిన పవన్ ఎలా లోపలకు వెళ్లాడనే విషయంపై ఆరా తీయగా మరో విద్యార్థి ఐడీ కార్డును ఉపయోగించుకుని కాలేజీలోకి వెళ్లాడు. ప్రెసిడెన్సీ కాలేజీకి చెందిన కొందరు విద్యార్థులు సహకరించటం వల్ల లోపలకు వెళ్లి హత్య చేసినట్లు విచారణలో తెలిసింది. మధ్యాహ్నం 12:30 గంటలకు కాలేజీ గేట్‌వద్దకు వెళ్లాడు. అక్కడ మరో విద్యార్థిని పరిచయం చేసుకున్నారు. అతడి కాలేజీ ఐడీతో లోపలకు వెళ్లి లయస్మిత తరగతి గది వద్దకు వెళ్లాడు. ఆమె గది నుంచి బయటకు వస్తుండగానే కత్తితో గుండెపై పొడిచాడు. అయితే నిందితుడి వద్ద ఉన్న ఐడీ కార్డు ఎవరిదనే విషయంపై పోలీసులు గుర్తించే పనిలో పడ్డారు. ఇదిలా ఉంటే లయస్మిత తండ్రి నాగరాజు మూడు నెలల క్రితమే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కూతుర్లు. లయను ఇంజినీరింగ్ చదివిస్తున్నారు. పవన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్కారు అవినీతి వల్లే ఈ ఘోరాలు

- కాంగ్రెస్ నేతల ధ్వజం

బనశంకరి: వ్యాపారవేత్త ప్రదీప్ ఆత్మహత్య కేసులో బీజేపీ ఎమ్మెల్యే అరవింద లింబావళిని అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. బెంగళూరులో ప్రదీప్ కుటుంబసభ్యులను నేతలు రణదీప్ సూర్జేవాలా, సిద్దరామయ్య, రామలింగారెడ్డి తదితరులు పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రదీప్ మృతి ఆత్మహత్య కాదు, హత్య. దీనికి కారణమైన వ్యక్తులు ఎంతపెద్దవారైనా వారికి శిక్ష పడాలని, తక్షణం వారిని అరెస్ట్‌చేయాలని డిమాండ్ చేశారు. ప్రదీప్ కుమార్తె , భార్య కన్నీరు తుడవటం బీజేపీ ప్రభుత్వానికి సాధ్యమా? అవినీతి వల్ల ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. కాంట్రాక్టర్లు సంతోష్‌పాటిల్, ప్రసాద్, పారిశ్రామికవేత్త ప్రదీప్ లు 40 శాతం కమీషన్లు, ప్రభుత్వ అవినీతికి బలయ్యారని ఆరోపించారు. ప్రదీప్ ఒకటిన్నర కోటి పెట్టుబడి పెడితే నయాపైసా కూడా తిరిగి ఇవ్వలేదు, తమ డబ్బును వెనక్కి ఇవ్వాలని ప్రదీప్ భార్య కోరుతోందన్నారు. పోలీసులు ప్రదీప్ కుటుంబసభ్యుల మొబైల్ ఫోన్లను అడుగుతున్నారని, ఇది సరికాదని నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చెప్పేది నాటువైద్యం, చేసేది దోపిడీలు



అరెస్టయిన వంచకులు



స్వాధీనం చేసుకున్న కార్లు, ద్విచక్రవాహనాలు

- బెంగళూరులో రాజస్థానీ ముఠా అరెస్టు

బనశంకరి: ఆయుర్వేద మూలికలతో చికిత్స చేస్తామని చెప్పుకుంటూ ప్రజలవద్ద నుంచి డబ్బు దండుకుని వంచనకు పాల్పడుతున్న రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను మంగళవారం బెంగళూరు విల్సన్ గార్డెన్ పోలీసులు అరెస్ట్‌చేశారు. నిందితులు మహమ్మద్ సమీన్ అలియాస్ డాక్టర్ మల్లిక్, సైఫ్ అలీ, మహ్మద్ రహీస్.

ఇంటికెళ్లి రూ.8.8 లక్షలతో పరారు

వివరాలు... నెలమంగల వద్ద టెంట్లు వేసుకుని నాటు మూలికలు ప్రదర్శిస్తూ మొండి రోగాలను నయం చేస్తామని ప్రజలను నమ్మించేవారు. శాంతినగర బసప్పరోడ్డు నివాసి పంకజ్‌ఠాకూర్ తన తల్లికి కాలినొప్పికి చికిత్స చేయాలని వీరిని గత నెల 16 తేదీన ఇంటికి తీసుకెళ్లాడు. చికిత్స చేయడానికి ఖర్చవుతుందని వారిని మాటల్లో పెట్టి రూ.8.8 లక్షలు తీసుకుని ఉడాయించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో డీసీపీ శ్రీనివాసగౌడ, ఏసీపీ నారాయణస్వామి ఆధ్వర్యంలో ముఠాను గాలించి పట్టుకున్నారు. వారి నుంచి నాలుగుకార్లు, మూడు ద్విచక్రవాహనాలు రూ.3.50 లక్షలు నగదు, నాటు మూలికలను స్వాధీనం చేసుకున్నారు. ఇలా వైద్యం పేరుతో ఎంతోమందిని మోసగించినట్లు అనుమానాలున్నాయి.

నేత్రపర్వంగా గరుడోత్సవం



వెంకటరమణస్వామి గరుడోత్సవం దృశ్యం

చింతామణి: తాలూకాలోని ఆలంబగిరి గ్రామంలో వెలసిన శ్రీ వెంకట రమణస్వామి ఆలయంలో ముక్కోటి ద్వాదశి పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణస్వామి మూర్తికి, నారాయణ తాత విగ్రహానికి విశేషంగా అలంకరణ గావించారు. కన్నుల పండువగా గరుడోత్సవం జరిగింది.

ముంచేసిన జ్యోతిష్యుడు

- రూ.లక్ష నగదు, అర్ధకేజీ బంగారంతో పరార్

బనశంకరి: మూడు నెలల క్రితం పరిచయమైన నకిలీ జ్యోతిష్యుడు ఓ మహిళను నిండా దోచుకున్నాడు. ఈ ఘటన జేసీ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునిరెడ్డిపాళ్యలో జరిగింది. వివరాలు.. కృష్ణరాజపురం నివాసి సహన అనే బాలింత జేసీ నగరలోని పుట్టింటికి వచ్చింది. వారికి ఎదురింట్లో మూడునెలల నుంచి విజయ్ శ్రీనివాస్, మదన్ శ్రీనివాస్, గోవింద రాజన్, రేవతి లక్ష్మీ కుటుంబం ఉండేది. జ్యోతిష్యున్ని అని పరిచయం చేసుకున్న విజయ్‌శ్రీనివాస్ సహన కుటుంబంతో ఆత్మీయంగా మెలిగారు. మీ గ్రహ పరిస్థితులు చెడుగా ఉన్నాయి, కాబట్టి శాంతి పూజలు చేయాలని భయపెట్టాడు. అతని మాటలు నమ్మిన సహనా రూ.లక్ష నగదు, 578 గ్రాములు బంగారు ఆభరణాలను డిసెంబరు 28 తేదీ విజయ్‌శ్రీనివాస్ చేతికి అందించింది. నగలు, డబ్బును ఉంచి ఆ రోజు పరిహార పూజలు చేశారు. మరుసటి రోజున చూస్తే డబ్బు, నగలు లేవు, ఎదురింట్లో జ్యోతిష్యుని కుటుంబం కూడా కనిపించలేదు. షాక్ తిన్న సహన జేపీ నగర పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఆభరణాల విలువ రూ.28 లక్షలని తెలిపింది. పోలీసులు వంచకుల కోసం గాలిస్తున్నారు.